భారతి



సాహిత్య
మాసపత్రిక

జూలై
1986

బలివాడ కాంతారావు సీరియల్ ప్రారంభం!

భయం గొంగళి పురుగు ...... నిఖిలేశ్వర్

పరిశోధన ...... మాదిరాజు రంగారావు

ప్రారంభోత్సవం ...... నందినీ శతపథి

వెల : 4 రూపాయ



ఎదుగుతున్న పిల్లలతో నిండిన క్లాసుకి పాఠాలు చెప్పడం... వారిని సరియైన రీతిలో పెట్టడం... వారి అభివృద్ధిని గమనించడం... అది పూర్తికాలం పనే!
అయితే స్కూల్‌లో నా క్లాసుకి మంచి ఫలితాలు వస్తాయి. అదే గొప్ప తృప్తి. నాకు తెలుసు వారందరినీ ఎంతో ఆరోగ్యంగానూ, మరెంతో చురుకుగానూ వుంచేది హార్లిక్సేనని.
అందుకే నేను హార్లిక్స్ తీసుకోవడం ఒక అలవాటుగానూ చేసుకున్నాను. ఇక ఇటువంటి క్లాసు వున్నప్పుడు నేను ఇంతకంటే తక్కువ చురుకుగా ఉండగలనా?
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాల్సకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది
HMM-9074TEL



H K INTERNATION

సంపుటము: 63 జూలై, 1986 సంచిక: 7

భారతి

సాహిత్య మాసపత్రిక

*

సంస్థాపకుడు

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

*

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

(1938-1972)

*

విషయానుక్రమణిక

ముఖచిత్రం....శ్రీనివాస కళ్యాణంలో శశికళ, శోభ

సుచిత్రతో ఇంటర్వ్యూ- శ్రీ కోలపల్లి ఈశ్వరరావు-3 పరిశోధన అంతర్విధానం- వ్యక్తిత్వం- శ్రీ మాదిరాజు రంగారావు-6 ప్రకృతి చూపే ప్రస్థానం- లక్ష్మణ-9, అపురూపం- దశశ్రీ-9 సృష్టి (సీరియల్)- శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం-10 అశోక ధర్మ శాసనాలు- ఒక సమీక్ష- డా. సి. వి. రామచంద్రరావు-14 మనస్వి, తపస్వి, మాస్టి- శ్రీ శంకరగంట రంగాచార్యులు-20 భారతి- శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు-22 మేఘగీతం- షైదిశ్రీ-24 ప్రతిబింబం- శంకరయ్య-24 ధీమా - రఘువర్మ-24 మహీరుహం మానవుడు- శ్రీ గజానన్ తామన్-25 ఆంధ్రమహాసావిత్రి ఒక సమీక్ష- శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ-26 ప్రారంభోత్సవం- మూలం- శ్రీమతి నందిని శతపథి తెనుగుసేత శ్రీ బాసంగి శ్రీరాములు-31 సదర్ షాపూర్ శిలా శాసనము- పునఃపరిశీలన- శ్రీ పి. వి. పరబ్రహ్మ శాస్త్రి-33 కాలంతో ఓ మారుమూల- శ్రీ కలువకొలను సదానంద-35 తల్లి- కన్నడమూలం:- డా. యు. ఆర్. అనంతమూర్తి ఆంధ్రానువాదం:- శ్రీ శంకరగంటి రంగాచార్యులు-36 కోయిల తల్లిప్రేమ- శ్రీ కాణిపాకం లింగన్న-39 మరో రాజశేఖర చరిత్ర (సీరియల్) శ్రీ బలివాడ కాంతారావు-40 వరి ఉత్పత్తి- విక్రయంకాగల మిగులు- శ్రీ యం. రవీందర్ రెడ్డి-48 భయం గొంగలి పురుగు- నిఖిలేశ్వర్-50 వాన- శ్రీ వి. వి. బి. రామారావు-52 నాకు తెలిసింది- శ్రీ కావూరు పాపయ్యశాస్త్రి-55 నీ కళ్లల్లో సముద్రాలు- శ్రీ విరియాల లక్ష్మిపతి-56 గిరిజనుల ఋణభారము- ఒక పరిశీలన- కె. లక్ష్మిరాజ్యం, పి. దామోదరరావు, డా. పి. రామయ్య-57 హరివిల్లు చినుకులో- సాంధ్యశ్రీ-60 ఈ మాసం- మీ నక్షత్రఫలం - శ్రీ నిష్ఠల వేంకట సత్య సుబ్రహ్మణ్యం-62 వేములవాడ చాళుక్యుల జైనమత పోషణ- డా. కొల్లూరు సూర్యనారాయణ-65 కలగూరగంప-68 గ్రంథ విమర్శలు-77

స్వవిషయం

చి. సుచిత్రతో కన్నా వయస్సులో చిన్నవారితో భారతిలో ఇంటర్వ్యూ ఇంత దాకా పడి ఉండదు! నాట్యం చేసేవారే కాకుండా పాడేవారూ - వాద్యాలని వాయించే వారితో కూడా ఇంటర్వ్యూలు వెయ్యాలని ఉన్నది....

** ** **

అశోకుడి శాసనాల మీద పరిశోధన మొదలయి చాలా కాలమే అయింది కాని వీటన్నిటినీ సమీక్ష చేస్తూ శ్రీ రామచంద్రరావుగారు రాసిన వ్యాసం భారతి పాఠకులందరికీ నచ్చగలదని అనుకుంటున్నాము.....

** ** **

ఈ సంచికలో కన్నడం నుంచీ, ఒరియా నుంచీ చేసిన అనువాదాలు రెండు ఉన్నాయి. ఇతర భాషలలోని రచనల అనువాదాలు సయితం ఇంకా అందితే ఆ భాషలలో రచన ఎలాగ కొనసాగుతోందో తెలుసుకునే అవకాశం తెలుగు వారికి కలుగగలదు.....

** ** **

శ్రీ బలివాడ కాంతారావు గారి సీరియల్ నవల చదివే వారు పేరు పొందిన ఒక రచయిత భావాలు ఎన్నో తెలుసుకోగలుగుతారని అనిపిస్తుంది!

** ** **

శ్రీయుతులు మాదిరాజు రంగారావు, పాలడుగు వెంకటేశ్వరరావు, గుంటూరు శేషేంద్రశర్మ, పి. వి. పరబ్రహ్మశాస్త్రి, కలువకొలను సదానంద, నిఖిలేశ్వర్, వి. వి. బి. రామారావు, కొల్లూరు సూర్యనారాయణ గార్ల రచనలు ఈ నెల భారతిలో నే ఉండటం ఒక విశేషం.....

ఆగస్టులో కీ. శే. కొల్లూరు నారాయణరావు గారి 'తిక్కన సోమయాజి' నవల మొదలు పెడుతున్నాము.....

ఏడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు, ప్రచురణకర్త : శివలింక నాగేశ్వరరావు;
ముద్రణ : ఆంధ్రపత్రికప్రెస్, గాంధినగరం, విజయవాడ-3, సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ.
ఫోన్లు :- బిజినెస్ : 61247, 61248; ఎడిటోరియల్ : 75667

సుచిత్రతో ఇంటర్వ్యూ

"సుచిత్ర గారున్నారాండీ!" అన్నాను. కాలింగ్‌బెల్ శబ్దం విని వచ్చిన ఆవిడతో.

"గారూ-ఎందుకండీ-చిన్న అమ్మాయే-రండి. వుంది, అంటూ సాదరంగా లోపలకు ఆహ్వానించారు!

కూర్చున్నాక-

"నమస్తే! అండీ-" అంటూ వచ్చిందో పాప-ఆవిడ కేక విని-"నీ పేరేనా సుచిత్ర?" అన్నాను ఆశ్చర్యంగా.

బిడియంగా ప్రక్కనున్న శ్రీ చీరకొంగుని చేతికి తీసుకుని ఎడమచేతి చిటికెన వేలికి చుట్టుకోసాగింది.

"అరె. అన్నివేల జనాభా వుండే ఆడిటోరియంలో చక్కగా, బెరుకు లేకుండా నాట్యం చేశావు-ఇప్పుడిలా... ఆశ్చర్యంగా వుందే...." అన్నాను.

"మా అమ్మండీ-పేరు విజయమ్మ" అంది. నేను అన్నదానికి ఏమనాలో తెలీక-

"నమస్తే"-అని నేను వచ్చిన విషయం చెప్పాను.

"సరే పాపా! నేను పత్రిక తరపున నిన్ను ఇంటర్వ్యూ చేయాలని వచ్చాను ..." ఆ మాటకే-సన్నగా భయపడింది సుచిత్ర.

"భయపడకు-ఏం లేదు-ఇక్కడకు వచ్చి కూర్చో...." అన్నాను. కుర్చీ చూపుతూ!

"పదమ్మా! నిన్ను రెండు ప్రశ్నలు అడుగుతారు...సమాధానాలు చెప్పు-అంతే ..." అన్నారావిడ...కదిలింది సుచిత్ర!

నాకప్పుడే అర్థమైంది - ఈ పాప వెనుక చల్లని తల్లి చేయి వుందని—

"ఏం చదువుతున్నావమ్మా!"

"ఎనిమిదవ తరగతి!"

"సినిమాలు బాగా చూస్తావా?" (ఆ పాపకు బెరుకు పోవాలని వేరే ప్రశ్న లడగటం జరిగింది)

"కొద్దిగానేనండీ"

"నీకు నచ్చిన యాక్టర్లెవరమ్మా?"

"భానుప్రియ, జయసుధ ..."

"నీకు డ్యాన్స్ నేర్చుకోవాలని ఎందుకనిపించింది?"

తల్లివైపు చూసింది—

"చెప్పవే-నీకు తెల్సింది చెప్పు ..." అందావిడ సన్నగా నవ్వుతూ. ఆ నవ్వులో ప్రోత్సాహమనే మందు దొరికినట్లయ్యింది-

"అప్పుడు నేను ఆరవ తరగతి చదువుతున్నానండీ... మా మూడో వీధిలో ఉదయవర్లు దేవాలయం వుంది. ఆ రోజు అక్కడ ఉత్సవం జరుగుతుండటంతో మా అమ్మా-నాన్నలతో వెళ్ళాను. దేవుని ఊరేగింపు అయ్యింది. మండపంలోకి పద్దెనిమిదేళ్ళ అమ్మాయి వచ్చి నాట్యం చేయసాగింది. నేను ఎప్పుడూ అంత దగ్గరగా-టి.వి. సంగతి వదిలేయండి-ఎవ్వరి నాట్యం చూసివుండక పోవటంతో



నా పైప్రైజులు నాకు దైవంతో సమానమనే భావం.

కళ్ళప్పగించి చూడసాగాను. మా అమ్మా నాన్నా వెళదామన్నా కాసేపుందామన్నాను. నా ఉత్సాహం గమనించి మా అమ్మ-"నువ్వూ నేర్చుకుంటావుటే?" అంది ..."ఆఁ" అన్నాను అతి తేలిగ్గా తల వూపుతూ.

కాసేపు ఆగింది ఊపిరి పీల్చుకోవడానికి తల్లివంక చూసింది. ఇందాకటి నవ్వే ...

"ప్రక్కరోజునుండి మా నాన్నగారు ఊరూ వాడా తిరగటం ప్రారంభించారు...డ్యాన్స్ స్కూల్ వుందిగానీ అందులో చేర్పించటం ఇష్టంలేదు మా నాన్నగారికి. అదీగాక చాలా దూరం .. ఇంటికొచ్చి నేర్పించే వాళ్ళకోసం కొద్ది రోజులు ఎదురు చూడసాగారు. మూడ్నెళ్ళు గడిచాయి. నాకు గురువుగారు దొరికారు. శ్రీ వేదాంతం పూర్ణచంద్ర కామేశ్వరరావుగారు. వీరు నాకు సంవత్సరంలో అద్భుతంగా నర్తించటం నేర్పించారు. నేడు నేను స్టేజీమీద అవలీలగా నాట్యం చేయగలుగుతున్నానంటే వారి ప్రతిభే ..."


ఇంతలో ఒకాయన లోపలికి వచ్చారు.

"మా నాన్నగారు...." అంది సుచిత్ర!

"నమస్తే అండీ" అన్నాన్నేను.

'ఎవరు?' అన్నట్లు ఆవిడవైపు చూశారు. నేనే కల్పించుకుని వివరంగా చెప్పాను.

సంతోషంగా తలవూపి—"ముందుగా చెప్పి వుంటే-ఫోటోలవీ అరేంజేసి..." అంటూనే-"రెండ్నిముషాలుంటారా?" అంటూ చకచక బయటకెళ్ళారు.



"ఈ పాదం...." అనే మయూరి పాటకు అత్యద్భుతంగా నర్తించి మయూరి సుధగారి వద్దనుండి ప్రైజు అందు కుంటున్న దృశ్యం — ఈ సందర్భంలో షీల్డు కూడా ఇచ్చారు.

మంచి ఉత్సాహవంతు దనిపించింది.

"ఇప్పటికి ఎన్ని ప్రోగ్రాంలు ఇచ్చావమ్మా?"

"ఎన్నమ్మా?" తల్లివైపు చూసి, గుర్తు తెచ్చుకోసాగింది.

"నూటయాభై పైగా వుంటాయ్...." అంది తేలిగ్గా!

"ఆఁ-" అన్నాను. ఇంత చిన్న వయసులోనే! అనే ఆశ్చర్యం ధ్వనించేలా!

"అవునండి-అప్పటికీ స్కూల్‌కి ఇబ్బంది అవుతుందని కొన్నిదఫాలు వెళ్ళలేకపోయాను.

"నీ నాట్య ప్రదర్శనలో ముఖ్యమైన ఐటంస్ చెప్పగలవా?"

"థిల్లానా-తెప్పతామరాకుమీద - కొలువైతివా రంగశాయీ! కృష్ణ శబ్దం- అదిగో అల్లదిగో, దశావతారాలు, రామశబ్దం, జానపదాలు, గోంగూరపాట- లంబాడీ నృత్యం, నాకు కొలువైతివా, లంబాడీ పాటలకే ఎక్కువ ప్రైజులు, ప్రశంసలూ వచ్చాయ్ ..."

"నీకు ఎక్కడ ప్రోగ్రాం ఇచ్చేటపుడు ఎక్కువ సంతృప్తిగా అని పించింది?"

"నవాబ్‌పేట - మహాలక్ష్మి అమ్మవారి గుడిదగ్గర వేసేటపుడు-ఎందుకో నాకే తెలియని ఆనందం కలిగింది. మాటల్లో చెప్పలేను...

"నీకు డ్యాన్స్ ప్రోగ్రాంలపుడు ఎక్కువగా సహకరించేది ఎవరు?

"మా అమ్మ, నాన్న-మా అంకుల్ గోపాల్‌గారు (రైతు డిపో) మా అమ్మ తలసెట్-డ్రస్ చేస్తుంది. మా నాన్న మేకప్ చేస్తారు. గోపాల్ మామయ్య కొండంత అండలా (అంత ఎత్తున ఇంత లావున వుంటార్లెండి-అంటూ పసితనం పీడని స్వచ్ఛమైన నవ్వు నవ్వింది) వుంటారు. గాత్రం చేసే సరస్వతీలక్ష్మణ్ గారు-వారి తియ్యటి గొంతుతో నా నాట్యానికి శబ్దాలు పలికిస్తుంటారు. ఆవిడ గొంతు (గానం) నా నాట్యం పోటీలు పడుతుంటాయంటే నమ్మండి - ముఖ్యంగా లంబాడీ పాటలో మా ఇద్దరికీ...." ఎలా పూర్తి చేయాలో తెలీక చిన్నగా నవ్వింది!

"మీ నాన్నగారేం చేస్తుంటారు?" అన్నాను. ఇంటినిండా వున్న సుచిత్ర ఫోటో భంగిమల్ని చూసి-

"అరుగో వచ్చారు-ఆ పనే-" అంది. తమాషాగా చేతులు కెమేరాలాగా పెట్టి.

"ఎక్కడ?" అన్నాను వారివైపు తిరిగి.

"విజయా ఫోటో స్టూడియో - సుబేదార్ పేట-" అన్నారు - కెమేరాను సరిచేసుకుంటూ!

"మీదా!? అది బాగా ఫేమస్ అని విన్నాను...."

"ఫేమస్ అయ్యింది కాబట్టి మాది కాదనా మీ వుద్దేశ్యం?" సన్నగా నవ్వుతూ అన్నారాయన.

"అబ్బ-భలే-దెబ్బ కొట్టారే..."

సుచిత్ర ఆల్బం తీసింది.

ఆ భంగిమలూ అవీ చూస్తుంటే భవిష్యత్‌లో చక్కటి నర్తకి అయ్యే లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయ్. ఆ మాటే అన్నాను.

దంపతులిద్దరూ నవ్వారు.

వారిద్దర్నీ అలా చూస్తుంటే అన్యోన్యమైన జంట అనీ, మాటవరసకైనా కీచులాడుకోరని అనిపించింది. ఉలిక్కిపడ్డాను నేను వచ్చిన పని అదికాదుగా-

ఆల్బంలో సుచిత్ర - మయూరి సుధనుండి బహుమతి అందుకుంటున్న స్టిల్ చూపుతోంది.

క్లిక్‌మంది కెమేరా—

"థ్యాంక్సండీ-" అన్నారు ఆయన!

నీకు వచ్చిన ప్రైజుల్తో ఓ ఫోటో తీయించుకో సుచిత్రా-" అన్నాను.

చకచక రెండు నిముషాల్లో ఆమె తండ్రి సెట్ సిద్ధం చేశారు. నాకు ఆశ్చర్యం వేసింది ఆయన వేగానికి. కళాత్మకంగా తీర్చిదిద్దిన ఆ తీరుకు-అప్పు డనిపించింది డ్యాన్స్ నేర్చుకోవటం గొప్పకాదు. దానికి తగిన ప్రోత్సాహం ఉండా లనీ! సుచిత్రకు తనవారినుండి పుష్కలంగా దొరుకుతోందట! ఇంకేం!



అవన్నీ తనకొచ్చిన ప్రైజులు - అన్న చిరుగర్వం— సంతోషం.

''సుచిత్రా! నువ్విలాగే నాట్యం చేస్తూ మంచి నర్తకివి అవుతావా? లేక సినిమాల్లో చేరుతావా?''

''అమ్మో! సినిమాల్లోనే-సావిత్రిగారి గురించి అప్పుడప్పుడు చదువుతుంటానండీ! సినిమాపత్రికల్లో వస్తున్న నేటి నటీమణులగురించి చదువుతూ కూడా ఆ దారిలోకి ఎలా వెళ్ళగలను?'' అంది భయంగా!

''మరి-మొదటిదేనా?''

''ఖచ్చితంగా....'' అంది దృఢంగా. ఆ మాట అంటున్నపుడు ఆ కంఠం ఎంతో గట్టిగా పలికింది. అంత చిన్న వయసులోనే సినీనటుల జీవితాల్ని - కాచి, వడపోసినట్లు మాట్లాడుతుంటే మనసులోనే అభినందించాను.

''మీరేమంటారు?'' అన్నట్లు వారివైపు చూశాను.

''ఆ అమ్మాయి ఇష్టం ఎలా వుంటే అలా చేస్తాపుండీ. లేదూ-రేపు భవిష్యత్‌లో సినిమా యాక్టర్ని కావాలని కోరుకుందనుకోండి ...ఓ.కే. అంతా తనిష్టం .. '' అన్నారు సుచిత నాన్నగారు.

తన అభిప్రాయం కూడా అదేనన్నట్లు నవ్వారావిడ!

''అవునూ-చదువు ఎలా సాగిస్తున్నావమ్మా?'' అన్నాను. డ్యాన్స్ ఖచ్చితంగా ప్రతిబంధకం అయివుంటుందని.

నా అనుమానం తల్లక్రిందులైంది.

''లేదండీ! మేమూ అలానే అనుకున్నాం చదువు నిర్లక్ష్యం చేస్తుందేమోనని. కానీ అన్నిటిలోనూ ఫస్టే. దానిముందు అనటం కాదుగానీ-క్లాస్‌లో విన్న పాఠాలే గుర్తుకు వుంచుకుంటుంది. ఇంట్లో కూడా పెద్దగా చదవదండీ ... మొన్న సెకండ్ ఫారంలో స్కాలర్‌షిప్ కూడా తెచ్చుకుంది'' అన్నారు కాస్త గర్వంగా!

''ఇంకేమన్నా నాలుగు విశేషాలు చెప్పమ్మా?'' అన్నాను పేపు వెనక్కిమారుస్తూ!

''వివిధ పత్రికల్లో నా నాట్యఫోటోలు చాలా పచ్చాయండీ! తర్వాత-నాకు గుర్తుండిపోయే ప్రోగ్రాం గూడూరులో ఇచ్చాను. సిద్ధార్థ కళాశాల (ప్రిన్సిపాల్-గంగిశెట్టి శివకుమార్‌గారు) ద్వితీయ వార్షికోత్సవానికి నా ప్రోగ్రాం అడిగారు. నాన్నగారు వప్పుకున్నారు. ఎందుకనో చాలా బాగా వేశాననిపించింది. విపరీతంగా పిల్లలు చుట్టుముట్టారు. ఆటోగ్రాఫ్ అనే పదానికి అర్థం అప్పుడు తెల్సింది. చాలా మంది నా దగ్గర సంతకాలు తీసుకున్నారు.:..చెప్పద్దూ, కాస్త గర్వం అనిపించింది. తర్వాత-ప్రముఖ సంఘసేవకురాలు శ్రీమతి బెజవాడ ఈశ్వరమ్మగారి సన్మానం సందర్భంగా నర్తించినప్పుడు కార్యనిర్వాహకులు ఇచ్చిన రెమ్యూనరేషన్ ఎక్కువైనా - నా నాట్యాన్నే ఎక్కువగా మెచ్చుకొని (మరో ముగ్గురు చేశారు) నూటపదహార్లు తాంబూలంలో పెట్టి అందించినపుడు ఎక్కువ సంతోషించాను. ఇదిగో ఆ ఫోటో...అంటూ తనకు (తను స్టేజీ చివర-ఆవిడ క్రింద నుండి) శ్రీమతి ఈశ్వరమ్మగారు ఇస్తున్నట్లు వున్న ఫోటో చూపింది.

అమ్మో! పిట్ట కొంచెం కూత ఘనం అనే సామెత అక్షరాలా నిజమనిపించింది.

''కూచిపూడి నాట్యం గురించి ఇంకేమైనా చెపుతావా?'' అన్నాను.

''బాగా సాధనచేసి దీని అంతు చూడకపోయినా కొంతయినా చూస్తాను-మా అమ్మా నాన్నల ప్రోత్సాహాన్ని వృధా పోనీయను....'' అంది దృఢంగా.

''సరే-వుంటాను సుచిత్రా! మరోమారు టి.వి. ఇంటర్వ్యూ కోసం ఖచ్చితంగా కలుస్తాను. ఈలోపుగా డ్యాన్స్‌తోపాటు ఇంగ్లీష్ మాట్లాడటం కూడా ప్రాక్టీస్ చేసిపెట్టుకో. ఈసారి నేనొచ్చేసరికి విపరీతంగా గుడ్‌న్యూస్‌లు రెడీ చేసి వుంచు....'' అన్నాను తృప్తిగా నవ్వుతూ'

ఇంటర్వ్యూ: కోలపల్లి ఈశ్వరరావు

ఫోటోలు: వై. వి. రమణారావు,

శ్రీ మాదిరాజు రంగారావు

పరిశోధన అంతర్విధానం - వ్యక్తిత్వం

ఒక క్రమ పద్ధతిలో బాహ్యాంతర్విధానాల ననుసరించి నిర్దిష్టమైన ప్రణాళికతో సాగే శాస్త్రీయమైన విమర్శనారూపం, పరిశోధనం, అంతర్విధానంలో పరిశోధనకు స్వీకరించినవిషయం గురించి హేతుదృష్టి, విశ్లేషణం, సమన్వయం, సిద్ధాంతంతో సమాకలితయై అర్థవంతమైన అన్వేషణతో నిర్ణయానికి దారితీసే పరిశీలనం వివరణం నిర్వహణరూపం గురించి ప్రసక్తమౌతుంది. ఈ విధానంలో నిహితమైన వ్యక్తిత్వ వికాసమూ పరిశోధనా వ్యాసంగంలో అవశ్యం పరిశీలనా యోగ్యమైంది. ఈ సందర్భంలో శాస్త్రీయ దృక్పథంతో కూడిన యోజన వివేచన నిర్వహణ మార్గాలను అనుసరించడం వల్ల కలిగే ప్రయోజనం ఎంతో అమూల్యమైంది. శాస్త్రం అంటే ఒక క్రమ పద్ధతిలో హేతు సహితంగా తీర్చిన ఆలోచనా ప్రయోగ రూపం. ఈ దృష్టితో అంతర్విధాన క్రమాన్ని అనుసరించడం పరిశోధనలో పరిశోధకుని కర్తవ్యం, అంటే ఒక క్రమ పద్ధతి ననుసరించి సమస్యను ఎదుర్కొని దాని పరిష్కారాన్ని సాధించి సిద్ధాంతాన్ని ప్రతిపాదించే సరణికి సంబంధించిన రూపం అన్నమాట సమస్యను పరిష్కరించడానికీ, సత్యాన్ని దర్శించడానికే ప్రతి చర్యనూ పరిశోధనలో కార్య కారణోపపన్నంగా తీసుకోవలసిఉంటుంది. ఇదీ ఒక పద్ధతి ననుసరించి జరగాలి. క్రమ సహితమై ఉండాలి. పరిశోధన మొదటి దశలో బాహ్య విధానం గురించీ, రెండో దశలో అంతర్విధానం ప్రాధాన్యమూ ఉంటుంది. ఇందులో విశ్లేషణం సమన్వయం కార్యకారణ సంబంధ రూపం, పరిశీలనం సిద్ధాంతం మొదలైన అంశాలు పరిశోధనా రచనకు శిఖర సదృశమైనవీ, చర్చనీయమైనవీ, మొదటి విధానం స్థూలాకృతికీ రెండోది సూక్ష్మ రూపానికీ సంబంధించింది. పరిశోధకుడు ఎన్నుకొన్న వస్తువు, అతడు నిర్వహించే దృక్పథం ప్రతిపాదింపదలచిన నిర్ణయం లేదా సిద్ధాంతంపై దీని ముఖ పార్శ్వాలు తీర్చబడి ప్రవర్తితమౌతాయి. సాహిత్య ప్రక్రియను బట్టీ, విషయ పరిధిని బట్టీ, సమస్యలను బట్టి పరిణామ స్థితులేర్పడుతాయి. పరిశోధనలో అంతర్ విధానాన్ని గురించి సమాలోచనం చేసేప్పుడు బాహ్య విధానంవలె ఇదమిత్థమని స్పష్టంగా నిర్ణీత రూపాన్ని ఇవ్వడం కష్టం. పరిశోధనా నిర్వహణంలో అంతర్ విధానానికి సంబంధించిన ఏర్పాటు పరిశోధన యొక్క గతి క్రమానికీ, అంతస్తత్వానికి, పరిశోధకుని మనస్తత్వానికీ వస్తుగతమైన దృష్టికి సంబంధించింది కావడంచేత, దీని స్వరూపావగతికి శాస్త్రీయమైన వివేచనతో పాటు సమయానుకూలంగా మౌలిక స్థితికీ అవకాశం తప్పకుండా ఉంటుంది.


ఈనాటి పరిశోధనా సిద్ధాంతాల తీరును చూస్తే ఒక్క మూల పాఠ పరిష్కారాన్ని మినహాయిస్తే ఎక్కువగా పరిశోధనమూ విమర్శ రెండిటి యొక్క సమ్మేళనంగా గోచరిస్తుంది. నిజానికి రెండూ పరస్పరం ప్రభావాన్ని నెరపుతూండేవే కావడంచేత, ఒక్కొక్కప్పుడే రెండిటికీ మధ్య అంతరం చెరగిపోతుంది. ఈ కారణంగా ఒక విశిష్టరూపాన్ని సంతరించుకోవడమూ జరుగుతూంది. నిర్వహణంలో రెండిటికీ భేదం ఉంది. ఈ భేదం వల్లనే రెండూ విడివిడిగా వ్యవహృతమౌతూన్నాయి. పరిశోధనలో అప్పటి వరకూ జరిగిన కృషికి సంబంధించిన సమాచార సేకరణంతో మొదలై వివిధాంశాలకు సంబంధించిన విజ్ఞాన ప్రసక్తితో ప్రవృత్తమౌతుంది. ఇది ఒక క్రమ విధానంలో తీర్చబడుతుంది. సమగ్రమైన పరిశీలనా గుణంచేత విషయ విస్తృతిని పొందుతుంది. మొత్తం మీద సర్వమూ ఒక వ్యవస్థీకృతం చేసే ప్రయత్నం తప్పనిసరిగా ఉంటుంది. ఒక నిర్ణయం బహిరంతస్ సాక్ష్యాధారాలపై సరియైన ఉపపత్తులతో చర్చా సహితంగా లేదా వివరణయుతంగా రూపొందింప బడుతుంది. ముఖ్యంగా అంతర్విధానంలో మౌలికమైన ఆలోచనా విష్కార సమయాల్లో తప్ప మిగతా చోట్ల పరిశోధనకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఉండదు. అంటే కొన్ని పరిమితుల్లో నిర్ణీతమై ఉంటుందన్నమాట వైయక్తికమైన ధోరణికన్నా వస్తుగతమైన దృష్టికే ప్రాధాన్యం. విమర్శలో ఒక నియతమైన విధాన క్రమం పాటింపబడదు. ఇది విమర్శకుని వ్యక్తిగతమైన దృష్టినిబట్టి స్వేచ్ఛాయుతంగా ప్రవర్తితమౌతుంది. తత్కాలానికి సరిపడేట్లు నిర్ణయించుకున్న విధానంలో స్వానుభవంతో ఆతని దృష్టిలో ఉన్న ప్రయోజన తత్పరతతో రూపొందుతుంది. ఆత్మగతమైన స్పందనపై ఏర్పడే ఆలోచన, సిద్ధించే దర్శనంపై ఆధారపడి నిర్ణయాలు ఉంటాయి. ముందుగా స్థిరపరచుకొన్న విలువలతో కూడిన అభిప్రాయాలపై ఆధారపడి ఉపక్రమించడంతో నిర్ణయాలు పాక్షికంగా వెలువడేందుకు వీలుంది. వస్తుగతంగా కన్నా వైయక్తికమైన ధోరణికే అవకాశం ఎక్కువ.

పరిశోధనా విధానం, విమర్శనా ధోరణీ రెండూ వేరువేరు నిర్వహణం పరిధులూ కలిగినవి. ఐనా ఈనాడు వెలువడే పరిశోధనా గ్రంథాల్లో వీలును బట్టి ఈ రెండింటిలో అవసరమైన లక్షణాల సమాహారంగా రూపొందే స్థితి ఎక్కువగా కన్పిస్తుంది. ముఖ్యంగా సృజనాత్మక సాహిత్యంలోతత్త్వం జీవితం, భావం, శిల్పం, గురించి సమాలోచనం చేసేప్పుడు భావం శిల్పం గురించి సమాలోచనం చేసేప్పుడు భావుకలక్షణంచేత పరిశోధనలో వస్తుపరమైన దృష్టి సడలి, స్వానుభవగతమైన ఆలోచనకు గురికావడం జౌతూంది. దీనితో పాటు బాహ్యాంతర్ విధానాలయాంత్రికమైన పద్ధతి పట్ల వైముఖ్యం కాకపోయినా ఆసక్తి లేక పోవడంకావచ్చు. కార్యాన్ని శ్రమ రహితంగా సులభ మార్గాన సాధించాలన్న అభిలాష ఉండవచ్చు.

అంతర్విధానంలోని విశ్లేషణ సమన్వయ స్థితులు పరిశోధనా పరిధిలో అవలంబించే పాత్ర విశిష్టమైంది. ఇవి విషయాన్ని ఒక ప్రయోజనానికీ నిర్ణయానికీ అభిముఖంగా తీర్చేవి. బాహ్య విధానంలోవలె వీటిని విశ్లేషణ సమన్వయం అనకుండా విశ్లేషణ స్థితి, సమన్వయ స్థితి అనడం గమనించదగింది. వస్తువులోని వివిధాంశాలకు సంబంధించిన అనుబంధాలను బాగా తెలుసు కోడానికీ, అవి ఎట్లా ఒక దానితో మరొకటి ప్రయోజన కారులుగా పరిణమించేదీ గుర్తించడానికీ తోడ్పడే ఈస్థితులు పరిశోధనా భాగం అంతా పర్యాప్తమై ఉంటాయి ఆయా సందర్భాలను బట్టి కార్య కారణ సంబంధం చేత స్థితిత్వాన్ని పొందుతాయి, వీటి సంస్థితి, వివిధాంశాలను ఒక దాని నుండి మరొకటి విడదీసి అవసరమైన విధంగా మిగతా వాటితో సమన్వయం చేకూర్చి భావించడంతో ఏర్పడుతుంది, ఏవి వేటికి విరుద్ధమో. ఏవి వేటికి పొసగుతాయో ఏవి వేటికి తటస్థాలో కూడా సులభంగా తేలి

పోతుంది. విశ్లేషణ పద్ధతి నాశ్రయించి, కొత్త విషయాలు కనుగొనడమూ జరుగుతుంది. అందువల్ల దీన్ని అంతర్విధానంలో అన్వేషణ పద్ధతి (మెథడ్ ఆఫ్ డిస్కవరీ) అనడం సముచితంగా ఉంది. దీని వల్ల ఏది ముఖ్యమో ఏది అముఖ్యమో స్పష్టమవడమే కాకుండా, ఏది దేనికి కారణమో ఎట్లా కార్యరూపం వహిస్తుందో హేతుబద్ధంగా అవగతికి వస్తుంది. ఒక పద్యం తీసుకుంటే దాన్ని చదవగానే మొత్తం మీద కలిగే స్థూలమైన అనుభవాన్ని విశ్లేషిస్తే బాహ్య విధానంలోని శబ్దం నుండి మొదలుకొని అంతర్విధానంలోని వ్యంగ్య విలసనందాకా అనేకాంశాలు ఒకదానికొకటి కారణభూతమై కార్యరూపాన్ని పొందిందీ విశ్లేషణ స్థితినిబట్టి, దాన్ని అనుసరించే సమన్వయ స్థితిని బట్టి, అవగతమవుతుంది. ఎప్పటికప్పుడు విశ్లేషణతో పాటు అవసరమైన అంశాల సమన్వయంతో ఆలోచనకు పూనుకోవడం జరుగుతుంది కాబట్టి పరిశోధనలో ఈ రెండూ ఒకదాని నొకటి అందుకొని, ఉపక్రమణంతో గతి రూపాన్ని చేకూరుస్తాయనడంలో సందేహం లేదు. ఇది ఏ కవిత్వంలోనో ఏ పద్యానికో ఏ నవల్లోనో ఏ సంఘటనకో ఏ పాత్రకో మాత్రమే ఖండఖండంగా పరిమితం కాదు. ఇంకా ఒక రచనతో వస్తువునుబట్టి ప్రక్రియను బట్టి ఎన్నుకొన్న విషయంలో అంశాన్ని బట్టి మారుతూంవుటుంది. దీనికి స్పష్టమైన నిర్దేశక సూత్రాలంటూ లేవు. ఒక సందర్భంలో సముచితమైంది, మరో సందర్భంలో కాకపోవచ్చు ప్రస్తుతాంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తే సాహిత్య పరిశోధకుడు రెండు దశల (లెవెల్స్)ను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒకటి అనుభవ గుణం కలిగిందీ, రెండోది హేతులక్షణం కలిగిందీ. వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలోనే సాహిత్యంలో పరిశోధన ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించ గలదు. ఆ సందర్భంలో ఔచిత్యాన్ని పాటిస్తూ, అప్పటి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకు పోవడంలోనే న్యాయం చేకూరుతుంది. పరిశోధకుడు తన అనుభవంచేత ప్రజ్ఞచేత కొత్త విషయాన్ని ఆవిష్కరించే అవకాశం కలిగి ఉండడంవల్ల అంతర్విధానంలో సమన్వయ స్థితిని ఆవిష్కార పద్ధతి (మెథడ్ ఆఫ్ ఎక్స్‌పొజిషన్) అనడమూ జరిగింది. వివిధాంశాలు ఏకత్ర సమీకరించి సమన్వయం సాధిస్తూ కొత్త రూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో కొన్ని క్లుప్తం కావచ్చు ఉన్నవి మారవచ్చు, అర్థవంతమైన వీటి కలయికచేత, సంబంధ స్థాపనం చేత, కొత్త ప్రయోజనాన్ని పొందడం జరుగుతుంది. ఇది మొదట్లో ఎక్కడికక్కడ దశలు దశలుగానో ఖండఖండాలుగానో తటస్థ పడుతూ, పోనుపోను రచన మొత్తం మీద ఒక ప్రత్యేక క్రమంలో యోజితమై, సిద్ధాంత పరమైన సహయోగాన్ని పొంది విశిష్టమైన రూపాన్ని భజిస్తుంది. మహాకావ్యధ్వని ఈ స్థితి నుండి సముత్పన్నమైన శిఖరభూతమైన రూపం అనవచ్చు. పరిశోధన మొత్తం మీద ఈ కారణంగా పరిపూర్ణ స్థితినుండి వచ్చే శక్తివంతమైన నిర్ణయార్థం, దీని పర్యవసానమే. ఈ సమాలోచనాన్ని సంగ్రహంగా క్లుప్తీకరిస్తే అంతర్విధానంలో విశ్లేషణ స్థితి దేనికది బాగా గుర్తించి కొత్తవి అన్వేషించడానికి దారి తీస్తే, సమన్వయస్థితి కనుగొన్నవాటిని ప్రయోజనవంతంగా ఆవిష్కరించడానికి ఉపకరిస్తుందనేది స్పష్టం. విశ్లేషణ సమన్వయం అనేవి పరిశోధనా గమనానికి రెండు పాదాలుగా ఈ కారణంగానే భావించడమైంది.

అంతర్విధానంలో ఉపకరించే అంశాల్లో మరొకటి హేతుదృష్టి, పరిశోధనలో తలెత్తిన సమస్యలకు శాస్త్రీయమైన సమాధానం పొందేందుకు అవలంబించే మార్గం ఇది. ఇది వాస్తవాలపై జరిగే ఆలోచనా పురస్కృతమైందే తప్ప ఏ విధంగానూ కాల్పనికం కాదు. ఆధునిక యుగంలో ఈ దృష్టికి గల ప్రాధాన్యం గురించి వేరే చెప్పనక్కరలేదు. దీన్ని అనుసరించిందే కార్యకారణ సంబంధాల యోజనం. ఇది రెండు విధాలుగా నిర్వహింపబడవచ్చు. ఒకటి కాలక్రమంలో రెండోది హేతుక్రమంలో. ప్రతిదానికీ కారణం ఉంటుంది, ఒక్కొక్కప్పుడది స్ఫుటం కాకపోవచ్చు, కారణానికి ఆధారం పరిస్థితి - సాధారణ దృష్టిలో కారణం అంటే పరిస్థితి అనే.



అయితే కార్యం యొక్క పూర్వరూపమే కారణం. జీవితంలోనూ కార్యక సంబంధం ఒకచోట సమాప్తి పొందేది కాదు, అట్లాగే పరిశోధనలో ఇది గొలుసు వంటిది, చక్రనేమి క్రమణం వంటిది. ఎన్నో సమస్ శాస్త్రీయమైన అవగాహనతో చర్చకు నిలిపి పరిష్కరించేందుకు తో ఈ అంశం అటు సామాజిక తత్త్వాన్ని ఇటు కళాత్మకమైన విలు శోధించేందుకు పలువిధాలుగా ఉపకరిస్తుంది. ఒక క్రమ పరిణామ గ సామాన్యం నుండి ప్రత్యేకమైన విషయానికి (విశేషానికి) ప్రత్యేకం న సామాన్య విషయానికి పరిశోధకులకు అనుభవంలోకి వచ్చేదే. ఇక రెండు విధాలైనా స్థితుల్ని పరిశోధకుడెదుర్కోవలసి వస్తుంది. ఒకటి వికం రెండోది దార్శనికం. వాస్తవికంలో హేతుస్థితి ఉంటుంది దా కంలో హేత్వతీతమైన అనుభవరూపం ఉంటుంది. ఇది ఏ హేతుప లొంగదు. కాని అనుభవంతో నిజం అనిపిస్తుంది. ముఖ్యంగా సృజనా సాహిత్యంలో ఈ స్థితి ఎదురౌతుంది. ఈ రెండూ ఏ విధంగానూ పరస విరుద్ధంకావు. అన్యోన్యం ప్రయోజనాత్మకాలే.

పరిశోధనలో కొన్ని సందర్భాలు ఎట్లా ఉంటాయంటే తాత్కాలిక పద్ధతిలో ఒక ఊహాత్మక నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. కొన్ని సమ క్లిష్టమైనవీ, అపరిష్కృతంగా ఉన్నవీ ఎదుర్కోవలసి వచ్చినపుడూ, దానిపై అభివృద్ధిని కోరేటప్పుడూ ఈ చర్య అనివార్యమౌతుంది. మొ ఇది అంచనా లేదా ఊహాత్మక నిర్ణయ రూపంలో ఉంటుంది. అ ఇది ఏ ఆధారమూ లేకుండా మాత్రం ఉండదు. కాని సత్వరం ని మైన నిర్ణయానికి తగిన సమర్థనీయమైన బలమైన హేతుస్థితి ఉండ మాట. అప్పుడే అంచనా లేదు ఊహాత్మకమైన నిర్ణయరూపం తాత్కా మైన ప్రాతిపదికపై పొందించడం జరుగుతుంది. ఇది పరిశోధన కొద్దీ విశ్లేషణ సమన్వయ స్థితులతో కార్య కారణ చర్చా రూపంతో ఒ అంతర్ సాక్ష్యాధారాల పరీక్షకు నిలిపి, అట్లా నిలచిన మీదట అ మైన మార్పులుచేసి లేదా యథాతథంగానో స్వీకృతమౌతుంది. అ రణ పరిస్థితుల్లో నిరాకృతమూకావచ్చు, ఇది మూలపాఠ పరి రాల్లోనూ, చారిత్రకాంశాల్లోనూ, అపరిష్కృతంగా ఉన్న సమస గురించే, పునర్విలోకనం కోరే మార్పుల్ని అభిలషించే నిర్ణయాల గ ఆలోచన చేసేప్పుడు ప్రత్యామ్నాయంగా అవసరమౌతుంది.

అంతర్విధానంలో ఆరంభం నుండి సమాప్తి వరకూ పరిశీలనం నిరంతరం జరిగే పరిశోధనాక్రియా రూపం, ఇది చాక్షుషమూ, మానసి అని రెండు విధాలు, చాక్షుషం పరిమితమైంది, దేశకాల సంబంధ బాహ్యమైన స్థితి నాశ్రయించిందీ, దీని ఆధారంపై లేదా స్వతంత్రం ప్రసరిస్తుంది మానసికం. దీనికి పరిమితి లేదు. దేశకాలాతీతమైందీ, అంత నాశ్రయించిందీ, ఒక్కొక్కప్పుడు దర్శన స్థాయిలోనూ ప్రవ నపుతుంది. పరిశీలనం అంటే ఏదేని ఒక వస్తువును ఇది ఉన్న

స్వరూపాన్ని, ఒక ప్రయోజనాపేక్షతో (పరీక్షగా) చూడడం లేదా ఆలోచన చేయడం, కాబట్టి ఇది భౌతికం లేదా మానసికమైన అనుభవాత్మకమైంది. పరిశోధనలో దీన్ని అదుపులో వుంచడం అవసరం. లేని పక్షంలో విషయ పరిధుల్ని మరచిపోయేట్లు చేయడం లేదా అతిక్రమించడం జరుగుతుంది. అవసరం లేనివీ సంబంధంలేనివీ చోటు చేసుకొని చేరే అవకాశమూవుంది. విషమ పరిధుల దృష్ట్యా నియమితమైన పరిశీలనం వల్ల సత్ఫలితాలు పొందడానికి, సావధానతతో పాటు గ్రహణ శక్తి అవసరం. ఆ తరువాత వివేచనా శక్తి ప్రమేయం వస్తుంది. వివేచన పర్యవసానంగా సరియైన ఎన్నిక జరుగుతుంది. అయితే ఒక సమస్య గురించి మానసికమైన క్రమగతిలో అనుమతి (ఇన్‌ఫెరన్స్), నిర్ధారణ, ఆలోచన, భావనతో ఎప్పటికప్పుడు పరిశోధనం పరిణామాన్ని పొందుతూ ఉంటుంది. పరిశీలనం, వివేచనతో అభిప్రాయం లేదా సిద్ధాంత స్వరూపానికి దారి ఏర్పడుతుంది. అంటే సిద్ధాంత గ్రంథానికొక స్వరూపం ఇవ్వడానికి ప్రారంభ చర్య మొదలు ప్రతిపాదనం వరకూ శాస్త్రీయమైన విధానంతో ప్రణాళిక సుగమత్వాన్ని పొందుతుందన్న మాట. ఈ క్రమంవల్ల అంతర విధానంలో సంకీర్ణత, అస్పష్టత అసంతృప్తి తొలగిపోయి సౌలభ్యమూ, స్పష్టత, సంతృప్తి సిద్ధిస్తుందనడంలో సందేహం లేదు. పరిశీలనం దాని తరువాత వివేచనం ముఖ్యంగా వస్తుపరమైన దృష్టిని కోరే, హేతు స్థితికి ప్రాధాన్యం ఇచ్చే సందర్భాల్లో ఎక్కువగా అవసరమౌతుంది. ఈ నిర్మాణ క్రమం ప్రయోజనం అంతా సమస్యల స్వరూపాన్నీ వీటి వెనుకనున్న వాస్తవాన్నీ, గతినీ గుర్తిస్తూ ఒక దాని ప్రభావం మరో దానిపై ప్రసరించి అవి పనిచేసే తీరును అర్థవంతంగా పరిణమింప జేసి సిద్ధాంత స్వరూపాన్ని స్పష్టంగా సమంజసంగా ఆవిష్కరించడమే. శాస్త్రీయమైన విధానాల అవలంబనం పరిశోధనలో సిద్ధాంత ప్రతిపాదనకు సంబంధించిన సమస్యల ఆయువు పట్లను తెలుసుకోడానికీ, విశ్వసనీయమైన ఆధార తలంపై పరిశోధకుడు సరియైన మార్గాన ప్రయాణించడానికీ సహకరిస్తుంది. చివరకు పాతవి యథాతథంగా స్వీకృతం కావచ్చు. నిరాకృతం కావచ్చు. ఏమైనా మార్పులను పొందవచ్చు. కొత్తవి ఆవిష్కృతం కావచ్చు. ఇందులో ఏ దశలోనైనా పరిశోధనలో మౌలికతను ప్రదర్శించేందుకు అవసరమైన స్వేచ్ఛకు అవకాశం ఉందన్న సంగతి మరచి పోకూడదు. ఈ స్వేచ్ఛవల్లనే పరిశోధనలో ఇంతటి వైవిధ్యమూ, వైశిష్ట్యమూ.

ప్రతి పరిశోధనకూ ఒక ప్రత్యేకత ఉంది. దాని అంతస్ స్వరూపమూ ప్రయోజనమూ వేరువేరుగా ఉంటాయి. ప్రతి పరిశోధకుని అన్వేషణ మార్గం లక్ష్యం భిన్నంగా ఉంటాయి. స్థూలంగా కొన్ని సూత్రప్రాయమైన బాహ్యాంతర్నిర్దేశకాలున్నప్పటికీ పరిశోధకుని మౌలికమైన వ్యక్తిత్వ ప్రభావంవల్ల అంతరమైన యోజనమూ సంస్థితిలో విశిష్టత కలిగి ఉంటుంది. ఈ వైవిధ్యం మానవ జీవితం వలెనే తప్పనిసరియైంది. పరిశోధనా వ్యాసంగం, విజ్ఞాన రాశిని సంపన్నం చేసింది. కొన్ని సందర్భాల్లో విఫలం కావచ్చు అనుకున్న ఫలితాలనివ్వలేక పోవచ్చు. కోరిన ప్రమాణాలనందుకోలేక పోవచ్చు. అంత మాత్రాన ఈ కృషి నిలిచిపోదు. ఆధునిక యుగంలో సాహిత్య వ్యాసంగం బహు విస్తృతిని పొందుతూండటం చేత ఇంకా వినూత్నమైన సాంకేతిక విధానాలతో కొనసాగుతూనే ఉంటుంది. వివిధ మానవుల క్రియా కలాపాలతో కూడిన జీవితాలెంత వరకు సార్థకాలై, ప్రయోజనవంతాలై రాణిస్తాయి? అన్న ప్రశ్నకు సమాధామే దీనికీ వర్తిస్తుంది. దీనికి సంబంధించిన ప్రశ్నలే జీవితానికీ వర్తిస్తాయి. పరిశోధనలోనూ వ్యక్తి ఉన్నాడు. అతని వ్యక్తిత్వం పరిశోధనాత్మకమైంది. ముఖ్యంగా తాను చేపట్టిన కార్యక్రమం ఎటువంటి దీని అవసరం ఏమిటి? విలువలు ఎటువంటివి: సాహిత్య సంపదలో మొత్తం మీద ఇది సమకూర్చే భాగ మేమిటి? అన్న ప్రశ్నలకు సమాధాన రూపమే పరిశోధనావ్యక్తిత్వం- ఇంతకుముందు పేర్కొన్న అంతర్విధాన రేఖలతో ఏర్పడేది. ఈ ప్రశ్నలకూ చేపట్టిన వస్తువు పరంగా ఉత్పన్నమైన సమస్యలకూ, అతడు చేసే అన్వేషణం, పడే సంఘర్షణ, పొందే సమన్వయం, కోరే పర్యవసానం పైనే వ్యక్తిత్వం నిర్మితమౌతుంది. ఒక్కొక్క పరిశోధకుని సమాధానాలు పరిష్కారాలు ఒక్కొక్క విధంగా ఉంటాయి. వీటిలో కొన్ని తాత్కాలిక ప్రయోజనం కలవీ, మరికొన్ని శాశ్వతమైన ప్రాతిపదిక కలవీ, తప్పని సరిగా ఉంటాయి. పరిశోధనా కృషిలో ఎప్పటికపుడు ఎదుర్కొవలసిన పరిస్థితుల్ని పరిశోధకుడు స్వేచ్ఛగా ప్రయత్నించి నిర్ణయ శక్తిని ప్రదర్శించేందుకు ఉపక్రమించడంతో అంతకుముందు ఏర్పడివున్న స్థూలమైన రేఖలకు స్వరూప చిత్రం ఏర్పడడం ఆరంభమౌతుంది.

పరిశోధనలో ప్రయాణమే లక్ష్యం కాదు. లక్ష్యం వేరుగా ఉంటుంది. ప్రయాణం లక్ష్యపరిణామ రూపంగా పరిగణించే వారి మాటల్లోనూ తాత్త్వికసత్యంతో పాటు కొంత వాస్తవికత లేకపోలేదు. ఇది అంతం అంటూ లేని నైరంతర్యాన్ని సూచిస్తూనే ఎక్కడికక్కడ ఖండఖండంగా లక్ష్యసీమల్ని భావింప చేస్తుంది. అంతర్విధాన క్రమంలోని విశ్లేషణం సమన్వయం పరిశీలనం ఆలోచన దర్శనం చేత సుస్థితిని పొందిన నిర్ణీతమైన ప్రణాళికా నియతమై తన లక్ష్యాన్ని స్పష్టంగా ప్రసరింపజేయవలసి ఉంటుంది.

వ్యక్తిత్వం అనేటప్పటికి జీవితంవలెనే పరిశోధనలోనూ అంతర్విధానానికి సంబంధించిన మూలతత్త్వం 1) హేతుయుతం 2) భావనామయం 3) అనుభవాత్మకం అని మూడు దశ (లెవెల్స్)ల్లో ప్రవృత్తమై కన్పిస్తుంది. మొదటిది కార్యకారణ చర్చతో రెండోది ఆలోచనా ప్రసారంతో మూడోది దర్శన శక్తితో పరిశోధకుడు వస్తువును నిర్వహించే అంతర్విధానాన్ని ప్రకటిస్తాయి. ఈ మూడు వేటికవి విభజించడానికి వీలు కలిగినా సందర్భాన్ని బట్టి ఏదో ఒకటి ప్రముఖంగా తక్కినవాటి ప్రమేయం కలిగి తప్పనిసరిగా కన్పిస్తుంది. అంతర్విధానంలో ఇంతవరకు వివరించింది ఒక ఎత్తు, ఇప్పటి అంతర్వ్యక్తిత్వ వికాసం ఒక ఎత్తు.

ఇది ఇట్లా ఉంచి పరిశోధనలో పరిశోధకుని మనస్తత్వానికి సంబంధించిన ధోరణులూ విస్మరించడానికి వీల్లేదు. దీని ప్రశక్తిలేకుండా ఈ వ్యాసానికి సమగ్రత చేకూరదు. ఈ ధోరణుల్లో 1) కొన్ని సర్వసాధారణమైనవీ 2) మరికొన్ని వైయక్తికమైనవీ 3) మరికొన్ని అసాధారణమైనవీ ఉంటాయి. వీటి సమ్మేళనంతో ఏర్పడిన విశిష్టమైన రూపం చాలా సంక్లిష్టమైంది. ఎంత ప్రయత్నించినా ఇంకా తెలియంది ఎంతో మిగిలివుండే లక్షణం కలిగింది. ఇది ఏర్పడడానికి కారణాలు, మనస్తత్వ శాస్త్ర రీత్యా 1) అనువంశికం 2) పోషణ - పరిసరాల ప్రభావం 3) సంతరించుకున్న విజ్ఞానం, అలవడిన సంస్కారం 4) గతంలోని అనుభవాల ప్రభావం 5) వ్యక్తిగతమైన మనస్తత్వ నిర్మితి 6) సమాహారంగా రూపొందిన అభిప్రాయాలూ, ఆదర్శాలూ ముఖ్యంగా పేర్కొదగినవి. పరిశోధనా స్వరూపంతో ఇంచుమించు అందరూ ఒకే బాహ్య అంతర్విధాన సూత్రాలను అవలంబించినప్పటికీ పరిశోధనా గ్రంథాలు ఎంతో వైవిధ్యంతో వివిధ స్థాయి మూల్యాలతో ప్రవర్తితం కావడానికి మూల కారణాల్లో అంతర్గతమైన మనస్తత్వ ధోరణీ ప్రవాహం పేర్కొదగిన వాటిలో ముఖ్యమైంది. దీనిచేత ఏర్పడిందే వ్యక్తిత్వ విలసనం. ఈ సందర్భంలో పేర్కొదగిన మరో విషయం, పరిశోధకుని స్వేచ్ఛాశీలంతో కూడిన హేతుదృష్టి, నిర్ణయ శక్తితో కూడిన లక్షణం ప్రతి పరిశోధనలో తప్పని సరిగా దృష్టిని ఆకర్షిస్తుంది. యంత్రాలకూ మానవులకూగల భేదం ఇదే. గుణాత్మకమైంది. వ్యక్తి అంటే మొదట బాహ్య శరీర నిర్మితీ, ఆ తరువాత అంతర్ వ్యక్తిత్వ పరిణామంవలెనే పరిశోధనలోనూ ఈ స్థితి అనుభవానికి వస్తుంది. ప్రస్తుతం పరిశోధన కన్వయిస్తే ఇందులోని అంశాలు కొన్ని స్థిరమైనవీ మరికొన్ని పరిణామ సహజమైనవీ కన్పిస్తాయి. ఈ రెండో దాని వికాస రూపమే పరిశోధనలో మౌలికమైంది. పరిశోధన యొక్క గుణాధారమైన అస్తిత్వాన్ని ప్రదర్శించేదీ. ఇది ఆంతర విధానంలో నిహితమై

ప్రకృతి చూపే ప్రస్థానం

లక్ష్మణ

ఎవరు చెప్పారు చినుకులకు
మబ్బు తునకల్లోంచి
రాల్చుక రావాలని
ఎవరు చెప్పారు చిగుర్లకు
చెట్ల కొమ్మల్లోంచి
చీల్చుక పోవాలని
ఎవరు చెప్పారు వాగువంకకు
ఆగిపోకుండా మనోధైర్యంతో
సాగిపోవాలని
చినుకులతో స్నేహం
చేసినప్పుడు
చిగుర్లతో ఆడుగు
వేసినప్పుడు,
వాగు వంకలోని ధైర్యం
చూసినప్పుడు-
అప్పుడే
అలుముకున్న నిశీధిని చీల్చుకొని
వేగుచుక్క పొడుచుకొస్తుంది
వెలుతురు మొక్కకు ఊపిరి పోస్తుంది.

అపురూపం

దశశ్రీ

ఆకాశం
భూమిని
పలకరిస్తుంది
చినుకుల మాటలతో —
భూమి
అందుకు
పులకరిస్తుంది
చిగుళ్ళ నవ్వులతో —
ఆ మాటల్లో
శబ్దం వుంది —
ఈ నవ్వుల్లో
మౌనం వుంది —
ఆ శబ్దానికి ఈ మౌనానికి
మధ్య
ఓహ్!
ఎంత అనుబంధం!

విశిష్ట వ్యక్తిత్వ శక్తి కలిగి ఉండడం చేత మనస్తత్వ పరమైన వివరణం అవసరమౌతుంది. పరిశోధనలో అంతర్విధానంలో సన్నిహితమైన వ్యక్తిత్వ సిద్ధాంతం శాస్త్రరీత్యా సమున్నతమైందీ, సమర్థనీయమైందీ, ఇది పరిశోధనలో ఒకప్పుడు హేతుసహితమైన ఆలోచనకూ మరొకప్పుడు హేత్వతీతమైన స్థితికీ ముఖ్యంగా సాహిత్య రంగంలో అందునా సృజనాత్మక రచనల్లో ఎదుర్కొవలసి ఉంటుంది. అయినప్పటికీ ఒక క్రమ సహితమైన అంతర్ విధానంలో ప్రయోజితమై ఆవిష్కృతం కావడంవల్ల ఏ విధమైన క్లిష్టతనూ పొందదు. కొత్తను అన్వేషించే అభిలాషగల పరిశోధకుడు అవలంబించే స్వేచ్ఛ నియంత్రితమై, పరిశోధనా పరిధి అవసరం మేరకు విస్తృతిని పొందడం చేత ఒక విధంగా పరిశోధన హద్దులు మీరకుండా నిర్దుష్టంగా నిర్మితమౌతుంది. ఒక్కమారు సమాలోచనం చేస్తే అంతర్విధానం,

1) పరిశోధనకు క్రమ సహితమైన గతి చేకూరేందుకు అవసరమైన నిర్మాణ రూపాన్ని
2) మొదటి నుండి చివరి వరకూ భౌతిక రూపంతోపాటు అంతరమైన పరిణామంతో వికాస సమగ్రతనూ
3) హేతువు చేత కార్యకారణ సంబంధాన్ని, అనుభవం చేత వైయక్తిక మనస్తత్వ ధోరణినీ, ఆదర్శం చేత సామాజిక దృష్టినీ భావింపజేసే వాస్తవ శక్తుల్ని
4) పరిశోధనా వ్యాసంగం వెనుక నుండి అంతర విధానాన్ని నడిపే శక్తులు న్యాయనీ అవి సామాజికం. వైయక్తికం ఆదర్శలక్షణం చేత సమాహితమైన రూపాన్ని
5) కొత్తను అన్వేషించే, స్వేచ్ఛ, హేతుదృష్టి, అనుభవ దర్శనం చేత నిర్మితమైన పరిశోధనా వ్యక్తిత్వ వికాసం విస్మృతం కావడానికి వీలులేని స్థితినీ - భావింపజేస్తూ వివేచనకు ఉపకరిస్తుంది.

"సమస్యలెన్నో కృత్రిమ పద్ధతులన్ని విధాలు" నార్త్ రోప్ మాటలు, ఈ విధానక్రమం యొక్క వైవిధ్యాన్ని ప్రకటిస్తూ పరిశోధకుని స్వాతంత్ర్యాన్ని భావింపజేసినవి. సాహిత్యం ఒక విధంగా సామాజిక స్వరూపంతోపాటు కళాత్మకమైన అంశాలకూ సంబంధించింది. మానవులూ వారి వివిధ చర్యలూ ప్రతి చర్యలూ ఆలోచనలూ కల్పనల ప్రమేయం కలిగింది. దీన్ని గురించిన పరిశోధనమూ భౌతిక మానసికమైన నిర్మాణ వ్యక్తిత్వాలు తప్పని సరిగా సంతరించుకొని ఆవిష్కృతమౌతుంది. వీని సమాలోచనమే ప్రస్తుత పరిశోధనం - అంతర్విధానం క్రమం - వ్యక్తిత్వం.

సీరియల్

సృష్టి

ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

"చూడండి పద్మా! మీరు రెండు మూడు రోజులు హాస్పిటల్లో ఉండాలి.

"హాస్పిటల్ లోనా! దేనికి?" ఆశ్చర్యంగానూ భయంగా చూసింది.

"మీ కోసమే. ఏ తేదీలలో అన్నది నేను తరువాత చెబుతాను. ప్లీజ్..." అర్థిస్తున్నట్లు చూసిందామె వేపు ఆలిస్.

విరక్తిగా నవ్వింది పద్మ. "మీరెందుకు రమ్మంటున్నారో నాకు తెలుసు. కాని.... డాక్టర్! వొట్టిపోయిన గొడ్డుకెంత పితికినా పాలివ్వదు."

"ఆ నిరాశే పనికిరాదు. ఫ్రస్ట్రేషన్ ద వర్స్ట్ ఎనిమీ. పేషంట్ హృదయపూర్వకంగా సహకరిస్తేనే డాక్టరేమయినా చేయగలిగేదీ, మందులు పనిచేయగలిగేదీ. చూడండి. ఒక విషయంలో మీ అంత అదృష్టవంతు లెవరో కాని ఉండరు—"

"పిల్లలు లేకపోవడమే అదృష్టమయితే.... గొడ్రాలు కావడమే ఘనమయితే - మీ మాటలు నిజమే."

"కాదు. జయదేవ్‌కి మీరంటే ఎంత ప్రేమని! ఈ వయసులో కూడా ఆయన మిమ్మల్ని ప్రాణాధికంగా చూసుకుంటున్నారు. భారత స్త్రీకి భర్త అనురాగాన్ని మించిన సంపదా సౌభాగ్యమూ ఏముంటాయ్!"

"పిల్లలు!" కచ్చితంగా అంది. "ఇప్పుడు నేను తపిస్తున్నది భర్త అనురాగం కోసం కాదు. బిడ్డలు కలగలేదే అని."

"ఆ అవకాశం ఉందేమో చూడడానికే మిమ్మల్ని హాస్పిటల్లో ఉండమంటున్నది -"

"నాకు - పిల్లలు పుట్టించగలరా? అసాధ్యం. మీరు చాలా మంచి డాక్టరే కావొచ్చు కానీ. భగవంతుడు కారు. ఇప్పుడిక దేముడు కూడా నన్ను అమ్మని చేయలేడేమో."

"కాని- ఆ భగవంతుడే నిన్న నాకు కలలో చెప్పాడు." స్థిరంగా అంది.

"ఏమని?"

"నిన్న రాత్రి - నిద్రపోయే ముందు - మీ కోసం ఏసుని ప్రార్థించాను...."

తెర అవతల - ఆత్రంగా వింటున్నాడు జయదేవ్.

"నిద్రలో కలలో కనిపించాడు ఏసు."

"కనిపించి - ఏమన్నాడు?" ఆతృతతో జయదేవ్ గుండె ఆగేటట్లుంది.

"నీవు నా యందు విశ్వాసముంచుము. నేను నిన్ను ప్రేమించి అనుగ్రహించెదను. నా యందు విశ్వాసముంచిన వారిని నేను కరుణించెదను."

నిజమా! అనుకున్నాడు జయదేవ్. క్రిష్టియన్ అయిన ఆలిస్ అబద్ధమాడడం లేదు కద?

"పద్మా! ప్రభువయిన క్రీస్తు - రొట్టె లేని వారికి రొట్టెనిచ్చును.. బిడ్డలు లేని వారికి బిడ్డలనిచ్చును - అనుకున్నాడు అతను మనసులో.

"సరే. ఇంతలో నాకు పోయేదేమీ లేదు. ఎలాగూ జీవచ్ఛవాన్నే. నా శరీరం మీద మీరింకా ప్రయోగాలు చేయాలనుకుంటే - సరే."

"ఎలాగూ సహకరించేటప్పుడు.... మనస్ఫూర్తిగానే తోడ్పడవచ్చు కదా! పద్మా! నా మనసెందుకో - మీ కోరిక నెరవేరబోతోందనే చెబుతోంది."

"మాటలు అతిలురేపే స్థితిని నేను దాటిపోయాను డాక్టర్. అయినా మీరు చెప్పినట్లు నా శరీరాన్ని మీ వశం చేస్తానన్నానుగా."

"మీరు వెళ్లి నా గదిలో విశ్రాంతి తీసుకోండి." అని ఆమెను పంపి— ఒక నిట్టూర్పు వదిలింది ఆలిస్. శారీరకనారోగ్యం బాగుచేయడం సులభం కాని మానసికనారోగ్యం బాగుచేయడం కష్టమనుకుంటూ. ఇంతవరకూ ఆమెకొక గర్వముండేది. అబ్‌స్టెట్రిక్స్ - వైద్యంలో భాగమే అయినా - యితర విభాగాలకంటే దీనికి ప్రత్యేకత వుంది. ఎందుకంటే- యిది- యిద్దరి పేషంట్ల నొక్కసారి కాపాడుతుంది (తల్లినీ, గర్భంలో శిశువునీ). కాని- యిప్పుడు ఆలిస్ గర్వం- గాలి తీసిన బుడగలా చప్పబడిపోయింది. ఇటువంటి మనిషితో సుషను ఎలా నెగ్గుకు వస్తుంది?

జయదేవ్ వొచ్చాడు.

"కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలి." అందామె.

"చెప్పండి—" ఆశగా అంటూ అతను కూర్చున్నాడు.

"మీ స్పెర్మ్‌ని పరీక్షించాలి." సూటిగా అందామె.

అతను ముందు తుళ్లిపడ్డాడు. మరుక్షణం - సిగ్గుపడ్డాడు. అతనికొక్కసారి పొరపాటు చేసినట్లనిపించింది. ఇవి- పూర్వపు రోజులు కావు. స్త్రీ సంతానవతి కాకపోతే మునుపు నేరమంతా ఆమె మీదకే తోసి ఆమెనే బాధ్యురాలిని చేసేవారు.

"మీ సెమెన్ లో స్పెర్మటిజోవా (గర్భాన్ని కలిగించగలిగే కణాలు) కావలసిన సంఖ్యలో ఉన్నాయో లేదో చూడాలి. ఎందుకంటే...." తనకి తెలిసినా - మౌనంగా వినసాగాడతను.

"మీలో లోపమున్నా గర్భం దాల్చకపోవచ్చు."

"ఎప్పుడు పరీక్ష చేస్తారు?"

"ఈసారి వొచ్చినప్పుడు...." అంటూంటే ఆమె మెదడులో హఠాత్తుగా మెరుపు మెరిసినట్లయింది. "ఐడియా!" అరిచినంత పనిచేసిందామె.

"డాక్టర్!"

"ప్లీజ్.... డిస్టర్బ్ చేయకండి.... అవతలకి వెళ్ళండి నేను పిలిచే దాకా...." అతను చిత్రంగా చూసి— వెళ్ళిపోయాడు.

పది నిముషాలపాటామె కళ్ళు మూసుకొని ఏదో దీర్ఘమైన ఆలోచనలో మునిగినట్లుండి పోయింది. అప్పుడు చాలా ఉత్సాహంగా- కాగితం మీద ఏవేవో రాసింది.

"జయదేవ్!"

అతను పరుగెత్తుకు వొచ్చాడు. ఆలిస్- చాలా ఎక్సైట్ అయినట్లుంది

"మీరు మీ మిసెస్‌ని దింపేసి రాగలరా! వెంటనే రావాలి. మీతో మాట్లాడాలి. సుషమకి కూడా టెలిఫోన్ చేస్తాను."

"అలాగే." అన్నాడతను బుద్ధిగా.

కారు నడుపుతున్నాడేకాని- జయదేవ్ దృష్టి రోడ్డు మీద లేనేలేదు.

అతనేదో చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.... పద్మ పక్కనున్నా.

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

"డాక్టర్- రేపు నా సెమెన్‌ని పరీక్షిస్తానంది."

"దేనికి?"

"నా స్పెర్మ్‌లో - సంతానోత్పత్తి చేయగల స్పెర్మటోజోవా తగినంత ఉన్నాయో లేవో చూడాలని."

ఆమె మౌనంగా ఉండిపోయింది.

"పద్మా! రేపు.... పరీక్షలో.... స్పెర్మ్‌లో తగినన్ని స్పెర్మటోజోవా లేవని చెబితే?" ఆత్రంగా చూశాడు.

"బహుశా— అలా అయివుండదు...."

"బహుశా— అలాగే కావొచ్చునేమో? నిన్ను సంతానవంతురాలిని చేయలేని అసమర్థత నాదే కావొచ్చునేమో...."

"మీరు— నాకు తెలుసు.... నపుంసకులు కారు-"

"నపుంసకత్వం— చాలా విధాలు. స్త్రీని సుఖపెట్టలేక పోవడమే కాదు, ఆమెని సంతానవంతురాలిని చేయగలిగినన్ని కణాలు వీర్యంలో లేక పోయినా నపుంసకత్వమే. ఒకవేళ అదే అయితే.... నేరస్తుణ్ని నేనే అయితే.... "నువ్వేం చేస్తావు? పిల్లల కోసమని భర్త ద్వితీయ వివాహానికి ప్రోత్సహించిన భార్యలున్నారు కానీ- లోపం భర్తదైతే - సంతానవతి అయ్యేందుకు తాము ద్వితీయ వివాహం చేసుకున్న స్త్రీలీదేశంలో లేరే - పురాణాలలో తప్ప? భారత స్త్రీకి మాతృత్వం కంటే కూడా ముఖ్యమైనది పాతివ్రత్యమేనే? మరి- నువ్వు నేరం చేయకపోయినా.... పిల్లలు లేనందుకు బాధ్యత నీది కాక నాదే అయినా- ఆత్మహత్య చేసుకోడం అన్యాయం కాదూ? నేరం నాదీ శిక్ష నీదీనా!

"ప్రశ్న— తప్పు లేదా లోటు ఎవరిదని కాదు. అది మీదయినా నాదయినా- దురదృష్టం నాదే. నేను భరించలేనిదీ. ఆత్మహత్యకు నిర్ణయించుకున్నది యీ దౌర్భాగ్యం కొద్దీ." మార్గం కాదు, ధ్యేయమే.... గమ్యమే తన లక్ష్యం అన్నట్లు... యింక మాటలకవకాశమివ్వకుండా కచ్చితంగా చెప్పేసింది పద్మ.

ఇంక అతనూ ఏమీ మాట్లాడలేక పోయాడు.

ఆమెను యింటి దగ్గర దింపి.... అతను మళ్ళీ మేరీ నర్సింగ్ హోమ్ వొచ్చేసరికి—

అప్పటికే సుషమా ఆలిస్ - ఆమె గదిలో కూర్చుని టీలు తాగుతున్నారు.

"రండి." అన్నది ఆలిస్ - జయదేవ్‌ని చూస్తూ.

అతను కూర్చునే సరికే - కప్పుతో టీ వొచ్చింది.

"జయదేవ్! మీకు - మా మీద నమ్మకం ఉందా? పూర్తి నమ్మకం....'

అతను తెల్లబోయాడు. ఏమిటీమె ప్రశ్న ?

"జవాబు మీకే తెలుసు."

"అలాగ కాదు. ఇది. లక్షంతో వ్యవహారం—"

"నమ్మకానికి హద్దులుంటాయనుకోను. మనిషిని నమ్మితే - రూపాయయినా లక్షయినా ఒక్కటే."

"సరే. ఒక లక్షరూపాయలు క్యాష్ సిద్ధంగా ఉంచండి. ఏ క్షణంలో అయినా అవసరం పడొచ్చు. దేముడు మేలు చేసి - మా ప్రణాళికలూ ఆలోచనలూ సఫలం అయితే."

"ఏమిటివి?" ఆత్రంగా చూశాడు.

"క్షమించండి. ఇప్పుడు కాదు. పని పూర్తయ్యాక చెబుతాం. ఎందుకంటే - ఇది చాలా పెద్దపని. తరువాత - మేమెంతవరకూ కృతకృత్యులమౌతామో మాకే తెలియదు. సాధ్యమయినంతవరకూ తక్కువ ఖర్చుతో జరిగేలాగే చూస్తాం...."

ఆమె ఏదో పెద్ద పనే తలపెడుతూందని అతనికి తెలుస్తూనే ఉంది. అయితే- అది తనకి చెప్పడానికే మభ్యంతరమో అర్థం కావడంలేదు. తన పనికి - తన దగ్గర రహస్యమేమిటి?

"అది కాదు జయదేవ్! మేము మీ తరఫున వ్యవహరిస్తాం. మేము కొన్ని ఆలోచనలు చేశాం. అవి ఫలించేవరకూ బయటపడడం మాకూ వృత్తికీ కూడా మంచిది కాదు. నిజానికీ పని మీ కప్పగించెయ్యొచ్చు కానీ...."

"సరే. నా తరఫున మీరు వ్యవహరించండి...."

"ఎంతవుతుందో చెప్పలేం.... రిస్కు తీసుకోవాలి. సుమారొక లక్ష...."



"పరవాలేదు. నేను సిద్ధమే. డబ్బుకేముంది...." తేలిగ్గా అన్నాడు.

"థాంక్యూ."

"నేను మీకు చెప్పాలి, నాకోసం తీసుకుంటున్న శ్రమకి." నవ్వి-

"డబ్బు ఎప్పుడు తెచ్చి యిచ్చేది?" అడిగాడు.

"రేపు తెండి. మరొక విషయం...."

"ఏమిటి?"

"ఇది వొక గాలిలో దీపం లాంటి ప్రయత్నం. గుడ్డి గుర్రపుతాపు. ప్రయత్నించడమే తప్ప ఆశ ఎక్కువగా లేదు. తరువాత.... దీనిలో.... మెడికో లీగల్ యింప్లికేషన్సున్నాయి. కనుక- రహస్యంగా జరగాలన్నీ. అందుకు- మీరూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది."

"ఏమిటి ?"

"ప్రత్యక్షంగానే తప్ప టెలిఫోన్లు చేయక పోవడం, మీరిక్కడికి వొస్తున్నట్లు సాధ్యమయినంత తక్కువ మందికే తెలిసేలా రావడం.... అలాగ...."

"ఆలిస్!" అతనాశ్చర్యపోయాడు. "ఎందుకీ రహస్యం?" మనమేం నేరం చేస్తున్నామని? పేషంటు- డాక్టరు దగ్గరికి రావడం తప్పా?"

"కాదు. కాని.... తప్పదు. ఇంతవరకూ మనమేమీ నేరం చేయలేదు. కాని ... చేయబోయేది.... నేరంగా తోచవచ్చు కొందరికి. అందుకు."

"సరే." అన్నాడింక ఆ విషయం రెట్టించదలుచుకోక. "డాక్టర్, మీరేం చెప్పినా, చేసినా మా మంచికే. ఆ నమ్మకం నాకుంది."

"థాంక్స్. ఇంక మీరు వెళ్లండి."

ఇవతలకి వొచ్చినా అతని మెదడు ఆలోచిస్తూనే ఉంది. ఇద్దరు డాక్టర్లూ కలిసి - ఏం చేయబోతున్నారు? తన ప్రయత్నాలను రహస్యంగా ఉంచవలసిన అగత్యమేమిటి? ఇంత హఠాత్తుగా లక్ష రూపాయలడగడంలో ఆలిస్ ఉద్దేశమేమిటి? ఈ డబ్బుతో ఏం చేయబోతూంది?

* * *


"డబ్బుకి మనం కోరుతున్నది సాధించే శక్తి ఉంటుందనే అనుకుంటాను."

"ఇది- అమెరికా అయితే అలాగే. కాని- భారతదేశం. ఇక్కడ ఆడదానికెన్నో సెంటిమెంట్లు." మరచిపోకన్నట్లు అంది సుషమ.

"నిజమే. అమెరికాలో యిప్పటికే యిది ప్రొఫెషనయిపోయిందనుకుంటాను. ప్రాస్టిట్యూషన్ లాగే."

"ఔను. అక్కడి న్యాయస్థానాలలోకి కేసులు కూడా వొస్తున్నాయి. ఈ విషయంలో లా ఏర్పడాలంటూ డిమాండ్ చేస్తున్నారు."

"అన్నట్లు.... ప్రాస్టిట్యూట్ ఐతే - మన ప్రతిపాదన సంగీకరిస్తుందేమో డబ్బుకోసం?"



సుషమ చేదుగా ముఖం పెట్టింది. "వ్యభిచారిణా ?"

"ఎవరయితేనేం, స్త్రీ కదా? మనకి కావలసింది అంతవరకే...."

"అది కాదు.... మనిషి మనస్తత్వం అతను పెరిగే పరిసరాల మీద కొంత వరకూ ఆధారపడి ఉంటుంది కదా! అలాగే అతను లేదా ఆమె పెరిగిన గర్భాశయం మీద కూడా ఆధారపడి ఉండవొచ్చు. జయదేవ్ పద్మలు హైక్లాస్ మనుషులు. ఒక వేశ్య గర్భాశయంలో పెరిగిన బిడ్డ - ఆ యింటికి మనుషులకి అనుగుణంగా మసులుకుంటాడా? ఆలిస్ "తల్లి రక్తం నుంచి బిడ్డకు కొన్ని బుద్ధులు సంక్రమిస్తాయి. జెనిటిక్స్ నిరూపించింది విషయం.... ...."

"ఔను, మామూలుగా కూడా ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అంటారు, బిడ్డ తల్లి ననుసరిస్తుంది బుద్ధుల్లో అని సూచించడానికి. నీ సందేహం నిజమే కాని "ఒక విషయం మరచి పోతున్నావు."
"ఏమిటి?"

"మనకి - కావలసినంత ఛాయస్ లేదు- ఎంచుకుందుకు - గర్భాశయం అద్దెకిచ్చే స్త్రీ - దొరుకుతుందన్నదే అనుమానం. డబ్బుకోసం శరీరాన్నద్దెకిచ్చుకుంటారు. కనుక - మనం డబ్బు ఆశచూపితే తమ గర్భాశయాన్నద్దెకివ్వొచ్చునేమో అని ఆశ. అంతే, సుషమా! ఇళ్లకయితే టులెట్ బోర్డులని పట్టుకొని - పదిళ్ల చూపి - మనకి నచ్చిందెంచుకోవచ్చు. ఇది భారత దేశం. అమెరికాకాదు. ఇక్కడ సెంటిమెంట్లెక్కువ. ఆడవాళ్ళకి, వేశ్యయినా మన మడిగినది యిస్తుందా అన్నది ఆశే. నమ్మకం లేదు.

సుషమ - ఊహాలోకంలో ఉంది.

టులెట్.... యూటేరస్ టులెట్.... అద్దెకు యిల్లుందా అని అడిగినట్లు నీ గర్భాశయం కొన్నాళ్ళద్దెకిస్తావా అని స్త్రీని అడిగితే- ఏమౌతుంది ? ఆమెకు మొదట అర్థం కాదు. అర్థమయ్యాక - ఆశ్చర్యపోతుంది. గర్భాశయాలకు అద్దె, అద్దెకు గర్భాశయాలూనా ! అని, తరువాత - ఛర్రునలేచి నానాతిట్లూ తిట్టి పోస్తుంది. వేశ్యలకుకూడా కొన్ని సెంటిమెంట్లుంటాయి. తమ శరీరాన్నయితే అద్దెకిస్తారు కానీ.... ఆ శరీరంలో భాగమే అయినా గర్భాశయాన్నెంత మాత్రమూ అద్దెకివ్వరు. ఎందుకంటే - మొదట - యిది కొత్తా, వింతా. తరువాత - మాతృత్వంతో ముడిపడింది కనుక సవాలక్ష సెంటిమెంట్లు - ఆలిస్ చెప్పేది నిజమే. అలభ్యమయిన వస్తువుపట్ల ఎంపు కూడా ఏమిటి ? దొరికితే అంతే చాలని ఆనందించాల్సిందే. నిజంగా తన గర్భాశయాన్నద్దెకిచ్చే స్త్రీ - యీ దేశంలో దొరుకుతుందా ? అదీ - కొంచెం రోజులలో !

"న్యాయంగా" పద్మా జయదేవ్‌ల స్థితిగతులని బట్టి.... వేశ్యకాక కనీసం మధ్య తరగతి స్త్రీ అయినా ముందుకొస్తే ఎంత బాగుంటుంది ? "వేశ్యాగర్భంలో పెరిగిన శిశువువల్ల ముందు ముందేంసమస్యలొస్తాయో?" ఆలిస్ అదోలా నవ్వింది. "అలూలేదు చూలులేదు, కొడుకుపేరు సోమలింగమన్నట్లుంది నీ ఆలోచన. సుషమా! గర్భం అద్దెకిచ్చే స్త్రీ దొరకడమే సందేహాస్పదమయితే - అందులో ఎంపా ? ఆ స్త్రీ ఆరోగ్యవంతురాలయి ఉండాలి. గర్భందాల్చగలిగే శక్తి కలదై ఉండాలి. ఇంకా ఎన్నెన్ని ఉతకూడాలనీ."

"ఔను." అంగీకరించింది సుషమ.

"నేను ప్రయత్నిస్తాను. నువ్వూ ప్రయత్నించు."

అలాగే అన్నట్లు తల ఊపింది సుషమ. ఆమెకు కొంచెం చిత్రంగానే ఉంది, గర్భాశయాన్నద్దెకిచ్చే స్త్రీ కోసం అన్వేషించడమంటే. ఎవరయినా తారసపడతారా ? అమెరికాలో అయితే యిప్పటికే యిదొక వ్యాపారం ఐపోయింది. అమెరికాలో వ్యాపారం కాని దేదని ?

"ఇంకా నేను వెళ్తాను."

"పెళ్లి మాటేంచేశావ్?"

"ఎవరిపెళ్లి?" నవ్వింది.

"నీ పెళ్ళే. సుషమా ! నీకు తెలియదు- నువ్వు నీ జీవితాన్నెంత వృధా చేసుకుంటున్నావో !

"..........."

"జారిపోతే తిరిగి రానిది యౌవనం—"

ఇంకా అక్కడుంటే పెళ్లి గురించి పోరుతుందని - సుషమ గబగబ బయటకు వొచ్చేసింది.

అప్పుడు ఊపిరి పీల్చుకుంది - గండం నుంచి బయట పడ్డట్లు. తన గదిలో - ఆలిస్ - క్రీస్తు పటం ముందు నిలుచుని - కళ్లు మూసుకుని, అతన్ని ప్రార్థిస్తూంది. "జీసస్ ! మిలార్డు" నా ప్రయత్నాన్ని సఫలంచెయ్యి. ఒక జీవితాన్ని కాపాడడానికి - నేను చేయబోయేది పాపమే అయినా- నన్ను క్షమించు."

* * *

మేరి నర్సింగ్ హోమ్ — హడవిడిగా ఉంది. నర్సింగ్ హోమ్ మాత్రమేకాదు. లాబొరేటరీ కూడా. ఆలిస్ ఒక అద్భుతమూ అపూర్వమూ అయినా కార్యం చేయబోయే దానిలో మనసులో ఆత్రత పడుతుంది. దానిని కప్పిపుచ్చుకోవాలని ఆమె ఎంత ప్రయత్నిస్తున్నా - ముఖం మాత్రం.... మనసుకి ప్రతి బింబమయిన కళ్లు మాత్రం ఆమె ఆత్రతని కొంచెం బయట పెట్టేస్తూనే ఉన్నాయి. మనసులో - ఒక వేపు ఆమెకి భయంవేస్తూంది.

పద్మ యీ నెల, అండాన్ని తయారు చేసిందా ? చేయకపోతే - ఆమెను సంతానవంతురాలిని చేయడం అసాధ్యం. మెనార్కే లేటు కనుక- మెనోపాజ్ ఎర్లీ .... హటాత్తుగా మెనోపాజ్ సంభవించి.... ఆమె ఓవమ్‌ని తయారు చేయకపోతే - పడ్డ శ్రమంతా వృధాయే.

"నా రక్తం పంచుకు పుట్టిన బిడ్డ-" ఆమెకు లభించదు. ఆమె ఆత్మహత్య చేసుకోకుండా ఆపేందుకేమీ ఉండదు.

ప్రభూ! ఈ వొక్కసారీ పద్మ - అండాన్ని విడుదల చేసేలా అనుగ్రహించు.

పద్మ— ఆరోనంబరు గదిలో పడుకుని పుస్తకం చదువుకుంటూంది. ఆలిస్ ఆజ్ఞ ప్రకారం నర్స్ రెండేసి గంటల కొకసారి ఆమె టెంపరేచర్ తీస్తూ - ఛార్టలో నోట్ చేస్తూంది.

"ఎందుకిలా ? నాకేమీ జ్వరం లేదుగా?"

"నాకు తెలియదు. డాక్టర్ మేడమ్ తియ్యమన్నారు. అంతే"

నిజమే. అక్కడ ఎవరికీ ఏమీ తెలియదు - ఆలిస్ ఏంచేయబోతుందో. తెలిసిన సుషమ ఒక్కతే - ఆపరేషన్ థియేటర్‌ని పర్యవేక్షిస్తూంది. వారం కిందట స్టెరిలైజ్ చేయబడింది థియేటర్. ఆలిస్ తీసుకున్న ముందు జాగ్రత్తలవి, ఏవిధమయిన ఇన్‌ఫెక్షన్‌కీ అవకాశం లేకుండా. పోను. ఆమెకు మిగిలిన చిట్టచివరి అవకాశమిది అని ఆమెకు కచ్చితంగా తెలుసు. అందుకే ఆమె సర్వవిధాలా జాగ్రత్తపడుతుంది. పద్మకి కిందటిసారి ఋతుస్రావం ఐన తేదీని బట్టి లెక్కలు వేస్తుందామె. ఋతుస్రావం మొదటి రోజు నుంచీ మళ్ళీ పద్నాలుగు లేదా పదిహేను రోజులకి స్త్రీ అండం తయారు చేస్తుంది. అండం తయారయ్యేటప్పుడు ఆమె శారీరక ఉష్ణోగ్రత ఒక డిగ్రీపైన. పెరుగు తుంది. ఆలిస్ - యివాళకాని, రేపుకాని అండం విడుదల చెయ్యాలి లెక్క ప్రకారం. అందుకే ఆమె ఆత్రంగా ఎదురు చూస్తుంది. ఈ వొక్కసారి ఆమె అండం విడుదల చెయ్యాలని పదే పదే ప్రభువుకి మొక్కు కుంటూంది.

"టెంపరేచర్ పెరిగింది మాడమ్, అంటూ నర్స్ తెచ్చే వార్తకోసం" ఆమెకలలు కంటూంది. ఆమెకు ఎంత ఆత్రంగా ఉందో అంత థ్రిల్లింగ్ గానూ ఉంది అనుభవం.

ఆమె ఎక్కువ సేపాగదిలో ఉండలేక పోయింది. తను ఆరాటపడి నంత మాత్రాన అన్నీ ఆరాట పడవని ఆమెకు తెలుసు. మనసుని మరొక విషయం మీద లగ్నం చేస్తే తప్ప ఆత్రత తగ్గదు.

ఆమె లేచింది.

ఆపరేషన్ థియేటర్ వేపు వెళ్ళబోతూ — అప్రయత్నంగా అట చూసింది. రూమ్ నంబరు తొమ్మిది. ఆ రూమ్ ఒక్కటి - విడిగా ఉంది నిజంగా అది ప్రత్యేకమయినదే.

ఆమె కెందుకో ఆ గదిలోకి వెళ్ళాలనిపించింది. అప్రయత్నంగా ఆమె కాళ్ళు ఆ గదిలోకి తీసుకెళ్ళాయి. నిశ్శబ్దంగా ఆ గదిలోకి వొచ్చి ఆలిస్‌ని కిటికీ దగ్గర కూర్చుని అవతలకి చూస్తున్న ఆమె గమనించలేదు ఆలిస్ కేసు షీట్ అందుకుంది.

పేరు.... దయామయి. వయస్సు - ముప్ఫయ్, చరిత్ర :- రెండ కాన్పులు. ఇద్దరు పిల్లలతో ఆరోగ్యంగానూ సహజంగానే పుట్టారు. పెద్దమ్మాయి వయస్సు పదకొండు. రెండో అమ్మాయి వయసు తొమ్మిది. పేషంట్ కేవిధమయిన జబ్బులూలేవు. పేదరికం వల్లనేమో కొంచెం అండర్ నరిష్డ్ భర్త వివరాలు.... ఖాళీగా వదలబడ్డాయి.

హాస్పిటల్‌లో ఉండవలసిన కారణం :— అప్పుడప్పుడు పొత్తి కడుపులో నొప్పి.

సుషమని మెచ్చుకుంది ఆలిస్. ఆమెకు తెలును యీ చివ అంశం కచ్చితంగా కల్పనే అని.

"దయామయీ !"

ఆమె పలుకలేదు. వెనుతిరిగి చూడలేదు.

చెముడేమో అనుకుంది. కాని....అలా ఐతే ఆ విషయం కేసు షీట్‌లో వొచ్చేదే మరి ?

అప్పుడు స్ఫురించిందామెకు. సుషమని మళ్ళీ మెచ్చుకుంది మనసులో "దయామయీ!" గట్టిగా పిలిచింది.

ఆమె యిటుతిరిగి — "నా పేరు దయామయికాదు." అంది.

"నాకు తెలుసు. కాని.... యిక్కడ మీ పేరదే." నవ్వింది.

"మీరు — డాక్టరా?"

"ఔను."

"నన్నెందుకుంచారిక్కడ?"

"సుషమ ఏమీ చెప్పలేదూ?"

"లేదు చూడబోతే యిదేదో మోసంలా ఉంది...."

తుళ్ళిపడింది ఆలిస్. లేదు లేదు. మోసమేమీ కాదు. నా మా నమ్మండి.

"ఐతే చెప్పండి. నన్నెందుకుంచారిక్కడ.... నా పిల్లలకి దూరంగా

"సుషమ చెబుతుంది."

"సుషమంటే సన్నిక్కడికి మాయమాటలు చెప్పి తెచ్చిన ఆవిడా ఆవిడ మెడలో స్టెత్‌స్కోప్ లేదు. ఆవిడా డాక్టరేనా?"

"ఆఁ"

"నన్ను తొందరగా పోనివ్వండి యిక్కడి నుంచి."

"నేను సుషమని తీసుకు వొస్తాను. విషయాలు వివరంగా మాట్లాడు కుందాం. తరువాత మీ యిష్టం వొచ్చినట్లు చేద్దురుగాని, ప్లీజ్ .... అం వరకూ ఓపిక పట్టండి నేను ఆమెను తీసుకువొచ్చేందుకే వెళ్తున్నాను."

(ఇంకావుంది)

డాక్టర్ సి. వి. రామచంద్రరావు

అశోక ధర్మ శాసనాలు- ఒక సమీక్ష

భారతదేశ చరిత్రకు సంబంధించి నేటికి లభించిన విస్తార శాసన సంచయంలో అశోక శాసనాలు చారిత్రకాధారాలుగా ఎనలేనివి, వెలలేనివి అఖండ భారతదేశంలో తూర్పున పుండ్రనగరం (నేటి బంగ్లాదేశ్‌లో, బోగాలి జిల్లాలో కరతోయానది ఒడ్డున కల మహాస్థాన్) నుండి పడమట పురుషపురం (పెషావర్, పాకిస్తాన్) వరకు, దక్షిణాన కర్నాటకం నుండి ఉత్తరాన కాశ్మీరం వరకు వ్యాపించి వుండిన అశోక సామ్రాజ్యంలో పలుతావుల ఈ శాసనాలు లభించాయి. భారతదేశపు ఎల్లలను దాటి, అశోక సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండిన ఆఫ్ఘనిస్తాన్‌లో అశోక శాసనాలు లభ్యమయినాయి. అశోకుని ఆజ్ఞమేరకు అతని మాటలలో, అతని పాలనా వత్సరాలను పేర్కొంటూ, శిలలలో గండ రించిన అశోకుని స్వీయచరిత్రగా ఈ శాసనాలు అమూల్యమయినవి, అపురూప మైనవి. ఈ శాసనాలలో అశోకుడు తన ధర్మాశయాలను, పాలనాశయాలను తనకు తానై వివరణాత్మకంగా తెలిపి వున్నాడు. ఈ శాసనాల ఉనికి అశోక సామ్రాజ్య సరిహద్దులను మనకు ఎరుకపరచి దాని విస్తృతిని తెలుపుతుంది.

భాష: భారతదేశంలో నేటికి లభించిన అశోక శాసనాలన్నీ ప్రాకృత భాషలో రాయబడినాయి. ఆనాటి ప్రజల వ్యవహార భాషలకు ప్రాకృతమన్నది సామాన్యనామం అశోక శాసనాలు, అశోక సామ్రాజ్యపు ప్రాక్ పశ్చిమాల మధ్య గల కొద్ది వ్యావహారిక భాషాభేదంతో, సామ్రాజ్యానికంతా రాజధాని అయిన పాటలీపుత్రంలో అధికార భాషగా వాడిన మాగధీ ప్రాకృతంలో రాయబడినాయి.

భారతదేశానికి వెలుపల ఉండి, అశోకుని సామ్రాజ్యంలో చేరి వుండిన ఆఫ్ఘనిస్తాన్‌లో లంపాక లేక లంఘమాన్ అనేచోట లభించి అశోకునిదిగా తలచ బడిన ఒక శాసనం అరమైక్ భాషలో రాయబడింది.[1] (ఈ 'అరమైక్' జీసస్ క్రైస్తు మాతృభాష). ఆఫ్ఘనిస్తాన్‌లోనే కందహార్ వద్ద లభించిన ఒక శాసనం ద్విభాషా శాసనంగా, గ్రీక్, అరమైక్ బాషలలో ఉంది;[2] అచటనే లభించిన మరివొక అశోక శాసనం గ్రీకు భాషలో ఉంది.[3]

లిపి: అఖండ భారతదేశపు సరిహద్దుల లోపల. ఒక్క వాయవ్య ప్రాంతంలో లభించిన అశోక శాసనాలలో తప్ప, మిగిలిన అన్ని ప్రాంతాలలో లభించిన శాసనాలు బ్రాహ్మీలిపిలో రాయబడినాయి. పర్షియా(ఇరాక్)కు దగ్గరగా వున్న వాయవ్య ప్రాంతంలో లభించిన శాసనాలు మాత్రం పర్షియన్ - అరమైక్ భాషా సంబంధమైన ఖరోష్ఠి లిపిలో రాయబడినాయి.

బ్రాహ్మీలిపి ఎడమనుండి కుడికి రాయబడుతుంది. ఖరోష్ఠి లిపి కుడినుండి ఎడమకు రాయబడుతుంది. పోగా, కర్నాటక రాష్ట్రంలోని బ్రహ్మగిరిలో లభించిన లఘు శిలాశాసనంలో, శాసనమంతా బ్రాహ్మీలిపిలో ఉండి, చపడ అనే లిపికారుడు దానిని లిఖించాడని తెలిపే "చపడేన లిఖితే లిపికరేణ" అనే చివరి పంక్తి మాత్రం ఖరోష్ఠి లిపిలో రాయబడింది. ఆంధ్రదేశంలో ఎర్రగుడి (పత్తికొండ తాలూకా, కర్నూలు జిల్లా; గుత్తిస్టేషనుకు సుమారు 14 కి.మీ.) వద్ద లభించిన అశోకుని లఘు శిలాశాసనంలోని కొన్ని పంక్తులు, బ్రాహ్మీలిపిలో, కుడినుండి ఎడమకు, ఎడమనుండి కుడికి వరుసక్రమంలో, "బూస్ట్రోఫెడాన్" (వృషభగతి లేక ఎద్దు దున్నే పద్ధతి) పద్ధతిలో రాయడం జరిగింది.[4]

కొన్నివేల ఏండ్లుగా, భారతదేశంలో, వాని లిపి ఏమో, వాని భాష ఏమో గుర్తింపబడక, కొండలలో, గుట్టలలో, మారుమూల ప్రదేశాలలో, గ్రామా లలో మరుగున పడి మనము మరచిపోయిన అశోక శాసనాలను క్రీ.శ. 1837లో ఈస్టిండియా కంపెనీ కొలువులో టంకసాల అధికారిగా ఉండిన ప్రాచ్య విజ్ఞాన వేత్త జేమ్స్ ప్రిన్సెప్ మొట్టమొదటగా గుర్తించి, వాని పాఠాలను ప్రచురించి వాని ప్రాముఖ్యాన్ని పండిత లోకానికి తెలిపినది మొదలుగా, ఇటీవలి వరకు, అశోక శాసనాలనేకం బయల్పరచడం జరిగింది. ఇటీవలి కాలంలో, 1977లో బళ్ళారి జిల్లా సిరుగుప్ప తాలూకాలోని నిట్టూరువద్ద, 1978లో నిట్టూరుకు నైఋతిగా అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉదెగోళం వద్ద అశోకుని శిలాశాసనాలను కనుగొన్నారు. కాలక్రమంలో, అన్వేషణాఫలితంగా, అశోక శాసనాలు ఇంకా లభించే అవకాశం వుంది.

అశోక శాసనాలు_విభజన: అశోక శాసనాలను, ఆ శాసనాలలోనే చెప్పిన అశోకుని పట్టాభిషేక వత్సరాల కాలక్రమాన్నిబట్టి వరుస క్రమంలో ఈ విధంగా విభజించి పేర్కొనవచ్చు.

1. లఘు శిలాశాసనాలు
2. బృహత్ శిలాశాసనాలు
3. గుహా శాసనాలు
4. స్తంభ శాసనాలు
5. లఘు స్తంభశాసనాలు
6. అశోకునివిగా అనుమానింపబడిన శాసనాలు
7. అఖండ భారతదేశ సరిహద్దులను దాటి ఇతర దేశాలలో లభించిన శాసనాలు.

1. లఘుశిలాశాసనాలు: ఇవి రెండు మాత్రమే ఉన్నాయి. వీనిలో రెండవది, మొదటిదానితో చేర్చబడి, ఇవి లభించిన స్థలాలలో కొన్నిచోట్ల మాత్రమే లభ్యమయింది. లఘు శిలాశాసన ప్రతులు నేటికి ఈ క్రిందిచోట్ల లభ్యమయినాయి. బ్రాకెట్లలో ఆ స్థలం ఏ రాష్ట్రంలో ఉన్నది, శిలాశాసనాన్ని కనుగొన్న కాలం తెలిపినాము.

ఉత్తర భారతం

౧) సహస్రాం (బీహార్)
౨) అహ్రేరియా (ఉత్తరప్రదేశ్, 1965)
౩) బైరాత్ (రాజపుటానా)
౪) బహాపూర్ (ఢిల్లీ, 1967)
౫) రూపనాథ్ (మధ్యప్రదేశ్)
౬) గుజ్జర (మధ్యప్రదేశ్, 1956)
౭) పాంగురేరియా (మధ్యప్రదేశ్, 1976)

దక్షిణ భారతదేశం

౮) ఎర్రగుడి (ఆంధ్రప్రదేశ్, 1929)
౯) రాజుల మందగిరి (ఆంధ్రప్రదేశ్, 1953)

౧౦) మాస్కి (కర్నాటక, 1915)

౧౧) బ్రహ్మగిరి (కర్నాటక)

౧౨) సిద్ధాపుర (కర్నాటక. 1891)

౧౩) గాలిమఠ (కర్నాటక 1981)

౧౪) పాల్కిగుండు (కర్నాటక 1981)

౧౫) జటింగ రామేశ్వర (కర్నాటక)

౧౬) నిట్టూరు (కర్నాటక, 1977)

౧౭) ఉదెగోళం (కర్నాటక, 1978)

పై స్థలాలలో రూపనాథ శిలమీద మొదటి లఘు శిలాశాసనం సంపూర్ణంగా చెక్కబడి ఉంది. మిగిలిన స్థలాలలో, కొద్ది పాఠ భేదాలతో, దాని అసంపూర్ణ ప్రతులు వున్నాయి. రెండవ లఘు శిలాశాసనప్రతులు మొదటి లఘు శిలాశాసనంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రగుడి, రాజుల మండగిరులలో, కర్నాటకలోని నిట్టూరు ఉదెగోళం, జటింగరామేశ్వర, సిద్ధాపుర, బ్రహ్మగిరులలో మాత్రం లభించాయి. గుజ్జర, మాస్కి, నిట్టూరు, ఉదెగోళం లఘు శిలా శాసనప్రతులలో మాత్రమే అశోకుడు తన పేరుచే పేర్కొనబడినాడు; మిగిలిన అశోక శాసనాలన్నిటిలో, "దేవానాంప్రియ" "ప్రియదర్శి" అని అతని బిరుదాల చేత మాత్రమే పేర్కొనబడినాడు.

లఘు శిలాశాసనాలు–విషయము: మొదటి లఘు శిలా శాసనంలో, అశోకుడు బౌద్ధమతావలంబి అయిన తర్వాత రెండున్నర ఏండ్లు ధర్మానుసరణలో, ధర్మవ్యాప్తిలో ఎక్కువ ఉత్సాహం చూపలేదని, తర్వాత (బౌద్ధ) సంఘంలో చేరి, వీని కొరకై విశేషంగా పాటు పడినాడని, ధర్మాచరణంవల్ల క్షుద్రునికైనా స్వర్గ సౌఖ్యం ప్రాప్తిస్తుందని, సమయం దొరికినప్పుడంతా ఈ అర్థాన్ని శిలలపైనా, శిలా స్తంభాలపైనా చెక్కించాలని తెలుపబడింది. రెండవ లఘు శిలాశాసనంలో ధర్మాచరణకు సంబంధించి తల్లిదండ్రులకు శుశ్రూష చేయాలని, ప్రాణులను గౌరవించాలని, సత్యం పలుకవలెనని, ఆచార్యులను పూజించవలెనని, ఇట్టి పురాణమార్గము దీర్ఘాయువు నొసగునని తెలుపబడింది.

సిద్ధాపురం, జటింగ రామేశ్వరం, బ్రహ్మగిరి లఘు శిలా శాసన ప్రతులలో, సువర్ణగిరి యందుండే అధికారులు (ఆర్యపుత్రుడు, మహామాత్రులు) అశోకుని ఆజ్ఞానుసారంగా, ఇసిలాపురాధిపతులకు పై విషయాలు ప్రకటించినట్లు చెప్పబడింది. దీనినిబట్టి ఇసిలాపురం సువర్ణగిరి అధికారుల యేలుబడిలో ఉండినట్లు, అశోక సామ్రాజ్య దక్షిణ ప్రాంతానికి సువర్ణగిరి కేంద్రస్థానమై రాజప్రతినిధికి వాసస్థానంగా ఉన్నట్లు తెలుస్తుంది. దక్షిణ భారతదేశంలో అశోక శాసనాలు లభించిన స్థలాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రగుడివద్ద మాత్రమే అశోకుని పద్నాలుగు బృహత్ శిలాశాసనాలు, రెండు లఘు శిలాశాసనాలు ఒకేచోట లభించాయి. దక్షిణ భారతదేశంలో ఈ ఎర్రగుడివద్ద తప్ప మరెక్కడా బృహత్ శిలా శాసనాలు నేటికి కానరాలేదు. ఎర్రగుడికి అనతి దూరంలోనే రాజుల మండగిరిలో రెండు లఘు శిలా శాసనాలు ఉన్నాయి. అందుచేత మౌర్య యుగంలో ఈ ఎర్రగుడి మౌర్యసామ్రాజ్య దక్షిణ ప్రాంతానికి పాలనాకేంద్రమై ఉండినట్లు భావించవచ్చు. సిద్ధాపురం, జటింగ రామేశ్వరం, బ్రహ్మగిరి లఘు శిలా శాసన ప్రతులలో పేర్కొనబడిన సువర్ణగిరి ఈ ఎర్రగుడే అయివుండవచ్చునని కొందరు పండితులు సూచించారు. ఎర్రగుడికి అతి సమీపంలో సువర్ణగిరితో పదసామీప్యం కలిగిన జొన్నగిరి [ప్రాకృతం-సొణ్ణగిరి—సంస్కృతం-సువర్ణ గిరి—తెలుగు-జొన్నగిరి] అనే గ్రామం ఉండటం ఈ సూచనకు ఉపబలంగా పేర్కొన్నారు.[6]

బాబ్రా లఘుశిలాశాసనము: పైన పేర్కొన్న రెండు లఘు శిలా శాసనాలు కాక, అశోకునిది మరివొక లఘు శిలాశాసనము, రాజపుటానాలోని బైరాతు పట్టణానికి సమీపంలో బాబ్రా కొండగుట్టల మీద ఒక గండశిలపై చెక్కబడి ఉండింది. దీనిని కలకత్తాలోని ఇండియన్ మ్యూజియంకు తరలించారు. అందుచేత ఈ శాసనాన్ని బాబ్రా శాసనమని లేక కలకత్తా–బైరాతు శాసనమని పిలచినారు. దీనిలో అశోకుడు 'మగధరాజగు ప్రియదర్శి' అని పేర్కొనబడినాడు. అశోకుడు ఈ శాసనంలో బౌద్ధ త్రిరత్నాలయిన బుద్ధునిలో, ధర్మంలో, సంఘంలో తనకు గల గౌరవ విశ్వాసాలు ప్రకటించి, బౌద్ధాచార్యులను భిక్షు, భిక్షుణీ వర్గాలను ఉద్దేశించి, వారు భగవంతుడగు బుద్ధుడు స్వయంగా తెలిపిన కొన్ని ధర్మ విషయాలతో కూడిన ఏడు గ్రంథాలను, వాని అర్థాన్ని నిత్యమూ మననం చేయాలని శాసించాడు. బహుశా ఈ శాసనం వేయించినప్పుడు అశోకుడు బైరాతునందుండిన బౌద్ధ విహారంలో బౌద్ధ భిక్షువుగా వాసం చేస్తూ ఉండినాడు కాబోలు.

పైన పేర్కొన్న ఈ లఘు శిలాశాసనాలన్నీ అశోకుడు బౌద్ధమతానుయాయి అను విషయాన్ని నిర్ద్వంద్వంగా తెలుపుతాయి.

బృహత్ శిలాశాసనాలు:– అశోకుని బృహత్ శిలా శాసనాలు పద్నాలుగు. వీనిని సామాన్యంగా శిలాశాసనాలని పేర్కొంటారు. ఈ పద్నాలుగు శాసనపాఠాల ప్రతులు, పూర్తిగానో, కొద్ది పాఠభేదాలతోనో, కొంత లుప్తమయో భారతఖండంలోని ఈ క్రింది స్థలలాలో లభించాయి.

౧. షాబాజ్‌ఘడీ (పాకిస్తాన్, పెషావర్ జిల్లా)

౨. మన్సేహర (పాకిస్తాన్, హజారా జిల్లా)

౩. కాల్సి (ఉత్తర ప్రదేశ్, డెహ్రాడూన్ జిల్లా)

౪. గిర్నార్ (గుజరాత్)


౫. సోపారా (మహారాష్ట్ర)

౬. ధౌలీ (ఒరిస్సా, పురిజిల్లా)

౭. జౌగడా (ఒరిస్సా, గంజాం జిల్లా)

౮. ఎర్రగుడి (ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా)

పై స్థలాలలో, కాల్సిలోని పద్నాలుగు శాసనాలు సమగ్రంగా ఉన్నాయి. షాబాజ్ గఢీ, మన్సేహ్ర, గిర్నార్‌లలో సంపూర్ణ పాఠాలు లేవు. ఎర్రగుడిలో పద్నాలుగు శాసనాల పూర్తి పాఠాలతో, రెండు లఘు శిలాశాసన పాఠాలు వానికి ముందు చేర్చబడి ఉన్నాయి.[7] సోపారాలో ఎనిమిదవ శిలాశాసనంలోని కొన్ని పదాలతో మాత్రమే ఉన్న శాసన శిలాశకలం; తొమ్మిదవ శిలాశాసనంలో సగానికి పైగా వున్న మరివొక శాసన శిలాశకలం లభించాయి. ధౌలి, జౌగడాలలో పదకొండు, పన్నెండు, పదమూడు శాసనాలు లేవు. వాని బదులు మొదటి ప్రత్యేక శిలాశాసనం, రెండవ ప్రత్యేక శిలాశాసనం అని రెండు కళింగ శాసనాలు చెక్కబడినాయి. ప్రత్యేకం 'కళింగం'లోని, లోపలి సమీప నగరాలనుండి, ఆ రాజ్యాన్ని లేక ప్రాంతాన్ని పాలిస్తుండిన అధికారుల నుద్దేశించి చెప్పిన శాసనాలు కాబట్టి వీనిని కళింగ శాసనాలని పిలిచారు.



గుర్తించబడింది. లుంబినీవనం బుద్ధుని జన్మస్థాన మయినందువల్ల అశోకుడు అచటికి తీర్థయాత్ర వెళ్ళి, తన యాత్ర జ్ఞాపకార్థంగా స్తంభాన్ని స్థాపించి, లుంబినీ గ్రామంవారు పన్నులు చెల్లింపనవసరం లేదని, ఊరి ఫలసాయంలో మాత్రం ఎనిమిదో వంతు చెల్లించాలని శాసనం వేయించాడు. లుంబినీ వనాన్ని దర్శించిన సమయంలోనే అశోకుడు అచటికి వాయవ్యంగా సుమారు 22 కి.మీ. దూరంలో ఉన్న నిగలీసాగరం లేక నిగ్లీవా వద్ద కల కనకముని బుద్ధుని స్తూపాన్ని దర్శించి, దానిని అభివృద్ధి పరచి ఆ విషయాన్ని తెలుపుతూ స్తంభ శాసనం వేయించాడు.

సాంచీ స్తంభ శాసనం బౌద్ధ సంఘాన్ని విడదీయ ప్రయత్నించిన భిక్షుకులకు, భిక్షుణులకు విధించవలసిన శిక్షను గూర్చి చెప్తుంది. సారనాథ్ స్తంభం కూడా ఈ విషయాన్ని గురించే తెలుపుతుంది.

అశోకుని స్తంభ శాసనాలు, లఘు స్తంభ శాసనాలు ఉత్తర భారతానికే పరిమితమయి ఉండటం గమనించదగ్గ విషయం. అష్టే శిలాశాసనాలు, లఘు శిలా శాసనాలు సామ్రాజ్య సరిహద్దు ప్రాంతాలలో, రాష్ట్ర పాలనా కేంద్రాలలో లభ్యం కావటం కూడా గమనించదగ్గ విషయం. శిలాశాసనాల, లఘు శిలాశాసనాల ఉనికి అశోక సామ్రాజ్య సరిహద్దులను నిర్ణయించటానికి ఆధారమవుతుంది.


అశోకునివిగా అనుమానింపబడిన శాసనాలు: అశోకునివిగా అనుమానింపబడిన శాసనాలు ఒకటి నేడు పాకిస్తాన్‌లో వున్న తక్షశిలలో, మరొకటి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి (గుంటూరు జిల్లా)లో లభించాయి. వీనిలో తక్షశిలలో లభించిన శాసనం శిలాశాసనం; అరమైక్ భాషలో లిపిలో రచించబడింది. ఇది అశోకుడు రాజుకాకపూర్వం, తక్షశిలలో రాజప్రతినిధిగా ఉన్నప్పుడు వేయించినట్లు తెలుస్తుంది. రోమేదోతే అనే ఉన్నత రాజకీయోద్యోగి రాజ ప్రతినిధి అయిన ప్రియదర్శి వల్ల ఔన్నత్యం పొందినట్లు ఈ శాసనం చెపుతుంది. కాని శాసనంలో "ప్రియద్...." అనే అక్షరాలు మాత్రమే ఉండడంవల్ల, ప్రియదర్శి అనే బిరుదు అశోకునికి ఉన్నప్పటికీ ఈ శాసనం అశోకునిదో కాదో అనే అనుమానం వ్యక్తం చేశారు.

అమరావతిలో లభ్యమయి అశోకునిదిగా తలచబడిన శాసనం స్తంభ శాసనం. ఈ శాసనం అశోకునిదే అయితే స్తంభ శాసనాలు దక్షిణ భారతంలో లభించలేదని మనం పైన చెప్పిన విషయానికి అపవాదు అవుతుంది. స్తంభంలో ఒక ఖండమే లభించినందువల్ల శాసనపాఠం పూర్తిగా లభ్యపడలేదు. ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో రాసిన ఈ శాసన ఖండంలోని ఏడు పంక్తులలో అశోక శాసనాలలో కానవచ్చే పదాలు కొన్ని యధాతధంగా ఉండటాన్నిబట్టి దీనిని అశోక శాసనమని అనుమానించారు. ఇదే నిజమయితే అమరావతీ స్తూపం క్రీ.పూ. మూడవ శతాబ్దంలో అశోకుడు నిర్మించాడని చెప్పటానికి అవకాశం ఏర్పడుతుంది.

అఖండ భారతదేశ సరిహద్దులను దాటి, ఇతర దేశాలలో లభించిన శాసనాలు: నేటికి ఒక్క అఫ్ఘనిస్థాన్‌లో మాత్రం అశోకశాసనాలు ఈ క్రింది స్థలాలలో లభించాయి.

1) లంపాక: జలాలాబాద్‌కు సమీపంలో కాబూల్ నది ఉత్తరపు గట్టున ఉన్న లంఘన్‌కా శాసనంలో పేర్కొన్న లంపాకగా గుర్తించారు. ఇక్కడ లభించిన శాసన ఖండంలో ఉన్న మూడు అసంపూర్ణ వాక్యాలలో, దేవానాం ప్రియుడు స్తంభ శాసనాన్ని నిలిపాడని తెలిపి ఉండటం చేత, ఇది అశోక శాసనమయి ఉండవచ్చునని తలచబడింది. ఈ శాసనం అరమైక్ భాషలో, ఆ భాషా లిపిలో ఉంది.

కందహార్: కందహార్ వద్ద అశోకునిది, గ్రీక్, అరమైక్ భాషలలో అదే లిపులలో వున్న ఒక ద్విభాషాశాసనం, గ్రీకు భాషలో గ్రీకు లిపిలో ఉన్న మరివొక శాసనం లభించాయి. గ్రీకు, అరమైక్ ద్విభాషా శాసనంలో, పైన చెప్పబడిన అశోక బృహత్ శిలాశాసనాలు నాలుగు, ఒకటియొక్క సారాంశం సంక్షిప్త



కరించి చెప్పబడింది. గ్రీకు భాషలో లభించిన అశోక శాసనాలలో ఇదే మొదటి
దీనిని 1958లో కనుగొన్నారు. ఇది ఒక కొండచరియ పైద రాయబడిన
శాసనం. దీని తరువాత 1963లో, కందహార్‌లోనే, గ్రీకు భాషలో, లిపిలో
వొక అశోక శిలాశాసనం లభించింది. ఈ శాసన శిలను విడిగా ఒకచోటే
వుంచే కనుక్కొన్నారు, ఈ శాసనంలో పైన పేర్కొన్న అశోక శిలా శాసనా
12వ శిలా శాసనంలో అధికభాగం, పదమూడవ శిలా శాసనంలో మొదటిభా
గ్రీకు భాషలోనికి అనుసరింప బడినాయి. అశోక సామ్రాజ్యంలో ఆఫ్ఘనిస్తాన్
భాగంగా ఉండిందని, అచట గ్రీక్, అరమైక్ భాషలో మాట్లాడే ప్రజలు ఉ
వారని, ఈ శాసనాలు తెలుపుతాయి. సెల్యూకస్ నికేటర్ క్రీ.పూ. 3
ప్రాంతంలో చంద్రగుప్తుని మీదికి దండెత్తి వచ్చి, యుద్ధంలో ఓడి, అతనికి
రాజ్యంలో భాగాలుగా ఉండిన గెడ్రోసియా, అరకోసియా, అరియ, పరోపని
లను ఇచ్చివేశాడు. వీనిలో చివరి మూడు ప్రాంతాలు ఆఫ్ఘనిస్థాన్‌లో భాగాల
గుర్తించబడినాయి. అందుచేత ఆఫ్ఘనిస్థాన్ మౌర్యసామ్రాజ్యంలో ఒక భాగం
చంద్రగుప్తుని కాలం (క్రీ.పూ. 324-300) నుండి ఉండింది.

శాసన ప్రకటన-అశోకుని ధ్యేయం: అశోక శాసనాల
రాష్ట్ర రాజధానులలోనో, జనసమ్మర్దంతో గూడిన పట్టణాలలోనో, యాత్ర
స్థలాలలోనో, లేక వాని సమీపంలోనో, ప్రయాణపు లేక వ్యాపారపు రహదా
లను అనుకొనో, లేక అట్టి రహదారుల కూడలి స్థలాలలోనో నెలకొల్పబడినా
ఇట్లా వానిని నెలకొల్పడంలో ఉద్దేశం ఆ శాసనాలలోని విషయాన్ని ప్రజల
వీలైనంత, ఎక్కువమంది దృష్టికి తెచ్చి వారికి ఎరుక పరచటమే. ప్రజల
చదువను రానివారి సౌకర్యార్థమై కాబోలు, అశోకుడు తన అధికారులు ఈ శా
పాఠాలలో ముఖ్యమైన వానిని కొన్నిటిని, కొన్ని నిర్ణీత దినాలలో, ప్రజ
చదివి వినిపించే ఏర్పాట్లు చేశాడు. ఈ శాసనాలు అశోకునిచేత రాజశాసనా
పేరుతోకాక, ధర్మలిపులనీ, ధర్మ శ్రావణాలనీ చాలా అర్థవంతంగా పిలువ
నాయి.

శిలాశాసనాలు సామాన్యంగా కొండల, గుట్టలమీద వున్న పెద్ద బండర
నునుపైన ప్రదేశాలపైన చెక్కటం జరిగింది. స్తంభ శాసనాలన్నీ, శిల్పచా
ర్యంతో ప్రత్యేకంగా మలచబడిన, మెరుగు దిద్దిన, పెద్ద స్తంభాలపై చెక్క
ఏదో ఒక ప్రత్యేక సన్నివేశానికి స్మృత్యంకంగా నిలుపబడినాయి. ఈ స్త
శాసనాలలో కొన్ని, పైన చెప్పినట్లు, స్థాన భ్రష్టత్వం పొందాయి. దీనివ
వానిని వాని సహజ పరిసరాలలో అధ్యయనం చేయలేకపోవటం పురావస్తు శ
దృష్ట్యా కొంత విచారించవలసిన విషయం.

ఈ ధర్మ శాసనాలను ప్రకటించటంలో తాను అనుసరించిన విధాన
అశోకుడు పధ్నాల్గో శిలాశాసనంలో ఇలా చక్కగా విశదీకరించాడు; "ఈ ధ
లిపులు సంగ్రహంగానో, మధ్యమంగానో, సవిస్తరంగానో దేవానాం ప్రియు
ప్రియదర్శి రాజుచేత లిఖింపబడినవి. ఎందుచేతననగా (నా సామ్రాజ్యంలో) అ
చోట్లా వీనిని సమగ్రంగా లిఖించటానికి వీలుపడలేదు. నేను జయించిన ర
ములు చాలా పెద్దవి. చాలవరకు లిఖింపచేసితిని. ఇంకను లిఖింపచేసెద

వీనిలో కొన్ని కొన్ని భాగములు మిక్కిలి మధురములై ఉండుటవలన, జనులు వాని ప్రకారము నడచుకొందురనియు, మరల మరల వ్రాయబడినవి. స్థలము చాలకపోవుట చేతను, నా ఆలోచన ఆ దేశము వారికి సమ్మతము కాకపోవుట చేతను, లిపికారుని పొరపాటు వల్లను వీనిలో కొన్ని అసంపూర్ణముగా లిఖించటము జరిగినది.

అశోక శాసనాల కాలక్రమ నిర్ణయం: అశోకుడు క్రీ. పూ. 269-268లో పట్టాభిషిక్తుడయినాడని పండితు లంగీకరించారు. ఇచట క్రీ.పూ. 268 అశోకుని మొదటి రాజ్యాభిషేక సంవత్సరంగా గ్రహించి, అశోక శాసనాల కాల క్రమ నిర్ణయం చేయటం జరిగింది. అశోక శాసనాలలో కొన్ని సందర్భాలలో శాసనాల ప్రకటనకు సంబంధించి. మరికొన్ని సందర్భాలలో అశోకునికి సంబంధించిన జీవిత, చారిత్రక సంఘటనలకు సంబంధించి, రాజ్యాభిషిక్త సంవత్సరాలలో కాలం తెలుపబడింది. అశోక శాసనాలలో, సామాన్యంగా, కాలం ఈ క్రింది విధంగా తెలుపడం జరిగింది.

"ద్వాదస వాసాభిసితేన మయా ఇదం అజాపితం"

(3వ శిలాశాసనం)

"నా రాజ్యాభిషేక మయిన పన్రెండో సంవత్సరాన ఇది ఆజ్ఞాపింపబడినది"

"తే దస వసాభిసితేనా మమయా ధంమ మహామాతా కటా"

(5వ శిలాశాసనం)

"నా రాజ్యాభిషేకం కాలం పదమూడో ఏట ధర్మమహామాత్రులు ఏర్పాటు చేయబడినారు"

ఇట్టి వాక్యాలలో చెప్పిన ఏండ్లు జరిగిపోయిన ఏండ్లా, జరుగుచున్న ఏండ్లా? "పన్రెండో సంవత్సరాన" అన్నప్పుడు పన్రెండేండ్లు పూర్తి అయినట్లు గ్రహించాలా, లేక పదకొండు ఏండ్లు పూర్తి అయి వర్తమానంలో పన్రెండవ ఏడు జరుగుతున్నదని గ్రహించాలా అని వెనుకలో అనుమానం ఉన్నప్పుడు, పండితులలో కొందరు ఇవి గతాబ్దాలని మరికొందరు వర్తమానాబ్దాలని అభిప్రాయ పడటం జరిగింది. కాని 1958లో కందహార్‌వద్ద అశోకుని గ్రీక్-అరమైక్ ద్విభాషా శాసనం దొరికిన తర్వాత ఈ అనుమానం తీరిపోయింది. గ్రీకు భాషలోని, దానికిచ్చిన అంగ్లానువాదం ప్రకారం, శాసనం ఇట్లా మొదలవుతుంది.

"టెన్ యియర్స్ హ్యావింగ్ ఎలాప్స్‌డ్ (ఫ్రం హిస్ ఇన్‌స్టలేషన్ కింగ్ పియోదస్సెస్ హ్యాస్ షోన్ మ్యాన్‌కైండ్ (ది వే టు) పయటి"

"పదేండ్లు (తన పట్టాభిషేకం నుండి) గడచిపోయిన తర్వాత ప్రియదర్శి రాజు మానవులకు ధర్మమార్గాన్ని తెలియజేశాడు"

అరమైక్ భాషలో కూడా ఇట్లానే చెప్పబడి వుంది. ఈ శాసనాన్ని బట్టి, అశోక శాసనాలలో పేర్కొన్న అభిషిక్త వత్సరాలు గతాబ్దాలనేది స్పష్టం; ఈ అభిప్రాయాన్ని పండితులందరూ ఆమోదించారు.

"నేను రాజ్యాభిషిక్తుడనైన పన్రెండవ సంవత్సరంలో....ఈ ధర్మ లిపులు నా చేత లిఖింపబడిన"వని, రాజ్యాభిషిక్త వత్సరం 26వ ఏట (క్రీ.పూ 268-26=242) లిఖించిన ఆరవ స్తంభ శాసనంలో అశోకుడు చెప్పివున్నాడు. అందుచేత అశోక శాసనాలన్నీ క్రీ.పూ. 268-12=256 తర్వాతనే లిఖింపబడినాయి.

అశోకుడు మొదట లఘుశిలాశాసనాలను, అటుతర్వాత బృహత్ శిలాశాసనాలను ప్రకటించాడు. మొదటి లఘు శిలాశాసనంలో తాను బౌద్ధుడై రెండున్నర సంవత్సరాలు పైగా కావచ్చిందని తెలిపాడు 13వ శిలాశాసనం అశోకుడు పట్టాభిషిక్తుడైన ఎనిమిదవ ఏట, క్రీ.పూ. 260 (268-8)లో కళింగాన్ని జయించినట్లు తెలుపుతుంది. కళింగాన్ని జయించిన తర్వాత అతి కొద్దికాలంలోనే, ఆరు నెలలు లోపలనే అశోకుడు బౌద్ధమత స్వీకారం చేసినట్లు అనుకోవచ్చు. ఎందువలన అనగా పట్టాభిషిక్తుడైన పదవ ఏట, క్రీ.పూ. 258లో, సంబోధి నగరం అంటే గయకు పోయి, మృగయా వినోదయాత్రలను వదలి, తన ధర్మయాత్రలను ప్రారంభించినట్లు తెలిపాడు. మొదటి లఘుశిలాశాసనంలో తాను బౌద్ధుడై రెండున్నర ఏండ్లయినా తాను బౌద్ధ ధర్మంలో ఎట్టి ఉత్సాహం చూపలేదని, ఒక ఏడాది కింతట సంఘాన్ని దర్శించింది మొదలు మిక్కిలి ఉత్సాహవంతుడనై ధర్మాచరణకు పూనుకొన్నానని అశోకుడు తెలిపాడు. దీనినిబట్టి సంఘాన్ని దర్శించి ఉత్సాహం పొందిన తర్వాత, ధర్మాచరణలో ఒక భాగంగా మొదటగా గయకు ధర్మయాత్ర చేసినట్లున్నది. అంతేగాక, ఈ మొదటి లఘు శిలాశాసనంలోనే తన ధర్మ శ్రావణాలను అంటే ధర్మశాసనాలను శిలలపై, స్తంభాలపై చెక్కించవలెననే తన ఉద్దేశాన్ని మొదటిసారిగా వ్యక్తం చేసి వున్నారు: "సమయం దొరికినప్పుడెల్లా ఈ అర్థాన్ని (అంటే ధర్మాన్ని) శిలలపై చెక్కింపుడు. శిలాస్తంభములు వున్న చోట్ల నెల్లా శిలాస్తంభాలపై దీనిని చెక్కింపవలెను" (లఘు శిలాశాసనం-రూపనాథ్). మొదటి లఘు శిలాశాసనంలో, చెప్పిన ఈ విషయాలన్నీ అశోకుడు తన శిలాశాసన ప్రకటనను క్రీ.పూ. 256లో లఘు శిలాశాసన ప్రకటనతోనే ప్రారంభించాడనే విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఎర్రగుడి, బ్రహ్మగిరి మొదలయిన కొన్నిచోట్ల మాత్రమే లభ్యమయిన రెండవ లఘు శిలాశాసనంలో తరువాత బృహత్ శిలాశాసనాలలో, స్తంభ శిలాశాసనాలలో తాను విపులీకరించిన ధర్మాన్ని, అశోకుడు క్లుప్తంగా, రేఖామాత్రంగా తెలపడం కూడా ఈ అభిప్రాయాన్ని బలపరుస్తుంది. తన పట్టాభిషేకం నుండి పదేండ్లు పూర్తి అయిన తర్వాత ప్రియదర్శిరాజు ప్రజలకు ధర్మమార్గాన్ని తెలిపాడు, అని కందహార్ వద్ద లభించిన అశోకుని గ్రీక్-అరమైక్ ద్విభాషా శాసనం చెప్పటం కూడా ఈ అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

బృహత్ శిలాశాసనాలలో మూడు శాసనాలలో మాత్రమే వాని ప్రకటనా కాలం తెలుపబడింది. మూడవ శాసనం రాజ్యాభిషేకమయిన పన్నెండో సంవత్సరాన ఆజ్ఞాపింప బడినట్లు, నాల్గవ శాసనం అదే సంవత్సరాన లిఖింపబడినట్లు, ఆ శాసనాలలోనే చెప్పబడింది. అంటే, ఈ రెండు శాసనాలు క్రీ.పూ. 268-12= క్రీ.పూ. 256లో ప్రకటింపబడినాయి. అయిదవ శిలాశాసనంలో రాజ్యాభిషేక కాలం పదమూడవ ఏట, క్రీ.పూ. 268-13= క్రీ.పూ. 255లో ధర్మమహామాత్రులను ఏర్పాటు చేసినట్లు చెప్పబడింది. ఆ శాసనాన్ని అదే ఏటనో, లేక మరు సంవత్సరమైన క్రీ.పూ. 254లోనో లిఖించి ఉండాలి. 13వ శిలాశాసనంలో పేర్కొన్న యవన (గ్రీకు) రాజులకు అశోకునితో ఉన్న సమకాలీనతను బట్టి ఆ శాసనం క్రీ పూ. 255-54 తర్వాత లిఖింపబడి ఉండటానికి వీలులేదు. అందుచేత అశోకుని పద్నాలుగు బృహత్ శిలాశాసనాలు క్రీ.పూ. 256 నుండి క్రీ.పూ. 254 వరకు గల మధ్యకాలం రెండేండ్లలో ప్రకటించటం జరిగిందని చెప్పవచ్చు. ఆ శాసనాలలోని ఇతివృత్తంలో రచనా సంవిధానంలో వున్న ఐక్యం కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తుంది.

బృహత్ శిలాశాసన ప్రకటన తర్వాత పన్రెండేండ్లు అశోకుడు మరెట్టి శిలాశాసనాలు వేయించినట్లు లేదు. ఆ తరువాత క్రీ.పూ. 242లో ఆరు స్తంభ శాసనాలను ప్రకటించినట్లు తెలుస్తుంది. ఒకటి, నాలుగు, అయిదు, ఆరు స్తంభ శాసనాలు రాజ్యాభిషిక్త కాలం ఇరవై ఆరవ ఏట, (క్రీ.పూ. 267-26)= క్రీ.పూ. 242లో లిఖింపబడినట్లు ఆ శాసనాలలోనే చెప్పబడి ఉంది. రెండవ, మూడవ స్తంభ శాసనాలను కూడా అదే సంవత్సరం ప్రకటించారనేది నిస్సంశయం. ధర్మాచరణలో, ధర్మ ప్రచారంలో, ధర్మవ్యాప్తిలో తాను చేసిన కృషికి, సాధించిన ఫలితాలకు అశోకుడు కావించిన సమీక్షగా చెప్పదగిన ఏడవ శిలాశాసనం, రాజ్యాభిషిక్త కాలం ఇరవై ఏడవ ఏట, క్రీ.పూ. 268-27=క్రీ.పూ. 241లో లిఖించబడినట్లు శాసనమే తెలుపుతుంది. ఈ శాసనం చివరలో "నేను రాజ్యాభిషిక్తుడను అయిన ఇరవై ఏడవ సంవత్సరంలో ఈ ధర్మలిపి నాచేత లిఖింపబడినది" అని చెప్పి, అశోకుడు వెంటనే "దీని విషయమై దేవానాం

ప్రియుడు చెప్పుచున్నాడు. ఈ ధర్మలిపి చిరస్థాయిగా వుండుటకు శిలాస్తంభములు కాని, శిలాఫలకములు కాని దొరకెడి చోట్ల యందెల్లా లిఖింపబడవలెను" అని చెప్పి ఉన్నాడు. కాని ఈ ఏడవ శిలాశాసనం ఒక్క ఢిల్లీ–తోప్రా శిలాస్తంభం పైననే కానవస్తుంది. ఏడవ శిలాశాసన ప్రకటన తర్వాత అశోకుడు సుమారు పదేళ్ళు క్రీ.పూ. 232-31, వరకు పాలించాడు. ఈ పదేళ్ళలో, అశోకుడు శాసించిన ప్రకారం, ఈ ఏడవ శిలాశాసనం ఇతర స్తంభాలమీద కాని, ఫలకాల మీదకాని రాయకపోవుటకు కల కారణము ఆలోచించవలసి ఉన్నది.

చిన్న స్తంభ శాసనాలు, - సాంచీ, సార్నాథ్ శాసనాలు, కౌశాంబీ స్తంభ శాసనం, - బౌద్ధ సంఘం విడదీసినవారికి వేయవలసిన శిక్షను గూర్చి చెప్తాయి. వీనిలో ఎక్కడా కాలం తెలుపబడలేదు. మూడవ బౌద్ధ సంగీతి పాటలీపుత్రంలో సమావేశమయిన తర్వాత ఆ సమావేశం తీసుకొన్న నిర్ణయాల మేరకు, అశోకుడు ఈ శాసనాలను జారీచేసి ఉండవచ్చునని పండితులు అభిప్రాయ పడినారు. ఈ సంగీతిని అశోకుడు, ధర్మవ్యాప్తిలో తాను కావించిన కృషిని సమీక్షించిన ఏడవ స్తంభ శాసనం (క్రీ.పూ. 241)లో పేర్కొనలేదు. ఈ మూడవ బౌద్ధ సంగీతి క్రీ.పూ. 240లో సమావేశమయి ఉండవచ్చునని భావించటమయింది. అందుచేత పై స్తంభ శాసనాలు (క్రీ.పూ. 240లోనో, ఆటు తర్వాత కొద్ది కాలంలోనో ప్రకటించబడి ఉంటాయి.

పైన పేర్కొన్న చిన్న స్తంభ శాసనాల కోవకే చెందిన రుమ్మిందయ్ స్తంభ శాసనం. ఆ శాసనంలోనే చెప్పినట్లు, అశోకుని రాజ్యాభిషిక్త కాలం ఇరవయ్యో సంవత్సరాన, క్రీ.పూ. 268-20=క్రీ.పూ. 248న వేయబడింది. దీనితోపాటే వేయబడింది నిగలీసాగర స్తంభ శాసనము.

బారాబర్ గుహాశాసనాలలో, రెంటిలో, అవి అశోకుడు అభిషిక్తుడైన పన్నెండవ ఏట, క్రీ.పూ. 268-12=క్రీ.పూ. 256లో ఆజీవకులకు ఇచ్చినట్లు తెలుపబడింది; మూడవ గుహ, పందొమ్మిదవ ఏట, క్రీ.పూ 268-19=క్రీ.పూ. 249లో ఆజీవకులకు ఇచ్చినట్లు తెలుపబడింది.

అశోకుని జీవితంలో కొన్ని సంఘటనలు - వాని కాలము:

ఆశోక శాసనాలు అశోకుని జీవితంలోని కొన్ని సంఘటనలను పేర్కొని వాని కాలాన్ని తెలిపాయి. అశోకుడు పట్టాభిషిక్తుడైన ఎనిమిదవ ఏట, క్రీ.పూ. 268-8=క్రీ.పూ. 260లో, కళింగరాజ్యం అతనిచే జయింపబడినట్లు 13వ శిలాశాసనం చెప్తుంది. పట్టాభిషిక్తుడైన పదవఏట, క్రీ.పూ. 268-10=క్రీ.పూ. 258లో అశోకుడు సంబోధికి (గయకు) ధర్మయాత్ర చేసినట్లు 8వ శిలా శాసనం చెప్తుంది. పన్నెండవ ఏట, క్రీ.పూ. 268-12=క్రీ.పూ. 256లో ధర్మలిపులు (ధర్మ శాసనాలు) లిఖించినట్లు ఆరవ స్తంభశాసనం తెలుపుతుంది. క్రీ.పూ.268-13=క్రీ.పూ. 255లో ధర్మ మహామాత్రులను కొత్త ఉద్యోగులను నియామకం చేసినట్లు అయిదవ శిలాశాసనం చెప్తుంది. క్రీ.పూ. 268-20= క్రీ.పూ. 248లో అశోకుడు బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ గ్రామాన్ని దర్శించినట్లు రుమ్మిందై స్తంభశాసనంవల్ల తెలుస్తుంది. నిగలీసాగర స్తంభ శాసనం వలన, అశోకుడు రాజ్యాభిషేక కాలం పద్నాల్గవ సంవత్సరం క్రీ.పూ. 268-14=క్రీ.పూ. 254లో ఒకసారి, ఇరవయ్యో సంవత్సరం, క్రీ.పూ. 268-14=క్రీ.పూ. 248లో మరొకసారి లుంబినీ గ్రామానికి సమీపంలో వున్న కనకముని బుద్ధుని స్థూపాన్ని అశోకుడు దర్శించి, దానిని విస్తరింపచేసి, పూజించినట్లు, నిగలీ సాగర(నిగ్లీవా) స్తంభం తెలుపుతుంది.

అశోకుని కందహార్ గ్రీక్-అరమైక్ ద్విభాషా శాసనంవల్ల అతడు పట్టాభిషేకంనుండి పదేండ్లు గడచిన తర్వాత, అనగా, క్రీ.పూ. 268-10=క్రీ.పూ 258 తర్వాత, మానవులకు ధర్మబోధ చేయటానికి ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఈ ధర్మబోధ చేసే ప్రయత్నంలో ముఖ్యమయిన సాధనాలుగానే అశోకుడు తన పన్నెండవ పాలనా సంవత్సరంలో శిలాశాసనాలను సామ్రాజ్యవ్యాప్తంగా ప్రకటించటం జరిగింది.


పై వర్ణనబట్టి అశోక శాసనాల కాలక్రమాన్ని, అశోకుని జీవితంలో కొన్ని సంఘటనలను, అశోకుని రాజ్యాభిషేక సంవత్సరం క్రీ.పూ. 268గా గ్రహించి, పట్టీ రూపంలో ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

శాసనాల కాలక్రమం:

లఘు శిలాశాసనాలు 1, 2	క్రీ.పూ. 256-255
బృహత్ శిలాశాసనాలు	క్రీ.పూ. 256-254
బారాబర్ గుహాశాసనాలు 1, 2	క్రీ.పూ. 256-255
బారాబర్ గుహాశాసనం 3	క్రీ.పూ. 249-248
రుమ్మిందయ్ స్తంభ శాసనం	క్రీ.పూ. 248-247
నిగలీసాగర్ (నిగ్లీవా) స్తంభశాసనం	క్రీ.పూ. 248-247
స్తంభ శాసనాలు 1 నుండి 6	క్రీ.పూ. 242-241
రాణీ స్తంభ శాసనం	క్రీ.పూ. 241-240
ఏడవ స్తంభ శాసనం	క్రీ.పూ. 241-240
చిన్న స్తంభశాసనాలు (సాంచీ, సార్నాథ్, కోరం)	క్రీ.పూ. 240-239

జీవిత సంఘటనలు:

కళింగ యుద్ధం (13వ శిలాశాసనం)		క్రీ.పూ. 260
బౌద్ధమత స్వీకారం (లఘు శిలాశాసనాలు)		క్రీ.పూ. 260-259
గయకు ధర్మయాత్ర (8వ శిలాశాసనం)		క్రీ.పూ. 258
ధర్మవ్యాప్తికి పూనుకొనుట (కందహార్ శాసనం)		క్రీ.పూ. 258
ఆజీవక సన్యాసులకు బారాబర్ గుహలు 1, 2 అంకితం చేయుట		క్రీ.పూ. 256
ధర్మమహామాత్రుల నియామకం (5వ శిలాశాసనం)		క్రీ.పూ. 255
ప్రతివేదకుల ('రిపోర్టర్ల') నియామకం	(6వ శిలాశాసనం)	క్రీ.పూ. 255-254
కనకముని బుద్ధుని స్థూపానికి యాత్ర	(నిగ్లీవా శాసనం)	క్రీ.పూ. 254
ఆజీవక సన్యాసులకు బారాబర్ గుహ 3 అంకితం చేయుట		క్రీ.పూ. 249
బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ గ్రామానికి యాత్ర	(రుమ్మిందై శాసనం)	క్రీ.పూ. 248
కనకముని స్థూపాన్ని రెండవ సారి దర్శించుట	(నిగ్లీవా శాసనం)	క్రీ.పూ. 248



మనస్వి, తపస్వి, మాస్తి!

(సానెట్)

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

మీ పరమ సుకుమార హృదయమ్మునకు దీటు
పచ్చు వస్తువు సృష్టిలో లేదు నిక్కమ్ము!
బాల్యమ్ములో మీరు పడినట్టి దుఃఖమ్ము,
కష్టమ్ము ఒసగినవి మీ యెదదలో చోటు
సానుభూతికి, మీకు ప్రతి వస్తువున కూడ
మంచియే కనిపించు! చెడ్డ కనబడదింత!
మీ శత్రువును కూడ మీరు దయతో చూడ
నెంచెదరు! మీరలు అజాత శత్రులు! ఎంత
గొప్పవారో మీరు - ఎవడు చెప్పగలండు!
మీదు కృతితతి కన్న మీదు వ్యక్తిత్వమ్ము
గొప్పదని అందరును భావింత్రు. తత్త్వమ్ము
చూడగా, దేనికదియే సాటి కద! నిండు
బ్రదుకు బ్రదికిన మనస్వి. తపస్వి. మాస్తి!
మీరు రసజగమునకు అత్యమూల్యపుటాస్తి!!

(6-6-1891 న అవతరించి, సుమారు 75 సంవత్సరములు ఆధునిక కన్నడ సాహిత్యమును, తద్వారా భారతీయ సాహిత్యమును శ్రీమంత మొనరించి 6-6-1986 న, తమ 96 వ జన్మదినమునాడు పరమపదము నందుకొన్న మరపు రాని మనిషి, మహారచయిత, మహామానవుడు, డా॥ మాస్తి వేంకటేశ అయ్యంగార్ గారికి నేను సమర్పించిన శ్రద్ధాంజలి ఇది.)

అశోకుడు క్రీ.పూ. 240-39 తర్వాత ఎట్టి శాసనం వేయించినట్లు నేటికి తెలియరాలేదు. అశోకుని పాలనా కాలాన్ని హిందూ పురాణాలు 36 ఏండ్లని, బౌద్ధ గ్రంథాలైన మహావంశం, దీపవంశం 37 ఏండ్లని పేర్కొంటాయి. అందు చేత అశోకుని పాలన క్రీ.పూ. (268-36/37) = క్రీ.పూ. 232/231లో సమాప్తం చెందింది.

సూచికలు

1. హెన్నింగ్, బులెటిన్ ఆఫ్ ది స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, 1949, పార్ట్ 1, పు. 80; రోమిలాథాపర్, అశోకా అండ్ ది డిక్లైన్ ఆఫ్ ది మౌర్యాస్, పు. 7.
2. ఎపిగ్రాఫియా ఇండికా (ఎపి. ఇం) సం. 34, పు 1-8లు.
3. ఎపి. ఇం: 37 పు. 193-200
4. డి. సి. సర్కార్ (సం) "ఎర్రగుడి ఎడిక్ట్స్ ఆఫ్ అశోకా", ఎ.పి. ఇం, సం. 32, పు. 1-28లు.
5. రిత్తి. యస్, "జర్నల్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా" సం. 7.
6. డి. సి. సర్కార్, "అశోకన్ స్టడీస్" (కలకత్తా, 1979), పే. 55-56.
7. డి. సి. సర్కార్ (సం) "ఎర్రగుడి ఎడిక్ట్స్ ఆఫ్ అశోకా", ఎపి.ఇండి. సం. 32, పు. 1-28లు.
8. ఈ వ్యాసంలోని అశోక శాసనాలలోని భాగాలకు, తెలుగు అనువాదం ప్రాకృత మూలం. ప్రసిద్ధ ఆంగ్లానువాదాలు, ఆధారంగా నేను స్వంతంగా చేయడం జరిగింది - వ్యాసకర్త

కొన్ని ఉపయుక్త వ్యాసాలు, గ్రంథాలు

వ్యాసాలు:

జి. బూలర్ (సం) "అశోకాస్ రాక్ ఎడిక్ట్స్ అకార్డింగ్ టు గిర్నార్, షాబాజ్‌గఢీ, కాల్సీ అండ్ మన్సెహ్రా వెర్షన్స్", ఎపి ఇండి, సం.2, పు. 447-72లు.

జి. బూలర్ (సం) "ది అశోకా పిల్లార్ ఎడిక్ట్స్ ఆఫ్ పడరియా (రుమ్మిందై) అండ్ నిగ్లివ" ఎపి.ఇండి, సం.5, పు. 1-6లు.

ఇ. హెర్జ్‌ఫీల్డ్ (సం) "ఎ న్యూ అశోకన్ ఇన్‌స్క్రిప్షన్ (ఇన్ అరమైక్) ఫ్రం టాక్సిల" ఎపి.ఇండి సం.19, పు. 251-53

డి. సి. సర్కార్ (సం): "గుజ్జర ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోకా"
ఎపి.ఇండి: సం. 31, పు. 205-10లు
"రాజుల-మండగిరి ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోకా"
ఎపి.ఇండి: స. 31, పు. 211-18లు.
"ఎర్రగుడి ఎడిక్ట్స్ ఆఫ్ అశోకా"
ఎపి.ఇండి: సం. 32, పు. 1-28లు.
"సోపారా ఫ్రాగ్‌మెంట్ ఇరాక్ ఎడిక్ట్ నైన్ ఆఫ్ అశోకా"
ఎపి.ఇండి; సం. 32, పు. 29-30లు
"ఫ్రాగ్‌మెంటరి పిల్లార్ ఇన్‌స్క్రిప్షన్ ఫ్రం అమరావతి"
ఎపి.ఇండి: సం. 35, పు. 40-43లు.
"న్యూ ఢిల్లీ ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోకా"
ఎపి.ఇండి: సం. 38, పు. 1-4.

జె. ఫిలియోజా (సం): "గ్రీకో-అరమైక్ ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోకా నియర్ కందహార్" ఎపి.ఇండి సం. 35, పు. 1-8లు.

డి. ష్లుంబెర్గర్, ఇ. బెవెనిస్ట్ (సం) "ఎ న్యూ గ్రీక్ ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోకా ఎట్ కందహార్" ఎపి.ఇండి. సం. 37, పు. 193-200లు.

గ్రంథాలు:

రోమిలా థాపర్: అశోకా అండ్ ది డిక్లైన్ ఆఫ్‌ది మౌర్యాస్, ఆక్స్‌ఫర్డ్ 1973.

డి. సి. సర్కార్: అశోకన్ స్టడీస్, కలకత్తా, 1979.

నీలకంఠశాస్త్రి, కె. ఎ.: ఏజ్ ఆఫ్ ది నందాస్ అండ్ ది మౌర్యాస్, ఢిల్లీ, 1967. (సెకండ్ ఎడిషన్)



కోటయ్య అనుభవం-
కోటయ్య నోటనే విందాం
కోటయ్యా సూరయ్యా ఇరుగు పొరుగు ఊళ్ల రైతులు. ఎన్నాళ్లనుంచో మిత్రులు. ఒకసారి అనుకోకుండా కలిశారు ...
అరె, కోటయ్యా నువ్వా!
ఏరోయ్ సూరి, ఎలాగున్నావ్!
బాగానే ఉన్నాలే. నీ ఎడ్ల గురించి రామన్న చెప్పాడు. చాలా బాధైందనుకో!
ఏంజేస్తాం... దేవుడలా పెట్టాడు.
కోటయ్య ఎడ్లు మేస్తుంటాయి... ఉన్నట్టుం చెవులు దద్దరిల్లే శబ్దం... రాళ్లూ మట్టీ దొర్లివస్తాయి. గాభరా పడ్డ కోటయ్య ఎడ్లను కాపాడుకొ ప్రయత్నంలో
భగవంతుడా... నా ఎడ్లను కాపాడు తండ్రీ!
ఎంత గోరం! ఇపుడెట్టా గడుపుతున్నావ్ మరి!
అదృష్టం కొద్దీ న్యూ ఇండియా వాళ్లతో పశువుల భీమా చేయించుంచా. లేకుంటే మునిగిపోయుండేవాణ్ణి.
... కిందటి సంతలో రెండు కొత్తెడ్లు కూడా కొన్నా!
అబ్బో! అంత డబ్బు కూడబెట్టావా!
డబ్బెక్కడ కూడబెట్టాను! పశువుల భీమా చేయించానని చెప్పాగా!
పశువుల భీమా, పశువుల భీమా అంటున్నావు. అదేమిటీ!
పశువుల భీమా అంటే... ప్రమాదంలోనో రోగంతోనో నీ పశువులు చచ్చిపోయాయంటే న్యూ ఇండియా వాళ్లు నీ నష్టానికి డబ్బు కట్టేస్తారు.
ఉట్టినే డబ్బిచ్చేస్తారా?
ఊహుం. ఏడాదికింత అని మనం కాస్త డబ్బు కట్టాలి. మన పశువు 100 రూపాయల్లనుకో; మహా అంటే 4 రూపాయలు చాలు!
అలాగా! ఈ సంగతి తెలీదే!
ఇప్పుడు తెల్సింది కదా నష్టాలు వచ్చినప్పుడు భీమాయే మనకు ఆధా



భారతి

పాలడుగు వెంకటేశ్వరరావు

ఆకాశం చిల్లు పడినట్లుగా - కుండల్తో కుమ్మరించినట్లు వాన పడుతోంది. వంటగదిలో మండని కట్టెల్తో, పొగతో అవస్తపడుతోంది మంగమ్మగారు. నీరజ ఇంకా నిద్ర లేచినట్లు లేదు. వాసు రెండు దినాల క్రితం ఫ్రెండు పెళ్ళికని పాలకొల్లు వెళ్ళినవాడు ఇంకా తిరిగి రాలేదు.

పైన కప్పునించి కారుతున్న వర్షపుధారలు ఇల్లంతా తడిపేయకుండా పళ్లేలూ, బిందెలూ పెట్టి – తమ్ముడు వాసు చొక్కాకి వూడిపోయిన గుండీల్ను తిరిగి కుట్టటానికి ముందు వరండాలో కూర్చుంది భారతి.

ప్రపంచాన్ని తెల్లటి ముసుగు కప్పేసింది. అస్పష్టమయిన అయోమయం అలముకుంది. కాస్సేపు అయ్యాక వాన ప్రతాపం తగ్గింది. కాని సన్నని చినుకులు ఎడతెగకుండా రాల్తూనే ఉన్నాయి.

తెల్లవారగట్లనే మెలకువ వచ్చింది భారతికి తలంటి స్నానంచేసి మెత్తటి వంకీల జుట్టుని పైపైన దువ్వుకుంది, భారతి – ఈ లోపల నిద్రలేచి, ఇంటి పనుల్లో చొరబడిన మంగమ్మగారికి సాయం చెయ్యబోయింది.

'ఇవన్నీ నీకెందుకు లేవే! ఆఫీసు పని మిగిలిందని నిన్న ఏవో ఫైళ్ళు తెచ్చుకున్నావు గదా! పోయి ముందు గదిలో కూర్చుని ఆ పని చూసుకో.' అంది మంగమ్మగారు మురిపెంగా చూసి. భారతి నవ్వుకుని ఫైళ్ళు చూసుకోబోయింది. కాని–నిలకడ కుదరలేదు.

మనసు, గుర్రమువంటిది-పరుగులు తీసింది. బుద్ధిని నిలవనీయలేదు. ఆలోచనలు చేతులకి సంకెళ్ళు వేయగా ఫైళ్ళు తీసి అవతల పెట్టింది. అసహనంగా ఇల్లంతా అటూ ఇటూ కలయదిరిగింది. కాలు నిలవలేదు ఆ పనీ ఈ పనీ చెయ్యబోయింది. చెయ్యలేదు.

భారతీ, సుందరీ ఆఫీసులో కొలీగ్సు, మంచి స్నేహితులు.

విశ్వం సుందరికి చిన్నన్న. మద్రాసులో ఏదో మంచి కంపెనీలో పెద్ద ఆఫీసరుగా ఉద్యోగిస్తున్నాడట వూరుగాని వూరులో-గారాల చిన్నకొడుకు ఒంటరిగా ఇబ్బంది పడటం తల్లిదండ్రులకు ఏమాత్రం ఇష్టంలేక - వెంటనే వచ్చేసి-మంచి లగ్నాలున్నాయి గనక-నీక్కావల్సిన అమ్మాయిని నీ ఇష్ట ప్రకారమే ఎన్నుకుని పెళ్ళి చేసుకుని వెడతావా లేక మమ్మల్ని సత్యాగ్రహం చేసి ప్రాయశ్చిత్తం చేసుకోమంటావా–అని తల్లీ తండ్రీ పదే పదే నిష్ఠూరంగా వుత్తరాలు రాయగా-సర్లెమ్మని వచ్చి-మధ్యలో చెల్లెల్నీ బావమర్దినీ కూడా చూసి నాలుగు రోజులుండి పోదామని ఈ వూరు వచ్చాడని సుందరి అతని గురించి చెప్పింది. మొదటి పరిచయంలోనే అతని పెదాలమీది నవ్వులోని విశేషాన్ని గమనించింది భారతి. అతని కళ్ళు భారతికి ఏదో చెప్పాలని ప్రయత్నించాయి. కాని భారతి పట్టించుకొనలేదు.

ఆ తర్వాతి రోజున సుందరి రాయబారం తెచ్చింది.

'చిన్నన్నయ్య నిన్ను పిల్చుకు రమ్మన్నాడు. 'త్వరగా తయారవు తరుణీమణీ.'

'నాతో అతనికేం పని?'-అని చిరుకోపం ప్రదర్శించింది భారతి.

'ఏమో నాకేం తెల్సు? వచ్చి అతన్నే అడగరాదా?' కొంటెగా నవ్వింది సుందరి. మొదటిసారిగా సిగ్గుపడింది భారతి.

'క్లియోపాత్రా తెల్సు గదా!'

'ఊ'

'తన వాల్చూపులతో సామ్రాజ్యాధిపతులనే బంధించింది.

'సర్లె. సర్లె.'

'అలా ఏం తెలియనట్లు మాట్లాడకు. నా ఉద్దేశ్యంలో, నీ వాల్చూపులు అంతకంటె శక్తిమంతమయినవి. చాలా చాలా గొప్పవి.'

'అబ్బ! ఇక చాల్లేవే, సుందరీ.'

'మరి ఏమయిందో ఏమో! నిన్ను పరిచయం చేసిన ఆ క్షణం నుంచీ మా అన్న నిద్రాహారాలు మాని చిక్కి సగమయ్యాడు 'పాపం నీదే సుమా'

'ఇక వూరుకో తల్లీ! ఎవరన్నా వింటారూ. బాగుండదు.'

'ఎవరూ వినకపోతే ఫర్వాలేదన్నమాట! అయితే మా ఇంటికి రా. మా శ్రీవారు కేంపుకి వెళ్ళి వున్నారు. తీరిగ్గా కూర్చుని భయం లేకుండా మాట్లాడుకుందాం, మనం మనం'

'నేను రాను ఫో. కొంటె మాటలూ నువ్వూ'

'అలా ఫో ఫో-అంటే పోయేదాన్ని కాదమ్మా. బంగారుబొమ్మవంటి అందాల వదినగార్ని అంత తేలిగ్గా వదిలిపెట్టేదాన్ని కాను నేను. నేనసలే మొండిని.'

'అబ్బ! నిన్ను పొమ్మనలేదే నేనూ. సారీ'

'అలాగా! నువ్వు మాట్లాడుతున్నది తెలుగులో కాదా? నేను ఆ యొక్క భాష ఎరుగక అపార్థం చేసుకున్నందుకు నన్ను క్షమించు హలా! ప్రియ సఖీ-నా అనుంగు నెచ్చెలీ'

సిగ్గుల మొగ్గ అయి చేతుల్తో మొహం కప్పుకుంది భారతి.

'అయితే నువ్వు రావన్నమాటేగా?'

'వుహూఁ' తల అడ్డంగా వూపింది భారతి.

'నిన్ను ఇలా కాదులే. మొండివి. అందగాడు, మంచి ఉద్యోగంలో వున్నాడు. కావాలని నిన్ను కోరుకున్నాడు. మంచి మనసున్న మనిషి మా చిన్నన్న. నాకు తెలీక అడుగుతానూ ఎందుకే నీకు ఆ బెట్టూ? నామీద నమ్మకం లేదా? చిన్నన్న కోరికని మావాళ్ళు కాదనరు తెలుసా?'

'భారతి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. అవ్యక్తమయిన అనుభూతికి లోనయింది.

'పిచ్చి! ఎందుకే ఆ కన్నీళ్ళూ? ఆనంద భాష్పాలా! సర్లే నన్ను నమ్ము మరి'

'సుందరీ! నీవు మంచి స్నేహితురాలివి. నా మంచిని కోరుకునే మనసున్న దానివి. నిన్ను కాక మరెవర్ని నమ్మను?'

'నీ మాటల్ని నేనూ నమ్ముతానులే. నీకు శుభమే జరుగుతుంది. సంతోషంగా వుండు. వెళ్ళొస్తానూ, మళ్ళీ కలుద్దాం త్వరలోనే'

వీధివరకూ వెళ్ళి సుందరిని సాగనంపింది భారతి.

అది జరిగిన నాలుగు దినాల్నుండి భారతి మనసు గుర్రంలాగా పరుగులు తీస్తూ వుంది. నిలకడ లేకుండా ఆందోళనతో పరుగులు తీస్తున్నది. సతమతమవుతున్నది.

నిన్న సాయంత్రం ఆఫీసునుంచి అలిసిపోయి ఇల్లు చేరిన భారతికి ప్రసన్న వదనంతో కాఫీ అందించింది తల్లి మంగమ్మ. చదువుతూ వున్న పేపర్ని అవతల పడేసి వచ్చి ప్రక్కన కూర్చున్నాడు తండ్రి, తిరుమలరావుగారు.

'నీతో ఒక మంచి సంగతి ప్రస్తావిద్దా మనుకుంటున్నానమ్మా'

'ఏమిటి నాన్నగారూ?'

'కుర్రవాడు మంచివాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. అందగాడు కూడా. నిన్ను అతను ఎరుగునట. పెళ్ళి చేసుకుంటానని ముందుకు వచ్చాడు. మీ కొలీగ్ సుందరిద్వారా అతను నీకూ తెలుసునట గదా! మనం సరేనంటే అతను వెళ్ళి తల్లిదండ్రుల్ని తీసుకుని వచ్చి మాట్లాడతానన్నాడు. కట్నకానుకలు అసలు అక్కర్లేదుట! తల్లీ! అదృష్టదేవత వచ్చి మన తలుపు తట్టింది. వెంటనే అలాగే అందామనుకున్నాను. కాని - నిన్ను కూడా ఒక మాట అడిగి చెపుతానన్నాను. నిన్న లైబ్రరీలో ఒక గంటపైగా అతన్తో మాట్లాడాను. నాకు ఈ సంబంధం అన్ని విధాలా నచ్చింది. ఏ సంగతి తెల్సుకొనటానికి రేపు ఉదయం విశ్వం మన ఇంటికి వస్తానన్నాడు' ఆనందంతో చెప్పుకుపోతూ ఆయాసంతో ఆగా తిరుమలరావుగారు.

సంతోషంతో కళ్ళు అంతలేసి చేసుకుని వింటూంది మంగమ్మగారు.

భారతి మౌనంగా ఉండిపోయింది.

'నీ అభిప్రాయం కూడా చెప్తే - నువ్వు సరేనంటే సంతోషించి, తర్వాత కార్యక్రమం ఆలోచిస్తాము. ఎదిగిన ఆడపడుచు పెళ్ళి - కన్నవాళ సమస్య — నీకు తెలీనిదేముంది?'

'సరేననక ఏమంటుందిలెండి.' ఆనందంగా అంది మంగమ్మగారు.

'కాదు. ఇటువంటి విషయాలలో స్పష్టంగా వుండాలి. ఇది అమ్మాయి జీవితానికి సంబంధించిన సమస్య. ఆలోచించే చెప్పనీ' అన్నారు తండ్రి.

'నాన్నగారూ! ఇది మన అందరి జీవితాలకి సంబంధించిన సమస్యండీ' అని లేచి లోపలకి వెళ్ళింది భారతి, భారంగా నిట్టూరుస్తూ.

'ఏమిటే! అమ్మాయి అలా అంటుందేమిటి?'—ఆందోళనగా అన్నా తిరుమలరావు.

'మీ బాదస్తంగాని - ఆడపిల్ల అంతకంటె ఎక్కువగా ఏమి చెప్తుంది' అంది మంగమ్మగారు.

నీరజకి చిన్నప్పుడే పోలియో వచ్చింది. వైద్యానికని చాలా డబ్బు తగలే చాలా వూళ్ళు తిరగటానికి తిరుమలరావుగారికి — రిటైరయినాక అం గ్రాట్యుయిటీ డబ్బు చాలక అప్పులయినాయి. ఇల్లు తాకట్టులో వుంది. వా అందరికంటె ఆఖర్న పుట్టినవాడు. ఇంటర్మీడియెట్ ఈ సంవత్సరం అ పోతుంది. పై ఏడాది — మెడిసిన్‌లో చేరాలనుకుంటున్నాడు. మెరిట్‌తో సీ సంపాదించుకున్నా — చదువు కొనసాగటానికి డబ్బు కావాలి. ఆ కుటుంబాని ఏకైక ఆధారం ఇప్పుడు భారతి ఉద్యోగించి తెస్తున్న జీతం. అన్నీ బాగ వున్నా - ఈ రోజుల్లో - ఆడపిల్లకి పెళ్ళి చెయ్యటం ఒక యజ్ఞం చేసినం వ్యయప్రయాసలు తగ్గటం లేదు. అటువంటిది నీరజ పెళ్ళి ఆ కుటుంబానికి గుదిబండలాగా అవదని చెప్పటం కష్టం. ఇవన్నీ అర్థంకాని వయసు కా భారతిది.

కిర్రున గేటు తీసిన చప్పుడయింది. చేస్తున్న పని ఆపి అటు చూసి భారతి. గుండె ఝల్లుమనింది. గండుమీనుల్లాగ ఆమె కనులు అల్లల్లాడాయి.

వానలో తడుస్తూ - లోపలకి రావటానికి సంశయిస్తూ - విశ్వం!

భారతి లేచి నిలబడి—'రండి'-సంభ్రమంగా అతన్ని ఆహ్వానించింది- తుడుచుకోవటానికి తువాలందించి — 'వానలో తడిశారు! అంది. విశ చిరునవ్వు నవ్వాడు. అది భారతి గుండె లోతుల్ని కోసింది. విలవిల్లాడింది దె తిన్న పక్షిలాగ భారతి.

'మిమ్మల్ని చూడకుండా వుండలేకపోయాను. మీకోసం ఈ వర్షా కాదు - దేనినీ లెక్క చెయ్యాలనిపించటం లేదు.' మనమోహనంగా నవ్వా విశ్వం.

'భారతీ! సుందరి మీకు అన్నీ చెప్పే వుంటుంది. మీ నాన్నగారు కూ ఆ ప్రస్తావన మీ దగ్గర తెచ్చివుండాలి. మీ నిర్ణయాన్ని విని — ఆ క ఆనందంతో మా వాళ్ళకి మోసుకుని పోవాలని కొండంత ఆశతో వచ్చాను, వర్షంలో....'

అతని వాక్ప్రవాహం ఆగేటట్టు లేదు, గుండె విప్పి ఎన్నో సంగత పరిచాడు.

ఆరాధన, విశ్వాసంతో కూడిన అతని మాటలకి భారతి కళ్ళు చెమర్చా

లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి అందించింది - అతనికి.

'నా జీవితంలో నేను తాగిన చాలా మంచి కాఫీ ఇది' అన్నాడు. అదే మయిన నవ్వు నవ్వి. భారతీ నవ్వింది.

మేఘగీతం

మైత్రి

మౌనమే ధ్యానమైన
నీలగగన ప్రాంగణాన
ఏముందని చరియింతువు
దేనికొఱకు తపియింతువు
జాలికనుల మేఘమా
ఆవిరి స్వరగీతమా ॥మౌనమే॥

కలదే ఏదేని అచట
కలగీతుల ఎలకోయిల
కలదే ఏదేని అచట
పూలుకూర్చిన తూగుటూయెల
కలదే చెలికౌగిలి
కలదే తొలిపలపుల గిలి
కలదే కమకమ్మగ మాటలాడు జాబిలి
కలదుగాని పుడమిపై... ॥మౌనమే॥

కలదే ఏదేని కాంతి
కలదే ఏదేని క్రాంతి
కలదే నీ గుండెలకు
హరితకిరణ సంక్రాంతి

కలదే ఒక నిముషమైన
నీ నడకకు విశ్రాంతి
కలదుగాని పుడమిపై ॥మౌనమే॥

నింగిలోనె మిగిలిపోవ
నీ జన్మకు సాఫల్యమిచ్చోట
నేలపై నువు నడయాడిన
నిను కొలవని గుడి ఎచ్చట
చినుకై కురిసి పంటకు ప్రాణంకావే
వేసవి గుండెకు రవంత బాసటకావే

ప్రతిబింబం

శంకరయ్య

గాజు కళ్ళ వినీలచ్ఛాయావరణంలో
అనుభవాల తాయాకు పగుళ్ళ నెగళ్ళు.
అమృతాభిషేకాన్ని కాంక్షిస్తూ
ప్రపంచ కూపం నుండి చేదుకుంటున్న
చూపుల బొక్కెన నిండా
హృచ్ఛకలాలు తేలే రక్తాశ్రుపూరం.
కదిలే పెదాల గుహా ముఖాల చీకట్లో
నిబద్ధపగ్గచిత్రాల గుసగుసలు.
ఆత్మన్యూనతా పరిధిలో
లయలేని
విలయోన్ముఖ పద ఘట్టనల ఫిరంగుల మోతలు.
గుండె గూడులో రునుకు తీస్తున్న
ఆశాబుద్బుదాల విస్ఫోటనా వికట ధ్వనులు.
ముళ్ళచేతులు పువ్వుల్ని రువ్వవు.
ఈ లోకం దర్పణంలో
ముక్కలై ఏడుస్తున్న ప్రతిబింబాన్ని చూచి
భయపడితే ఎలా?...... అది నీదే!

ధీమా

రఘువర్మ

విధి ఎప్పుడూ
నాకు ఇస్తూంటుంది
నిరాశా విషం!
పైగా చేస్తూంటుంది
వికటాట్టహాసం!
కానీ... పాపం

దానికి తెలియదు కాబోలు
నేను ఆశామృతాన్ని
త్రాగేవాణ్ణని-
అందుకే చిరంజీవిగా
బ్రతుకుతున్నానని!!!

'నాన్నగారు ఇంట్లో వున్నారా?'

'వస్తారు. బజారు వెళ్ళారండి, అమ్మ.

'నాన్నగారు వచ్చేలోగా మీ నిర్ణయం చెప్పి నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి ప్లీజ్! భారతి'

'భారతి మౌనంగా తల వంచుకుంది.

'సారీ విశ్వంగారూ! నా మీద మీకు ఏర్పడిన సదభిప్రాయానికి చాలా థాంక్స్. కానీ ఇది నా జీవితానికి సంబంధించిన విషయం. కనుక నా ఆలోచనలు నాకుంటాయి. అందువలన మీరు నన్ను క్షమించి — మీ హృదయంలో నాకు కేవలం ఒక స్నేహితురాలిగా చోటివ్వండి. నాకు అది చాలు' అంది అతి ప్రయత్నం మీద.

విశ్వం మొహం తెల్లగా అయింది—రక్తం తోడేసినట్టు.

'భారతి! ఇదే మీ నిర్ణయమా? బాగా ఆలోచించే చెప్పండి. తొందర లేదు....'

భారతి నవ్వి తల వూగించింది, పైకీ క్రిందికీ. అతను చాలాసేపు తల వంచుకుని కూర్చున్నాడు. 'థాంక్సండీ. మరి నేను వెళ్ళి వస్తాను. గుడ్‌లక్'— అతను లేచి గబగబ బయటికి నడిచాడు. అతని అడుగుల్లో తడబాటు. ఆశాభంగం అందించిన అలజడి

శిలావిగ్రహంలాగ నిలబడి—వెళ్ళిపోతున్న విశ్వాన్నే చూస్తున్న-భారతి కళ్ళల్లో వరదలు. తుఫానుకి గురయిన సముద్రపు కెరటాల హోరు. అగ్నిపర్వతాల సెగలు.

వర్షం విజృంభించి జోరున కురవసాగింది. బజార్నుంచి, రాబోయే అతిథి కోసం స్వీట్సూ, పళ్ళూ తీసుకుని అప్పుడే ఇల్లు చేరిన తిరుమలరావుకి-తల వంచుకుని వడివడిగా తనని గమనించకుండానే...చరచరా సాగిపోతూ వున్న విశ్వం ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది.

క్రూరంగా ఆకాశం వురిమింది ఆ గర్జనల ఘట్టనల్ని తట్టుకొనే ప్రయత్నంలో గుండెల్ని అదిమి పట్టుకుని కుర్చీలో వాలిపోయి మవునంగా శోకించింది, భారతి.

మహీరుహం : మానవుడు

శ్రీ గజానన్ తామన్

ఎంతోకాలం
ఎదురుచూడటం దేనికి?
రేపో-మరీ అయితే-మాపో,
ఓ అపూర్వ సుముహూర్తాన
స్థలం కాలం సవ్యంగా మేళవించిన క్షణాన,
పుడుతాను పుడమి గర్భాన్ని చీల్చుకుని-
ఆందాక, నీవు ఓర్పువహించు, నేస్తం!

ఏదో ఓ రోజు నీవు నిదురలేస్తూనే,
నీకు దినచర్యలో తొలిదైన వేకువనడకలో
తృణాంకుర సందోహంమధ్య
ముత్యమంత ఆకృతిగా
మూర్తిమంతమైన నా అస్తిత్వాన్ని
గమనించి విస్తుపోతావు

ఇది వర్షర్తువు:
ఇంచుక శ్రమించదలిస్తే నాకోసం,
ప్రాణిరూపాన ఏ హాని
నా దరిదాపులకు రాకుండా
ఓ దట్టమైన కంచెను
కట్టుదిట్టంగా
నాచుట్టూ నిర్మించు;
రానున్న గ్రీష్మంలో
ప్రతినిత్యం మాపటివేళ
నన్ను సలిల స్నాతనుగావించు;
కనీసం ఓ రెండు వసంతాలైనా
నా పోషణభారం వహించు;
కారుణ్యభావ వివశుడవై
సదా నన్నవలోకించు
నీ ఈక్షణలో, ప్రతీక్షలో
ఆరాధనకు పరంగా
సాధనకు ఫలంగా
నింగి నందుకుందని ఎవరైనా
సహజంగా భ్రమించేంత ఎత్తుకు
నేను ఎదుగుతాను:

నాతోబాటు నీవూ ఎదుగుతావు
కేవలం ఏళ్ళలోకాదు-విలువల్లో.
ప్రభంజనా హతులకు,
పర్జన్యాఘాతాలకు,
సహస్రవర్షాలు అచలంగా నిలిచే
అజస్ర మహావృక్ష సామర్థ్యంతో
శాఖోపశాఖలు వ్యాపించి,
విరాటరూపం నేను ధరించటాన్ని
నీవూ- నీతరం- మున్నుతరాలవారు చూస్తారు.
నాలోగూండ్లు నిర్మించుకొని
నానా ద్విజసంతానాలు
గడుపుతాయి ముచ్చటగా
గార్హస్థ జీవనాలు.
మార్గశ్రాంతులైన పాంథులనేకులు
చేరుతారు నా సుఖద శీతలచ్ఛాయలో.
గ్రామాభ్యుదయం ధ్యేయమైన
యువకిశోరాలు
కావిస్తారు నా కొలువున వాదోపవాదాలు
యంత్ర సంస్కృతికి నన్ను బలిపెట్ట
    నెంచు ధూర్తులతో
సాగుతుంది నా ప్రేరణ కురుక్షేత్రసంగ్రామం.

మానవేతిహాసంలో
అనుస్యూతంగా వస్తూవున్న
వైషమ్యానికి శోషణకు
అమానుషం అశ్లీల మూలమైన వర్తమానవ్యవస్థకు
విరుద్ధంగా ఆక్రాంతం విప్లవించి
పరాభూతుడవై, సహచర పరిత్యక్తుడవై
ఇష్టుల కనిష్టుడవై, నష్టనీడుడవై
నీకు నీవే పరాయివై, ఒంటరివై
అలా, సార్థకజన్ముడవైన వేళ
నన్నాశ్రయించు—
పర్ణపర్ణానికి ప్రసరించిన హర్షంతో
నిన్నాశీర్వదిస్తాను

శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ

ఆంధ్ర మహా సావిత్రి-ఒక సమీక్ష

(గత సంచిక తరువాయి)

స్వర్గ నరకాల అనుభవంలో కూడా క్రమం ఉంది. సావిత్రిలో స్వర్గ నరకాల వర్ణన లేదన్నాను. కానీ ఆ వర్ణన భారతంలో స్వర్గారోహణ పర్వంలో ఉంది. అక్కడ స్వర్గనరకానుభవ క్రమం చెప్పబడింది. "అగ్రతో దేవదూతశ్చ యయౌ రాజాచ పృష్ఠతః। పంథా న మశుభం దుర్గం సేవితం పాప కర్మభిః(16) తమసా సంవృతం ఘోరం కేశ శైవల శాద్వలం। యుక్తం పాపకృతాం గంధైర్మాంస శోణిత కర్దమం(17) దంశోత్పాతక భల్లూకం మక్షికా మశకా వృతం." అశుభము నడపడానికి దుస్సాధ్యము. పాపాత్ముల దుర్గంధ యుక్తము మాంసశోణిత పంకిలము, ఎలుగుబంట్లు, ఈగలు, దోమలు ముసురుకుని ఉన్నది అయిన నరకలోకము చూపిస్తాడు దేవదూత ధర్మరాజుకి. ఆ లోకాన్ని దాటిన తర్వాత దేవతలు పుణ్యాత్ములు వస్తారు. వారి ఆగమనం చేతనే పాపాత్ముల యాతనలు, వైతరణి, శాల్మలీవృక్షం, మొదలైన భయానక దృశ్యాలు అదృశ్యమైపోయాయి. "తేషు భాసుర దేహేషు పుణ్యాభిజన కర్మసు। సమాగతేషు దేవేషు వ్యగమత్ తత్ తమో నృప" (2అ. శ్లో) నా దృశ్యంత రా స్తత్ర యాతనాః పాపకర్మణాం। నదీ వైతరణీ చైవ కూట శాల్మలినా సహ। లోహకుంభ శిలాశ్చైవ నా దృశ్యంత భయానకాః (2అ-శ్లో) అప్పుడు ధర్మరాజు ఇంద్రుణ్ణి అడుగుతాడు నాకు నరకమెందుకు చూపించావు అని. దానికి ఇంద్రుడు చెపుతాడు, "వ్యాజేనైవ తతో రాజన్ దర్శితో నరకస్తవ(18) అవశ్యం నరకస్తాత ద్రష్టవ్యస్సర్వరాజభిః। యః పూర్వం సుకృతం భుంక్తే పశ్చాన్నిరయమేవసః" ఒక వ్యాజంగా నీకు నరకం చూపించబడింది. రాజులందరూ నరకం చూచి తీరాలి, ముందు పుణ్యం అనుభవించినవాడు తర్వాత తప్పక నరకం పొందుతాడు...ఈ విధంగా మహాభారతంలో నరకం మొదట తర్వాత స్వర్గం అనే క్రమం చెప్పబడింది. ఇలాగే పరలోక యాత్రాకథలు అన్యదేశాల్లో కూడా ముందు నరకము తర్వాత స్వర్గము అని చెప్పాయి. ఈ లియడ్‌లోగానీ డివైన్ కామెడీలోగానీ ఇదే క్రమం.

కానీ ఇలియడ్ ఆది గాథలన్నిటికంటె మహాభారతం ప్రాచీనం. కానీ మహాభారతానికంటే ముందు పరలోకయాత్రా కథనమున్న కథలు కూడా ఉన్నాయి. అవన్నీ తెలుసుకోవడం సావిత్రి అనే అరవింద మహాకావ్యాన్ని కూలంకషంగా అవగాహన చేసుకోడానికి అమూల్య సామగ్రి అని నా అభిప్రాయం. అందులోనూ ముఖ్యంగా కఠోపనిషత్తు అత్యంత ప్రధానము. సావిత్రి నిర్మాణ వాస్తువులో కఠోపనిషత్తు పునాదిరాయి. కఠోపనిషత్తు సంపూర్ణంగా సూటిగా అరవింద దర్శనానికి అతుకుతుంది. బహుశా అరవిందుడు కఠోపనిషత్తునే తన దర్శనా విర్భావానికి వాడుకుని ఉంటాడని లేక ప్రగాఢంగా ప్రభావితుడై ఉంటాడని నా దృఢ అభిప్రాయం.

కఠోపనిషత్తు మృత్యుప్రోక్తమైన నాచికేతోపాఖ్యానము నచికేతుడు మృత్యులోకానికి వెళ్ళి మృత్యుదేవతను మృత్యురహస్యం చెప్పమంటే, ఆయన మూడు వరాలిస్తానని రెండు వరాలిచ్చి మూడో వరమైన ఈ మృత్యురహస్యోద్ఘాటనకు అంగీకరించడు. చూడండి—నచికే:- యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతి చైకే ఏతద్విద్యామనుశిష్టస్త్వయాహం వరాణామేష వరస్తృతీయః (1 వల్లి-20 మంత్రం) మనిషి మరణించిన తర్వాత వాడు ఉన్నాడని ఒక పక్షము వాడు ఇక లేడని ఒక పక్షము ఈ రహస్యానికి చెందిన విద్యను నాకు బోధించు ఇది నా మూడవ వరము (అంటాడు నచికేతుడు) అని అర్థం. దానికి మృత్యువు అంటాడు, "దేవైరత్రాపి విచికిత్సితం పురా నహి సువిజ్ఞేయం అణురేషధర్మః అన్యంవరం నచికేతో వృణీష్వ మామోపరోత్సీరతి మాసృజైనం" దేవతలచేతకూడ ఇది పూర్వం శోధింపబడింది. వారికి కూడా ఈ అస్తి నాస్తి విచికిత్స వశం కాలేదు. ఈ ధర్మము అవిజ్ఞేయము అణువువలె సూక్ష్మము—మరో వరం కోరుకో నచికేతూ! నన్ను బలాత్కరించకు నన్ను దీనిలోనుంచి విడిపించు—అని అర్థం. నచికేతుడు విడవడు— "దేవైరత్రాపి విచికిత్సితం కిల త్వంచ మృత్యోయన్న సు విజ్ఞేయమాత్థ। వక్తాచాస్యత్వాదృగన్యో నలభ్యో నాన్యోవరస్తుల్య ఏతస్య కశ్చిత్ (22). ఈ రహస్యము దేవతల విచికిత్సకు కూడా లొంగలేదు అతి సూక్ష్మము అవిజ్ఞేయము; మరి అట్టి అత్యంత జటిలమైన విద్యను బోధించగల వక్త నీకంటే అన్యుడు లేడు, నేను వరంతో సమానమైన మరొక వరం కూడా లేదు. అప్పుడు మృత్యుదేవత నచికేతుడికి ఎన్నో లోకాలు చూపిస్తాడు. ఈ వరంనుంచి అతణ్ణి విముఖుణ్ణి చెయ్యడానికి. శతాయుష్కులైన పుత్రపౌత్రుల్ని అనేక పశువుల్ని, ఏనుగుల్ని, బంగారాన్ని, అశ్వాల్ని, రథాల్ని, రాజ్యాల్ని ఇలా ఎన్నో ఐశ్వర్యరూప వస్తువుల్ని ఇస్తానని ఈ వరంనుంచి మాత్రం తనని విముక్తుణ్ణి చెయ్యమనీ మృత్యుదేవుడు నచికేతుణ్ణి అడుగుతాడు. కానీ నచికేతుడు నాకు ఈ విద్యోపదేశమే కావాలి ఇంకేమీ వద్దు అని ఖండితంగా చెప్పివేస్తాడు. అప్పుడు మృత్యుదేవత చెపుతాడు. "శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యః శృణ్వంతోపి బహవో యన్న విద్యుః ఆశ్చర్యో కుశలోస్య లబ్ధాశ్చర్యో జ్ఞాతా కుశలాను శిష్టః" అనేకమంది చేత వినడానికి కూడా అలభ్యుడో విన్నవాళ్ళు కూడా చాలామంది దేన్ని తెలుసుకోలేరో దాన్ని బోధించే కుశలుడు దొరకడం ఆశ్చర్యం, బోధిస్తే అర్థం చేసుకునే కుశలుడు దొరకడం ఆశ్చర్యం—"నైషాతర్కేణ మతిరాపనేయా ప్రోక్తాన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ। యాంత్వంఆపః సత్యధృతిర్బతాసి త్వాదృజ్నోభూయాత్ నచికేతః ప్రష్టా" (9) తర్కంచేత ఈ విద్య లభించేది కాదు. అన్యప్రోక్తమైనప్పుడు అన్యప్రోక్తమైనప్పుడే అది సుగ్రాహ్యమవుతున్నది. దాన్ని నీవు ఇప్పుడు పొందావు నీవు దృఢ సంకల్పమున్నవాడివి. నచికేతుడివంటి ప్రష్ట, ప్రశ్నకుడు మాకు దొరుకుగాక అని బ్రహ్మవిద్యోపదేశం ప్రారంభిస్తాడు మృత్యుదేవుడు.

అంటే మరణానంతరం మనిషి ఉన్నాడా లేడా అనే నచికేతుడి ప్రశ్న ఆత్మానాత్మ వివేచన. శరీరం ఆత్మకాదు, అనాత్మ. అనాత్మ నశ్వరం ఆత్మ శాశ్వతం. ఆత్మ ఏమిటి? శరీరోత్పత్తి. శరీరోత్పాదక మూలద్రవ్యాలు ఏమిటి? శరీరోత్పత్తికి కేవలం పంచభూతాలే కాదు కారణం, ఇంకా అనేక చక్షురగోచర ద్రవ్యాలున్నాయి దాని నిర్మాణంలో. అనేక హేతువులున్నాయి దాని ఉత్పత్తికి;

అవన్నీ ఏమిటి? చరాచర వస్తు రూపధారి సృష్టి ఏమిటి? ఇలా అనేక విషయాలు శోధింపబడుతాయి. ఆత్మానాత్మ వివేచనలో. ఉపనిషత్తులు 108. ఇవన్నీ ఒకే కాలంలో పుట్టాయా' అనేక కాలాల్లో పుట్టాయా అనే ప్రశ్నకంటే వీటి సారాంశం తత్త్వాన్వేషికి ముఖ్యం. ఈ ఉపనిషత్తుల సారమంతా భగవద్గీత ఇస్తుంది. భగవద్గీతలో ఎక్కువగా కఠోపనిషద్వాణి వినిపిస్తుంది. కొన్ని ప్రసిద్ధ భగవద్గీత శ్లోకాలు కఠోపనిషత్తులోనివే! ఉదా:- "నజాయతే మ్రియతేవా విపశ్చిన్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్। అజోనిత్యః శాశ్వతోయం పురాణో నహన్యతే హన్యమానే శరీరే" (2వ-18మం) హంతా చేన్మన్యతే హంతుగ్ హతశ్చేన్మన్యతే హతం ఉభౌతౌనవిజానీతో నాయగ్ హంతి నహన్యతే" (19 మం) ఇలాంటివే గాక కఠోపనిషత్తులో అన్యథా ప్రసిద్ధమైన అనేక శ్లోకాలున్నాయి. ఉదా— ఆత్మానం రథినం విద్ధి శరీరగ్ రథమేవతు...", "అణోరణీయాన్ మహతో మహీయాన్ ..", "ఊర్ధ్వమూల మధశ్శాఖం, అశ్వత్థం, ప్రాహురవ్యయం.." ఇలా అనేకం ఉన్నాయి

ఇంకా ముఖ్యం-కఠోపనిషత్తు బ్రహ్మజ్ఞానం ప్రదానం చెయ్యటమే గాక దాని తత్త్వానుభవ సాధన కోసం యోగమార్గం ఉపదేశిస్తుంది. షష్ఠవల్లిలో 10వ మంత్రం- "యదా పంచావతిష్ఠంతే జ్ఞానాని మనసా సహబుద్ధిశ్చ నవిచేష్టతే తామాహుః పరమాంగతిం" జ్ఞానేంద్రియాలు ఐదు మనస్సహితంగా నిశ్చలం అయినప్పుడు బుద్ధి కూడా అప్పుడు విచేష్టితమవగా అదే పరమపదము. ఈ మంత్రార్థాన్ని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి అరవింద యోగాన్ని పోల్చుకో డానికి. ఎందుకంటే ఈ నిశ్చలస్థితినే కఠోపనిషత్తు యోగమంటుంది. "తాం యోగ మితి మన్యంతే స్థిరాం ఇంద్రియ ధారణామ్। అప్రమత్తస్తదా భవతి, యోగోహి ప్రభవాప్యయౌ(11) ఈ మంత్రానికి అర్థాలు భిన్న భిన్నంగా ఉన్నాయి. కానీ శబ్దార్థాల సరళ ప్రవృత్తి చేత తాత్పర్యాన్ని గ్రహించడం సహజ మార్గం— నిరంతరాలోచనాశీలి అయిన మనస్సును జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలి. ధ్యాన సమయంలో నీవు ధ్యానమగ్నుడివై ఉన్నప్పుడు నీకు తెలీకుండానే ఒక దశలో నీ ఆలోచనల చక్రం కూడా నీ ధ్యానంతోపాటు తిరగడం ప్రారంభిస్తుంది. ఈ ఆలోచనా చక్రభ్రమణం నీకు తెలిసేసరికి నీవు మనస్సుచేత వంచితుడివైనావని కూడా నీకు తెలుస్తుంది. పరితాపం కలుగుతుంది. నిజమైన యోగి అప్పుడు మరింత దృఢ సంకల్పంతో యోగాన్ని పునరుద్ధరణ చేస్తాడు. మనస్సును నిగ్రహించడమేనయితే యోగ ప్రక్రియ సారాంశమో అది నిరంతర అభ్యాస వశాన గానీ స్వాధీనం కాదు. ఈ విషయంలో యోగులు పొందిన అనుభవాలే అనేక శబ్దాభివ్యక్తులు పొంది మనకు ఈనాడు ఉపలభ్యమవుతున్నాయి. "సదామోహాటవ్యాంచరతి యువతీ కుచగిరౌ అటత్యాశా...." (శివానందలహరి) ఇత్యాది వచనాలు ఈ విషయాన్నే చెపుతాయి.

10వ మంత్రంలో చెప్పిన ఇంద్రియాది నిగ్రహం అనే ప్రక్రియ అభివృద్ధి పొంది అష్టాంగ యోగంగా రూపొందింది యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణా సమాధులనే అష్టాంగములచేత సాధన చేయబడవలసిన యోగము. ఇందులో అహింస-సత్యము అస్తేయము ఆర్జవము ఇత్యాది దశవిధ యమములు. జపతపోదాన యదృచ్ఛాలాభ లజ్జాది దశవిధనియమములు, యోగానుకూల కాలప్రదేశాహారవిహారాది వివరాలు ఇడా పింగళాది నాడులు, ధౌతి నేతి నౌలీత్యాది షట్క్రియలు, దశవిధ వాయువులు, జాలంధర ఉడ్యాణాది ముద్రలు, సిద్ధాసనాది షడశీత్యాసనములు, ప్రాణాయామ విశేషములు, స్థూల సూక్ష్మ జ్యోతిరాది ధ్యాన విశేషములు, పృథివి అంభసి ఆగ్నేయ వాయవీ ఆకాశ భేద ధారణలు, ధ్యానయోగ నాదయోగ రసానంద యోగ సవికల్ప నిర్వికల్ప వితర్క- విచార ఆనంద అస్మిత ఆది అనేక సమాధి భేదములు, యోగ సాధనలో వికసించాయి. యోగమొక బ్రహ్మాండమైన శాస్త్రమై సాధకులకు ప్రహత మార్గం ఏర్పడింది.

కఠోపనిషత్తు షష్ఠవల్లి 16వ మంత్రంలో మరో యోగ విధానం కూడా చెపుతూంది- "శతంచైకాచ హృదయస్య నాడ్యస్తాసాం మూర్ధానమ తయోర్ధ్వమాయ న్నమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి" నాడీమండల సంబంధమైన యోగము. 101 నాడులున్నాయని అంద ఊర్ధ్వంగా ఉత్క్రమించి మూర్ధమునకు చేరుతుందనీ అప్పుడు అమరత్వం పొందుతాడనీ చెపుతూంది. ఇది కపాల మోక్షం కావచ్చు, అంటే ఫాలము శిరస్సు అగ్రము అని అర్థాలు. ఇక్కడ అగ్రమనే ("అతిష్ఠన్మనుజేంద్రాణాః మూర్ధ్ని దేవపతిర్యథా" అని మహాభారతం) తర్వాత ఈ నాడీమార్గ యోగం పెరిగి గొప్ప శాఖ గొప్ప శాస్త్రము కఠోపనిషత్తులో అవి బీజాలుగా ఉన్నకాలం అది. ఈ పరానాడి మూ నిద్రిస్తున్న సర్పాకార కుండలిని అనీ దాన్ని వాయుధారణారూప చేత నిద్రలేపి స్వాధిష్ఠానాది కమలముల ద్వారా పైపైకి తీసుకుపోయి రమునకు చేర్చి అగ్నివేధ చేసినప్పుడు తత్ఫలితంగా సహస్రారాంత మండలము నుండి అమృతస్రావము కలిగి దేహమందలి ద్విసప్తతి నాడీ తర్పణ కలుగుతోంది అనీ ఈ శాస్త్రం చెపుతుంది. ఈ విధమైన తర్ సుఖప్రాప్తి. వాయుధారణాంతమున కుండలిని యథాప్రకారము చేరి నిద్రిస్తుంది. ఈ యోగమిచ్చే సుఖం భావనచేత సిద్ధించేది కాదు చేతనే సిద్ధిస్తుంది. కనక గౌడపాదాచార్యులవారు కౌళులు క్షణము కనక సమయ మతవాదులైన వైదికులు, మోక్షాపేక్ష కలవారు జ్ఞాన స్వవిచారణమే చెయ్యాలని చెప్పారు. అందుచేతనే కఠోపనిషత్తు "దుర మను ప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠంపురాణం అధ్యాత్మ యోగాధిగ మత్వాధీరో హర్షశోకౌ జహాతి" (2-12) అంటుంది. ఈ విధంగా మృత్యుదేవత వలన బ్రహ్మవిద్యను తత్సాధన యోగవిధానాన్ని పొం ప్రాప్తి మృత్యురహితత్వము పొందాడు. (మృత్యు రహితత్వమంటే చక్రరూప సంసార బంధ విముక్తి)

వ్యాసభారతము కఠోపనిషత్తులకు పూర్వం మృత్యురహస్యాన్వే పుట్టిన ఒక సుప్రసిద్ధ కథ గిల్గమేష్ అనే సుమేకియన్ ఇతిహాసం. ఇ 8000 సం. నాటిది. గిల్గమేష్ అనే దివ్య మానవవీరుడు తన ప్రాణ ఎంకిదో దేవతలచేత వధింపబడగా అత్యంత చింతాగ్రస్తుడై మృత్ తెలుసుకోవాలని బయలుదేరుతాడు. నదులు, పర్వతాలు, అరణ్యాలు, దాటి ఎక్కడో ఒక దీవిలో ఏకాంతంగా నివసిస్తున్న మృత్యువిజే షమష్నపిష్టంను కలుస్తాడు. (షంష్ అంటే సూర్యుడు నపిష్టం న సూర్య సప్త; ఇతడు ప్రళయజలధి చేప సహాయంచేత దాటడం ఇత్యా చేత మన పురాణాల్లో పేర్కొనబడిన మనువు) షమష్నపిష్టం గిల్గమే సంజీవినిలాంటి మొక్కనిస్తాడు. దాన్ని తీసుకుని గిల్గమేష్ వెడుతు స్నానం చేస్తున్న సమయంలో ఆ మొక్కను ఒక పాము తీసు పోతుంది. (ఇక్కడ మన మహాభారత ఉదంకో పాఖ్యానం జ్ఞాపక అలా ఆ సంజీవిని మొక్కను కోల్పోయి గిల్గమేష్ శోకితపుడై దేశ దేవాలయాలన్నీ తిరిగి ప్రార్థించగా ఎంకిదు ప్రేతస్వరూపము అ పిస్తుంది. అతడ్ని గిల్గమేష్ ఎంకిడ్ని మృత్యులోక రహస్యం చెప్పమ నిరాకరిస్తాడు. అది భయంకరం నీవు సహించలేవంటాడు. ఎంత వినడు. చివరకు చెప్పడానికి పూనుకుంటాడు. ఆ తర్వాతనుంచీ ఈ బడిన ఇటుకరాళ్ళు పరిశోధకులకు దొరకలేదు. ఆ దొరకని ఇటుకల్లో లభించకుండా నష్టమైపోయిన ఏ అమూల్య వృత్తాంతముందో! ఈ క అడెస్సీ, ఈనియడ్ ఆది తదనంతర కథలు పుట్టాయని పరిశోధక అభిప్రాయము. డి. ఎమ్. లాంగ్ ప్రొఫెసర్ ఆఫ్ కాకసియన్ స్టడీస్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, యూనివర్శిటీ ఆ గిల్గమేష్‌ను గురించి ఇలా అన్నాడు, "ఎలిమెంట్స్ ఆఫ్ దీజ్ స్టోరీస్ హేవ్ బీన్ డిటెక్టెడ్ ఇన్ ది ఒడిస్సీ, ది ఎనెయిడ్ ఎండ్ అదర్ ఎపిక

సాగాస్ ఆఫ్ ది క్లాసికల్ ఎండ్ ఆల్సో ఆఫ్ ది మెడీవల్ వరల్డ్"- ఆడెస్సీ ఆదులే కాక భారతీయ సావిత్రి నచికేత కథలతో కూడా సంబంధం వుండవచ్చు. గిల్గమేష్ స్నానం చేస్తున్నప్పుడు సర్పం అతడు నేలమీద ఉంచిన సంజీవిని మొక్కను తీసుకుని పారిపోవడం అనే ఉదంతం మన మహాభారత ఉదంకో పాఖ్యానంతో పోలి ఉండడం చేత గిల్గమేష్ మృత్యురహస్య అన్వేషణకు మన సావిత్రి నచికేతుల మృత్యురహస్య అన్వేషణకు సంబంధం ఉందని ఊహించ వచ్చు. ఈ మూడింటిలోనూ మృత్యురహస్యం చెప్పబడకుండా సిరాకరింపబడు తుంది. సావిత్రికి నచికేతోపాఖ్యానాలకి మధ్య పోలికలు చాలా ఉన్నాయి-మృత్యు రహస్య నిరాకరణ, వరాలు, బలాత్కారంమీద మృత్యుదేవత రహస్యం చెప్పడం ఇత్యాదులు

తత్త్వరహస్యదృష్ట్యా అరవిందుడి మహాకావ్యము ఈనాడు గిల్గమేష్ నుంచి డివైన్ కామెడీవరకు లోకంలో వచ్చిన మృత్యు రహస్య అన్వేషణ కావ్యాలన్నిటి తోను కలిపి చదవబడాలి. అప్పుడు అరవింద కావ్య విస్తృతిలో ఉన్న సార్థకత బోధపడుతుంది. అన్యకృతుల్లో లేని విశేషం, 'సమస్త భారతీయ తత్త్వాన్వేషణ పరంపరను అరవిందుడు తన కావ్యనిర్మాణం వాస్తువులో గ్రహించడం. ఒక గొప్ప ఆధ్యాత్మిక సంపదను సమస్తము ఈ కావ్యరూపంలో లోకానికివ్వడం అత్యంత విశిష్టమైన సంఘటన.

20వ శతాబ్దంలో ఇంత మహత్తర ఆధ్యాత్మిక కావ్యం మరొకటి లేక పోవడంచేత ఈ ఒక్క కావ్యమే ఈ శతాబ్దపు శిఖరాల్లాంటి సవాళ్ళలో ఒకటిగా లేచి నిలబడుతుంది. ప్రధానతః మార్క్సిజము అరవింద సావిత్రి రామాయణంలో పరశురామ, శ్రీరాముల్లా కనిపిస్తాయి. ఈ రెంటిని పరస్పర కాంతితో పరిశీలించడమే ఈ శతాబ్దపు తత్త్వచింతకుడి సఫల సార్థక ప్రయాస అవుతుంది. అన్యథా చింతిన అసమగ్రము పాక్షికము అవుతుంది.

వర్తమాన శతాబ్దంలో సావిత్రి వచ్చేనాటికే సాహిత్యక్షేత్రంలో సామాజిక ఆర్థిక రాజకీయ క్షేత్రాల్లో ప్రముఖ సంఘటనలు వచ్చేశాయి. సింబలిజం, అక్టోబర్ రివల్యూషన్. మార్క్స్ సిద్ధాంత ప్రభావం, చింతనలో సైన్సు నిరంకుశత్వం, హేతువాదము, స్టీమరు, విమానము. విద్యుత్ సౌకర్యాలు, ఇవన్నీ మానవీయ జీవపరిణామ పురోగమన రూపమైన స్వాప్నిక జగత్తు పునాదులమీద హేతువాద తార్కిక శతఘ్నులు పేల్చడం ప్రారంభించాయి. మనిషి గాలుల్లోకి పరిమళాలు విడిచే పుష్పంగా ఉండడం మానివేసి వృక్షాల్ని నరికే గండ్రగొడ్డలిగా మారడం ప్రారంభించాడు. ఆహారైక జీవిగా మారి రెక్కలు కోల్పోయిన గంధర్వుడులా భూపతనం పొందాడు. అప్పుడు మనిషికి రెక్కలివ్వడానికి ద్రష్టలు చేసిన యజ్ఞాల్లాంటి ప్రయత్నాల్లో అరవిందకృత సావిత్రి శిఖరాయమాణమైన యజ్ఞము. ప్రపంచవ్యాప్తంగా మేధావుల్లో ఆలోచనా బీజాలు వేసిన మహాయజ్ఞము. సావిత్రి ఒక భాషకు సంబంధించినది కాదు—మూలం ఇంగ్లీషులో ఉన్నప్పటికీ, అందుచేత అన్ని భాషల్లోకి పోయి ఆ భాషది ఆ ప్రజలది కావచ్చును మూలమే ఇంగ్లీషు భాషలో ఉన్న కారణంగా ప్రసిద్ధ ఆంగ్ల విమర్శకుడు ప్రొ. రేమండ్ ఫ్రాంక్ పైపర్ ఇలా అన్నాడు.

"డ్యూరింగ్ ఎ పిరియడ్ ఆఫ్ నియర్లీ 50 యియర్స్ బిఫోర్ హిస్ పాస్సింగ్ ఇన్ 1950, హి క్రియేటెడ్ వాట్ ఈస్ ప్రాబబ్లీ ది గ్రేటెస్ట్ ఎపిక్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్...ఐ వెంచర్ ది జడ్జిమెంట్ దట్ ఇట్ ఈస్ ది మోస్ట్ కాంప్రెహెన్సివ్, ఇంటిగ్రేటెడ్, బ్యూటిఫుల్ అంట్ పెర్ఫెక్ట్ కాస్మిక్ పొయమ్ ఎవర్ కంపోస్డ్. ఇట్... ఇల్యూమినేట్స్ ఎవ్రీ ఇంపార్టెంట్ కార్నర్ ఆఫ్ మాన్ త్రూ వెర్స్ ఆఫ్ అన్‌పార్లల్డ్ మాస్సివ్‌నెస్, మాగ్నిఫిసినెస్ ఎండ్ మెటాఫిసికల్ బ్రిలియన్స్" గ్రేట్ ఎపిక్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజి అనడంచేత ఆంగ్ల సాహిత్య ఐతిహాసిక శిఖరమైన మిల్టన్ అరవిందుడి వెనక్కి పోతాడు, "మోస్ట్ కాంప్రిహెన్సివ్..." వగయిరా అవటంచేత హోమర్, వర్జిల్, దాంతేలు వెనక్కి పోతారు. అరవిందుడు వాల్మీకి వ్యాసులప్రక్క ప్రతిష్ఠితుడవుతాడు.

కనకనే ఇరవయ్యో శతాబ్దపు బౌద్ధిక కాంతిపుంజంలో సావిత్రిని పరిశీలించడం సావిత్రి స్థాన నిర్ణయానికి సావిత్రి ప్రయోజన అవగాహనకు అనివార్యం అవు తుంది. సావిత్రిని కేవలం ఆధ్యాత్మిక జ్ఞానపు హద్దుల్లో పరిశీలించడం ఆంధ్ర పరంపరకు చెందిన మార్గము అనుపయోగకరము. ఇరవయ్యో శతాబ్దపు మానవుడికి సావిత్రి ఏం చేస్తుంది అనే ప్రశ్నకు జవాబు ఇరవయ్యో శతాబ్దపు జీవన కల్లోలపు లోతుల్లో ఉంది. కనక సావిత్రిలోకి అనేక అడుగు లోతుల్లోకి దిగి అన్వేషించాలి. దాన్ని వర్తమాన జీవన సమస్యలతో బౌద్ధిక యుగీన సవాళ్ళతో జోడించాలి. అన్యథా దాని సాధారణ పరిశీలన వ్యర్థము.

మనిషి ఆదిమ కాలంనుంచీ ఒకవైపు భౌతిక సుఖము కోసము మరొకవైపు ఆధ్యాత్మిక సుఖం కోసమూ సమానంగా కృషిచేస్తూ రావడం మనకు చరిత్రలో కనిపిస్తుంది. ఇది సహజం కూడా. అయితే ఆధ్యాత్మిక సుఖప్రాప్తి కోసం చేసిన కృషి అవిచ్ఛిన్నంగా పురోగమిస్తూ వచ్చింది. కానీ భౌతిక సుఖం కోసం చేసిన కృషిగానీ చింతనగానీ నిరంతరం కుంఠితం అవుతూ వచ్చింది. వేదాంతాది తాత్త్విక చింతనా రూపమైన ఆధ్యాత్మిక సుఖవివేచన తత్తత్కాలీన ప్రభుత్వాలకు ఏ విధమైన ప్రమాదాన్నీ కలిగించలేక పోయింది. కనీసం ఆనాటి రాజులు యోగుల్ని వేదాంతుల్ని తమకు ప్రమాదం కలిగించే వాళ్ళుగా భావించే అవ కాశాలు ఆ యోగులు కలిగించలేదు. కలిగించి ఉంటే తత్త్వవిచారం కూడా భౌతిక సుఖప్రాప్తి విచారంలాగే కుంఠితం అయిఉండేది. వాస్తవంగా, యోగులూ తత్త్వచింతకులూ ప్రభుత్వానికి ప్రమాదం తెస్తున్నారని తోచినప్పుడల్లా ప్రభుత్వం వాళ్ళని అణచివేసింది. జీసస క్రైస్తు శిలువ, భక్త రామదాసు, పోతన మహాకవి, బసవేశ్వరుడు ఇత్యాది మహా పురుషుల జీవితాలు, ప్రభుత్వాలు ప్రజాపీడకుల సంఘటిత రూపశక్తులనీ, ఆ పీడనకు ఏ రూపంలోనైనా విఘ్నం కలిగించేవాడు తలయెత్తితే వాడ్ని ఆ ప్రభుత్వాలు నిర్మూలించడానికి వెనకాడలేదని మనకు విశదం చేస్తాయి. అన్యయోగులు తత్త్వచింతకులు ప్రమాదం కాదని రాజులు భావించినప్పుడు వాళ్ళని రాజులు పూజించారు కూడా భౌతిక సుఖప్రాప్తి వివేచన మాత్రం పీడకవర్గాల ప్రభుత్వాలకు ఎప్పుడూ నిర్ద్వంద్వంగా ప్రమాదం కలిగించేదే కనక దాని పురోగమనం అతి అలస్యంగా దృశ్యాదృశ్య మాత్రంగా అస్తినాస్తిగా నడుస్తూ వచ్చింది కానీ, ఆధ్యాత్మిక తత్త్వచింతన మాత్రం అవిచ్ఛిన్నంగా అతి జోరుగా గడిచింది.

ఆధ్యాత్మిక జీవనాన్ని గురించి లోకం ఇప్పటికే అసంఖ్యాక విషయాలు ఆలోచించి చర్చించి తర్కించి వాదోపవాదాలు జరిపి తపస్సు చేసి ఆ వ్యాయామాలలో అలిసిపోయింది. అందుచేత ఇప్పుడు కొత్తగా చెప్పగలిగిందేమీ లేదు. ఇప్పటికి చెప్పబడినవాటిలో పౌనఃపున్యం ప్రవేశించింది. ఉక్తి చమత్కారం చేతనో లేక వాద చమత్కారం చేతనో నూతన మతాలుగా, సిద్ధాంతాలుగా కొన్ని కనిపిస్తాయి గానీ అన్యథా అవి తత్పూర్వం ఉన్నవే. సార్త్రే ప్రతిపా దించిన అత్యాధునిక చింతన అనబడే ఎగ్జిస్టెన్షియలిజం న్యాయవైశేషిక సాంఖ్య విశిష్టాద్వైతాది సూక్ష్మసూక్ష్మతర సూక్ష్మతమ భిన్న భిన్నమతాల్లో ఎక్కడో ఒక పోగులా కనిపిస్తుంది. క్యాంటు చెప్పిన ది థింగ్ ఇన్ ఇట్సెల్ఫ్ బ్రహ్మసత్యం జగన్మిథ్య లేక రజ్జు సర్పభ్రాంతి అన్న వేదాంతవిషయమే. ఇలా పరిశీలిస్తూ పోతే ఆధ్యాత్మిక చింతనలో ఈనాటి లోకం కొత్తగా చెప్పడానికి మిగిలిందేమీ లేదు. ఎన్నో శతాబ్దాల క్రితమే చరమవాక్యం చెబ్బబడింది.

కానీ భౌతిక జీవనానికి సంబంధించిన పరిష్కారమేమిటి, అన్న ప్రశ్న మీద అలా అవిచ్ఛిన్న ధారావాహిక చర్చ జరగలేదు. కనకనే ఈ శతాబ్దిలోనే మొదటిసారిగా మార్క్సిజం దానికి అంతిమ సమాధానంగా రూపొందింది. పైగా ఆ సిద్ధాంతం అందుచేత అపూర్వము నూతనము - అది యుగయుగాల భౌతిక జీవన చింతనా పరిణామ ఫలితమే కావచ్చు. కాని అది సైద్ధాంతికంగా అంతిమ వాక్యం. ఆచరణకు సంబంధించిన స్వల్ప మార్పులు కూర్పులు రాగలవేగానీ మూలతః సిద్ధాంతం మాత్రం శాశ్వతం, ఎలా వేదాంత దర్శన సిద్ధాంతం

శాశ్వతమో....మార్క్సిస్టు వాదులు అనుకునే భావ వాద విరోధం భ్రాంతి మాత్రమే; భావవాదం ఆధ్యాత్మిక సత్యమైతే భౌతికవాదం వ్యావహారిక సత్యం. కనక వాటిమధ్య పరస్పర వైరుధ్యం లేదు. రజ్జు సర్పభ్రాంతి చెప్పిన శంకరుడే మాయ అనే వ్యావహారిక సత్యం అంగీకరింపబడాలని కూడా అంటాడు. రెండు ఉన్నాయి అన్నాడు. చాలా సూక్ష్మ విషయాలు-తర్కానికంటే తపస్సుకే లొంగేవి. కనక 21వ శతాబ్దం మార్క్సిజం కంటే కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుందనుకునే అవకాశం లేదు. ఆధ్యాత్మిక చింతనాక్షేత్రం కొన్ని శతాబ్దాల క్రితం ఏ అంతిమదశ చేరిందో భౌతికచింతనా క్షేత్రం 20వ శతాబ్దంలో అలాంటి దశ చేరింది.

ఈనాటి జ్ఞాని ప్రాచీన జ్ఞాని కాదు. ప్రాచీనజ్ఞాని అసంపూర్ణజ్ఞాని లేక అర్థజ్ఞాని. ఈనాడు భౌతికవాద భావవాద సమన్వయం సాధించి సంపూర్ణ జీవన సుఖాన్ని దర్శించే సమగ్రజ్ఞాని రూపొందుతున్నాడు. రస్సెల్ షా, సార్త్రె, రూసో, వోల్టేర్, నీట్షే, కామూ, హెయిడెగ్గర్, ఫాయర్‌బాక్ హెగెల్, మార్క్స్, ప్రభృతి ఆధునిక జ్ఞానులు వర్తమాన మానవ చైతన్యాన్ని, అత్యాధునిక మానవ బౌద్ధికతని జీవన దర్శనాన్ని ప్రతిబింబిస్తారు. ఈ శ్రేణిలో తన సావిత్రిచేత విశిష్ట స్థానం గడించుకున్నవాడు అరవిందుడు. ఈ శతాబ్దంలోనే మొదటిసారి భావవాద భౌతికవాద అంతిమ స్వరూపాలు మానవుడి ముందున్నాయి. ఈ శతాబ్దంలోనే మానవుడు ఈ రెండూ జీవనసౌఖ్యానికి సమానంగా అవసరం అనే సత్యం గుర్తించే అవకాశం కలిగింది. కనక సావిత్రి ఈ అద్భుత ఆధునిక సన్నివేశంలో పెట్టి పరిశీలింపబడాలి. ఈ శతాబ్దం ఇచ్చిన సావిత్రి, దాస్‌క్యాపిటల్ అనే రెండు గ్రంథాలు కలిపి ఒకే గ్రంథం చెయ్యబడాలి.

మార్క్సిజం ద్వారా సమాజంలో విప్లవం సాధించి సోషలిస్టు వ్యవస్థ స్థాపించి ఆర్థిక రాజకీయ సమానత మానవుడు అనుభవిస్తున్నప్పుడు ఇక అధ్యాత్మ జీవనచింత ఎందుకు అది ఎట్లా అవసరం అవుతుంది అనేదే ఈ శతాబ్దపు నిజమైన బౌద్ధిక ప్రశ్న. ఇంతవరకూ ఈ ప్రశ్న ఆసన్నం కాలేదు ఇప్పుడు అయింది. నిజమైన స్వేచ్ఛాయుత ఆధ్యాత్మిక చింతన సోషలిస్టు సమాజంలోనే ఉద్భవించగలదు. కారణం అంతవరకూ వర్గకలహాలు సృష్టించే సామాజిక కల్లోలంలో మానవీయ చింతన కుంఠితమై తత్కాలీన రాజకీయ సామాజిక ఒత్తిళ్ళకు లొంగిపోయే అవకాశాలు పరిస్థితులు ఎక్కువ వున్నాయి. కనక అసోషలిస్టు సమాజ అధ్యాత్మిక చింతన వెనకే చూపించబడినట్లు అక్కడక్కడ దూషితమై ఉంది. సోషలిస్టు సమాజపు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఆధ్యాత్మిక చింతన పరిసరాల ఒత్తిళ్ళు లేని స్వతంత్ర వాతావరణంలో జరుగుతుంది. ఈ మాట సైద్ధాంతిక పరంగా వేస్తున్న అంచనా; కానీ సామాజిక వాస్తవాలు అంచనాల్ని తారుమారు చేస్తుంటాయి. కానీ సైద్ధాంతిక ఆలోచన మానవ కార్యానికి నిర్దుష్టమైన పునాది.

భౌతిక జీవన దుఃఖం మూడు వంతులకు పైగా లోకపు అస్తవ్యస్త ఆర్థికవ్యవస్థ చేత లోకానికి జన్మతః కలిగిన ఒక వ్యాధి. దాన్ని నివారించడానికి చికిత్సా విధానం యుగయుగాల నుంచీ చినుకుగా ప్రారంభించి మార్క్సిజం అనే కుంభవృష్టిగా మారింది ఈ శతాబ్దంలోనే-ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన సాధనంగా పరిగణింపబడిన సమాధి ఈ శతాబ్దంలో అధిభౌతిక జీవనానికి కూడా చికిత్సా విధానం గుర్తింపబడుతోంది. మరణానంతర జీవన రహస్యాన్వేషణ కోసం బ్రహ్మజ్ఞాన సాధనకోసం సమాధి పూర్వకాలం వాడుకోబడితే, ఈనాడు అనేక అసమానతలతోజటిలమైన సమాజం విధించే భౌతిక జీవనక్లేశాల మూలంగా కలిగే శైథిల్యంనుంచి మనిషి తనను తాను రక్షించుకోడానికి సమాధి ఏకైక అమూల్య చికిత్స అని లోకమంతటా క్రమంగా గుర్తింపబడుతోంది. నాస్తిక వాదానికి కేంద్రాలైన రష్యాలాంటి దేశాల్లో కూడా యోగసమాధి జనవ్యాప్తంగా సాధన చేస్తున్నారు. జీవనక్లేశ పీడితుడైనవాడికి జీవితాన్ని ఎదుర్కోడానికి యోగం కావాలి. యోగం జీవితంనుంచి పారిపోయే మార్గం కాదు. జీవితాన్ని ఎదుర్కోడానికి యోగం గాండీవం - కాదు; మార్క్సిజం అని ఎవరన్నా అంటే అది అవివేకం.

కారణం - మార్క్సిజం సమాజ అసమానతల్ని కూల్చివేసి
లోకాన్ని నిర్మించేవరకూ ఈ క్లిష్ట జీవనం మనకు తప్పదు. న్యాయలో
వాస్తవ రూపం దర్శించడానికి ఎన్ని ఏళ్ళు ఎన్ని శతాబ్దాలు పడతా
వరకూ మానవుడు నిస్సహాయుడుగా ఎందుకుండాలి? జీవనక్లేశాల దం
ఎందుకు గురికావాలి? అంతేకాదు, కమ్యూనిస్టు సమాజం వచ్చిన తర్వా
మానవుడి సమస్య శాశ్వతంగా పరిష్కారమయిందనుకోడానికి
శతాబ్దంలో కమ్యూనిస్టు దేశాలుగా మారిన రష్యా చైనాల్లో మన
విప్లవాన్ని సాధించిన తరం పోయి విప్లవానంతర తరం వచ్చేసరికి
ఎలా విప్లవపూర్వ దశకు తిరోగమించడానికి పరిక్రమిస్తుందో చూస్తే,
ఏదీ శాశ్వతం కాదు. అలాగే మానవుడి విజయాలు కూడా శాశ్వత
మానవ సుఖం తరతరాన నిత్యనూతన కృషిచేత స్థాపింపబడవలసిన
తాత్త్విక సారాంశం సాక్షాత్కరిస్తుంది. ఒక తరం ఒక పరమార్థాన్ని
డానికి ఒక శతాబ్దపు కృషి అవసరం అవుతుంది; ఆ తరం పోగానే
మార్థం కూడా పోతుంది. అది నూతన తరానికి పాతదవుతుంది. పసం
కనక దాన్ని విడిచిపెట్టేస్తారు. వాళ్ళు పీడితులవుతారు. తప్పిద ఫలిత
స్వీయానుభవం ద్వారా ప్రయాణం చేస్తూ వాళ్ళు మళ్ళీ కృషి చేస్తార
చేస్తారు, వాళ్ళ మోక్షాన్ని వాళ్ళు సృష్టించుకుంటారు. కానీ వాళ్ళ
తర్వాత వాళ్ళు సాధించిన మోక్షం తదనంతర తరానికి మళ్ళీ పాతద
ముసలివాసన వేస్తుంది. ఇలా మనిషి తన నిరంతర భూమండల ప్ర
ఎప్పటికప్పుడే తన సుఖాన్ని తన కృషితో తాను సృష్టించుకుంటూ
దానికోసం దుఃఖరూపక్లేశం అనుభవించాలి. ఇలా సుఖదుఃఖాల శాశ్వ
మానవజీవనం. మానవుడు న్యాయం అనుకునేది వాడినుంచి శాశ్వత
కోరే బ్రహ్మరాక్షసి! కనకనే తరతరాలుగా మారుతూ వచ్చే
సిద్ధాంతాన్ని గురించి "నా దేశం నా ప్రజలు" ఇలా అంటుంది.

"ఓహో! ప్రతి యుగమూ ఒక వెర్రి ఆకాంక్ష కోసం ఆకలితో అరుస్తూ వుంటుంది; ప్రతి యుగమూ ఒక మూర్ఖసిద్ధాంతపు ఫరిపాలన్ని ఆహ్వానిస్తుంది. దాని సార్వభౌమత్వానికి హృదయపూర్వకంగా లొంగుతుంది; బౌద్ధికశక్తి మాత్రం అనుమానంతో చూస్తూ ఉంటుంది మరో యుగపు గుడ్లు పొదుగుతూ" (8వసర్గ అంతంలో) కవి భవిష్యత్తరాలన్నిటినీ చూస్తాడు. రాజకీయవాది తన తరాన్ని మాత్రమే చూస్తాడు. ఈ సముద్రమంతటి భేదం ఇద్దరిమధ్య ఉంది.

అందుచేత క్రాంతదర్శి అయిన కవి చెపుతాడు ఆధునిక మానవునికి మార్క్సిజం కావాలి యోగం కావాలి విజయసాధనకు ఆత్మపరాక్రమ రక్షణకు. గాంధీ లెనిన్ ఆది ప్రజాసమూహాల్ని గురుతర లక్ష్యాలవైపు నడిపించిన మహాపురుషులు జ్ఞాత అజ్ఞాత మనస్థితుల్లో యోగదశ అనుభవించినవాళ్లే. వాళ్ళ జీవన విజయాలే దీనికి నిదర్శనాలు. వాళ్ళు యోగరహితులైతే పరాజితులయ్యేవారు. యోగం ఏకాగ్రత!

భారతదేశంలో వున్న 108 ఉపనిషత్తుల్లో అగ్రగణ్యమైన ఈశావాస్యోపనిషత్తు అందరూ అధ్యయనం చెయ్యడం ముఖ్యం. కర్మలు చేస్తూనే మనిషి నూరేళ్లు జీవించడం కోరుకోవాలని బోధిస్తుంది ఆ ఉపనిషత్తు—"కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేత్ శతం సమాః"- ఈ విధంగా మానవుడు జీవన సంఘర్షతత్పరుడయితే సుఖప్రాప్తి ఎలా కలుగుతుంది అనే ప్రశ్నకు ఆ ఉపనిషత్తు చెపుతుంది. "అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్య యామృత మశ్నుతే"—అవిద్యచేత మృత్యువును పరించి విద్యచేత అమృతత్వాన్ని మానవుడు పొందుతాడు అని చెపుతుంది. అవిద్యచేత మృత్యువును వరించడమెలా? నీళ్ళలో పడ్డవాడు ఆ నీళ్ళ సహాయంతోనే ఈది గట్టుకు చేరవలసినట్లు అవిద్య అనే సంసారంలో పడ్డవాడు సంసారంలో ఉంటూనే దాని సహాయంతోనే గట్టుకు చేరాలి; అదే మృత్యువిజయం ఉపనిషత్తు ప్రకారం, జలత్యాగం చేసినవాడు ఎలా ఈదలేడో కనక గట్టు చేరలేడో, అలాగే సంసార త్యాగం చేసినవాడు దరిచేరలేడు.

మార్క్సిజము యోగము పరస్పర విరుద్ధము అనుకొనేవాళ్ళు ఉభయ స్కంధావారాల్లోనూ ఉన్నారు. విశ్వాసం ఉన్నవాళ్ళకంటే మూఢ విశ్వాసం ఉన్నవాళ్ళు ఎక్కువమంది. విశ్వాసంలో బలముంది మూఢ విశ్వాసంలో అజ్ఞానముంది. విశ్వాసం నడపలేని బలహీన మానవుడికి చేతికర్ర; మూఢ విశ్వాసం కసాయివాడు కబేలాకు తీసుకుపోతున్న మేక హేతువాదులమని ఉద్ఘోషించే వాళ్ల ఎక్కువమంది ఈ రెండవ తరగతివాళ్లు. ఎవడూ తర్కబద్ధ జీవనం జీవించలేడు. హేతువాది కూడా. ఈ అసాధ్యత మానవ నిర్మాణంలోనే ఉంది. మనిషి హేతువాదాన్ని మందులా తగు మోతాదులోనే పుచ్చుకోగలడు, షడ్రసోపేత భోజనంగా భావించలేడు. ఈ అనుల్లంఘనీయ సత్యాన్ని మూర్ఖుడే గ్రహించడు.


మార్క్సిజము యోగము సులభగ్రాహ్యం కాని క్లిష్ట విషయములు. ఈ రెంటిని గురించీ మాకు తెలుసునంటే మాకు తెలుసు అని పోటీ పడ్డవారు చాలామంది; ఒక అడుగు ముందుకు వెళ్ళి మాకే తెలుసు మీకు తెలీదు అని కూడా అంటారు. ఈ లక్షణం తెలుగుదేశంలో ఎక్కువ, అందులోనూ రాజకీయ సాహిత్యవాదుల్లో తెలీదనేవాళ్ళు అల్పసంఖ్యాకులు. తెలీదనే వాళ్ళ మాటలోనే ఎక్కువ సత్యం లభిస్తుంది. మార్క్సిజాన్ని గురించే కాదు యోగాన్ని గురించి కూడా సాధారణంగా ఇదే పరిస్థితి నిర్దుష్టమైన సత్యనిష్ఠమైన చింతన అరుదు.

భౌతికవాదం ఆకాశం ఎత్తుకు లేచి ద్వంద్వాత్మకం చేసిన ఈ శతాబ్దంలో ఆ ఎత్తుకు భావవాదాల్ని లేపి రెండు శిఖరాల్ని మన దృష్టికి తీసుకువచ్చి వాటి సమన్వయంలోనే మానవ ముక్తి ఉందనే బిందువుకు మనల్ని తీసుకు వెడుతుంది సావిత్రి. సావిత్రి పాత్ర ఇది. ఈ పాత్రని ఒక కావ్యమే నిర్వహించగలదు గానీ ఎలాంటి తాత్త్విక సిద్ధాంత ప్రతిపాదక గ్రంథమూ నిర్వహించలేదు. బహురూపి, క్లిష్టశిల్ప గర్భిత అయిన జీవనలీల తార్కికబుద్ధికి చిక్కదు. యాతాయాత సుఖదుఃఖ పరంపరలచేత విశ్లథుడైన జీవికి ఉపశమనదాయి అయిన ఉపాయం కావాలి. కనక అతడికి హేతువాదం ఒక మేధావుల కేళిగా కనిపిస్తుంది. దేవీ భాగవతం హేతువాద నిర్మితమైన న్యాయశాస్త్రాన్ని చీకటిశాస్త్రం అని వర్ణిస్తుంది. "సాత్త్వికం తత్ర వేదాంతం మీమాంసా రాజసమ్మితం తామసం న్యాయశాస్త్రం చ హేతువాదాభి యంత్రితం"(ప్రథమాధ్యాయం) కనక ఈ సందర్భంలో శాస్త్రం కంటే కావ్యమే ఉత్కృష్టము.

సావిత్రిలో ఉన్న ఆధ్యాత్మిక సామగ్రి ఆడెస్సీలోగానీ ఈలియడ్‌లోగానీ డివైన్ కామెడీలోగానీ లేదు; ఇంత ఐంద్రజాలిక కావ్యములో కూడా లేదు. ఆడెస్సీ ఆదులు కేవలం కథన ప్రధాన కావ్యాలు. కానీ సావిత్రి పాఠకుడ్ని మోహావేశ వివశుడ్ని చేసే అలంకార బింబ ప్రతీకాత్మక ఇంద్రజాలంతో అల్లిన ఒక స్వాప్నిక రచన ఒక లీలామయ శబ్ద వాస్తువు. అరవిందుడు యోగి కావడంచేత ఈ కావ్యం కావ్యతలో పరాకాష్ఠ పొందింది. అయోగులు అర్థయోగులు అయిన లౌకిక కవులు ఈ మూర్ఛావహ మాయను ఉత్పాన చెయ్యలేరు.

వర్తమాన సమాజంలో జీర్ణమై చూర్ణమై రాజీతత్త్వోన్ముఖుడై నీతి జారవిడిచి జీవితంనుంచి పలాయితుడవుతున్న మానవుడిలో యోగం ఆత్మ విశ్వాసాన్ని ఉద్ధరించి నైతిక శౌర్యం ఉత్పాదన చేసి జీవన సంగ్రామ క్షేత్రంలోంచి పారిపోనీకుండా నిలబెడుతుంది. నైతిక పతితులు భీరువులు పలాయనోన్ముఖులు అయిన మానవులు విప్లవాన్ని ఎలా తీసుకురాగలుగుతారు? నూతన సమాజ నిర్మాణానికి ఎలా అర్హులవుతారు? కనక వ్యక్తిని ముందు మరమ్మత్తు చేసి నిలబెట్టాలి. వ్యక్తిని ఎప్పుడూ మరమ్మత్తు చెయ్యలేడు.' వాడ్ని వాడే చేసుకోవాలి. పరివర్తన అంతర్గతంగా రావాలి. అంతర్గత పరివర్తనకు మనిషిని మనిషే పరిశోధించుకోవాలి. మనిషిలోకి మనిషే వెళ్ళాలి. తనలోకి తాను వెళ్ళి శోధించుకునే విద్యే యోగం—దానికి అభిముఖంగా మనిషిని మార్చే దోహద ప్రక్రియ సావిత్రి.

నా విక్షిప్తమైన మానవ జీవయాత్రాచింతనని అరవిందచ్ఛాయల్లో సమీక్షించుకునే అవకాశం కలిగించిన భారతికి నా కృతజ్ఞత. **(అయిపోయింది)**





ప్రారంభోత్సవం

మూలం: శ్రీమతి నందినీ శతప

తెనుగుసేత: శ్రీ బాసంగి శ్రీరాము



ఈ రోజు ముగియకుండా వుంటే ఎంత బాగుండేది! కాలం దగ్గర పడుతున్నకొద్దీ పుణా మనస్సులో ఆతురత, అనుమానాలు పెరుగుతున్నాయి. ఇంటిలో కొద్ది సామాన్లు - మట్టికుండలు చిన్నవీ పెద్దవీ - మాత్రమే వున్నాయి. ఆ కుండలో కొద్దిగా ఊరగాయ, చోళ్ళు (రాగులు), నూకలు మాత్రమే వున్నాయి. ఆమె యింటిగోడలకున్న ఊచల మీద పాత్రల మర్చుకొనే బల్లొకటుంది. మరొకసారి బల్ల మీద సామాన్ల నమర్చి, ఆ అమరిక సరిగా వుందో లేదో యని పరిశీలనగా చూసిందామె. ఆ ఏర్పాటామెను తృప్తి పరచ సందున, ఆ సామాన్లను మరొక క్రమంలో పెట్టింది.

ఆరోజామె చాలా వేగమే నిద్రనుండిలేచి ఇంటిని పరిశుభ్రం చేసింది. తనగదిలోని నేలపై తెల్లని ముగ్గులను వేసింది. సనియా తనకు మిగిల్చింది ఈగదొక్కటి మాత్రమే.

సనియా జ్ఞాపకాలామె మనస్సును వరదలా ముంచెత్త సాగాయి. వాళ్ళ నాలుగేళ్ళ వివాహ జీవితం — రాత్రి వచ్చే కలలా తొందరగా గడచిపోయింది. ఎన్నో కోరికలతో, ఎన్నో కష్టాలతో చివరకు రోజుకోసారి, యిద్దరూ భోజనం లేకుండా గడపవలసి వచ్చినప్పటికి, సనియా పెదవులపై చెరగని చిరునవ్వు మాత్రమే వుండేది. సనియా రోజువారీ సంపాదన ఎనిమిదణాల కూలిడబ్బులు మాత్రమే ఆరోగ్యవంతుడైన సనియా కొద్ది కాలంలోనే అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్రమైన జబ్బుతో రక్తాన్ని కక్కుకుంటూ వుండేవాడు. మూడు నెలలలోనే ఆ వ్యాధి అతని ప్రాణాన్ని హరించింది. మందులుగాని, సరియైన ఆహారంగాని లేక పోవడమే దానికి కారణం.

పుణా, తాను కూడబెట్టిన సొమ్మును గూర్చి గుర్తు తెచ్చు
రెండు రూపాయలామె సంపాదిస్తుండేది. ఇప్పటికి తాను
ఆదా చేయ గలిగింది. ఒక మహిళ తనను కలసి తన చేత, త
పొదుపు ఖాతా నొక దానిని తెరిపించింది. ప్రతి నెలా తా
వెళ్ళి తన ఖాతాలో కొంత సొమ్ము జమ చేస్తుంది. సనియా
తానాదా చేసిన సొమ్ముతో యిద్దరూ హాయిగా కాలం గడిపే
వైద్య సహాయంతోపాటు, ఉచితంగా మందులను కూడ పుణా
తోంది.

సుతే భర్త రఘువాను కంపెనీవారు పెద్దాసుపత్రి కొకరోజ
రఘు నాకు, మందులు, సరియైన భోజన ఏర్పాట్లకోసం, కం
తగినంత డబ్బును యిచ్చారు. జబ్బు నయమై రఘు నా
వస్తాడని ఎవరూ అనుకోలేదు. కాని నాలుగు మాసాలలోనే
వచ్చి పనిలో చేరాడు. ఇప్పుడాయన పూర్తి ఆరోగ్యాన్ని పొం
హృదయాన్ని గాఢనిట్టూర్పొకటి ఛేదించింది.

"ఓహో! నీయింటిలో కొన్ని ముగ్గులు వేశావే—" ఒ
మాటలతో పుణా తుళ్ళి పడింది. కొంత సేపటి నుండి క
లామె వెనుక నిలబడివున్నారు. పుణా వేసిన ముగ్గును వా
చూస్తున్నారు. కొద్దిగా ఆలోచించి, ఒక పెద్ద ఆనకట్ట బొ
వేసింది. ఒకనదిపై ఆనకట్ట నిర్మింపబడి, విద్యుచ్ఛక్తి కూడ
సరఫరా చేయబడుతుంది. ఎన్నో పట్టణాలు, గ్రామాలలో విదు
ప్రసరిస్తుంది. గ్రామాల చుట్టూ అనేక కర్మాగారాలు ఏర్పడ

గ్రామంలో ఒక పాఠశాల వైద్యశాల కూడ ఏర్పడతాయి. చిన్న పిల్లలు చదువు కోడానికిపాఠశాలకు బారులు తీరి వెళతారు. పుణా మెదడుకు వచ్చిన రంగుల ఆలోచనతో, తన యింటి నేలపై యీ అద్భుతమైన బొమ్మను వేసింది.

ఆ బొమ్మవైపే వచ్చిన పెద్దలందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు, పుణా కూడా దానినే చూస్తున్నది. పుణా యివన్నీ నిజంగా ఎలా ఆలోచించ గలిగింది ! తన సృష్టకితానే విస్తుపోతోంది.

"ఇంటి ముందు తోటను చూపలేదేమి !" నవ్వుతూ అడిగాడొక పెద్ద మనిషి.

"తోట చూపేదాన్నేగాని, దానికి స్థలమేది ? దానికి బదులు పెద్ద పార్కొకటి వేసాను. పిల్లలంతా సంతోషంగా ఆ పార్కులో ఆడుకోవచ్చును" సిగ్గు పడుతూ బదులు పలికింది పుణా.

నిజానికి పట్టణ మధ్యస్థలంలో పెద్ద పార్కొకటి చూపించబడింది. అందులో ఒక ఉయ్యాల, జారుడుబల్ల, రంగులరాట్నం మొదలైన సౌకర్యాలు, సందడిగా పిల్లలాడుకోడానికి వీలు కలిగిస్తున్నాయి. ప్రతి చోట విద్యుత్ దీప స్తంభమొకటుంది.

"నిజంగా యిదొక చక్కని పట్టణ ప్రణాళిక" అన్నాడొక పెద్ద మనిషి.

"సర్వవిధాలా సత్యం. ఎందరు గొప్పయింజనీర్లు యిలాంటి గ్రామస్థులలో దాగి వున్నారో ఎవరికి తెలుసును ? అన్నాడు కార్మిక నాయకుడు సంతోష్‌బాబు.

పుణా యీ మాటలను గ్రహించలేదు. తన యింటిలో వారంతా నిలబడి వుండడమామెను ఎంతగానో బాధించింది. వచ్చిన అతిథులు కూర్చొనేందుకు నేల మీద పరచడానికి, తన వద్ద చాపొకటి, తప్ప, యింకేమీలేదు! ఆమె భావాలను గ్రహించిన సంతోష్‌బాబు "నీవేమీ కంగారు పడవద్దు నీతో ఒక విషయాన్ని చెప్పడానికి వచ్చాం. ఇప్పుడే వెళ్ళిపోతాం" అన్నాడు.

రెండవ శ్రేణి, మూడవశ్రేణికి చెందిన పెద్ద ఉద్యోగులయిన వీరందరికి పుణా తో ఏమిపని? ఆశ్చర్యంలో పుణా కండ్లు విశాలం కాసాగాయి. ఇటు వంటి రోజున, వారి వారి ఇళ్ళను. అలంకరించుకోకుండా, యీ పెద్దలంతా పుణా యింటి ముందు నిలవటానికి కారణమేమిటో !


ఆ జలవిద్యుత్ పథకానికి పెద్ద ఉద్యోగైన ముఖ్య యింజనీరు యిలా అన్నాడు — "ఆనకట్టకు ప్రారంభోత్సవం నేడే అని నీకు తెలుసు. మన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను దీనికి ఆహ్వానించాం."

"ఆయన రానన్నారా?" అని భయంతో పుణా అడిగింది. ఆమె ముఖం నల్లగా మారింది. ఈ ఏర్పాట్లు అలంకరణలన్నీ వృథా కావలసిందేనా ?

సంతోష్‌బాబునవ్వేడు "కాదు. ఆయన తప్పకుండా వస్తారు కాని యీ పథకం విజయవంతం చేయడంలో తమ చెమటని, రక్తాన్ని ధారపోసిన వారిలో ఒకరు యీ వుత్సవాన్ని ప్రారంభించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుతున్నారు. ఈ పథకంలో మొదటినుండీ నీవు పని చేసావు. దీనిని నీవే యీ రోజు ప్రారంభించాలి"

స్వర్గం నుండి క్రిందకు పడిపోతున్నానేమోనని పించింది పుణాకు. తాను చూసిన లేక విన్న ప్రతిచోట ప్రారంభోత్సవాలు మంత్రులే చేసారు. ఈ రోజేమిటీ క్రొత్త విషయం!

అనేక సంగీతధ్వనులు. నినాదాల మధ్య నెహ్రూగారిపక్కన పుణాను నిలువబెట్టినపుడు, తనవునికినే నిజంగా మరచి పోయిందామె. ప్రజలముఖాలన్ని క్రమంగా కనుమరుగై, ప్రతి ఒక్కరి చూపు ఒకేముఖంపై నిలిచింది. ఆముఖంనిండా ఆనందం, ఆశీస్సులే వున్నాయి. 'నెహ్రూగారికి జిందాబాద్' ! వినిపించే నినాదమిదే— మరే యితర ఆలోచనలేదు. అంతా శూన్యమే. ఆమె ఏంచెయ్యబోతోందో ఆమెకే తెలియడం లేదు. తనవైపుగా చాపబడుతున్న చేతికి దగ్గరౌతోందామైన ఆ అందమైనముఖం వైపామె కనురెప్పలెయ్య కుండా చూస్తోంది. అందమైన ఆముఖం వెనుకగా, ఎన్నోముఖాలు సనియా ముఖంతోపాటు, సోదరులు మధు, బజాలముఖాలు, మరింకెందరివో ముఖాలు పుణా విజయానికి— భవిష్యత్తువైపు చిగురిస్తున్న ఆశలకు— ఆనందాన్ని ప్రకటిస్తున్నాయి. పుణా వణికిపోతూ, భూమి వైపు తలాడిస్తోంది.



శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

సదర్ షాపూర్ శిలాశాసనము పునఃపరిశీల

నల్లగొండజిల్లా మోతుకూరు తాలూకాలోని సదర్‌షాపూర్ గ్రామము వద్ద నున్న ఈ శాసనమును నా మిత్రులు శ్రీ బి. నరసింహశాస్త్రిగారు 1985 సెప్టెంబరు భారతిలో (పుటలు 56-58) ప్రకటించి ఆంధ్రదేశ చరిత్ర పరిశోధకులకు గొప్ప మేలు చేసిరి. వారొసగిన శాసన మూలములోను దానినను సరించి వారొనర్చిన నిర్ణయములలోను కొన్ని సవరణలు అనివార్యముగ చేయవలసి వచ్చుచున్నది అందు ముఖ్యమైన సవరణ శాసన కాలమును గూర్చి. 'జయాభ్యుదయ శకవరుషములు 1193 యగు ప్రజాపతి సంవత్సర పుష్యబహుళ 8 వడ్డ వారమునాండు' అనియున్న మొదటి నాలుగు పంక్తులలోని 1193ను 1173గాను, బహుళ '8'లో '8' సంఖ్యను పూర్తిగాను వదిలిపెట్టి చదివిరి. ఈ పొరపాటు వలన శాసనకాలము ఇరువదేండ్లు ముందుకు జరుగుచున్నది ప్రజాపతి సంవత్సరము కాని, ఆ సంవత్సరము పుష్య బహుళ అష్టమినాటి ఉత్తరాయణ సంక్రమణముగాని వారు చదివినదానికి సరిపోవుట లేదు. అంతకంటె ముఖ్యమైనది, శాసనములో పేర్కొనబడ్డ కాకతి రుద్రమహారాజు, అనగా రుద్రమదేవి వారనుకొనినట్లు శకవర్షము 1173కు సరియగు క్రీ.శ 1251 నాటికే రాజ్యాధికారము వహించినట్లు చెప్పవలసి వచ్చెను. అప్పటికి గణపతిదేవుని పరిపాలన కాలమే జరుగుచుండెను. తన 63వ రాజ్య సంవత్సరమునగాని గణపతిదేవుడు రుద్రమదేవికి పరిపాలనా బాధ్యతను అప్పగించలేదు. అనగా క్రీ.శ. 1262 లేక 1263లో గాని రుద్రమదేవి కాకతీయ రాజ్యమునకు పట్టము కట్టుకొనలేదు. ఈ నిర్ణయమునకు అనేక ఆధారములు గలవు వాస్తవిక స్థితి యిట్లుండగా ఈ శాసన కాలమును క్రీ.శ. 12F18 సరియగు శకము 1173గా జదువుట వలన రుద్రమదేవియొక్క రాజ్యారంభకాలమును కనీసము 11 లేక 12 ఏండ్లు ముందుకు జరిపి వారు నిర్ణయము చేయవలసి వచ్చెను. పాఠకులు ఈ పొరపాటును సరిచేసుకొని శాసనములోని శకవర్షము సంఖ్య తెలుగు అంకెలలో ౧౧౯౩ అని ఉన్నది ఉన్నట్లుగా చదువుకొనవలయును. రుద్రమదేవి రాజ్యకాలము క్రీ.శ. 1262(3) నుండి 1289 వరకు ఉండెనను పూర్వపు నిర్ణయము ఈ శాసనము వలన మారుటలేదు. రాజ్య వ్యవహారములలో శిక్షణ నిచ్చుటకై క్రీ.శ 1959–67 నుండి గణపతిదేవుడు ఆమెను తనకు తోడుగా నుంచుకొనెను. ఆమె పరిపాలన చేపట్టిన తరువాత గూడ గణపతిదేవుడు కనీసము ఆరేండ్లు జీవించి యున్నట్లు తెలియుచున్నవి. అవి యెట్లున్నను ఈ సదర్‌షాపూర శాసనకాలము తెలిపెడు శక సంవత్సర సంఖ్యను ౧౧౯౩ అని ఉన్నది ఉన్నట్లుగా చదువుకొనవలెను. శాసనకాలము క్రీ.శ. 1271 డిశంబరు శనివారము నాటికి సరిపోవుచున్నది. ఆ ముందు దినము శుక్రవారము మధ్యాహ్నమునుండి మకర సంక్రమణ పుణ్యకాలము గలదు

ఇందు రెండు శాసనములు గలవు. మొదటి మూడువైపుల ఒకటి, నాలుగవవైపు రెండవది. మొదటి శాసనములో వాక్యరచన బాగుండకపోవుట వలన అందలి విషయము స్పష్టముగా తెలియుట లేదు. శాసనమిచ్చినవాడు గజసాహిణి మహాప్రధాని పోంకయ్యప్రెగడ తన అధికారి లేక కార్యకర్త ద్వారా దీనిని వేయించెను. ఆ కార్యకర్త పేరు 20-21 పంక్తులలో పేర్కొనబడిన మాధవుని అన్నయ కావచ్చును. రెండవ శాసనంలో 18వ పంక్తిలో కూడ నితడు పేర్కొనబడెను. అందతడు గ్రామాధికారిగనో లేక కార్యకర్తగ పన్నులు వసూలు చేయువాడుగనో చెప్పబడుచున్నాడు. అతడే మొదటి శాసనములో చెప్పబడిన అధికారి కావచ్చును. అతడే దీపస్తంభము, తోరణము ప్రతిష్ఠించెను ప్రెగడ చెప్పిన విధముగ దానము లొసగెను. మొదటిప్రక్క చివరి అక్షరాలు స్పష్టముగా లేవు. అర్థము తెలియుటలేదు. ఆ ముందు 'పరాయము' అనే పదాన్ని కలుపుకొంటే 'పరాయము [పరగంపా అని అర్థం చెపితే బాగుంటుందని తోస్తుంది. అయినా [పరగంపా] పూర్తిచేసిన పదానికి అర్థం తెలియదు. 'పరాయము' అంటే పంటమీ యెనిమిదో వంతు అదనపు పన్ను అని తోస్తోంది. ఈ పదం వేఱొం గనుపించును. (ది కాకతీయాస్ పు. 230) కాని అర్థం సరిగా తెలియద ఈ రెండు పంక్తుల్లో చెప్పబడ్డ ప్రత్యేకాదాయము దేవునికిచ్చిరి. ఇవి చెందవలసినవి కాక మాండలికునకే చెందునట్టివి. శాసనం భూదానములు, కొన్ని వస్తువుల దానములు చెప్పబడెను. ఈవైపున క పంక్తులు సరిగా లేవు. తమ్ముళ్ళను గూర్చి చెప్పబడెను. వారికి 'క అన్నట్లు కనపడుచున్నది. బహుశ ఇది రెండవమాటు చెల్లించవలసిన లేదని అర్థమగునేమో

మూడవవైపున చామయ, ఊరివారు ఇచ్చిన దానములు చామయఊరికి సంబంధించిన ఒక అధికారి కావచ్చును. వీరిలో రాచవా రూపంలో పన్ను చెల్లించే వారందరు, చాతుర్జాతులలోని యితరులు ఆబుడనాల వంతున దేవునికి పెట్టవలెను. వీసమనేది సాధారణంగా పదహారవ వంతు. మాడకు పది రూకలుగా కాకతీయులనాడుండెడి మాడకు 160 వీసాలు అగును. అందు ఆఱు వీసాలు దేవునికి పెట్టవ సిద్ధాయము క్రింద లెక్కించరాదని సుంకమాన్యగాంగ్రడకు తరువాత తోంది గనుక ఈ ఆఱు వీసాలు అదనపు పన్ను కాదని తెలుస్తుం పొంనయ ప్రెగడవారికి చెల్లించే సిద్ధాయం నుండియే దీనిని ముందు తీసి యివ్వవలెనని గ్రామమువారు ప్రెగ్గడవారితో చెప్పుకొని యేర్పా కాలం గడచినమీద గ్రామాధికారి, సుంకర్లు ఇందులో అన్యాయం చేసిన యేర్పాటిది.

ఈ శాసనశిలపైన నాలుగోవైపున మఱియొక శాసనము గ తేది నందన సంవత్సరం కార్తిక శుద్ధ 15 గురువారము శకసంవత్ పేరు చెప్పబడలేదు. పై శాసనముకంటె ఇది సుమారు ఇరువదేండ్ల కావచ్చును. దీనికి క్రీ.శ. 1292, అక్టోబరు నెలకు సరియగుచున్నది మాత్రము సోమవారమగుచూ భేదించుచున్నది ఇది సరియగుచో అప్పు రుద్రదేవుడు పరిపాలించుచుండెను. ఇందు వెల్పుంగొండ కేతయపెద్ది దేవునికే అంగరంగ భోగానకు 2000 చెట్లున్న తోటతోపు, గుడి 1¼ (మఱుతురు) చేను, విడిగా ¼ (మఱుతురు) దీపము చేనున్న, సరుకును, ధాన్యమును ఎవ్వరు గుత్తకు తీసుకొన్నను అందు మాడ సరుకులో అద్దెడు వంతున దేవునికి ధర్మము చేయవలెను అని కట్టడ దేవునికి చేసిన ధర్మముగాక, ఆకేతయపెద్దియే పరియపాడులోనున్న మాధవుని అన్నయరాజునకు తాము చెల్లించెడి తొలిపన్ను చెల్లి లేదనియు, అట్లే కాపులు ఆమడి పన్ను చెల్లించనవసరము లేదని చేసెను. మాధవుని అన్నయ మొదటి శాసనములో తోరణము సేం చెప్పబడెను. ఇరువదేండ్ల తరువాత కూడ నతడే యధికారిగా

ు. గ్రామమువారు రాజునకు చెల్లించవలసిన ధనధాన్యములు పసులు చేసి గా చెల్లించు బాధ్యత ఈ యధికారిపై నుండును. బహుశః ఈ గుత్త ంపులోనే మొదట చెప్పిన, మాడ విలువ సరకున అడ్డెడు లెక్కన దేవునికి ంచవలెనని చెప్పినట్లు చెప్పుచున్నది. లేక, గ్రామమువారికి పన్నులు కొన్ని ంచనక్కరలేదని చెప్పబడింది. కనుక, బ్రాహ్మలు, కాపులు తాము చెల్లించే ్లకు అధికముగా దేవుని కొరకు కొంత అధికారిద్వారా చెల్లించవలసి యున్న ా తెలియుచున్నది. ఇట్టి యేర్పాటు ప్రతాపరుద్రుని కాలంనాటి మాచేడు శాస ో గనపించును. అందు నగరికి (రాజునకు) చెల్లే సిద్ధాయము పుట్టుబడి కి పుట్టికి) మాడలిచ్చేటి అంఱుదు వీసాలు దేవుని కిచ్చేటట్లు గ్రామమువారు ్టు చేసిరి. (వరంగల్లు జిల్లా శాసన సంపుటి పుట 241). అట్లే ఈ ాపూర్ శాసనంలో కూడ ప్రజలే దేవుని కొరకు అధికంగా చెల్లించాలనే ్పాటు చేసి దానికి బదులు వారు రాచవారికి చెల్లించాల్సిన అమడి పన్నును ్యముగా తొలగింప జేసికొనినట్లు చెప్పవచ్చును. ఇది మాండలికుడైన వేల్పు డ కేతమపెద్ది తన బాధ్యతమీద చేసిన యేర్పాటు. రాజునకు దీనితో ంధము లేదు. రాజునకు రాను చెల్లించవలసిన గుత్త కప్పము యథాతథము యుండును. ఇచటి బ్రాహ్మలకు, కాపులకు తగ్గించిన పన్నులు అందు ుకు రావు. అందువలననే రాజుగారు ఇందు పేర్కొనబడలేదని తోచుచున్నవి.

మొదటి శాసనములో ఒక విధమగు ఏర్పాటు జరిగియుండగా మఱల శాసనముయొక్క ఉద్దేశమేమిటి? రెండవ శాసనంలో వేల్పుగొండ కేతయ దాతగా చెప్పబడుచున్నాడు. దీనినిబట్టి పూర్వము మొదటి శాసనములో బడిన బొంసయ ప్రెగ్గడ స్థానములో కేతయపెద్ది నియుక్తుడుకాగా ఊరివారు ు పూర్వము దేవుని కొరకు చెల్లించుచున్న అధికమగు పన్నుకు బదులుగా ు యితర తగ్గింపులు కోరియుందురు. వారి కోరికను మన్నించి కేతయపెద్ది ్మలకు తొలిపన్నును, కాంపులకు 'అమడి' అనగా అమణి పున్నమినాడు ంచే పన్నును మాన్యముగా తొలగించెనని అర్థమగుచున్నది. 'అమణి' పదము వైశాఖ పౌర్ణమి, మార్గశిర పౌర్ణమి అర్థములుగా జెప్పబడెను. పూర్వము ులమీద మూడుపన్నులు విధించువారు. వైశాఖ పౌర్ణమినాడు, ఏఱువాక ినాడు, మార్గశిర పౌర్ణమినాడు. రెండు పంటలు పండించువారు ఈ మూడు ులు చెల్లించవలెను. ఏఱువాకనాడు భూములలో వ్యవసాయమారంభించుదురు. ుడు భూములు కలవారందరు తప్పక కొంతపన్ను చెల్లించవలెను. మొదటి లు (పునాస) వచ్చే మార్గశిర పౌర్ణమికి (ఆగ్రహాయణికి) చెల్లించేది రెండవ . రెండవపంట (పైరుపంట) వచ్చిన తరువాత వైశాఖ పౌర్ణమికి చెల్లించేది ుపన్ను. వీటిలో రెండవపన్ను ముఖ్యమైనది. అధికాదాయము నిచ్చును. ్మలకు ఇచ్చిన మాన్యముల మీద ఏఱువాక పౌర్ణమికి చెల్లించే తొలిపన్ను ము గనుక అది మాఫీ చేయబడింది. రెండవపంట అందరు వేయరు. వేసి ిక మొదటి పంటలోవలె నుండదు. దీనిపై పన్నుగూడ తక్కువగ ును. కాపుల విషయములో ఈ కడమపన్ను అనగా వైశాఖపౌర్ణమికి చే రెండవ పంటమీద పన్ను మాఫీ చేయబడింది.

ఈ రెండు శాసనములలోను కొన్ని పన్నులు పేర్కొనబడినవి

సము	(పంక్తి 22)	: పంటలో ఎనిమిదో వంతు రాజునకు భాగముగా నిచ్చునది.
	(" 39)	: తుదకు వైశాఖాంతమున చెల్లించునది. రెండవ పంట విషయమున ధాన్య రూపమున కావచ్చును.
న్ను	(" 54)	: ఏఱువాకనాడు చెల్లించే మొదటిపన్ను. ఇది డబ్బుగనుండును.
మడి	(" 56)	: మార్గశిరములో మొదటి పంట నుంచి ధాన్య రూపముగ చెల్లించునది.
సిద్ధాయము	(" 51-2)	: ఇదియు, తొలిపన్నును ఒకటేననిపించు చున్నది.
సుంకము	(" 58)	: ఇది వస్తువులు అమ్మునపుడు విధించు నది. శుల్కముయొక్క రూపాంతరము. అనేక విధములుగా విధించువారు.
వరగంపా (అస్పష్టము)	(" 23)	: ధాన్యరాశినుండి మొదట ఒక గంప ధాన్యము తీసి గ్రామము ఉమ్మడిన జరుగు ధర్మకార్యములకై వినియోగించు నది కావచ్చును.

ఈ వివరణములన్నియు ఊహించి చెప్పినవి మాత్రమే. ఇంతకంటె మంచి అర్థములు లభించువో మార్చుకొనవచ్చును. తెలుగుదేశము అన్ని ప్రాంతముల లోను అనాడు వీటిలో కొన్ని పదములు వాడుకలో నుండెననుటకు కూడా ఆధారములు గనుపించవు.

శాసన మూలము

(శ్రీ బి. యన్. శాస్త్రిగారు ఇచ్చిన ఫోటోలనుండి వ్రాసినది)

మొదటివైపు

1. స్వస్తిశ్రీ జయాభ్యుద
2. య శకవరుషములు ౧౧౯౩
3. యగు ప్రజాపతి సంవత్సర పుష్య
4. బహుళ ౧ వ[డ్డ]వారము నాండు
5. మహ(హా) మండలేస్వ(శ్వ)ర అను[మ*]కొ-
6. ౘ[ద*] పురవర(రా) ధీస్వ(శ్వ)ర కటక చూ-
7. ఱ కాఱ(ర) శరణ(ణా)గత వ్రజ-
8. పంజర స్వయంభు దేవర ది-
9. వ్యశ్రీ పాద పద్మా రాధక పర
10. బలసాధక నామాది సమ
11. స్త ప్రశస్తి సహితులైన కాక-
12. తియ్య రుద్ర మహారాజులు
13. ప్రి ద్వి (పృథ్వీ) రాజ్యము సేయంగా
14. గిజసాహిణి మహ (హా) ప్రధా-
15. ని బొంసయ్యప్రెగడ అధి-
16. కారి వరెపాడి సోమనా-
17. థ దేవరకు సంక్రమా(మ)ణ
18. కాల మప్పు [డు*] భేరి సాలది-
19. వ[ము*] మలెయగు (ట్ట) తోర-
20. ణము మ దమ ని అ-
21. న్నయ సే ఇంపిన వా-
22. ండు [1*] వరాయమూ
23. [వ గం] పా [దే] వర [కి]

రెండవవైపు

24. సోమయదేవుని [వి]త్తి
25. కాల్వను దేవరగుడి కడను
26. మ ౧॥ మొగవార అడ్డ॥
27. మేడి కుంటను అడ [౧] ॥ ఏటి అడ్డ
28. రి మ ౧ కొండనూరి గణ-
29. [ప]తి దేవరకు వేముపాయ

కాలంలో ఓ మారుమూల

శ్రీ కలువకొలను సదానంద

ఇప్పుడే మయిందనీ ?
ఎందుకు నేనిలా
నిరుత్సాహ పడిపోతున్నాను?
ఇన్నికోట్ల మంది
ఎంత ఉల్లాసంగా ఉన్నారు!
వాళ్లకున్న ఉల్లాసం
నా కెందుకు లేకుండా పోతుంది ?
...ఇది నా తప్పే !
వాళ్లలాగా నేనూ
ఉత్సాహంగా ఉండటానికి
ప్రయత్నిస్తాను —
జాతరనీ జారుడుతనాన్నీ
ఆడంబరాన్నీ అట్టహాసాన్నీ
వీటి చాటున దాగుడుమూతలాడే
ఆడవాళ్లనీ మగవాళ్లనీ
చూస్తూ తిరుగులాడుతాను—

ఏ చవకబారు హాస్యం కనిపించినా
చప్పున పక్కికిలిస్తాను—
బతుకు ఇట్టే తెల్లారి పోతుంది'
కాలాన్ని దొర్లించటం ఎంత సులభం!
చిన్నపిల్లలు ఆడుకునే
కాగితపు చక్రంలాంటిది కాలం—
అది గిరగిరా తిరిగిపోతుంటుంది
ఈ భూమ్మీద
శాలివాహనుడికి కూడా తెల్లవారింది—
ఆ తరవాత మరెన్నిసార్లు తెల్లవారలేదు!
శాలివాహనుడెప్పటివాడు !
అతనికీ నాకూ మధ్య
పందొమ్మిది శతాబ్దాలు దొర్లిపోయాయి—
నా కనురెప్పపాటు కాలమే
నాకు బరువై పోతుందా?
ఇంకెందుకీ నిట్టూర్పు!

30. ఆద [ ] ॥ పిన్నపడిసెల పె-
31. ద్దచెఱువు వెన్క రు[ద్రె]డి
32. పెట్టి[౦*]ది అర్థ మడి కుం-
33. ట వెన్క శ్రీరాముని దేవ
34. య ఇచ్చినది అర్థ [యు-]
35. కరణము పెద్ద ప(శ్య)ము అ-
36. ద్దెన్న పడిగంముకి (జీ) * గం-
37. నదము(?) పిడింగట్టందీప
38. కంబ్బాలు చందన---
39. -- ౩తం మళ్లకు కడ-
40. (మ) లేదు

మూడవవైపు

41. చామయానుఅయూ-
42. రి చాతు జాతుల ప్ర-
43. ను దీపా (రతి - ంగ) భోగాన-
44. కు ఇచ్చిన ఆయం రాచవా-
45. (రి) మాడ పెట్టెడి వారు దే-
46. వరకు అఱు వీసాలు
47. వెట్టెడిది (1*) ఇసమయా-
48. నకుం దప్పినవారు త-
49. మ ఇఱువయి ఒక్క పితా-
50. డ్లాను నరకానం బెట్టిన వా-
51. రు (1*) ఊరి పలుకులు సిద్ధా-
52. యములోనిది అని కొనలే
53. దు సుంకిలు దమసుంకి-
54. ము లోనిదని కొనలేదు (1*)
55. ఇధమ్మ౯ము ఎవ్వరు సె ల్చి-
56. నాను గంగ క ఱత కవిల-

57. ంబొడ్చిన దోషానం బొ-
58. ందువారు ॥ స్వద (త్తాం) పరద-
59. (త్తాం) వా యోహరే(త) వ సుం-
60. ధరాం। షష్టివరు(ష) స

61. హస్రాణి విష్టాయాం
62. జాయతే క్రిమి(ః) *దేవర
63. భోగానకు.... ....
64.............కుం దొంటచేను।।।

నాలుగవవైపు (రెండవ శాసనము)

1. నందనసంవత్సరం కా ర్తి౯-
2. కశుద్ధ ౧౩ గురువారము
3. నాండు సోమయదేవుని
4. అంగరంగభోగానకు వే-
5. ల్పుం గొండ కేతయపెద్ది ఇ-
6. చ్చిన ఏటిమడ తాటిపనము
7. ౨౦౦౦ గుడితూప్పు౯చేను
8. ౧। కల్నదేవుని దీపము
9. చేను।। ఊరఖండము ఏ
10. ధాన్యము ఎవ్వరు పట్టినా
11. మాడ అర్థెండు పెట్టెది
12. పెద్దివారి పరియపాటి మ-
13. హాజనాలు మాధవుని అన్నయ
14. రాజునకు థమ తొశి పన్ను మా-
15. న్యము క్షాంపులు అ-
16. మది సర్వ౯మాన్య-
17. ము।

తృప్తి

కన్నడమూలం: డా॥ యు. ఆర్. అనంతమూర్తి

ఆంధ్రానువాదం: శంకరగంటి రంగాచార్యులు

.... రాత్రియిందంటే దుష్ట మృగాల సంచారం.......... అయినా క్రూరురాలైన తల్లి —ఆ పిల్లవాడు పూర్తి రొట్టెకావాలని మొండి పట్టు పట్టాడని కోపించుకొని. ఆ చిట్టిపిల్లవాడిని బయటికి త్రోసి, గడెవేసుకునివచ్చి రొట్టె తట్టేందుకు...... "

"అమ్మా.......కథ చెప్పేటప్పుడు అదెందుకలా ఏడుస్తావమ్మా? "

'లేదు నాన్నా ఏడవలేదు నాన్నా.......'

ప్రక్కలో పడుకున్న కొడుకు సీను ఏం చెప్పినా వినడంలేదు. తల్లి కథకోసం ఒకే రకంగా పట్టుపట్టాడు. ఏం చేసినా నిద్రపోడు. కథచెప్పి మాత్రం ఎలా సంతృప్తి పరచగల్గుతుంది. అబ్బక్క?

"ఇదిగో శానా రాత్రయింది. కథవింటూ నిద్రపోబాబూ తర్వాత ఆ పిల్లోడికి శానా భయమై...........

లేదు. ఏమైనా సీను వినడు. చీరకొంగుతో అబ్బక్క కళ్ళు తుడుచుకుని కొడుకు వీపు నిమురుతూ నెమ్మదిగా వాడిని ఒప్పించే స్వరంతో చెప్పింది.:

'మాట్లాడవద్దుబాబూ తొట్టిలో పడుకున్న పసికందు మేల్కొవచ్చు. నేడు కథవిను........చెప్తాను.... ఆ పిల్లాడు అంత గట్టిగా కేకలు పెట్టినా పాపిష్టి తల్లి..."

'ఊహుఁ.........నాకు కథొద్దు. పొద్దున్నుంచీ ఎందుకు ఒకే రకంగా ఏడుస్తున్నావు చెప్పు?'

ఎనిమిదేళ్ళవాడే అయినా ఆ పిల్లవాడు మంచి బుద్ధి మంతుడు! తల్లి కంటే ప్రాణం.

ఎవరికైనా కానీ తన హృదయం విప్పిచెప్పితే తప్ప భరించడానికి కాదు కగా యాతన పడుతోంది అబ్బక్క కన్నపేగు! సీనుకైనా ఎందుకు చెప్పకుండి....

చెప్పొచ్చు. అయితే ఎలా?

"సీ కొక అన్నయ్య ఉండేవాడు బాబూ. ఈ దినం వాడి పుట్టిందినం కుగ."

'ఇప్పుడెక్కడున్నాడమ్మా, అన్నయ్య.?'

ఏమంటూ జవాబు చెప్ప గలదు అబ్బక్క? ఆలోచించినకొద్దీ 'అమాస' చీకటి ఆమె ఎదలో నిండి నలుపును పులుముతోంది.

అన్న ఎక్కడికి వెళ్లాడని చెప్పగలదు? దండులో చేరాడా? ఎక్కడో ఏ ప్రాంతంలో హోటల్లో చేరాడా? కార్ఖానాలో చేరాడా? పట్టణంలో వాళ్ల వీళ్ళ నామూసుమోసే కూలిపని చేస్తాడో? దిక్కులేని దిసుడిలా ప్రాణం వదిలాడా? తల్లిని వదిలిపెట్టి వెళ్ళిపోయిన ఆ పిల్లాడికి సుఖమా? దుఃఖమా? ఏమని చెప్పగలదు తను మాత్రం?

వాడిని చూడక ఎనిమిదేళ్ళయినా ఇప్పుడుకూడా తల్లి కొడుకును గుర్తు పట్టగలదు.

పేరు చెలువుడుఅని. పేరుకు తగినట్లే చూచిన వాళ్ల దృష్టినాకర్షించే చెలువం వాడిది!

చామనచాయతో ఎత్తుగా వుండేవాడు. కోలముఖం వేప చిపుళ్ళలా కొనలు తేరిన కనుబొమలు. పచ్చపోసిన ఎత్తైన నుదురు. చిపర్లోవంగిన ముక్కు. శివునిచేతి త్రిశూలపు వాడికొనలు వెలిగేటట్లు వెలిగే చురుకుచూపుల చిన్న వి గుండ్రని కళ్లు. కొంత గంభీరంతోనూ, కొంత గర్వంతోనూ, బిగిసిన ముద్రతోనూ వున్న లావుపాటి పెదిమలు. మొరటైన వుంగరాల జుట్టుతో ఆపెద్దతల నిద్రలేచి ఇంకా ఇప్పుడే వస్తున్నట్లు నెమ్మదిగా నడిచే నడకా....

అన్నీ కళ్ళకు కట్టినట్లుంది అబ్బక్కకు పది పన్నెండేళ్ళు అల్లారు ముద్దుగా సాకిన చెలువుడి రూపాన్ని ఆమె ఎలా మరువ గలదు?

"అన్నయ్య ఎక్కడున్నాడు చెప్పమ్మా?"

'మీ అమ్మపట్ల కోపగించుకొని ఎక్కడికో దూరంగా వెళ్ళిపోయాడు.'

ఇంతకన్నా ఎక్కువగా అబ్బక్క చెప్ప జాలదు; చెప్పినా ఎలా తెలుస్తుంది. ఆ పసివాడికి?

'వెళ్ళడం వద్దని నీ వెందుకు చెప్పలేదమ్మా?'

చురకత్తిలా నాటుకుంది ఈ మాట అబ్బక్క గుండెలో వాదలా మంకు పట్టుపట్టి వెళ్ళే వెళతాడని తెలిసివుంటే, ఆమె కొంగడ్డంపెట్టి బ్రతిమాలుకోక పోయేదా? ఏదో పాడు కోపావేశంతో ఆమె నాలుగు కఠినపు మాటలాడింది నిజం. అంత మాత్రానికే వాడు....

'నాయనెందుకు వొద్దనలేదమ్మా?'

శీను ఈ మాటలాడిన తర్వాత ఇక చెప్పక తప్పలేదు..... ఎన్ని రోజులని ఈ పసికందునుంచి దాచడానికి వీలవుతుంది?

'మీ నాయన వేరే; వాడి నాయన వేరే బాబూ. వాడి నాయన చచ్చిపోయిన తర్వాత..."

వేరే కూడిక చేసుకుంది అబ్బక్క వాడి నాయన వాడు పుట్టేటప్పుడే చనిపోయాడు. తరువాత పదమూడేళ్ళు ఎలా ఎలానో కూలి నాలి చేసుకుని

ఒక్కతే చెలువుడిని పెంచిన తర్వాత ఈ కూడిక ఏర్పడింది....ఆ విషయం గానే ఆమెకూ కొడుకుకూ వైమనస్యం పొడసూపి....

ఇవన్నీ చెబితే ఆ పసివాడైన శీనుకు యేమి తెలుస్తుంది? అందుకే ఏమీ అర్థంకాక వాడు మాట్లాడక సుద్దప్పగించిచూస్తూ వూరకున్నాడు.

తరువాత ఒంటరిగా బ్రతకలేక ఆ కొత్త మోహానికి బానిసై....

అలాగా తను చేయరాదై వుండెబో యేమో?

అయితే వాళ్ళ జాతిలో అది మామూలే కదా? 'సీతు' చేసుకో లేదా? "అక్కాకు' మూడు కూడికలు కాలేదా? అయిదుగురు పిల్లల తల్లి 'మీటి' మొన్ననే కూడుకోలేదా? ఇలా వున్నప్పుడు తనది తప్పా?

అయితే పదుమూడేళ్ళ ప్రాయానికి ఎదిగిన తన ముద్దుల కొడుకు చెప్పినా వినకుండా చేసుకుంది.

అయితేమాత్రం చెలువుడు వాళ్ళు వీళ్ళు చెప్పిన చాడీలు విని తన ఎదుట నిలువడమా? అది సరైందా? చేతులారా పెంచిన తల్లిమీద చేయి చేసుకోవడానికి ప్రయత్నించడమా? తల్లి ఎదో కోపావేశంతో ఏమైనా అంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవడమా? కొడుకుకు తగిన ప్రవర్తనా ఇది?

అయ్యో! తల్లి నెఱుగని చెలువుడు! తల్లిప్రేమ లోతులు తెలియని పసివాడు! ప్రాయం వచ్చిందని -మోసి, కని, పెంచిన తల్లిని వదలి....

........ఎనిమిది తొమ్మిదేళ్ళయినాయి. ఒక్కసారికూడా ఈ పక్కకు ముఖం తిప్పి చూడలేదు. కళ్ళల్లో వత్తులు పెట్టుకుని దారికేసి ఎదురు చూస్తూండే తల్లికి ఒక ఉత్తరం ముక్కకూడా రాసి పడేయలేదు.

తల్లి ముఖాన్ని ఒకసారైనా చూడాలనే ఆశలేకుండా పోయిందికదా కొడుకుకు?

" అమ్మా, ఊరికి వెళ్ళిన నాన్న ఎప్పుడొస్తాడమ్మా?.... నాన్న వొస్తే నిన్ను ఇలా యేడవనీడు."

ఎంత ముద్దుగా మాట్లాడుతాడు పసివాడైన శీను! వాడు చెప్పేది కూడా అబద్ధంకాదు.....తన్ను వలచి, చేపట్టినవాడు అలాంటి వాడే. యేనాడు తను కన్నీళ్ళు కార్చటం సహించడతడు. లేకపోతే తను అతని చేయిపట్టి ఉండేదా?

అతని మెలిపెట్టిన మీసాలూ, తాంబూలం నములడంవల్ల ఎరుపెక్కి వుండి, ఎల్లప్పుడూ చిఱునవ్వులు చిందుతూ వుండే ఆ పెదాలూ, తెలివస్త్రప్పు తలపాగాలోనుంచీ తొంగిచూస్తుండే ఆ పొడుగాటి వెంట్రుకలూ, ఆ తళతళలాడే పెద్దపెద్ద పోగులూ, కూలివాళ్లమీద అతడు మేస్త్రీగా అజ్మాయిషీ చేసే ఆ ఠీవి——

దేవుడులాంటి మనిషి.... ...

తన తల్లి వడ్లు దంచేటప్పుడు పాడుతూవుండిన ఆ పదంలో వర్ణించినట్లే——

" పడకేయ మన్నాడు
పూలుమ్రుడువమన్నాడు
బదలితివి పెండ్లామ పండుకోమన్నాడు
బదలితివి పండుకోమన్నాడు ననుచూసి...."

పుట్టినింటినే ఎందుకు? ప్రపంచాన్నే మరచిపోమన్న రసికుడతడు! .... ఔను, నిండు యౌవనంలోవున్న తను అపుడు అన్నీ మరచి పోవడంలో ఆశ్చర్యం లేదు. ఆ మోహంలో కొడుకుమీది వాత్సల్యమూ క్షణం మరిచి పోయిందో యేమో? అందుకే కదా ఏనాడూ సాహసించని తను ఆనాడు సాహసించడం. ప్రియాతిప్రియుడైన కొడుకును తిట్టింది. ఆడిపోసుకుంది. తన సుఖాని కడ్డంకిగా వున్న చెలువుడిని ధిక్కరించి నడిచింది....

అయ్యో, తను పాపిష్టిదాన్నికదా? అదెలాంటి మోహం! ఏ కన్నతల్లీ అలా చేసి వుండటానికి వీల్లేదు. అప్పుడు నలుగురూ ఆడిపోసుకున్న రాజ కన్న నీచంగా ప్రవర్తించలేదా?

తన్ను వలచినవాడు సఖ్యుడు. అయితే, ఆ పాడుమోహం కా ఇప్పుడు చేతుల్లోంచి జారిపోయాడు కదా, తన ముద్దులకొడుకు?

ఎక్కడికి వెడుతూ యే పులి నోటికంద అయ్యాడో? యే దోపిడీ ముండా కొడుకుల చేత బద్దాడో? దుఃఖం పట్టలేక యే దూకాడో? ఎక్కడ ఒంటరిగావుండి ఆకలిగొని అలమటించాడో? త లేని పరదేశికి యేమైందో?

ఈరోజు వాడి పుట్టిన పండుగ. ఇప్పుడిక్కడ వుండి వుంటే వయస్సు ఇరవై రెండేళ్ళుండేది. కోడల్నింటికి తెచ్చుకుని మనుమడిని పుణ్యం తనకెక్కడుంది? తను తల్లేనా?....కాదు, రాక్షసి! పిశాచి పాపిష్టిది!. ....

"అమ్మా, ఏపప వద్దంటే ఏనవేమమ్మా?...."

" నీ కింకా నిద్దర పట్టలేదా, బాబూ?"

'నీ వేడుస్తూవుంటే నేను నిదరపోను.'

'ఏడవను శీనూ....నిద్రపో'

" నిన్ను వదలిపెట్టి వెళ్ళింది అన్నయ్యదే తప్పు........నీ వెండు న్నావమ్మా?....పోతేపోనీ, ఆ కథలో తర్వాతేమైందో చెప్పు........ఆ ఏడుస్తువుంటే.... "

"యేడుస్తూవుంటేకూడా నాలాంటి కఠినురాలైన తల్లికి జాలి క అప్పుడు వెదురు పొదల మొదళ్ళలో పటపట సద్దు వినిపించింది.



ంటూ భయపడి ఆ బాబు చిట్టి కళ్ళను పెద్దవిగా చేసుకుని చూసేసరికి ఒక పులి!

" ఆ బాబు గడగడ వణుకుతూ, వాడి చిట్టి చిట్టి చేతుల్తో తలుపును దడ దడ కొడుతూ, వాడి ముద్దులు మూటకట్టే మాటల్తోనే...."

' సగం రొట్టె చాల్నమ్మా ...తలుపు తీయవమ్మా—కళ్ళు తళ తళా— 'క పరపరా! " అంటూ బ్రతిమాలడానికి మొదలెట్టాడు.

పులి అని చెప్పేందుకు పాపం పసివాడికి నోరు పెగల్లేదు. ఆ నాలాంటి హరు లైన తల్లికి పిల్లాడు భయంతో కేక లేస్తున్నాడని అనుమానమూ కలుగ దు.—

' సగం రొట్టె చాల్నమ్మా....తలుపు తీయమ్మా—కళ్ళు తళ తళా— 'క పరాపరా!.... '

అంతలోనే ఏడు పాగిపోయింది. మొండిపట్టు ఇప్పుడన్నా వదిలాడు దా అనుకుంటూ రొట్టె తింటూ కూర్చున్న తల్లి బయటికి వచ్చి తలుపు తెరచి గాసింది..

" ఎక్కడున్నాడు, బాబు?.... పులినోటికంద ! '

........నీచురాలైన తల్లి కారణంగా, పాపిష్టిదైన తల్లి కారణంగా దుష్ట లైన తల్లి కారణంగా కొడుకు- చేతికి వచ్చిన కొడుకు-పులినోటికి కంద?

పులి నోటికో?

ఏ అడవి పాలిటికో?

ఏ నది కౌగిటికో?

ఎక్కడో, ఏమో!! ఎట్లో!!!

అయ్యో. ..అమ్మా ....మాయమ్మా....

వస్తాడో?

రాడో??....

ఆ నా పెద్దకొడుకు, నా బంగారుకొండ, నా చెలువుడు, తనే చేతులారా ల్లు వదలిపెట్టి పరుగెత్తిపోయేట్లు చేసిన నా బాబు, నా ముద్దుల కొడుకు—


వస్తాడో........

రాడో?........

ఎదురు చూసిచూసి విసిగి వేసారి పోయింది తల్లి........తన గుడిసె యట పాములా చుట్టుచుట్టుకుని, వంపులు వంపులు తిరిగి, పొంతకోసిల, ట్లుచేమల నడుమ కనిపించి, ఎక్కడికో దూరంగా, దూ....రం....గా....తన డుకును తీసుకువెళ్ళి దారివెంట చూసిచూసి, వేచి వేచి, కన్నీళ్ళు కార్చి, గవళం చెందింది....

వస్తాడో? ....

రాడో??



వస్తే తినడానికి చేసిపెట్టిన వననతానల రసాయన మిస్తుంది. కట్టు కోవడానికి మంచి బట్టలు తెచ్చిపెడుతుంది... తనవని కూడబెట్టుకుని వున్న ఆ మున్నూరు వెండి రూపాయలనూ ఖర్చుచేసి పెళ్ళిచేస్తుంది.... వాడు ఇంట్లో కూర్చుని తింటూన్నా నరే తన, మొగుడి నోటినుంచి ఒక దురుసు మాటకూడా రాకుండా చూసుకుంటుంది....అయితే చెలువుడు........

వస్తాడో?

రాడో ?? ...

ఆ అతి ముద్దులబాబు....

వస్తాడో?....రాడో??....వస్....తా....డో....రా....డో??....వస్తా....???

....ఏమిది బయట నిశ్శబ్దం ??

" అమ్మా....అమ్మా....అమ్మా .... '

....ఎవరిధ్వని?...

మధ్యాహ్నపు మండుటెండకు బదలి పోయిన ధ్వని!....మృదువైన,.... ప్రేమమయమైన, బడలిన "అమ్మా" అనే ధ్వని!

అయ్యో, తలుపు తెరిచేటంతలోనే ఎందుకలా గుండె....

....అహ్! నీవు వచ్చావా, బాబూ.... ...ఇన్ని రోజులైన తరువాతైనా వచ్చావా తండ్రీ—నీ తల్లి తప్పు క్షమించవా, చెలువా—

కూర్చోబాబూ—ఎంత చిక్కిపోయింది నీ శరీరం!

దప్పిగొన్నావా?........ఎక్కడెక్కడ అనదలా తిరిగాడు నా పసివాడు? నా ముద్దుల చెలువుడు?—

తలంటి నీళ్ల పోస్తా రారా బాబూ. నన్ను వదలి ఎక్కడికి పోవద్దు— తల్లి కన్న పేగును కాల్చివేయకు చూడావా? నిన్ను వదిలిపెట్టి ఇక నేను బతికి వుండలేను.

అయ్యో!....అయ్యో!—

ఇదేం బాబూ? ఇంకెక్కడికి బయల్దేరుతావు?....అమ్మ నెందుకు వదలి పోతావురా, నాన్నా? అదెందుకు అలా దూరంగా, దూరంగా మంచులా కరగి కరగి మాయమవుతున్నావురా, చెలువా? నేను నీకు వద్దా??....

ఎందుకు అలా నీ కళ్ళలో తిరస్కారం?....వద్దు....అలా చురచుర చూడవాకు నాయనా.... నీ కోసం అయన్ని. నా ప్రాణమైన అయన్ని కావ లిస్తే వదులుతాను, చెలువా....అయితే ఇవి....ఈ రెండు పసికందులూ నా కడుపున పుట్టాయి. నీలాగానే నా పిల్లలు....నీ తమ్ముళ్ళు చెలువా....నిన్ను అన్నయ్య అంటూ ప్రేమిస్తారు చెలువా!.... వీళ్ళని వదలనే వదల్లేను నాయనా ...నా కోసం.... నిన్నడుక్కుంటాను!

నా కోసం ఆగు...బాబూ....నాతోడు....ఆగు....ఆగు చెలువా....చె....లు

" అమ్మా....అమ్మా....అమ్మా....ఇదేందుకమ్మా నిద్రలో అలా అలమటి స్తావ్! నీ కేమైందమ్మా ? '

ప్రక్కలో ఇంకా అప్పుడే కళ్ళు బరువెక్కి పడుకున్న ఎనిమిదేళ్ళ పిల్ల వాడు లేను దిగ్గునలేచి, అబ్బరక్క ఒళ్ళు పొర్లించి, పిలుస్తాడు.....తొట్లలోని పసికందు తల్లి పాలకోసం అలమటించి, ఏడుస్తుంది....

అబ్బరక్క పొంగి పొరలి పరుగెత్తుతున్న కన్నీళ్ళనీ చీరచెంగుతో తుడుచు కోడానికి ప్రయత్నిస్తూ, శిశువుకు చన్నిస్తుంది....

ఆ నీరవ గభీరాంధకారంలో .. దుఃఖతప్త హృదయం నుంచీ పాలు ప్రవహిస్తున్నాయి—తియ్యనిపాలు.

అయితే తల్లి కళ్ళలోనుంచీ నీళ్ళు కురుస్తున్నాయి—ఉప్పు నీళ్ళు.

అనంతంగా...........

కోయిల తల్లి ప్రేమ

శ్రీ కాణిపాకం లింగన్న

ఒకనాడు కోయిలమ్మ
కాకి గూడు జేరింది
అందులోన తన గుడ్డును
పొందికగా నిలిపింది॥

బువ్వకొరకు కోయిలమ్మ
దవ్వు దవ్వుల జేరినా—
తల్లిప్రేమ తనలో-లోన
చివ్వు చివ్వు మనుచుండె॥

నా బిడ్డ నా ప్రాణము
నా సొంతము ఏమాయెనో?
నా బిడ్డను చూచు భాగ్యము
ఇకపై ఉన్నదో లేదో॥

తనకు జరిగిన అన్యాయం
తన బిడ్డకు జరుగరాదని
అమ్మప్రేమ తన బిడ్డకు
అందించా లనుకుని—
పొంచి పొంచి కాకి గూటిపై
కాపువేసి ఉంచినది

కాకి లేని వేళ జూచి
తన బిడ్డకై వెతికేది॥

వారాలు మాసాలు—
వరుసగా గడచిపోయె
ఒకనాడు కోయిలమ్మ
భయంకర దృశ్యము, గని
కంపించి పోయింది
కన్నీటిని కార్చింది॥

తన బిడ్డ కాకున్నా—
పెంచిన బిడ్డకదా అన్న
మమకారంలేని కాకి
కోయిల బిడ్డను పొడిచి—
ముక్కు- పుటాన, వాడి-గోళ్ళ,
నిక్కి, నీల్గి, పొడిచి, గీచి
తరిమి తరిమి కొట్టసాగె
ఉరిమి ఉరిమి చూడసాగె॥

విలవిల్లాడెను బిడ్డ
పెనగులాడె ప్రాణాలకై
దిక్కులేని దారినిబడి
నక్కి నక్కి చేరెను వడి॥

కాకులు దూరని కారడవి
చీమలు దూరని చిట్టడవి
చేరినది దీనముగా బిడ్డ
పారినది హీనముగా గడ్డ॥

ఎవరి కన్ను కుట్టినదో
ఎవరి తన్ను శపించిరో
ఎవరు తన సర్వస్వమును
దోచుకొని పోయిరో॥

నీ పదము లంటి ఉన్నందుకు
ఇది ఫలితమా ఓ తండ్రీ!
నీ పూజలు చేసినందుకు
ఇది న్యాయమా!! ఓ దైవమా!!
ఇక ఎక్కడ జీవింతును?
నా తల వ్రయ్యలగుచుండె!
ఇక ఎక్కడ నే పోదును
నాకు దారి లేకపోయె!!
నా ప్రాణము-నా సర్వము
ఎక్కడ దాచితివయ్యా?
నా బ్రతుకు-నా తేజము
ఎక్కడ జేర్చితివయ్యా?
పోతన మహాకవి ఎంత
పొంగి పొంగి ఏడ్చెనో!!
భాగవతమును పోగొట్టుకుని
ప్రాణమెట్లు విడిచెనో!!
కాకులు తన బిడ్డను
పీచుపీచు చేస్తున్నా—
లోకులు చూచెడివారే
గాని, రక్షించకపోయారే!
ఆపాత మధురమని
అమృత తుల్యమ్మని
పొగుడు చున్రదు గానమ్మును
మిగిలించరు తన బిడ్డను!!
ఈ జనాలకు కావలసింది
ఆనంద నందన వనము
ఆనందమునకు మూలమ్మును
కాపాడుకొనరు లోకులు!!

కళను జూచి ఆనందింతురు
కళాకారుల గతులెంచరు
సుఖము కావలె తమకు
సుఖదాతల సుఖమెంచరు॥

తన వ్యధలను - తన బాధల
తనలోనే లయముజేసి
మధురగాన ఝురులతో
మనిషిని అలరించే జీవీ—
కోయిలా! నిస్పృహతో ఇలా—
కుమిలి కుమిలి ఏడ్వకే—
తానరాని సీమజేరి
కాలమ్ము ఒంటరిగా—
జీవనమ్ము సాగించినా
సకల జీవకోటులు॥

ఆపాత మధురమైన
నీ గానమ్ము కోసమే
యెదలు పులకరింప నీకై
ఎదురు చూచుచుందురమ్మ॥

(పోతన దివ్యస్మృతికి అంకితం)



ముందురోజు రాత్రి వేంచేసిన ఆచార్యులవారు ఆరోజు ఉదయమంతా చక్రాంకితాలు వేస్తునేవున్నారు. సాయంత్రం అయ్యేసరికి వీధిలో వాళ్ళదృష్టి పురిటిగది వేపు మళ్ళింది. శాంతమ్మను ఆ గదిలోనికి పంపించేముందు పురుళ్ళుపోసే పున్నమ్మ పరీక్షించి మరీ చెప్పింది "తప్పక కొడుకే పుట్టాడని" అది అలానే చెపుతుంటుంది అని పున్నమ్మ మాట యెవరూ పట్టించుకోలేదు.

ఈ పురిటి గదిలోనే శాంతమ్మ పద్నాలుగు సంవత్సరాల క్రితం పుట్టింది. ఏవూర్లో పుట్టిందో ఆవూర్లోనే కాదు, ఆ వీధిలోనే కాపరంకి వచ్చింది. ఇలా రాగానే అలా కడుపుపండింది. ఆ యింట్లో యిరవైరెండేళ్ళ తరవాత యిప్పుడీ సంతానం.

పదికుటుంబాలున్న వీధి అది. ఆ కరణాల వీధిచుట్టూ మంటిగోడ. వచ్చి పోడానికి రెండు చివర్లలో రెండు పెద్ద గుమ్మాలున్నాయ్. ఈ పది కుటుంబాల వాళ్ళకీ సంబంధ బాంధవ్యాలున్నాయ్. భూవసతి ప్రతి కుటుంబానికీ కొద్దో గొప్పో వుంది. ఏ కార్యంఅయినా అంతా ఒకటి. ఏ కష్టాలొచ్చినా అంతా పంచుకుంటున్నారు.

ఎవరివ్వి వాళ్ళకుండ. పురిటిగది లాంటి కొన్ని గదులు అందరూ అవసరానికి వాడవచ్చు. అందరి పశువులూ కట్టటానికి పెరట విశాలమైన సాల. ప్రతి యింటికీ పాలిచ్చే ఆవులున్నయ్ పచ్చదనంతో వూర్లో పెత్తనం చెలాయించే వాళ్ళున్నారు. పేరున్నా అనుభవించేవాళ్ళ, అనుభవించలేనివాళ్ళూ వున్నారు. ఈ కూడలిలో చదువునేర్చిన ఆడవాళ్ళూ వున్నారు. వంటనేర్చిన మగవాళ్ళూ వున్నారు. అందుకే అప్పుడప్పుడూ చిన్న వాదనలు వినటం కద్దు

వీధి వీధంతా శుభవార్త వినడానికి తెలివేసేవుంది. శాంతమ్మ అంటే వీధిలో అందరికీ యిష్టురాలు. చిన్నవయసులోనైనా స్వంత తమ్ముళ్ళు చెల్లెళ్ళతో నైనా నోరు జారేసుకోలేదు. బడిలో పలకపుల్లకోసమైనా పోట్లాడుకోలేదు. అత్తగారుగానీ ఆడబడుచుగానీ లేనికొంపలో పాదం మోపగానే సంసారయాతన పట్టుకుంది. పెళ్ళాం పోయాక ఇల్లు శుభ్రంయెరుగని మామగారూ, తీరుబడిలేని భర్త చూడలేని చిందరవందర సర్దడానికి చిన్నవయసు. తెల్లవారి లేచేసరికి తోవ తప్పినట్లే అనిపించింది. ఇంట్లో ఒకటి వుంటే మరొకటిలేదు. రెండూవుంటే యేదీ చాలదు. ఇంట్లో యెదురైనవి పిల్లులు. పొయ్యిలో పిల్లిపడుకున్న రోజులూ లేకపోలేదు. ఇంట్లో చదువుండ. చదివిన భాగవతానికి చమురు దండగౌతోంది.

అలాంటి లేమిలో యింతవీగం యీ సొంపెందుకనుకున్నా, కొడుకుపుట్టి కొత్తరంమికి కారకుడౌతాడన్న ఆశ. ఈ ఆశతో మామగారు వల్లిస్తున్న

సీరియల్

మరో రాజశేఖర చరిత్ర

బలివాడ కాంతారావు



పురాణాలు వింటుండేది శాంతమ్మ "చిత్తశుద్ధిగలిగి పుణ్యంచేస్తావు. నిక్కమైన మంచినీలం పుట్టుంది." యిలాంటిమాటలు భర్త కన్నబాబు నోటినించి విని యే శతకంలోని చరణాలో స్ఫురించేవి. చీకటిపడ్డాక వీధి అరుగు గూటిలో దీపపు సమ్మెలో దీపం వెలిగేది. ఒకసారి ఆ దీపందగ్గర ఒక పెద్ద పన్ను, జుత్తు ముడితో యెత్తు విగ్రహం నిల్చున్నట్లు కనిపించింది. ఎవరో యేమిటో అని గాబరాపడిందిగాని యెవరికీచెప్పలేదు. నెలలునిండినతర్వాత ముగ్గురుముత్తయిదువులను పిలిచి తోటకూరకట్టలు వాళ్ళ వొడిలోవేసింది. ఎంత సులువుగా యీ కట్టలు వేస్తే అంత సులువుగా పురుడు వస్తుందని.

పురిటిగదిలోనికి వెళ్ళి రెండుగంటలైనా యింకేవార్త వినపడలేదు. తొలి వానలకు ఏరు పొంగిందేమో నీరు పారుతున్న శబ్దం పురిటిగదికి వినిపిస్తోంది. ఇదేదో కొత్తది వస్తోంది. ఒక వింతగా చూద్దామని యెదురుచూస్తున్న వాళ్ళ దృష్టి యిప్పుడు వీధికి తూరుపువేపునున్న చివరి యింటివేపు మళ్ళింది. శాంతమ్మ తల్లి సుందరమ్మమీద పేరంటాలు వాలిందన్నారు. ఆ పేరంటాలెవరో కాదు. శాంతమ్మ అత్త రాజమ్మ. కన్నబాబు అయిదోయేట పోయింది. రాజమ్మ, సుందరమ్మ ఒకే వయసువాళ్ళు. ఒకేరోజు ఒకేపందిట్లో ఒకే ముహూర్తాన పెళ్ళయింది. పెళ్ళినాటికి యిద్దరివయసూ మూడేళ్ళే. మంగళస్నానాలు చలిలో చెయ్యించలేక చప్పున ఒక చెంబుడు నీళ్ళువేసి ఆ తరువాత తలమీద పళ్ళెం అడ్డుపెట్టి మిగతానీరంతా ఒంపారట. రాజమ్మంత అందగత్తె ఆ చుట్టుపట్ల గ్రామాల్లో వుండేదికాదట! ఆమె అందాన్ని చూడడానికి ఆడవాళ్ళు అదేపనిగా

వచ్చి చూసేవారట. పాపిడిబిందెలు పాపడాతో కాలికి వెండిమువ్వల పట్టీలతో నడుస్తుంటే భాగవతంలో భామలా వుండేదంటారు. పదిహేడేళ్ళక్రితం గతించిన యీమె యీనాటికి కొడుకు కడుపుకు వస్తున్నానంది. అందరిముఖాలు యీ వార్తతో ముడుచుకుపోయాయ్. "ఆడపిల్లర్రా ఆడపిల్ల" అన్నారు. ఈ వార్త అప్పుడే పురిటిగదివరకూ ప్రాకిపోయింది.

"ఆ అందంతోనే వస్తున్నావా?" అని ప్రశ్నించిందొకామె. ఆరోజుల్లో ఆవిడ అందాన్ని మెచ్చుకున్నావిడే ఆవూరి గ్రామకరణం భార్య.

"అ అందంతో యెలాగొస్తానే? అందం ఆడదాని సొత్తు"

"అయితే యేరూపుతో వస్తున్నావ్?"

"మొగరూపుతో వస్తున్నానే! ప్రబలమెత్తడానికి వస్తున్నానే... "

"ఆడపిల్లకాదర్రో ... మగపిల్లాడే పుట్టాడు" మళ్ళీ గోల.

ఈ వార్త పురిటిగదివరకూ పరిగెత్తింది. ఆడా మగా మగా ఆడా మధ్య రాత్రి పదిగంటలవరకూ తర్జన భర్జనలు ఆశ నిరాశలూ పెనవేసుకుంటుంటే యేవార్తా పురిటిగదినించి రావటంలేదు.

"ఏ పెద్దల పేరంటాలను మొక్కడం మరచిపోయారో? శాంతమ్మకు యే కోరికలు మిగిలిపోయాయో? ఏ దాతా దైవం అడ్డుపడకుండా యే భూత పిశాచాలు అడ్డుకుంటున్నాయో?" ఇలా మళ్ళీ వీధి వీదంతా అయోమయావస్థలో పడిపోగానే అప్పుడు ఉదయమే చక్రాంకితాలు వేసుకున్న గోపాలం, ఆగ్రాసనంపై కూర్చున్న ఆచార్యులవారి దగ్గరకు వెళ్ళి వేడుకున్నాడు.

అతను అలా వేడుకుంటున్నాడని వీధంతా తెలిసిపోయింది. అంతా ఆచార్యులవారు కూర్చున్న ప్రత్యేకమైన గదివైపు వెళ్లారు. అతను వేళ్ళు లెక్కపెట్టూ గణిస్తుంటే నిశ్శబ్దంతో నిల్చున్నారు. పసిమిరంగుతో ఆజానుబాహు మనిషి ఆచార్యులవారు ముఖం నిండుగా పట్టెవర్ధనాలు. హుందాగాకూర్చొనే.

"ఈవేళ మఖానక్షత్రం. సింహరాసి, ఆలస్యం మంచిదే, రాత్రి 12-30 గంటలనించి 2-19 నిముషాల్లోపల పురుడువస్తే తప్పక మగబిడ్డే. రెండుగంటల పందొమ్మిదినిముషాలు దాటితే ఆడబిడ్డ."

కొద్దిగా ఆలస్యం కావడం మంచిదేనని అందరూ కోరుకున్నారు. రాత్రి పన్నెండు దాటిపోయింది. ఇంకా కొంతమంది తెలివేసేవున్నారు. సరిగ్గా రాత్రి ఒంటిగంట ముప్ఫైయైదునిముషాలకు అంతా పెద్దనిట్టూర్చారు. ఇరవై రెండేళ్ళ తర్వాత యింట్లో తొలికేక వినిపించింది. కొత్తనీరు ప్రవహించింది. కన్నబాబుకు కొడుకుపుట్టాడు. గోపాలంకు పేలాలు జల్లడానికి మనుమడు పుట్టాడు.

తన అధిక్యత నిలుపుకోడానికి ఆచార్యులవారు ఉదయమే కొత్తగా వుదయించిన బిడ్డ జాతకచక్రం గీసేసారు. మేషలగ్నం, సింహరాశి, మఖా నక్షత్రం. గురుడు స్వస్థానం. రవి, రాహువులు మూడింట.... అష్టమశని యిలా చెప్పుకుంటూ అత్రుతతో వీటి ఫలితాలు యేమిటోఅని యెదురుచూస్తున్నవాళ్ళతో-

"పొ చిల్లాంటి తలవున్నా, పెద్దనుదురు తోటకూరలా పెరుగుతాడు. అందమైన అణుగుణమైన కళత్రం. హూణవిద్య అభ్యసిస్తాడు. రోగిష్టికానీ ఆయుర్దాయం యెక్కువ. పేరు ప్రతిష్టలు సంపాదిస్తాడు.

అప్పుడే అంతా నిజమైనట్లు వూరంతా యీ వింత ప్రాకిపోయింది. ఉదయమే ఏటిలో స్నానంచేసి యెందరెందరో ఆచార్యులవారికి కట్నాలు అర్పించుకుని చక్రాంకితాలు వేసుకున్నారు. అందుకు అతను ఆవూర్లో ఆగే గడువు యింకోరోజు పెంచాడు. పేరంటాలను ఆహ్వానించిన సుందరమ్మ ప్రయోగం యెవరూ పట్టించుకోలేదు. పరీక్షించి కొడుకుపుట్టాడని ధీమాగాచెప్పిన పున్నమ్మ శాస్త్రీయ దృక్పథం యెవరూ నమ్మనైనా నమ్మలేదు. ఆచార్యులవారి జ్యోతిషం ప్రతిభకు కీర్తించి అతనుచెప్పిన వాక్యాలు వేదవాక్యాలుగా తీసుకుని యీ బిడ్డ మీద ఆశలన్నీ కేంద్రీకరించుకున్నారు.

2

గురువుబాబు, మనుమడు గొప్పవాడౌతాడని చెప్పిపోడని గోపాలం వూరంతా చాటేసాడు. ఊరంతావచ్చి యీ పసికందుని చూసేసారు. అందుకే దిష్టిపడిపోయిందట. చనుపాలు నోటుకోలేకపోయాడట!

"రాజమ్మకు పుట్టుకకువచ్చిందంటే నేను నమ్మను. ఆవిడ గోదిచివరకు పోలడని" సుందరమ్మే అంటే.

"ఏమైంది? ఆ రంగు లేకపోయినా ఖంగుమని కేకలేస్తున్నాడు. కర్ర పుల్లల్లా వున్నా పొడుగ్గావున్నాయి కాళ్ళు చేతులు. ఆ లోతుకళ్ళూ దీటైన ముక్కు-తల్లివే...." అని కరణంభార్య అందుకుంటే.

"అదంతా అదృష్టవంతుని ఛాయలని" గోపాలం పొంగిపోయాడు. పుట్టక ముందు ఆశ. పుట్టినతరువాత అదృష్టం. ఆనిన కొన, తీవై అల్లుకోవాలన్న కాంక్ష. ఇంత అర్భకుడ్ని యెలా పెంచి పెద్దచేస్తామన్న బెంగ ఆ చిన్నిబాలింతరాల్లోనే ఆవరించింది. బిడ్డ యేడ్చినప్పుడల్లా, ఒకనాడు గూటిలో దీపందగ్గిర పెద్దపన్ను జుత్తుముడితోనున్న యెత్తైన విగ్రహం గుర్తుకొచ్చింది. ఈ సంగతి కన్నతల్లితో చెప్పుకుంటే అది వీధంతా ప్రాకిపోయింది. శాంతమ్మ పినతండ్రి కాశీపతి పీడా పిశాచులవైనం తెలిసినవాడని అంటారు. నమ్మినవాళ్ళు ఆ వైద్యం చెయ్యించుకోడానికి వస్తారు.

"ఆ దేవతపేరు ఎండమ్మ" అని కాశీపతే తేల్చాడు. దాని ఆకారం వర్ణించాడు. దానికి తగ్గ శాంతి చెయ్యకపోతే అది బిడ్డను లోనా బయటా యెండ బెట్టేస్తుందట. ఈ శాంతి ముందే చేసుంటే యీబిడ్డ కండతోపుట్టేవాడట. కావలసినంత చనుపాలు తాగేవాడట. ఆలస్యంకాలేదని పసుపుకొమ్ము దిగదుడిచి రాత్రి పెనకలో దోపాడు. మరుచటిరోజు రాత్రి వూరికి దక్షిణాన కుంభంపోసాడు. పాలు కొద్దిగా పడింది. ఆవుపాలు అంత పసిపాపకేం పెట్టడం? ఊర్లో బాలింతరాళ్ళు చనుపాలు పిండియిస్తే దూడితో నోట్లోపోసేవారు.

"ఇంతడిలాగా ఉన్నాడు. వీడేం బతుకుతాడని" లోలోన అనుకున్నవాళ్ళు లేకపోలేదు. ఈ మాటలు గోపాలం చెవివరకూ వెళ్ళాయి.

"తేటనీరు రావడానికి ముందు బురదనీరు పారాలి. గురువుగారు చెప్పారు కదా ప్రబలమెత్తుతాడని, ఆయుర్దాయం లేకపోతే ప్రబలమెలాయెత్తుతాడు?"

రాజశేఖరం యైదోనెలలోపడేసరికి రాజుగా చలామణి అయిపోయాడు. రాజు తీవిలేకపోయినా రారాజై యేలుతాడని గోపాలం నమ్మకం. వాడి నమ్మకం నిజమైనట్లు అరుస్తున్న రోజునే రాజుకేదో ఒక కీడు వస్తోంది. ఈ యైదోనెలలో యెవరో చుట్టాలు పైవూరినించి వచ్చి పిల్లడ్నిచూసి మురిసిపోయారు. వాళ్ళతో పాటు వాళ్ళయింటి దెయ్యంకూడా వచ్చిందట. రాజు రాత్రీ పగలు ఒకటేఏడుపు. పాలుపోసినా మీదవేసి తిప్పినా యేంచేసినా గుక్కపెట్టి యేడుస్తుంటే చివరకు కాశీపతే శరణ్యం.

"ఇది చిన్నదికాదు. పెద్దపిశాచం. దిగదుడుపులకు లొంగదు. అన్నింటికీ జయించి యీవూర్లో కాలుపెట్టింది. దీనికి ప్రాణంకావాల... " అంటూ కోడిపిల్లతో దిగదుడిచి వూరిబయటకు చుట్టాలువచ్చిన త్రోవగుండానేతీసుకవెళ్ళాడు. ఈలోగా కడుపునొప్పెమోనని సుందరమ్మ దుంపరాష్ట్రిం వగైరా మూలికలు నూరి పాలతో కలిపి పట్టింది. తెల్లవారేసరికి చుట్టాలు పోయారు. రాజు శాంతించాడు.

ఎనిమిదోనెలలో సరేసరి అన్నారు. ఇంక పిల్లడు దక్కడనిడయ్యో, మొర్రోమన్నారు. ఎవరుచెప్పిన వుపాయాలుచేస్తున్నారు. కడుపు కాపుతున్నారు. ఏడుస్తున్నాడు ఆ ఆపదలో ఆపదమొక్కులు మొక్కేసారు. నయం అయితే మూడోయేట సింహాచలం ఉగ్రనరసింహమూర్తి యెదర తలనీలాలు అర్పిస్తామని ముడుపుకట్టారు. ముడుపుకట్టి మొక్కినా ఏడుపు తగ్గలేదు. పున్నమ్మ పరీక్షచేసి చెప్పింది. "ఇదేదో మాయదారినొప్పి. ఉపశమనాలకు లొంగటంలేదు. వైద్యుడి

దగ్గరకు వెళ్తేగాని పిల్లడు దక్కడని" చెప్పేసింది. గోపాలం రెండుక్రోసుల దూరంలోనున్న ఆయుర్వేదవైద్యునిదగ్గరకు పరుగెత్తాడు. తిరిగి అంతవేగంగా మందు తీసుకవచ్చాడు. ఉసిరికపప్పు కషాయంతో యెర్రమాత్ర ఒకటి పడేసరికి పిల్లడు పడుకున్నాడు. ఇంకోమాత్ర వెయ్యగానే బాగుంది

"ఆ సింహాచలం దేముడు బాణంవేసాడు. సమయానికి వైద్యుడు వూర్లో వున్నాడు" అన్నారు వీధిలోవాళ్ళంతా! ఆ వైద్యుడ్ని తెమ్మని సలహాయిచ్చిన పున్నమ్మ సంగతే ఆలోచించలేదు. పున్నమ్మకు గురువుగారిలా జ్ఞానంలేదు, దేవునిలోవున్న మహిమలేదు. ముందూ వెనకాలేని వెర్రిబాగుల్ది. ఎదుటివారి నోటి దురదను పట్టించుకోకుండా యేడుమాసికల చీరకట్టుకుని, యేడు మెతుకులు ఆర్జించుకుంటోంది.

ఏడాది దాటేసరికి యీబిడ్డతో యేడుకాన్పుల కష్టమంతపడింది శాంతమ్మ.

"ఇంత యిప్పుడుచేస్తే పెద్దయితే ఉద్ధరిస్తాడు" అని కరణంభార్య అంటే-

"ఏంవచ్చినా గాలివానలా వస్తుందే గుండెదడపట్టుకుంటోంది"

శాంత మాటలు విన్న మామగారు

"ఈ చిన్నతనంలో కష్టాలన్నీ పడిపోతే - పెద్దయ్యాక వాడు సుఖపడి మీ అందరినీ సుఖపెట్టాడు"

"ఏం? మనుమడి ఆర్జన తినరా?" అంది కరణం భార్య.

"మనుమడి ఆర్జనా? రాజమ్మ పుట్టుకతువచ్చింది. దాని అందం అనుభవించడానికి నోచుకోలేనివాడ్ని వీడి ఆర్జన తినడానికి బ్రతికుంటానా;"

గోపాలంది నలుపైనా నిగనిగలాడే ముఖం. ఆ ముఖంలో స్పష్టంగా కనిపించే పట్టివర్ధనాలు. నెత్తిపై యెల్లప్పుడూ అలంకరించుకునివుండే తలపాగా. ఎత్తుకు యెత్తు. ఆ యెత్తుకుతగ్గ గుండె. ఆ జాలిగుండెను మధురంగా ఆలాపింపగల గొంతుక ఊరు వూరంతటికీ తను సమ్మోహనంచెయ్యగల చతురుడు. వీధి ద్వారం బయటనున్న పెద్ద మర్రిచెట్టుక్రిందనున్న కచేరీసావిడిలో సాయంత్రం మఠంవేసుకుని శ్రీమదాంధ్ర మహాభాగవతంలో ఘట్టమో, మహాభారతంలో తిక్కన విరాటోద్యోగ పర్వాలో కంఠస్థంచేసినట్లు చెప్తుంటే పిట్టలుకూడా శబ్దం చెయ్యవు. ఏడాదినించి నడుస్తున్న మనుమడు వెంటవుంటున్నాడు. మర్రిచెట్టు క్రింద తాతప్రక్కనే కూర్చుంటున్నాడు. ఆ చెట్టునించిచూస్తే నదిలో కదిలే ఓడలు కన్పిస్తుంటాయ్. ఒకోసారి కమ్మని స్వరాలు విన్పిస్తున్నాయ్ ఊర్లో వీధినాటకాల్లో గోపాలం కృష్ణుడుపాత్రవేస్తే కన్నబాబు అర్జునుడిపాత్ర వెయ్యడం కద్దు. ఎదుగుతున్న మనుమడు తాతని విడిచిపెట్టడు. తాత మనుమడ్ని విడిచి పెట్టలేడు. ఒకోసారి స్టేజిమీదకు రాజు వెళ్ళి తాతదగ్గరే కూర్చుంటున్నాడు.

రాజుకు యివేవీ గుర్తుండేవయసు కాదు. తల్లిగర్భంలోవుండి చక్కని పద్యాలు విన్నాడో లేదోగానీ యిప్పుడు వినగలుగుతున్నాడు. సంగీతానికి రుచిపడ్డ చెవులు ఒకరీతిగాపోయే పద్యానికి అనుసరించే నాటక కదలిక ఊహాలకు స్వరూపానిచ్చే భంగిమలుచూసేవాళ్ళు తాతగుణాలు అబ్బుతున్నాయనుకుంటున్నారు. కానీ తనకు యేమిటి వుందో లేదో తెలియదు. ఏదో అనుకరణ చేస్తున్నట్లు తెలీదు. ఏమంటున్నాడో యెందుకంటున్నాడో, యేంచేస్తున్నాడో యెందుకుచేస్తున్నాడో యేమీతెలియని అవస్థ.

ఇటువంటి అవస్థ పెద్దవాళ్ళలోకూడా వుంటుందన్నట్లు యెన్నోసార్లు గోపాలం సంచరించిన తీరునుబట్టి చెప్పవచ్చు. "ఒకసారి తన తండ్రితో పోట్లాడి వేరైపోయి, తండ్రి పోయేవరకూ మాట్లాడనివాడు యీవూర్లోనేకాదు యేచరిత్రలో లేదంటారు" గోపాలంగురించి వూర్లో తెలిసినవాళ్లు "వయసులో వున్నప్పుడు పెళ్ళంపోతే యింకో ఆడదానివేపు కన్నెత్తిచూడని మగపురుషుడు" గోపాలం తప్పించి యింకొకరు లేరంటారు.

ఇలా గోపాలంగురించి చెప్పడానికి యెంతోవుంది. తాతను అనుసరించే మనుమడు యెదిగాక తిన్నదీ, విన్నదీ కన్నదీ యెంత జీర్ణించుకుంటాడో చూడాలి మరి.

మూడోయేట రైలుయెక్కాడు. గుర్తులేదు. విజయనగరంలో దిగి రామతీర్థాల్లో రాముని సేవించి సింహాచలంలో జడలు అల్లిన జుత్తుఅర్పించి తిరిగి వచ్చాక రాజులో చిరాకు తగ్గింది. బహుశః ఆ జడల్లోవున్న పేలు పీకుతుండేవేమో? కానీ యింట్లో యీ మార్పుకు కారణం దేవునికి మొక్కుబడి తీర్చటంవల్లనని చెప్పుకునేవారు.

గోపాలంకి చూపుడువేలు కొండిప. అందుకే అతనికి ముందుచూపులేదని కొందరు వరసైనవాళ్ళు వేళాకోళం చేస్తారు. ఈ మొండివేలుతోనే యింట్లో మనుమడికి అక్షరాభ్యాసం చెయ్యించాడు. తాత, రాజు వ్రేలుపట్టుకొని శ్రీకారం కుదురుగా బియ్యంమీద చుట్టగానే గోపాలం చేటంతముఖంతో "శ్రీకారం సులువుగా చుట్టాడు. వీడు గొప్ప రాతగాడౌతాడు" అని అన్నాడు. చుట్టూ చేరినవాళ్ళు "శుభం" అన్నారు.

ఎదుగుతున్న రాజు చూడ్డానికి వికృతంగా లేకపోయినా, ముచ్చటగా ముద్దులాడ్డానికి పట్టుకోడానికి కండలు శరీరంలో సర్దుకోలేదు. పొలికేలు తలకాయనంతా సర్దుకున్న జుత్తు. ఆ తీక్షణమైన కళ్లు తప్పించి చెప్పుకోతగ్గవేమీలేదు. గొంతెత్తి తాతలా పద్యం చెప్పడంలేదు. వీడు పుట్టినతర్వాత యేదో సిరి కొట్టుకవస్తుందని యెదురుచూసిన తల్లి, రోజుకు రోజూ భర్త రాత్రి పగలు సంసారం యీదడానికి పడుతున్న తాపత్రయం చూసి చప్పబడిపోయింది. దానికితోడు మామగారు పెళ్ళంపోయాక యెవరూ తోడులేరనికామోసు నోట్లో సత్యంవెలిగే చుట్టను తోడుచేసుకొని యింతో అంతో డబ్బు అనవసరంగా కాల్చేస్తున్నారు. ఇదివరకు యిలాంటివి పట్టింవుచేసుకునే వయసులేదు. ఇప్పుడు ఇద్దరి పిల్లలతో యింటిని నడపడం కష్టమౌతోంది. ఏ ఖర్చుతగ్గిస్తే మూడుపూటలు మూతులు తడుపుకోవచ్చన్న ఆరాటంలోపడింది. అంతా పోగా మిగిలిన పొలం ఓ పది సెంటుంది. దానిమీద గోపాలం యెప్పుడో ఆమె పెళ్ళిముందు యిరవై రూపాయలు వడ్డీకి వాడాడు. వడ్డీతోసహా బాకీ నూటతొమ్మిది రూపాయలకు తేలింది. పోతే పొలంపోనీ, తీసుకోమంటే ఆ పొలం అమ్మితే మూడుపదులైనా రావు. అందుకే అప్పిచ్చినవాడు గోపాలంమీద అరెస్టువారెంటు తెచ్చాడు, జైలుకు వెళ్తె యెంత నామోషి. ఉన్న పిసరాపిప్పి, యిదీ అదీ అమ్మేసి ఆ డబ్బుకట్టాక శాంతమ్మ కటకటలాడిపోయింది. చప్పన నోరు జారేసుకుంది.

"ఏం మిగిల్చారు? అప్పలేమిగిల్చారుకదా?" అని.

గోపాలం కాస్సేపటికి గానీ తట్టుకోలేకపోయాడు. తట్టుకున్నాక పెద్ద జవాబే యిచ్చారు.

"ఆరోజుల్లో యీఏటిమీద వంతెనలేదు. నట్టేట్లో నిల్చున్నాను. ప్రవాహం కొట్టుకపోయింది. ఇప్పుడు చూడు వారధికట్టారు. ఇదిగో వారధిలా నా మనుమడు రాజు వుదయించాడు. ఆగు- జీవితం సులువౌతుందిలే."

ఆ వారధి కట్టిన కొత్తలో ఒక జట్కా ఒక రెండెడ్లబండి వారధిమీద గట్టిగా గుద్దుకున్నాయ్. జట్కాలోనున్న ఒక ఆడమనిషి దెబ్బలుతిని అక్కడికక్కడే చచ్చిపోయింది. ఆ చచ్చినమనిషి దెయ్యం అయిందని పుకారు. ఒక రోజు రాజుయెండలో వారధివేపు వెళ్ళాడు. వెళ్ళడం గుర్తుంది. రావడం గుర్తులేదు. మంచి రాత్రిమీద తెలివివచ్చింది. అప్పటికే మూర్ఛ అనుకొని నాటు వైద్యంచేసేసారు. పసుపుకొమ్ము కాల్చి రెండుచెంపలమీద పైభాగంలో, మెడమీద చురకలుపెట్టేసారు. తరువాత పేరంటాలు సుందరమ్మ మీదపడి "అదిమూర్ఛ కాదు. వారధి దెయ్యంపట్టిందని" చెప్పిందట. ఆ కాల్చినచోట తర్వాత చీముపట్టి పెద్ద పుళ్ళు అయిపోయి నానాచికాకుపెట్టేసింది. రాజుగాపుట్టుకొచ్చిన రాజమ్మ యింకా పేరంటాలుగా యెలావుందని యెవరూ అడగలేదు. ఎవరికి ఏదైనా ఒంటికి వస్తే దెయ్యంపట్టినట్లుందనటం ఆవీధిలో కొన్నాళ్ళపాటు అలవాటైపోయింది.

3

ఆ చుట్టుపట్ల మూడుగ్రామాలకు అదొక్కటే బడి. ఈ బడిలో ఒకే టీచరు. ఆ టీచరు యైదోక్లాసువరకూ పిల్లలందరికీ లెక్కలుదగ్గిరనించి తెలుగువాచకం వరకూ చెప్పాలి. ఈ మేష్టారికి జీతం సంవత్సరానికి ఒక్కసారే గ్రాంట్‌రూపంగా వస్తుంది. రాజు యీబడిలో చేరేసరికి ఆ గ్రాంట్ సంవత్సరానికి కోతలు లేకపోతే నూటయెనిమిదిరూపాయలు. ఇందులోనించే బడికి కావలసిన హంగులు, ప్రతి యేడాది బడి యింటికప్పు నేత వగైరా ఖర్చులు భరించవలసిందే. ఈ మేనేజ్‌మెంట్ బడికి మేనేజరూ మేష్టారూ కన్నబాబే! ఇదివరకున్న మేనేజరు వూర్లో డబ్బు తినేసిపోతే వాడిదగ్గర పదిరూపాయలకు యీ మేనేజ్‌మెంట్ కొనుక్కున్నాడు కన్నబాబు. కొనుక్కోవడానికి డబ్బులేకపోతే వాయిదాలమీద చెల్లించాడు కన్నబాబు యైదోక్లాసు చదువుకొని బడిపంతులయ్యాడు. కొన్నాళ్ళుపోయాక టీచరు ట్రయినింగు అయ్యాడు. తనకు వూహవచ్చిన దగ్గరనించి యాతన తప్పలేదు. యైదోయేట తల్లి పోయేటప్పుడు యింట్లో అన్నీవున్నాయ్. రాజమ్మ పోతూ సిరినికూడా వెంట తీసుకపోయిందంటారు. కన్నబాబు పదేళ్ళ నుంచీ వూర్లో పిల్లలను పోగుచేసి చదువుచెప్పడం మొదలుపెట్టాడు. ఈ యాతన పెరుగుతూవచ్చిందేగానీ తరగలేదు.

గోపాలంకి తప్పించి రాజుఅంటే అపురూపమైన వాడన్న ధ్యాస వీధిలోనే పోయింది. ఇలా పుట్టగానే అలా పోయిన సిరివచ్చి పడుతుందనుకున్న వాళ్ళల్లో కలిగిన ఆశాభంగం కొంత దీనికి కారణంకావచ్చు. బడిలో తనకేం ప్రత్యేకత లేదు. మిగతావాళ్ళతోపాటు పాఠం సరిగ్గా చెప్పకపోతే తండ్రే బుగ్గపోటు పొడిచే వాడు. బుగ్గపోట్లు తిననివాళ్ళు కొందరుండేవాళ్ళు. వాళ్ళు వేరేగా కూర్చునేవారు. వాళ్ళను ముట్టుకోకూడదని బడిలో చేరకముందే రాజుకు తెలుసు. ఆ మాలవీధిలో అడుగుపెట్టకూడదని తెలుసు, ఊర్లో చాకలివీధి, మంగలివీధి, కాపువీధి, కరణాల వీధి, కోమటివీధి, జాలారివీధి యిలా వీధులుగా విడిపోయి వీధికొకరు పెత్తనం చలాయించినా అసలు పెత్తనం యింకొకరిచేతిలో వుండేది.

ఎదుగుతున్నకొద్దీ రాజులో యెన్నెన్నో ప్రశ్నలుదయించేవి. అడిగితే నాన్నకు కోపంవస్తుందనే భయం. కోపంవస్తే కొడ్తాడన్న భయం. ఈ భయాల్లో పడి తెలియనివి అడగలేదు. బోధపర్చినదాంట్లో తెలుసుకున్నవే మనసులో మననం చేసుకున్నాడు. తెలియనివి తాతని అడిగితే తెలుసుకోవచ్చని తెలిసింది. తాత పద్యంసదీస్తూ బాగాపాడుతాడు. పాండవుల కౌరవుల చరిత్ర చెప్పగలడు. ఇక కాశీపతి వున్నాడంటే యిహేపి తెలివు. రాజుకు కాశీపతి అంటే యిష్టం. కాశీపతి ఒకే కొడుకు సత్యం అంటే మరీయిష్టం. సత్యం తనకన్నా ఒక యేడాది పెద్ద. అయినా తన క్లాసులోనే వున్నాడు. ఎక్కడచూసినా యిద్దరూ జయవిజయుల్లా తిరుగుతున్నారనేవారు. సత్యంది మంచిరూపు. వాడి కళ్ళల్లో మత్తువుండేది. వాడి



నవ్వుచ్చుదగ్గర రాజు నగదుడిదిసట్టుండేవాడు. రాజంటే వాడికి యెదతెగని అభిమానం. ఎప్పుడూ ఏదో తెచ్చి దాచి మరీ తినడానికి యిస్తుండేవాడు. తనకు అబ్బని గోపాలం గొంతుక సత్యంకి అబ్బినట్టుంది. జీడితోటల్లో, చెట్లన, ఏటిలో ఈదుతున్నప్పుడు, ఇసుకదిబ్బలపై ఆడుతున్నప్పుడు కూనిరాగంతో పద్యాలు పాడుతుండేవాడు. ఇద్దరూ కలసి కాశీపతితో యాత్రకు వెళ్ళారు. కాశీపతి కడుపునిండా కథలే. అందులో దెయ్యంకథలనించి భేతాళకథలువరకు వుండేవి. కథలు కథలుగా కాదు అవన్నీ నిజంగా జరిగినట్లు చెప్పేవాడు. సత్యంని, రాజుని చెరో భుజంమీద కూర్చోబెట్టి ఆంజనేయులవారిలా గెంతుతూ పొరుగూరు యాత్రకు తీసుకవెళ్ళాడు. తొలిసారి యాత్రచూసిన రాజు గెంతులేసాడు, అక్కడ పాములవాడు నాగస్వరం వాయించి పామును ఆడించటం తొలిసారి చూసాడు. ఆ ప్రక్కనే తీపితీపి మిఠాయికొట్లు, బొమ్మల అంగడి. రంగులరాట్నం ప్రతిదీ వింతగాతోచింది. రోజూ యాత్రవుంటే బాగున్ననిపించింది. తిరిగివస్తూ కాశీపతి నడిపించుకవచ్చాడు. నడుస్తూ అలసటలేకండా వుండటానికి కథలు చెప్పాడు. సాయంత్రం అయితే అతనిచుట్టూ మూగి కథలుచెప్పమనడం అలవాటై పోయింది. చదువుకన్నా కథలు వినడం ముఖ్యమయింది రాజుకి. కాశీపతి అనగా అనగా ఒక రాజు అని చెప్పేవాడుకాడు. ఫలానావూర్లో ఫలానారాజు యేలుబడి చేస్తుండేవాడని చెప్పేవాడు. వాడి పుట్టుపూర్వోత్తరాలు, వాడిలోపాలూ కోపాలు లాపాయీ అన్నీ చెప్పగానే యెదరగా ఆ రాజు నిల్చున్నట్లే అనిపించేది.

ఊర్లో అమ్మవారిగుడి రోడ్డువారవుంది. ఒకసారి పిల్లలతో అలావస్తూ నమస్కారంచేసాడు. పిల్లలనీ నమస్కారంచెయ్యమన్నాడు కాశీపతి. ఒక మర్రిచెట్టు దానికి ఆనుకునే ఒక వేపచెట్టు. ఆ చెట్టు మొదట్లో రాతిపైచెక్కిన రెండు పాదాలు. ఇదే గుడి అన్నట్లు రాజు చూసాడు.

"అమ్మవారిని నేను చూసాను."

రాజువయసూ ఆలోచనలతో యెదిగాడు కాబట్టి కాస్త అనుమానంగా చూసాడు. ఇంతకీ యెక్కడ తను యిలా అమ్మవారిని చూసాడో చెప్పకొచ్చాడు.

"పుష్యమాసం. అమావాస్యరాత్రి. వరిచేను కోసారు. అందుకే పొలంలో పడుకున్నాను. అర్ధరాత్రిమీద కవ్వోకవ్వోకో అన్న శబ్దం వినపడి లేచాను. కటిక చీకటి. రోడ్డుమీద వెల్తురు కనిపించింది. పల్లకీ బోయీలు మోస్తున్నారు. ఈ అమ్మవారి గుడి యెదిరగా పల్లకీ ఆగింది. అందులోనించి అమ్మవారు దిగింది. నా కళ్ళతో చూడలేని ధగధగ ఎన్ని చేతులున్నాయో చెప్పలేను. మాయమై పోయింది. ఆ మరుచటిరోజు వూర్లో కలరా- చాలామంది చచ్చిపోయారు."

"మంచివాళ్ళనుకూడానా?" రాజు అడిగాడు.

"చెడ్డవాళ్ళతోపాటు మంచివాళ్ళకూడా చచ్చిపోయారు"

"మంచివాళ్ళను అమ్మవారు చంపకూడదా:"

"చెడ్డవాళ్ళని చంపాలంటే అమ్మవారుకూడా వాళ్ళతో పోట్లాడాలి, ఆ పోట్లాటలో మంచివాళ్ళుకూడా కొందరు బలి అవుతుంటారు తప్పదు"

ఇలా చిఘంమీద ఆసక్తి కాశీపతి పుట్టిస్తుంటే బడిలో చదువు భిన్నంగా వుండే.

"గురువులను, తల్లితండ్రులను పెద్దలను పూజించవలెను"
"అక్కరకురాని చుట్టాన్ని
మొక్కితే వరమీయని దేవుణ్ని వదలవలెను"
వరాలిచ్చే దేముడైతేనే తెలుసుకొని మొక్కాలన్నమాట!

ప్రతి మనిషి జీవితగమ్యం యిలావుండాలని కన్నబాబు నొక్కినొక్కి చదువు చెప్తున్నాడు.

జీవితంలో కోపం వుండకూడదు.

తన కోపమే తన శత్రువు

తన శాంతమే తనకు రక్ష

తన దయ తన చుట్టం

తన సంతోషం తన స్వర్గం

తన దుఃఖమే తన నరకం....

అంతా తన తన తన... తనని మరచినవాడు బతకలేడు. ఇది కంఠో కంచేసి చెప్పనివాసిచేత వంద గుంజీలు తియ్యించేవాడు కన్నబాబు.

"జీవితంలో పోనిది యేమిటి ?

విద్య మరచిపోవచ్చు. పోదుసుమీ కీర్తికాంత పొందినపిదపన్... అంచేత ...కాంతను పొందడానికి ఏంచెయ్యాలి?"

"మనిషి ధన్యుడవ్వాలి!"

"ఎలా ధన్యుడవుతాడు?"

"ఎప్పటికియ్యది ప్రస్తుత

మప్పటికా మాటలాడి అన్యుల మనసును

నొప్పించకండా, తాను నొవ్వకండా

తప్పించుక తిరుగవాడు ధన్యుడౌతాడు"

ఇవన్నీ ఒక శాసనాలుగా కన్నబాబు భావించి, శిష్యులందరి మనసులో ...క్షరాలుగా వుండిపోయేటట్లు చెక్కుతున్నాడు. కాశీపతిచెప్పిన కథలు కంఠస్థం ...య్యలేదు. ఈ నీతులు కంఠస్థంకావటంవలన నాలిక చివర్లో వుంటున్నాయ్. చేసినా చేస్తున్నా యీ నీతులు కన్నబాబు అన్వయించిన రీతిలోనే రాజు ...దడులో అల్లుకుని స్థావరం ఏర్పరచుకున్నాయి.

ఇలా చదువు సాగుతుండగా కొత్త ఇన్‌స్పెక్టరు వస్తున్నాడని తెలిసింది. స్కూళ్ళ యిన్‌స్పెక్టరు చండశాసనుడట వాడు సాధారణంగా చెప్పిరాడు. ...కన్నబాబంటే దయతలచి కబురంపి మరీ వస్తున్నాడు వారంరోజు లుండనగా ...ం అట్టహాసం. గబగబ అరటిమొక్కలు బడి పెరటితోటలో నాటించేరు.

ఈవారంలో చిగురుపెట్టగలిగే కొమ్మలేమైనా వుంటే అవికూడా నాటడం ...గించి బడికి వెల్లవేసారు. రెండు పిల్లులు రొట్టెముక్కకు తగువులాడి కోతి ...దకు న్యాయంకి వెళ్ళడం, దాహంవేసిన కాకికథ యిలాంటివి కథలతోవున్న ...పుకాగితాలు అట్టలపై అంటించి స్కూలు గోడలకు కొట్టారు. హాజరుపట్టీలో ...కుండానే హాజరైనట్లు రాస్తుండిన పిల్లలను యీ వారంరోజులూ బడికి రోజూ ...పమని కన్నబాబు స్వయంగా వెళ్ళి వాళ్ళ తల్లితండ్రులతో బతిమాలాడు ...డాను.. ఎలాగో అతను వచ్చిన నాటికి కావలసినంత మందిని హాజరుపర్చ ...గాడు. లేకపోతే స్కూలు యిక్కడవుండవలసిన అవసరంలేదని అతగాడు ...సేవొచ్చు. వచ్చే గ్రాంటుతోపాటు వూర్లోవచ్చే రాబడిపోతే బతకడమెలా?

చీకటిపడ్తుండగా ఇన్‌స్పెక్టరు వస్తున్న రెండెడ్లబండి గంటల గణగణ వి... ...చింది. కన్నబాబుతోపాటు కొందరు స్కూలుపిల్లలుకూడా యెదురెళ్ళిస్వాగతం ...కారు. అతనికోసం అమర్చిన విడిదిలో ఇన్‌స్పెక్టరుగారు వేంచేసారు. అతని ...రు గాదె నారాయుడు. ఆడద్దైయుంటే గేదెలా వున్నదనేవారే. గ్లాస్కోపంచె ...స్త అందులోదోపిన తెల్లని కమీజుమీద నల్లకోటు వేసుకున్నాడు తలమీద తెల్లని ...లపాగా వుంది. పెట్టింది వద్దనకండా తనూ తిన్నాడు. తన బంట్రోతును తిన ...న్నాడు. రెండెద్దులుకూడా పుష్టిగా యెక్కించాయి. కన్నబాబు అతను యేదన్నా ...త్తం చిత్తం అంటుంటే దగ్గిరేవున్న రాజు, సత్యం వింటూనేవున్నారు. ఇంటికి ...స్తూ రాజుకు యిన్‌స్పెక్టరు పని అంటే రెండెడ్లబండీ, మంచి తిండీ, మేష్టర్లచేత ...త్తం చిత్తం అనిపించుకోవచ్చని సత్యంతో అన్నాడు.

"సత్యం! అయితే యిన్‌స్పెక్టరే అవ్వాలి"

"నివ్వే అవ్వాలి-నేను అవ్వను"

"ఏం?"

"దానికి చదువుకోవాల"

"నివ్వు చదవ్వా?"

"మానాన్న యీబడి చదువైపోయాక తనవెంట పొలాల్లోతిప్పుతుంటాడట!" సత్యం అన్నాడు.

ఇంత తిన్న ఆ ఇన్‌స్పెక్టరు మరుచటిరోజు బడిలో యిది సరిగ్గాలేదు అది సరిగ్గాలేదని అరుస్తున్నాడు. దేనికీ కన్నబాబు చిత్తం చిత్తం అని ఒక వూత పదంలా అంటున్నాడు- ఐదోక్లాసుకు వచ్చేసరికి

"నీ పేరు?" అని అడిగాడు యిన్‌స్పెక్టరు

"రాజశేఖరం"

"ఒక గొప్పవాని పేరుచెప్పు"

"కాశీపతి" అన్నాడు సంకోచించకండా రాజు,

"కన్నబాబూ- ఎవడయ్యా యీ కాశీపతి?"

"మా చినమామగారండీ"

"ఎందుకోయ్ వాడ్ని గొప్పవాడంటున్నావ్" రాజునే ప్రశ్నిస్తే

"మంచి మంచి కథలు చెప్తాడండీ"

"నీకు కథలంటే యిష్టమా?"

రాజు అవునన్నట్లు తల ఆడించాడు.

"పదినిముషాలు టైంయిస్తాను. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన కథ చెప్పకు. ఆలోచించి కథ అల్లి చెప్పు" అంట్ూ యింకోవిద్యార్థిమీద దృష్టిమరల్చాడు.

రాజు మనసులో తొలిసారి యాత్రలో రంగులరాట్నం యెక్కి వూగుతున్నట్లు ఆలోచనలు గిర్రున తిరిగాయ్. రంగులరాట్నం- యాత్ర- ఆ బొమ్మల అంగడి, తియ్యని చెరుకుగడలు, తీపితీపి మిఠాయి, రకరకాల రంగు రంగుల దుస్తులు.... తీర్థప్రజ... ఎన్నెన్నో స్వరాలు, రాగాలు అవన్నీ ఓ హరివిల్లులా కనిపిస్తుండే వాటిమధ్య నాగస్వరం, ఆ స్వరానికి పడగెత్తి తన్మయత్వంతో ఆడుతున్న నాగు....

ఆమధ్య తనువున్నాడు. బడిలో యిన్‌స్పెక్టరు యెదరగాలేదు. అతనిగంభీర స్వరం విన్పించలేదు. ప్రక్కనున్న సత్యం కదిపితేగానీ మళ్ళీ బడిలోనున్నానన్న ధ్యాసరాలేదు.

"నీ కథ చెప్పు" అన్నాడు నారాయుడు.

"ఒకవూర్లో......"

"కథ పేరేమిటి?"

"కథపేరా- కథపేరు ...యాత్ర..."

"బాగుంది-చెప్పు"

"యాత్ర. జనం. ఎంతోమంది జనం. పెద్దలు పిన్నలు అంతా పిల్లల్లా గెంతుతున్నారు. ఆ యాత్రలో యెన్నో దుకాణాలు, తీపితీపి మిఠాయి, మరేమో ఆడుకోడానికి బొమ్మలు- ఒక కుర్రాడు. వాడికి అమ్మా నాన్నా లేరు. డబ్బులేదు. అన్నీకావాలి, ఎలాగొస్తుంది? ఇంకోకుర్రాడిదగ్గర డబ్బుంది. పందెంవేసారు. ఒక చోట పడగెత్తింది నాగుపాము. పాములవాడు ఆడిస్తున్నాడు. వాడు ముట్టుకుంటే పాము యేంచెయ్యదు. వాడికి మంత్రం వచ్చునని వీడికి తెలీదు. పామేమీ చెయ్యదని యీ పేదపిల్లవాడు పందెంగెలిచి మిఠాయి కొనుక్కుందామని పాముని ముట్టుకుంటాడు. అది కాటేసింది. పాపం విషంతో చచ్చిపోయాడు."

రాజు చెప్పగానే కన్నబాబు జోక్యంచేసుకొని

"ఈ కథ నీతేమిటి?"

"నిన్ను పరీక్షించలేదయ్యా" అని నారాయడు అన్నా వినిపించుకోక కన్నబాబు అదే దీక్షతో

"ఖలునకు అంటే చెడ్డవానికి నిలువెల్ల పాములానే విషంవుంటుంది. అందు వలన మీరంతా చెడ్డవాళ్ళకు దూరంగా వుండవలెను."

నారాయడు ఖనేల్‌మన్న గొంతుకతో "పిల్లలకు యిలాంటి చదువునే చెప్తున్నావా?" అని అడిగాడు.

"చిత్తం మన పెద్దలుచెప్పిన నీతులు బోధించవద్దండీ?"

నారాయడు పిల్లలవేపు తిరిగి

"రాజశేఖరం స్వంతంగా అల్లి మరీ కథచెప్పాడు. మంచికథ చెప్పాడు. ఈ కథలో ఒక-పాముపుంది. పాములో విషంవుంది. చెడ్డది అన్నమాట. ఈ చెడ్డ దాన్ని పాములవాడు వశంచేసుకుని డబ్బులుకూడా సంపాదించి తింటున్నాడుకదా! అంటే చెడ్డవానిని సరిగ్గా తిప్పితే పనికివచ్చే పనిచేస్తాడుకదా! మరి దూరంగా వుంచితే మరీ చెడ్డవాడు అయిపోతాడుకదా!"

అందరికీ యిదొక కొత్తఆలోచనలా తోచింది. ఇతనెవరో కొత్తమనిషిలా కనిపించాడు. కొత్తగొంతుకతో మాటాడుతున్నాడనిపించింది. రాజులో ఒకకొత్త ప్రశ్న వుదయించింది. అడిగేద్దామనుకున్నాడు గానీ తండ్రిముఖంచూసి నోరు నొక్కుకున్నాడు. కాస్సేపుపోయాక నారాయడు అన్నాడు "కన్నబాబూ?"

"చిత్తం"

"నాలా ఇంగ్లీషునేర్చుకోవోయ్"

"ఇప్పుడు దాని అవసరం నాకేంవుంది బాబూ?"

"ఆ భాషలో కొత్త ఆలోచనలున్నాయి. పాతబాణీ మార్చి కొత్త బాణీలో అప్పుడుగానీ చదువు చెప్పలేవు" అంటూ యైదోక్లాసు అబ్బాయిలవేపు తిరిగి

"అబ్బాయిలూ మీరంతా తెలుగు బాగా నేర్చుకున్నారు. ఇంగ్లీషు చదువు కూడా బాగా నేర్చుకోండి పైకొస్తారు."

నారాయడు వెళ్ళిపోయాక కన్నబాబు బడిలోవున్నా ఖర్చు వెచ్చాలలో తికమకపడుతున్నాడు. అనుకున్నదానికన్న నారాయడు బృందం యెడ్లతోసహా రెండింతలు మేసాయి. పోనీ యింత ఖర్చుపెట్టించినవాడు యెంతో గొప్పగా స్కూలుంది. ఇంకో అసిస్టెంటు అవసరంవుందని రాస్తాడంపే అదేం చెయ్యలేదు సరికదా చాలా హెచ్చరికలుచేసాడు. ఈ గొడవల్లో తను ప్రశ్నవేస్తే కోపం వస్తుందని సత్యంచేత ఆ ప్రశ్న వెయ్యించాడు రాజు.

"ఈబడిలో మాలపిల్లలు మంచివారుకదా వాళ్ళను దూరంగా మమ్మల్నెందుకు కూర్చోబెట్టారు?"

కన్నబాబుకి కోపంవచ్చి ఛర్రునలేచి

"అవి వాళ్ళ ఖర్మరా!" అని కటువుగా అనగానే యింకేమీ మాటాడే అవకాశంలేదు. బడి వదిలాక సత్యం, రాజూ అనుకున్నారు.

"ఖర్మంటే యేమిటిరా సత్యం?"

"అదొక అమ్మవారేమోరా రాజూ"

"అమ్మవారు మీ నాన్నలాగ కొందరికే కనిపిస్తుందిరా! ఖర్మఅమ్మవారైతే అందరికీ కనిపించదేమో?"

"ఈ మాలవాళ్ళకందరికీ ఆ ఖర్మం అమ్మవారు కనిపిస్తుందేమో?"

"అయ్యుండాలి. లేకపోతే వాళ్ళఖర్మ అని యెందుకంటారు సత్యం?"

"అమ్మవారిగురించి చెడ్డగా అనుకుంటే...."

"ఏమౌతుంది సత్యం?"

"కలరా వస్తుందేమోరా రాజూ...."

"మనిద్దరికీ యే కలరా రావద్దు బాబోయ్." అంటూ యిద్దరూ పిట్లా తుర్రున యెగిరిపోయారు. ఇలా యెగరడానికి యెదురులేని మనసులు. ఊరంతా వాళ్ళదే. ఊళ్ళోవున్న పచ్చదనం వాళ్ళ పరుషలాడుండి. చెట్లకున్న పళ్ళు చిలకల్లా కొరుకుతున్నా వుంట్ హాత్ అని యెవరూ తరమలేదు. వీళ్ళిద్దరూసీటిలో యీదుతుంటే కాకుల్లా కనపళ్ళేదు. హంసలకు చూస్తున్నట్లు చూస్తున్నారు. తొలకరివానలకు మొలకెత్తి తొలియేకాదశికి పచ్చబడ్డ పరిదుబ్బుల్లా ఉన్నారు. పగలు వెలుగు, రాత్రి వెన్నెల వెలుగు. రెండువెలుగుల్లో జంటరౌతుల్లా ఉన్నారు. ఈ నెయ్యం యిలాసాగితే యెప్పుడో వియ్యంమందేవరకూ పోయేటట్లుండే.

అసలు యీ నెయ్యం ఎన్నిరోజులో కొనసాగలేదు. సత్యం జ్వరంతో పడివున్నప్పుడు రాజుకు అంతా శూన్యంగాతోచినది ఇదిగో తగ్గిపోతుంది అదిగో తగ్గిపోతుందన్న జ్వరం కషాయాలకూ లంఖణాలకూ లొంగలేదు. ఆయుర్వేద వైద్యుడు వచ్చి చూసి విషజ్వరమన్నాడు విషజ్వరం అనగానే వీధి వీధంతా గడగడలాడిపోయింది. ఏ పిల్లా పిచ్చుకకు ఆ యింటిదగ్గరకు వెళ్ళనిచ్చేవారు కారు. రాజు చూస్తానని ఎంత ఏడ్చినా లాభంలేకపోయింది. కన్నబాబు వంట యింట్లో కొడుకుమీద కళ్ళెర్రచేసాడు. రోజుకు రోజూ జ్వరం ముదురుతోంది గానీ తగ్గలేదు. ఇంట్లోకాకండా వరండాలో తడికలుకట్టి మరో మంచంమీద వేసారు. ఆ జ్వరంతో మూలిగిన మూలుగు రాజుకు విన్పించేది. ఆ మూలుగులో రాజూ రాజూ అని సత్యం అరుస్తున్న అరుపులు వినపడేవి. ఇంచుమించు రాజు కాళ్ళూ చేతులు కట్టేసారు. తల్లి కొడుకును బతిమాలింది. "ఇంక చిన్నవాడివికావు. ఆ విషజ్వరం వాడిదగ్గరకు వెళ్తే నీకూ అంటుకుంటుంది. వాళ్ళువైద్యుడ్ని తేగలిగారు. మాకు ఆ స్తోమతా లేదు. నా బాబు- నామాట విను"

రాజు ఒక్కడే అలా నిద్రపోకండా లోలోన కుమిలి కుమిలి యేడ్చుకున్నాడు. "సత్యం చచ్చిపోకూడదు! సత్యం చచ్చిపోకండా చూడు" అని అమ్మవారికి ప్రార్థించాడు. ఎందరు దేముళ్ళపేర్లు విన్నాడో అన్ని పేర్లు తలచుకొని మొక్కుకున్నాడు. రాత్రుళ్ళయినా కదలకండా వుండినట్లు ఎవరో ఒకరు తనను కాచుకొనే ఉన్నారు.

"సత్యం మంచివాడు. కాశీపతి తాత గొప్పవాడు అందుకే సత్యం బతకాలి" ఇలాఅనుకొని చివరకు "ఒక్కసారైనా దూరంనించి చూస్తానమ్మా" అని అమ్మను

హన్నను, తాతనూ బతిమాలాడు. బతిమాలుతుండే కళ్ళంట నీరు కారిపోతోంది. అప్పటికే వైద్యుడు వచ్చియున్నాడు.

"రేపు 21వ రోజు. చాలా గడ్డురోజు. ఇది దాటితే బ్రతికేస్తాడు." అని వైద్యుడు అంటూ ఒకసారి మళ్ళీ వెనుతిరిగి సత్యం దగ్గరగా వెళ్ళాడు. సత్యం స్పృహతోనే ఉన్నాడు. మాటాడకుండా చేతులు లాక్కొని వైద్యునికి నమస్కారం చేస్తున్నట్టు చేతులెత్తబోయాడు.

"శుభం" అన్నాడు జ్యోతిష్యునిలా వైద్యుడు. అంతదూరం వెళ్ళాక కన్నబాబు ఒక్కడే వైద్యునివెంట వున్నాడు.

"బాబూ! ఏమైన ఆశవుందా? ఒక్కడే సంతానం పాపం!"

"మేష్టారూ- శుభం అని యెందుకన్నాను?"

"శుభంకోరడం సహజంకదా?"

"అదికాదండీ! వైద్యుడికి రోగి యిలాంటిదశలో నమస్కరిస్తే - ఎవరితో చెప్పకండి.... శుభం!"

"అంటే.... ఆశ వదులుకోవాలన్నమాట!"

"ఆ మరణాన్నే జ్యోతిష్యులు శుభం అని రాస్తారు. మేం ఫర్వాలేదంటాం"

తిరిగివచ్చాక కన్నబాబు యేమనుకున్నాడో కళ్ళల్లో నీటితోనున్న రాజును చెయ్యిపట్టుకుని

"సత్యంకి దూరంగా నిల్చోబెట్టాను ఒకసారి చూసి నాతో తిరిగి వచ్చేస్తావా?"

"అలాగే...."

అంతదూరంలో నిల్చోబెట్టగానే "సత్యం" అంటూ కెవ్వున కేకవేసి రాజు యేడవగానే కన్నబాబు వెనక్కిలాగ్కొనివచ్చేసాడు.

కళ్ళు విప్పలేదుగానీ సత్యం చెవులీకేకను అందుకున్నాయ్. అదేపనిగా.

"రాజూ... రాజూ.... పద పద పెద్ద పొలంగట్టుమీద యీతచెట్టుమీద బంగారంపిచ్చుకలు.... ఆ గూడుతెద్దాం... పద పద...."

ఇంతమాటాడి, పోతున్న ఆశలను మళ్ళీ ఆ తల్లిదండ్రులలో సత్యం రేకెత్తించాడు. కానీ తెల్లవారేసరికి ప్రాణం చడీచప్పుడులేకండా విడిచాడు.

తలకొట్టుకొని సత్యం తల్లి యేడుస్తోంది. "నేను తెలిసి యేం పాపం చెయ్యలేదో- నాకెందుకీ శిక్ష భగవంతుడా?" అని.

కాశీపతికి నోటమాట పెగల్లేదు. శవం కదిలేటప్పుడు భుజంమీద తువ్వాలు తీసి నోరుకప్పుకొని వెక్కివెక్కి యేడ్చాడు. ఎంత ఆపినా యేడుస్తూనేవున్నాడు. రాజు ఏదోవంకపెట్టి సత్యం శవాన్ని చూస్తున్నాడు. చావులోకూడా ఠీవిగా కనిపిస్తున్నాడు తన కళ్ళకి. తనకన్న యెంత గొప్పవాడో అవుతాడని అందరితో చెప్పుతున్నాడు. దెయ్యాలపని పట్టించిన కాశీపతి యముని ఆట కట్టించలేక పోయాడు.

కాశీపతిచెప్పిన అమ్మవారు జ్ఞాపకంవచ్చింది. ఊర్లో పెద్దవాళ్ళతో పోట్లాడుతూ యీ మంచివాడిని కూడా చంపేసింది. కలరా బదులు విషజ్వరం వచ్చింది

రెండురోజులైనా రాజు కన్నీటిధారలు ఆరలేదు. ఎంతచెప్పినా యేడుపు హెచ్చవుతోందిగానీ తగ్గలేదు. అప్పుడు తల్లి దగ్గర కూర్చోబెట్టుకుని తనను ఒడిలోనికి తీసుకుంటూ

"వాడికి ఆయుర్దాయంలేదు. ఇంకొక్క క్షణం బ్రతకడానికిలేదు."

"ఎక్కడ ఎవరు రాసారు?" అమ్మని ప్రశ్నించాడు.

"అది బ్రహ్మరాత నాన్నా. మనం చెరిపేలేం. వాడిలో సగంలేవు. పుట్టినదగ్గరనించీ యేదో ఒక అలుసు వుండనేవుంటుంది నీకు. ఇద్దరూ కలిసే తిరిగేవారుకదా- ఆ విషజ్వరం వాడికే ఎందుకొచ్చింది? నివ్వు ముందుకు పెద్ద చదువు చదివి పెద్ద ఉద్యోగంచేసి ప్రఖలమెత్తడానికి వుంటే...."


"ఆ రాత చదివారా?"

"నివ్వు పుట్టకముందే 'ఆ బ్రహ్మవాక్కు' విన్నాం. నీ జాతకంరాసిన గురువుగారు నివ్వు పేరు ప్రతిష్ఠలు తెస్తావని ఖచ్చితంగా గ్రహాలుచూసి మరీ చెప్పారు! వాడికి అయుర్దాయంలేదు పోయాడు. అది వాడిపాపం కాదు. వాడి తలిదండ్రులు చేసుకున్న పాపం" అంది శాంతమ్మ.

"కిందటిజన్మలో వాళ్ళు చెడు చేసుంటారు. ఆ కర్మను వాళ్ల యీజన్మలో అనుభవిస్తున్నారు. వెర్రివెర్రివేషాలుమాని రేపటినించి బడికిపద" అన్నాడు కన్నబాబు కోపంగా!

"ఇదేదో కర్మ. మనిషి యేంచేసినా కర్మలో రాసినట్లే జరుగుతుంది. ఈ కర్మ మంచికర్మగా వచ్చేజన్మలో వుండాలంటే యీజన్మలోనే మంచిగా ఉండాలి. మంచిగాఉండాలంటే మానాన్న బడిలోనేర్పిన నీతులన్నీ పాటించాలి. మానాన్నలా వూర్లో అందరితో మంచిగావుండాలంటే నొప్పించక తానొవ్వక తప్పించుక తిరగాలి. అధికారులకు ఆగ్రహంరాకండా ప్రతి మాటకు చిత్తం చిత్తం అనాలి. అప్పుడే కర్మ మంచికర్మయై బ్రతికిస్తుంది. లేకపోతే చెడుకర్మయై చంపేస్తుంది. కాశీపతి, సత్యం, సత్యం తల్లి కిందటిజన్మలో చేసిన చెడుకర్మ యీజన్మలో యింత ఘోరంచేసింది..." అని అనుకుని యీకర్మ నిజంగా అమ్మవారే అనుకున్నాడు రాజు.

(ఇంకా ఉంది)



శ్రీ యం. రవీందర్ రెడ్డి

వరి ఉత్పత్తి - విక్రయం కాగల మిగులు

ఆర్థికాభివృద్ధి జరగాలంటే వ్యవసాయోత్పత్తి పెరగటమేకాకుండ, వ్యవసాయరంగము నుండి వచ్చే విక్రయంకాగల మిగులుకూడ పెరగవలెను. వ్యవసాయోత్పత్తి పెరుగుచున్నప్పటికి, విక్రయంకాగల మిగులు పెరగనట్లయితే వ్యవసాయరంగం తన ప్రాధాన్యతను కోల్పోతుంది. ప్రస్తుతం ఆహారధాన్యాల కొరత వలన వ్యవసాయరంగమునుండి వచ్చే విక్రయంకాగలమిగులుకు విశేష ప్రాముఖ్యం ఉన్నది. ప్రస్తుత పరిశోధనావ్యాసంలో వివిధ తరగతుల వ్యవసాయదారులనుండి విక్రయంకాగల మిగులు ఏవిధంగా ఉత్పన్నమవుతుందో పరిశీలించడం జరిగినది.

1. ఉద్దేశ్యం :-

1) మొత్తం విక్రయంకాగల మిగులులో వివిధ తరగతుల వ్యవసాయదారుల వాటా ఎంతెంత ఉన్నదో తెలుసుకొనుట.

2) కమతం పరిమాణానికి, ఉత్పత్తికి మధ్యఉన్న సంబంధాన్ని తెలుసుకొనుట.

2. పరికల్పన :-

విక్రయంకాగల మిగులుకు, ఉత్పత్తి పరిమాణానికి ధనాత్మక సహ సంబంధంఉన్నది.

3. సమాచారానికి ఆధారాలు :-

ఈ పరిశోధనా వ్యాసంలోని ఫలితాలన్నియు ప్రాథమిక సమాచారముపై ఆధారపడిఉన్నవి. నియమిత ప్రశ్నావళిని తయారుచేసి దానిద్వారా ఎన్నుకోబడిన వ్యవసాయదారులనుండి అవసరమైన సమాచారాన్ని సేకరించటం జరిగినది. సేకరించిన సమాచారం 1984-85 సంవత్సరములోని ఖరీఫ్ మరియు రబీ కాలమునకు సంబంధించినది.

4. విధాన పరిధి :-

ఈ పరిశోధనా వ్యాసం కొరకు "వరంగల్" తాలూకాను యూనిట్‌గా ఎన్నుకోవటం జరిగినది. ఈ తాలూకాలోని ఐదు గ్రామాలను(రాండమ్ శాంప్లింగ్) పద్ధతిద్వారా ఎన్నుకుని, ప్రతిగ్రామమునుండి పదిహేనుమంది వ్యవసాయదారులను ఎంపికచేయటం జరిగినది. ఈవిధంగా ఎంపికచేసిన వ్యవసాయదారులలో ప్రతి గ్రామంనుండి ఐదుగురు చిన్నతరహా, మధ్యతరహా, పెద్దతరహా వ్యవసాయదారులుండే విధంగా చూడడం జరిగినది. ఈ తాలూకాలో వరిపంట అధిక ప్రాధాన్యతను కలిగియున్నందువలన ప్రస్తుత పరిశోధన వరిపంటకుమాత్రమే పరిమితం చేయబడినది

వ్యవసాయదారులను వారియొక్క కమతం పరిమాణం ఆధారంగా ఈ కిందివిధంగా విభజించటం జరిగినది.

1. చిన్నతరహా వ్యవసాయదారులు .... 01—5 ఎకరాలు.
2. మధ్యతరహా వ్యవసాయదారులు ... 5.01-10 ఎకరాలు.
3. పెద్దతరహా వ్యవసాయదారులు .... 10.01 అంతకంటె ఎక్కువ.

5. అధ్యయన ఫలితాలు :-

వివిధ తరగతుల వ్యవసాయదారులు సేద్యంచేసిన మొత్తం భూమి (ఎకరాలలో) కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన వివరాలు ఈ క్రింది పట్టిక తెలియజేయును,

పట్టిక - (1)

వ్యవసాయ దారుల తెగ	ఎకరాలలో కమతం పరిమాణం	ఎన్నుకొన బడినవ్యవసాయదారుల సంఖ్య	కుటుంబ సభ్యుల సంఖ్య	ఎకరాలలోసేద్యం చేయబడిన మొత్తం భూమి	సగటు కమతం పరిమాణం
1.చిన్నతరహా వ్యవసాయ దారులు	.01-5	25	109	68(11.48)	2.72
2.మధ్యతరహా వ్యవసాయ దారులు	5.01-10	25	157	175(29.56)	7.00
3.పెద్దతరహా వ్యవసాయ దారులు	10.01 కంటెఎక్కువ	25	128	349(58.95)	13.96

పై పట్టికలో ప్రతి తెగ వ్యవసాయదారులనుండి 25 మందిని ఎంపిక చేసినట్లుగా చూపబడినది. ఎంపిక చేయబడిన చిన్నతరహా వ్యవసాయదారులు, 68 ఎకరాల భూమిని సేద్యంచేయుచున్నట్లుగా తెలియుచున్నది. వీరియొక్క సగటు కమతం పరిమాణం 2.72 ఎకరాలు. ఈ వ్యవసాయదారుల కుటుంబ సభ్యులు 109. ఈ వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న భూమి అందరు వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న భూమిలో 11.48% ఉన్నది.

మధ్యతరహా వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న భూమి 175 ఎకరాలు వీరియొక్క సగటు కమతం పరిమాణం 7 ఎకరాలు. వీరు సేద్యంచేస్తున్న భూమిలో 29.56% ఉన్నది. వీరి కుటుంబసభ్యుల సంఖ్య 157.

పెద్దతరహా వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న మొత్తం భూమి 349 ఎకరాలు. వీరియొక్క సగటు కమతం పరిమాణం 13.96 ఎకరాలు. అన్ని తెగల వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న మొత్తంభూమిలో వీరు సేద్యంచేస్తున్న భూమి 58.95% ఉన్నది. వీరి కుటుంబసభ్యుల సంఖ్య 128.

వివిధ తెగల వ్యవసాయదారులు ఉత్పత్తిచేసిన మొత్తం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు ఈ క్రింది పట్టిక తెలియజేయును.

పట్టిక - 2

వ్యవసాయ దారుల తెగ	ఎకరాలలో సేద్యం చేయబడిన భూమి	బస్తాలలో మొత్తం ఉత్పత్తి	మొత్తం ఉత్పత్తిలో శాతము	బస్తాలలో సగటు ఉత్పత్తి
1. చిన్నతరహా వ్యవసాయ దారులు	68	2046	14.01	30.09
2. మధ్యతరహా వ్యవసాయ దారులు	175	4800	32.90	27.43
3. పెద్దతరహా వ్యవసాయ దారులు	349	7750	52.09	22.21

పై పట్టిక ప్రకారం వరంగల్ తాలూకా యూనిట్ ప్రతిచయన వ్యవసాయ దారులు ఖరీఫ్, రబీ కాలంలో ఉత్పత్తిచేసిన మొత్తం పరిధాన్యంలో చిన్నతరహా వ్యవసాయదారులు ఉత్పత్తిచేసే మొత్తం ధాన్యం 2046. మొత్తం అన్ని తెగల వ్యవసాయదారులు ఉత్పత్తిచేస్తున్న ధాన్యంలో వీరు ఉత్పత్తిచేసే ధాన్యం వాటా 14.7% ఉన్నది. సగటు ఎకరా ఉత్పత్తి 30.08 బస్తాలు.

మధ్యతరహా వ్యవసాయదారులు ఉత్పత్తిచేసి మొత్తం ధాన్యం 4800 బస్తాలు. అన్ని తెగల వ్యవసాయదారులు ఉత్పత్తిచేసిన దానిలో వీరివాటా 32.9% ఉన్నది. వీరి విషయంలో సగటు ఎకరం దిగుబడి 27.4 బస్తాలు.

పెద్దతరహా వ్యవసాయదారులు ఉత్పత్తిచేసిన మొత్తం ధాన్యం 7750 బస్తాలు. మొత్తం ఉత్పత్తిలో వీరివాటా 52.4% ఉన్నది. సగటు ఎకరం దిగుబడి 22,21 బస్తాలు.

వివిధ తెగల వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న భూమిని, దానినుండి వచ్చే ధాన్యం ఉత్పత్తిని పోల్చి చూసినట్లయితే కొంత వ్యత్యాసం ఉన్నట్లు అర్థం అవుతుంది.

చిన్నతరహా వ్యవసాయదారులు సేద్యంచేస్తున్న భూమిని, దానినుండి వచ్చే ధాన్యం ఉత్పత్తిని పోల్చి చూసినట్లయితే కొంత వ్యత్యాసం ఉన్నట్లు అర్థం అవుతుంది.

పట్టిక - 3

1	మొత్తం ఉత్పత్తి	శ్రామికులకు చెల్లించిన మొత్తం వేతనాలు	ఒక్కొక్క ఎకరంకు శ్రామికులకు చెల్లించిన వేతనాలు
1	2046	130	1.91
2	4800	500	2.86
3	7750	1200	3.44

పై పట్టికప్రకారం చిన్నతరహా వ్యవసాయదారులు శ్రామికులకు చెల్లించే వేతనాలు 130 బస్తాలు. సగటున ఒక్కొక్క ఎకరానికి వీరు శ్రామికులకు చెల్లించే ధాన్యం 1.91 బస్తాలు.

చిన్నతరహా వ్యవసాయదారులు, మధ్యతరహా మరియు పెద్దతరహా వ్యవసాయదారులకంటె ఒక్కొక్క ఎకరా భూమిలో ఎక్కువగా ధాన్యం పండించు చున్నారని తెలియుచున్నది.

మధ్యతరహా వ్యవసాయదారులు, పెద్దతరహా వ్యవసాయదారులకంటె ఒక్కొక్క ఎకరం భూమిలో ఎక్కువగా ధాన్య ఉత్పత్తి చేయుచున్నారని తెలియుచున్నది.

పెద్దతరహా వ్యవసాయదారుల విషయంలో ఎకరం పంట దిగుబడి తక్కువగా ఉండుటకు కారణం, కమతం పరిమాణం పెరుగుచున్న కొలది నిర్వహణ సామర్థ్యం, పర్యవేక్షణ మొదలైనవి లోపించటంవలన ఉత్పాదకత తగ్గిపోయి, పంట దిగుబడి తగ్గిపోవుచున్నది. అంతేగాకుండ పెద్ద వ్యవసాయదారులు వ్యవసాయిక పనులను స్వంతంగా చేసుకొనలేదు. వీరు ఇతరుల శ్రమపై ఆధారపడి వ్యవసాయపనులను నిర్వహిస్తుంటారు. సరియైన సమయంలో శ్రామికులు అందు బాటులో ఉండనందువలన అనుకున్న సమయంలో విత్తనాలను నాటలేకపోవుట, మొదలైన కారణాలవలన వీరి కమతంలలో పంట ఉత్పాదికతా చిన్న వ్యవసాయ దారుల కమతంలతో పోల్చిచూసినప్పుడు తక్కువగా ఉంటుంది.

వివిధ తెగల వ్యవసాయదారులు పండించిన ధాన్యంలో శ్రామికులకు చెల్లించే వేతనాల వివరాలు ఈ క్రింది పట్టిక తెలుపును.

పట్టిక - 4

	బస్తాలలో మొత్తం ధాన్యం ఉత్పత్తి	బస్తాలలో శ్రామికులకు ధాన్యరూపంలో ఇచ్చే వేతనాలు	ఒప్పందాల ప్రకారం ఇతరులకు చెల్లించ బడిన ధాన్యం	అన్ని అవసరాల నిమిత్తం	కుటుంబ అవసరాల నిమిత్తం వినియోగించే ధాన్యం	విక్రయం కాగల మిగులు	మొత్తం విక్రయం కాగల మిగులులో శాతము
1	2046	130 (6.35)	800 (41 66)	1410 (68.91)	980 (47.90)	636 (31.09)	10.50
2	4800	500 (10.4)	160 (3.3)	2778 (57.80)	2778 (44.00)	2022 (42.20)	33.50
3	7750	1200 (15.48)	132 (0.01)	3040 (39.23)	4372 (54.41)	3378 (45 59)	56.00

భయం గొంగళి పురుగు

నిఖిలేశ్వర్

వెన్నెముకలోంచి
వెనక్కి-ముందుకు పాకే భయం గొంగళిపురుగు
నిత్యం జీవన్మరణాల సాక్షి
సీతాకోకచిలుకగా
పరకాయ ప్రవేశంచేయ నిరాకరించి
నిరంతరం హీనభావం పెంచే
ఆధిక్య అహంకారంలో ఆత్మవంచన తప్ప
మనస్సుపొరల అచేతనావస్థలో చీకటి
గుహల్లోని తపస్సే పరమావధి
అక్కడ ఒక్కో పదాన్ని
స్వయం తృప్తితే సానబట్టి
అనంతంగా సాగించుకొనే శబ్దాన్వేషణలో
తప్పిపోయే శిల్పజీవులకు
సజీవ పరిసరాలు కేవల పలాయన లోకాలు !
పిరికిమందు ప్రేలుడులో
కూలిపోతూనే వుంటాయిచెట్లు జీవితాంతం.
ఒకవేళ మళ్ళీ చిగురించినా
భయ సందేహాల కత్తుల నడుమ
విషాద విహాయసంలోనే ఆకుల కదలిక
అడుగడుగునా అనుమానాల అంబరంకింద
చెక్కబడిన పదాలు కాలరేణువుల్లో కలసి
శూన్యంలో అతని ముఖాన్నే
ముద్దిడుతాయి అతిముఖావంగా !!

(కవి మిత్రులు " అజంతా " కోసం.........)

మధ్యతరహా వ్యవసాయదారులు శ్రామికులకు చెల్లించిన మొత్తం ధాన్యం 500 బస్తాలు. వీరు ఒక్కొక్క ఎకరంకు శ్రామికులకు చెల్లించిన మొత్తం ధాన్యం 2 86 బస్తాలు.

పెద్దతరహా వ్యవసాయదారులు శ్రామికులకు చెల్లించిన మొత్తం 1200 బస్తాలు. వీరు ఒక్కొక్క ఎకరంకు శ్రామికులకు చెల్లించిన మొత్తం 3.44 బస్తాలు.

పెద్దతరహా వ్యవసాయదారులు ఒక్కొక్క ఎకరంకు శ్రామికులకు చెల్లించే ధాన్యం చిన్నతరహా, మధ్యతరహా వ్యవసాయదారులకంటె ఎక్కువగాఉన్నది. దీనికి కారణం పెద్ద వ్యవసాయదారులు వ్యవసాయిక పనులను స్వంతముగా చేసుకొనలేరు. కాని చిన్నతరహా వ్యవసాయదారులు, వ్యవసాయిక పనులను, తమ కుటుంబసభ్యుల ద్వారానే నిర్వహించుకొనటంవలన, ఇతర శ్రామికులకు చెల్లించే వేతనాలు తక్కువగా ఉన్నాయి.

చిన్నతరహా వ్యవసాదారులు సేద్యంచేస్తున్న 68 ఎకరాల భూమిలో పండించే ధాన్యం ఉత్పత్తి 2046 బస్తాలు. వీరు 180 బస్తాల ధాన్యాన్ని శ్రామికులకు వేతనాలుగా చెల్లించడం జరిగినది. వీరి మొత్తం ఉత్పత్తిలో శ్రామికులకు చెల్లించిన వేతనాల వాటా 6.85% ఉన్నది. పంటరాగానే ఒప్పందాల ప్రకారం ఇతరులకు చెల్లించిన ధాన్య 300 బస్తాలు. మొత్తం ఉత్పత్తిలో దీని వాటా 14.66%. కుటుంబ అవసరాలనిమిత్తం ఉంచుకున్న ధాన్యం 980 బస్తాలు. మొత్తం ఉత్పత్తిలో దీని వాటా 47.9%. మొత్తం ఉత్పత్తిలో శ్రామికులకు చెల్లించినది, ఒప్పందాల ప్రకారం చెల్లించేవి, కుటుంబ అవసరాలకొరకు ఉంచుకునే ధాన్యం 1410 బస్తాలు. మిగిలిన ధాన్యం 636 బస్తాలు. ఇది విక్రయంకాగల మిగులు. చిన్న వ్యవసాయదారుల మొత్తం ఉత్పత్తిలో 31.09% విక్రయంకాగల మిగులుగా ఉన్నది. మొత్తం విక్రయం కాగల మిగులులో వీరివాటా కేవలము 10.5% మాత్రమే.

మధ్యతరహా వ్యవసాయదారులు తాము పండించిన ధాన్యము నుండి శ్రామికులకు 500 బస్తాలు వేతనాలుగా చెల్లించుచున్నారు. వేతనాలుగా చెల్లించే ధాన్యం వీరియొక్క మొత్తం ఉత్పత్తిలో 10.4%. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలకు గాను 160 బస్తాలు (3.3%) మొత్తం ఉత్పత్తిలో చెల్లించుచున్నారు. కుటుంబ అవసరాలకు 2118 బస్తాలు (44%) వినియోగించబడుచున్నాయి. మిగిలినది 2022 బస్తాలు (42.20%) విక్రయంకాగల మిగు[illegible] మొత్తం విక్రయంకాగల మిగులులో వీరియొక్క వాటా 33.5%.

పెద్ద వ్యవసాయదారులు తాముపండించే పంటనుండి శ్రామికులకు చెల్లిం[illegible] వేతనాలు 1200 బస్తాలు (15.48%). ముందుగా కుదుర్చుకున్న ఒప్పంద[illegible] ప్రకారం ఇతరులకు చెల్లించేవి 132 బస్తాలు (0.01%) కుటుంబ అవసర[illegible] నిమిత్తం వినియోగించే ధాన్యం 3040 బస్తాలు (39.23%). మిగిలిన ధాన[illegible] 3378 బస్తాలు (45.59%) విక్రయంకాగల మిగులు మొత్తం విక్రయంకా[illegible] మిగులులో వీరియొక్క వాటా 56%.

పెద్ద కమతాలలో ఉత్పాదకత చిన్న కమతాలతో పోల్చిచూసినప్పు[illegible] తక్కువగా ఉన్నప్పటికి మొత్తం విక్రయంకాగల మిగులులో పెద్ద వ్యవసా[illegible] దారుల వాటా 56% ఉన్నదని పై సమాచారము ఆధారంగా తెలియుచున్నది.

ముగింపు :-

ఈ పరిశోధనా వ్యాసంకోసం వరంగల్ తాలూకాను యూనిట్‌గా ఎన్నుకు[illegible] వివిధ వ్యవసాయదారుల తెగలనుండి సేకరించిన దత్తాంశం ఆధారముగా రాబట్టి[illegible] ఫలితాలు విక్రయంకాగల మిగులు ఏవిధంగా ఉన్నదో తెలుపుతుంది. ఏ ఆర్థి[illegible] వ్యవస్థలోనైన అభివృద్ధి ప్రక్రియ వేగంగా జరగాలంటే వ్యవసాయరంగ[illegible] అభివృద్ధిచెంది, దానినుండి వచ్చే విక్రయంకాగల మిగులు అధికంగా ఉండా[illegible] పై సమాచారము ప్రకారం చిన్నకమతాలలో ఉత్పత్తి పరిమాణం ఎక్కువ[illegible] ఉన్నప్పటికి విక్రయంకాగల మిగులు తక్కువగ ఉన్నది. అందువలన విక్రయ[illegible] కాగల మిగులు అధికంగా ఉండాలంటే కమతాల సమీకరణను చేపట్టి, పె[illegible] కమతాలలో నిర్వహణ సామర్థ్యమును పెంపొందించవలసిఉంటుంది. వ్యవసా[illegible] యోత్పత్తిని పెంచడమే కాకుండ వ్యవసాయ రంగమునుండి లభ్యమయే విక్రయంకాగల ఆహారధాన్యాల మిగులు పెరగవలెనని, ప్రతి వ్యవసాయదారు[illegible] గుర్తించి, ఆర్థికాభివృద్ధి సాధనలో తనవంతు పాత్రను నిర్వర్తించవలెను. అం[illegible] కాకుండ పండిన పంటలో అన్ని అవసరాలనిమిత్తం ఉపయోగించబడే ధాన్య[illegible] సాధ్యమైనంతవరకు తగ్గించి, విక్రయంకాగల మిగులు పెరిగేందుకు ప్ర[illegible] వ్యవసాయదారుడు కృషిచేసినప్పుడు ఆర్థికాభివృద్ధి పథంలో వ్యవసాయరంగాని[illegible] కీలకపాత్ర నిచ్చిన వారగుదురని ఆశిద్దాం. (రచయిత వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంయొక్క ఆర్థికశాస్త్ర విభాగానికి చెందినవారు.) ✳

వాన

వి.వి.బి.రామారావు

ప్రదోషవేళ కావస్తోంది. ఆకాశమంతా చీకట్లు కమ్ముతున్నాయి ఆర్భాటంగా ఉరుములు. దట్ట చీకట్లు కమ్మించే తటిల్లతలు. ఏ క్షణాన్నయినా కుండపోత ప్రారంభమయ్యేటట్టుంది.

అకాల వర్షం. బంగాళాఖాతంలో వాయుగుండమేమో! వార్తల్లో ఏమీ చెప్పినట్టు లేదు.

చల్లటి గాలి ప్రారంభమయింది.

కొద్ది నిముషాలలో ఇకముందుకు పోవడం అసాధ్యమయ్యేలా ఉంది.

నరసింహం చుట్టూ చూశాడు. గాలివానలో చెట్టు నీడన ఉండడం కంటె ఏ ఇంటి గుమ్మంమీదో తలదాచుకోవడం మేలనిపించింది.

ఎదురుగా పెద్ద లోగిలి. బయట పెద్ద గేటు. చుట్టూ తోట. మధ్యలో ఇల్లు. ఆ ఇల్లు ఎవరిదో నరసింహానికి తెలుసు కాని ఆ ఇంటిగలాయనను చూడడం పడలేదు. ఆయనను చూడడానికి ఇది ఒక అవకాశమేమో!

జిగ్గున మెరుపు మెరిసింది. గేటు క్రొక్కేంవేసి వరండావరకూ నడిచాడు. ఫెళ్ళున ఉరుము ఉరిమింది.

ముక్తావిద్రుమ హేమ నీలధవళ
చ్ఛాయైర్ముఖై స్త్రీక్షణై
ర్యుక్తా మిన్దు నిబద్ధ మకుటాం
తత్త్వార్థ వర్ణాత్మికాం...

ఉరుముల హోరు ఎక్కువైంది. లోపలనుంచి సంధ్యావందన శ్లోకాలు వినవస్తున్నాయి.

వాన మొదలైంది. సన్నటి జల్లువంక కన్నార్పకుండా మైమరచి చూస్తున్నాడు నరసింహం.

వెనక అలికిడయి ఒటుక్కున వెనుదిరిగి చూశాడు. తంకువబొట్టు— నుదుటున ఏదో ప్రకాశం - ఛాతీమీద శాలువ. పొన్నాలు ఒపంచ ఎదురయ్యాయి.

"నమస్కారం!" పలకరింపు ఆయనదే

నరసింహం తేరుకునేలోగా "కూచోండి వస్తా!" అంటూ ఆయన లోపలకు వెళ్ళాడు.

వరండామీద వున్న కుర్చీలవంకా, గోడకున్న బొమ్మలవంకా చిన్న గాజు బీరువాలో ఉంచబడ్డ ప్రతిమవంకా చూస్తున్నాడు వానకు తలదాచుకోడానికి వచ్చిన నడివయసు మనిషి.

ఈ ఇల్లు దేశవిఖ్యాతి గాంచిన శాస్త్రజ్ఞుడిదని తెలుసు. ఆయన ఆ ఊళ్ళోనే - నరసింహం పనిచేస్తున్న కాలేజీలోనే చదువుకున్నాయననీ అతనికి తెలుసు.

ద్వారం ముందు తెర.

వెనక్కి తిరిగి జాబిరీగుండా తాను వచ్చిన దోవవంకే చూస్తూ వానకి తృప్తిగా తడుస్తున్న చెట్లువంక చూస్తున్నాడతను.

ప్రొఫెసర్ శర్మగారు — ఆ ఇంటిగలాయన బహుశః తను పుట్టక పూర్వం అక్కడ చదువుకుని ఉండవచ్చు. అంత చదువులు చదివి, అన్ని దేశాలు చూసి, అంతలేసి పదవులు చేపట్టి విశేష గౌరవాలని అందుకున్న అంతటి శాస్త్రవేత్త ఆ ఊళ్ళో స్థిరపడాలనుకోడంలో ఏదో విశేషం ఉండాలి.

శాలువా ఆయన శాస్త్రజ్ఞుడిలా కనపడలేదు. శుద్ధ శ్రోత్రియుడైన బ్రాహ్మణుడిలా ఉన్నారు. బహుశః వారి బంధువేమో!

ఇంతకీ ముందుగా అనుమతి తీసుకోకుండా వచ్చాడే ఆయనతో మాటాడడం కుదురుతుందా? ఆయనసలు ఇంటిలో ఉన్నారో లేరో!

కారు షెడ్డులో దుమ్ము కొట్టుకుపోయి ఉంది.

"క్షమించాలి... లోపల ..." అంటూ శాలువా ఆయన బయిటకు వచ్చారు.

"నమస్కారం! నా పేరు నరసింహం. నేను ఇక్కడ కాలేజీలో పని చేస్తున్నాను...ఇక్కడే చదువుకున్నాను. ప్రొఫెసర్ శర్మగారిని చూడాలని వచ్చాను.

"సంతోషం."

"వారు....?"

"వారెవరు?"

"శర్మగారు...."

"ఒక్క నిముషం...." మళ్ళీ లోపల కెళ్ళారాయన. కొద్ది క్షణాలలో కాఫీ కప్పు తీసుకుని వచ్చారు ఒక ట్రేలో.

మరొక మెరుపు. వెంబడే పెద్ద ఉరుము.

"క్షమించాలి...ఆయన చాలా పెద్దవారు...ముందుగా చెప్పకుండా వచ్చాను."

"ఫరవాలేదు ... ముందు తీసుకోండి!"

ఆయన తనవంకే చూస్తూ ఉంటే కాఫీ చప్పరించాడు నరసింహం. కాఫీ తాగడం అయిపోయేవరకు ఆయన ఏమీ మాటాడలేదు.

"వారు....?" మళ్ళీ అడిగాడు నరసింహం, కాఫీకప్పు కిందపెడుతూ.

జల్లులోనే తోటపని చేస్తున్నాయన పూలు పట్టుకుని మెట్లెక్కాడు.

"మీకు పూలంటే అంత మక్కువ. మీ చేతుల్లోనూ అవి కొమ్మమీద ఉన్నంత ఆనందంగానూ ఉన్నాయి..."

"మీ మనసు అలాంటిది." పూలు కోసుకొచ్చినాయన లోపలకు వెళ్ళిపోయాడు.

"వారేనా శర్మగారు?"

"మీరు మాటాడాలనుకుంటున్న శర్మని నేనే"

వాన ఉధృతమైంది. నరసింహం కొంచెం తబ్బిబ్బు పడ్డాడు.

"మనం అన్నదమ్ములం. ఒకే తల్లి ఒడిలో పెరిగిన బిడ్డలం. మా నాన్నగారు ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో ఓ గ్రామంలో ఉండేవారు. ఈ ఇల్లు మా చదువులకోసమని కట్టించిందే.... రోజులు బాగా మారాయి.... లోపలకు వస్తే నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరని బయటినుంచే కాలేజీని చూస్తూ ఉంటాను...."

"తమరు ప్రొఫెసర్ శర్మగారని నేను గ్రహించలేకపోయాను. క్షమించాలి."

"ఇందులో మీ తప్పేమీలేదు....ఉండండి" అంటూ లోపలనుంచి ఒక పెద్ద ఫోటో ఆల్బం తీసుకొచ్చారాయన.

నరసింహం ఆ ఆల్బం చూస్తుండగా ఆయన మళ్ళీ లోపలకి వెళ్ళారు.

ఒక్కొక్క ఫోటోవంకా జాగ్రత్తగా ఒకొక్క కళాఖండం వంక చూస్తు

న్నట్టు తదేక దీక్షతో చూస్తూ వుండే కాలగమనం దృష్టిలోనే లేదతనికి.

మనసులో ఏవేవో ప్రశ్నలు.

"అణుశక్తి పరిశోధనలో తమరు...." ఆయన రాగానే అడిగాడు.

"ఏదో కొద్దిమాత్రం కృషి చేశానను కోండి. కాని ఆ శాస్త్ర పరిజ్ఞానం జన సామాన్యానికి ఉపయోగపడి, మన జీవన విధానాన్ని వెలుగు పుంతలవైపు నడపాలి....నా మాటకేంలెండి ...మీ గురించి నాకేమి తెలియదు....ఒక కాలేజీలో చదువుకున్నవాళ్ళం. మీరు..."

ఆయనను మరేమీ మాటాడనివ్వకుండా నరసింహం వెంటనే అందుకున్నాడు.

"మహా మేధావులు మీరు...ఆధునిక శాస్త్రాలని ఔపోసన పట్టారు...."

"మీరు ఏ శాఖలో పని చేస్తున్నారు?"

"ప్రాగ్భాషా విభాగంలో సామాన్యమైన అధ్యాపకుడిని...."

"చాలా సంతోషం....ఆడబోయిన తీర్థం ఎదురైంది. నా అదృష్టం.... సౌందర్యలహరిలో ఆదిశంకరుల భావన గురించి మీ దగ్గరనుంచి తెలుసుకోవాలని ఉంది."

"మహాపురుషుడు. దైవశక్తి సంపన్నుడు ...మేధావి....అలౌకిక ప్రజ్ఞా పాటవం గలిగిన మహామనిషి. శంకర భగవత్పాదుల జీవితమే ఒక పురాణం... కారణజన్ములు వారు...పెద్దలు మీకు తెలియనిదేమీ కాదు....శివశక్తుల ఐక్యతనీ పలువిధాలుగా బహు రమ్యంగా సామాన్యులకు సహితం గుండెలకు హత్తుకునేలా మహా నిష్ణాతప్రౌఢులకు అనుభవ నైవేద్యంగా అందించిన తత్త్వవేత్త ఆయన...."


శర్మగారు నరసింహంవంక తదేకంగా చూస్తూ ఉండడంతో నరసింహం కళ్ళు తిప్పుకున్నాడు.

"మా రోజుల్లో కాలేజీకి చదువులకీ ఇప్పటివాటికీ పోలికలేదు. విద్యార్థులుగా ఏదో మా లోకంలో ఉండేవాళ్ళం. మాకు క్రికెట్ తెలీదు...సినిమాలు లేవు. రేడియోలు ఊరంతటికీ ఒకటి అరా అదీ నేను కాలేజీలో ఉండగా వచ్చాయో లేదో...."

"మీరన్నది అక్షరాలా నిజం....కాని వీటిని విద్యావ్యాప్తి సాధనాలుగా వాడే రోజులివి...అంతా మనం ఉపయోగించుకునే విధానంలో ఉంటుంది. పరికరాలు పరికరాలే!"

"సంస్కృతీ, ఆచారం, ధర్మం...వీటినుంచి మన యువత మరెటో మళ్ళిపోతోంది...దీనికి కారణం విలువలు దిగజారిపోవడమే! విలువలు మారడం సహజం కాని దిగజారడం దౌర్భాగ్యమే కదా! ఏది ముఖ్యం అనే విషయంలో మన యువతరం తప్పుదోవ పడుతుందనిపిస్తోంది. ఇంతకీ మీకు విసుగు కలిగిస్తున్నట్టున్నాను...."

"మీ దర్శనం చెయ్యాలని ఎన్నాళ్ళనుంచ అనుకుంటున్నాను...."



"ఏదో పాతకాలం మనిషిని....వయసుతో పెరుగుతుంది బాధ స్తం.... రండి...రండి...మూర్తిగారూ....నమస్కారం! నమస్కారం...వీరు మూర్తి గారని అటవీశాఖలో పనిచేసి రిటైరైపోయారు నాకు ఆప్తులు...వీరు నరసింహంగారు కాలేజీలో అధ్యాపకులు...."

లోపల ఫోన్ మోగింది. శర్మగారు లోపలికి వెళ్ళారు మూర్తిగారితో ఏదో మాటాడుతూ ఉన్న నరసింహం లోపలనుంచి వినపడుతున్న శర్మగారి మాటలూ అక్కడా అక్కడా వింటున్నాను.

"....అమ్మలేదు....అంతా క్షేమమే....అక్కయ్య దగ్గరకు వెళ్ళింది.... అంతా మన ఇష్టం కాదు కదా...దైవేచ్ఛ....పిల్లలు బాగున్నారా....మీ ఆరోగ్యం జాగ్రత్త ."

కొంతసేపయ్యాక శర్మగారు బయటకు వచ్చారు....

క్షమించాలి....వాళ్ళ తగ్గేటట్టు లేదు....వాళ్ళు నాకోసం చూస్తూ ఉంటారు. మొన్న చెప్పాను కదా....వాళ్ళ లేబరేటరీ మీరు చూడాలని ఆశ పడుతున్నారు.... మీకు వీలయితే ..."మూర్తిగారు అడిగారు.

"మీకు తెలుసుగా నే చెప్పే సమాధానం!"

"అంతేననుకోండి...అయినా మరొక్కసారి..."

"ఇప్పటికే చాలా కాలయాపన జరిగిపోయింది రేపు మనది కాదు. అబ్బాయి అక్కడికి రమ్మంటున్నాడు...నాకు వెళ్ళాలని లేదు....ఎక్కడికీ వెళ్ళాలనిపించదు...ముసలి ఎద్దుకి ఇక కావాల్సింది...ఆ రోజు కోసం నిరీక్షణే కదా..."

"మరి నాకు శలవిప్పించండి...." అంటూ మూర్తిగారు వెళ్ళిపోయారు.

"మీ అబ్బాయి...."

"లాస్ఏంజెల్స్‌లో ఉన్నాడు....వారానికొకరోజు మాతో మాటాడతాడు... నేను సాధారణంగా ఇల్లు కదలను....ఈ వయసులో ఇంకా పై దేశాలెందుకని అనిపిస్తుంది."

నరసింహం ఆయన కళ్ళలోకే చూస్తున్నాడు. ఆయన కళ్ళలో ఏదో దివ్యకాంతి...

ఏమాత్రం అవకాశం ఉన్నా, ఉద్యోగమనో, చదువనో, డబ్బు సంపాదించాలనో విదేశాలకు వెళ్ళి అక్కడే స్థిరపడాలనే ఆలోచనే సామాన్యంగా కన పడుతున్న రోజుల్లో ఈయన...

"మీలో మా కాలేజీ - కాదు — మన కాలేజీ నిజమైన విలువల వెలుగు కన పడుతోంది."

నరసింహం బయటకు అనకుండా ఉండలేకపోయాడు.

"అది కేవలం మీ అభిమానమే ...ఒక కాలేజీలో చదువుకున్న వాళ్ళం ఒకరిమీద ఒకరికి ఇలాంటి మమకారం ఉండడం సహజమే"

కాసేపటిక్రిందట గులాబీలు కోసుకొచ్చినాయన శర్మగారిదగ్గర శెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

"ఆయనకు గాలివాసంటే ఏమాత్రం భయంలేదు" చిరునగవుతో అన్నారు శర్మగారు.

నరసింహానికి ఆయన కాలాన్ని వృథా చేస్తున్నాననిపించింది.

"నా కాలానికి ఇక ప్రత్యేకమైన విలువేమీ లేదు. దైవకృప నా ఎడల పరిపూర్ణంగా ఉంది...."

"తమ పిల్లలు?"

"పెద్దాడు అమెరికాలో....చిన్నాడు ఢిల్లీలో....అమ్మాయి అత్తారింట్లో.... ప్రస్తుతం మా ఆవిడ అమ్మాయిని చూడడానికి వెళ్ళింది. నాకు ఈ ఊరు వదలా లనిపించడంలేదు....ఇది నాన్నగారు కట్టించిన ఇల్లు...ఇదిగో. ఇక్కడే ఆయన పరమపదించారు... నాకూ..."

"మహానుభావులు....ఇన్నాళ్ళూ మిమ్మల్ని చూడడానికి రాకపోవడం నాతో మాటాడతారా అనే సందేహంతోనే...."

"జీవితంలో పైకి రావడానికి కారణం మన ప్రయత్నమూ, దైవకృపా కలసి రావడమే.. దైవకృప ఉంటేనే మన ప్రయత్నమనే ప్రేరణ ఉంటుంది... నేనూ సామాన్యుడినే....మా గురువుల ఆశీర్వచనం నేనెన్నడూ మరువలేను. నేను క్లాసులో కనపడకపోతే శర్మ ఎందుకు రాలేదు?' అని అడిగేవారట. ఆయన ముఖం చూసిన వేళా విశేషం...ఒకరోజు...."

నరసింహం ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాడు.

"క్లాసులో ఒక్కతే అమ్మాయి—ఎనమండుగురం మగపిల్లలం ...మా ఇంట్లో పద్ధతి పూర్వకాలం పద్ధతి...మూడుపూటలా సంధ్యావార్చేవాడిని. సహస్ర గాయత్రి చేసేవాడిని-మూడవ తరగతినుంచీ...ఆ రోజు అమ్మాయి క్లాసులోకి వచ్చేసరికి ఎవరో కిసుక్కున నవ్వారు.

నేను తలఎత్తి చూశాను.

'ఆమె ముఖాన్న బొట్టు లేదురా!" ఎవరో అన్నారు.

ముందు బెంచీ వదలి చివరకు వెళ్ళి కూచున్నాను.

మరునాటిరోజు క్లాసులో మాష్టారు నన్ను "శర్మా! యూ ఆర్ బీయింగ్ సిల్లీ!" అన్నారు. నాకు తల తీసేసినట్లనిపించింది. నామీద మాష్టారికి కోపం వచ్చింది. కాని కారణం నేను గ్రహించలేకపోయాను. నాకు చాలా భయం వేసింది. అంతకంటె ఎక్కువగా సిగ్గు వేసింది."

శర్మగారు నిజంగా ఆ క్షణాన్న అవమానభారంతో కృంగిపోతున్నట్టు ముఖం లజ్జతో దింపుకున్నారు.

నరసింహానికి ఏదో అడగాలనిపించినా ఊరుకున్నాడు.

"శాస్త్రం చదువుకుంటాం...కాని అది మనల్ని కొంతవరకే ముందుకు తీసుకుని వెళుతుంది. మానవుని మేధ అవధి లేనిది కాదనే నా నమ్మకం.... శాస్త్రం విప్పి చెప్పలేనివెన్నో వున్నాయి... అవి మతంమీద విశ్వాసంవల్ల వచ్చే ఇంట్యూయిషన్ వల్లనే మనకు అవగాహన కొస్తాయి. ఒక సామాన్యమైన సంఘటన నా జీవితసరళినే మార్చింది ..." శర్మగారు ఆగి నరసింహం కళ్ళ లోకి సూటిగా చూశారు.

"మీ ముందు ఎంతసేపయినా కూచోవాలనే ఉంటుంది." శర్మగారు లోపలికి వెళ్ళి యాష్‌ట్రే పట్టుకొచ్చారు.

"ఫరవాలేదులెండి!" నరసింహానికి మొగమాటం వేసింది.

"నాకు తెలుసు ఆ యావ! కానివ్వండి... ఆ సంఘటన నా జీవితంలో మరపురాని కొద్ది సంఘటనల్లో ఒకటి.

"న్యూయార్క్‌లో ఒక ప్రతిష్ఠాకరమైన క్లబ్బులో మెంబరునయ్యాను. అప్పటికి నాకు ఇరవై నాలుగేళ్ళు . పెళ్ళయి మూడేళ్ళయింది...మా ఆవిడను తీసుకు వెళ్ళడానికి తగినంత డబ్బు లేదు....యువ శాస్త్రవేత్తగా నన్ను పెద్ద వాళ్ళందరూ ఎరుగుదురు....మంచి మంచి ఖరీదైన సూట్లు కుట్టించుకున్నాను.... సంఘంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్ళినవారి ఎడల శాస్త్రంలో పరిశోధనలు చేసేవారి ఎడల విశేష గౌరవం ఉండేది...

"ఎంతో అందమైన అమ్మాయిలు పార్టీలలో. క్లబ్బులలో డాన్సు చేస్తుండే వారు—నాకూ డాన్సు చెయ్యాలనిపిస్తూ ఉండేది. వాళ్ళు సేవించే పానీయాలంటే మాత్రం నాకు విపరీతమైన భయం. కాని వాళ్ళెవరూ నాచేత నాకు ఇష్టంలేని పనిని ఎప్పుడూ చేయించ ప్రయత్నం చెయ్యలేదు. నిమ్మరసమో, నారింజ రసమో తీసుకునేవాడిని....

"ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త ఇంటికి పార్టీకి మా ప్రొఫెసర్‌గారు నన్ను తీసుకుని వెళ్ళారు...ఆ శాస్త్రజ్ఞుడి భార్యా, కుమార్తె, ఇద్దరూ ఎంతో ఆప్యాయంగా నన్ను పలకరించి మర్యాద చేశారు. మా ప్రొఫెసర్ నా గురించి చాలా మెచ్చికోలుగా మాటలు చెప్పారు. ఆ చిన్నదాని అందం వర్ణనాతీతంగా వుంది.

"భారతీయుడినని-వాళ్ళ అలవాట్లను కొంతలో కొంత తెలిసినవాడినని కాబోలు నా బెరుకు పోయేటట్టుగా నా ముందే ఆ అమ్మాయి కూచుని పిచ్చాపాటీ మాటాడాక డాన్స్ మొదలయ్యేముందు "నాతో డాన్స్ చేస్తారా?" అని అడిగింది.

నేను లేవబోయాను. లేచానేమో కూడా.

ఒక్క లిప్తలో నా మనస్సులో ఏదో వికాసం వెల్లివిరిసింది.

"క్షమించాలి. నాకు కొంచెం తలనొప్పిగా ఉంది" అన్నాను. నా ముఖకవళికలలో ఆమె ఏమి గమనించిందో వెళ్ళి ఆమె తల్లిని వెంటబెట్టుకుని వచ్చింది.

డాన్స్ మొదలైంది. నేను పక్క గదిలోకి వెళ్ళాను. మా ప్రొఫెసర్ అక్కడికి వచ్చారు కొంతసేపటికి.

"డాక్టర్ వద్దకు తీసుకెళ్ళనా?" అంటూ గృహిణి వచ్చింది.

"నే తీసుకు వెళతా!" అంటూ ప్రొఫెసర్‌గారు నా వెంట వచ్చారు.

"నా ముఖం సిగ్గుతో మండిపోతుంది. ఇన్నిసార్లు ఇన్ని పార్టీలు చూశాను-వాళ్ళ జీవిత విధానం తెలియనివాడిని కానే....ఈరోజు ఎందుకిలా జరిగింది?

"మా ప్రొఫెసర్ నన్ను గదివరకూ దిగబెట్టి వెళ్ళిపోయారు.

"నన్ను నేను ఆత్మ పరిశోధనకు గురి చేసుకున్నాను. నాకు తలనొప్పి కాదు. ఏదో విద్యుద్ఘాతం తగిలినట్టనిపించింది.

"ఒక్క క్షణంలో నేనేమిటో, నా వారసత్వమేమిటో కోటి సూర్యుల వెలుగుతో నా కళ్ళముందు సాక్షాత్కరించింది.

ఏ రోజుకి ఆ రోజు నా అనుభవాలని ఒక పుస్తకంలో రాసుకుంటూ ఉండేవాడిని. అందులోనుంచి కొన్ని భాగాలను ఎత్తి ఇంటికి రాస్తూ ఉండేవాడిని. నా రచన ఉద్దేశ్యం నన్ను నేను లోతుగా ఆకళింపు చేసుకునే ప్రయత్నమే.... ఆ రోజు రాత్రి నా ఆలోచనలన్నిటినీ కాగితంమీద అక్షర రూపంలో పెట్టాలనుకున్నాను. రాత్రంతా ఏమిదేమిటో రాసేశాను. తెల్లవారేక ముక్తసరిగా మూడు ముక్కలే ఉంచి మిగిలినది కొట్టేశాను. 'ప్రొఫెసర్ స్మిత్‌గారితోపాటు జాన్సన్స్ ఇంటికి పార్టీకి వెళ్ళాను....ఆ అమ్మాయి అందం వర్ణనాతీతం... ఆమె నన్ను ఆమెతో డాన్స్ చెయ్యడానికి రమ్మని పిలిచింది. ఆమె ముఖంలో ఏదో ఆకర్షణ. చటుక్కున లేచి వచ్చేశాను.' నాకు ఒక్కటే అనిపిస్తుంది. మనసుతో కాపురం చేస్తున్న నా భార్యకు విడమరచి రాయలేని పని చేయకూడదని.

ఆ సంఘటన నాలో ఒక కొత్త ఆలోచనని రేకెత్తించింది

మనం కొన్ని పనులు చెయ్యలేము. చెయ్యకూడదు. మన నెత్తుటిలో ఉన్న ఊపిరి, మన విశ్వాసం, మన ఆలోచనా వేరు ...శాస్త్రాధ్యయనం, శాస్త్రావగాహనా ఆధ్యాత్మికతవంకే మనసుని తీసుకు వెళతాయని నా నమ్మకం....

అందుకే నాకు మన గడ్డమీదే శేషజీవితం గడపాలనే కోరిక....మిమ్మల్ని విసిగించానేమో! మీరు నాయందు దయ ఉంచి సౌందర్యలహరి ఒకసారి చదివి వినిపిస్తే మీకు ఎప్పుడూ ఋణపడి ఉంటాను. ఇంటర్‌వరకూ సంస్కృతం చదువుకున్నాను కాని గురుముఖంగా శ్రవణం చెయ్యడంలోనే ఆనందం ఉంటుంది!"

"ఎంతమాట! రేపటినుంచే ప్రారంభం చేద్దాం. నేను పండితుడనని కాదు కాని మీ దగ్గర చదవాలంటేను ముందే కొంత జాగ్రత్తపడి చదువుతానని....మీరు ఏమీ అనుకోకపోతే....చిన్న మనవి....మీవాళ్ళు ఇంట్లో లేరంటున్నారు. నాతో పాటు భోజనానికి...."

"ఎప్పుడయినా తప్పక వస్తాను కాని నేను తినేది కేవలం చప్పిడి కాబట్టే మిమ్మల్ని భోజనానికి ఉండమనలేకపోయాను....నా వంట నేనే చేసుకోగలను. అదే నాకు తృప్తి."

నరసింహం లేచి చేతులు జోడించి

వచ్చేముందు ఫోన్ చేస్తా మరి... నాకు శెలవా!" అంటూ లేచాడు

గేటుదాటి బయటకు వచ్చేసరికి మబ్బులు వీడిపోయాయేమో తళ్ళున వెలుగు వచ్చింది.

ఆ వెలుగులో పసిమి ఉంది, ఆహ్లాదం ఉంది. వైభవం ఉంది.

ముందుకు నడుస్తుంటే జేబులో సిగరెట్టు పెట్టె గుచ్చుకుంటున్నట్టనిపించి చటుక్కున పైకి తీసి రోడ్డువారకు విసిరేశాడు.

వానలో నిశ్చలంగా నుంచున్న చెట్ల ఆకులు కడిగిన ముత్యాల్లా అస్తమిస్తున్న సూర్యుని కిరణాలలో మిలమిలలాడిపోతుంటే ఒక్కక్షణం ఆగి తోటవంక తృప్తిగా చూసి ముందుకు నడిచాడు నరసింహం.

నాకు తెలిసింది

చేపలు కూడా
గాలాలు విసరగలవని
నీ కళ్ళను చూసినపుడు ... ...

మందహాసాలు
చంద్రహాసాలై
ఎదదలను గాయపరచగలవని
నీ పెదవులు చెప్పినపుడు ... ...

ముఖాలు కూడా
మొగ్గరాలు పన్నగలవని
నీ మోము తమ్మిలో
నా మనోభ్రమరం చిక్కినపుడు ... ...

తల నీలాలు
నల్ల త్రాచుగా పగబట్టగలవని
నీ వినీల వేణీబంధ సౌందర్యం
విసురుగా బుసకొట్టినపుడు ... ...

మౌనంలోనే
మధురమైన రాగాలున్నవని
నీ మూగ భాషలు విన్నపుడు ... ...

అమాయకత్వం కూడా
అఘాయిత్వం చేయగలదని
నా హృదయాన్ని
నీవు కొల్లగొట్టినపుడు ... ...

శ్రీ కావూరు పాపయ్య శాస్త్రి

నీ కళ్ళల్లో సముద్రాలు

శ్రీ విరియాల లక్ష్మీపతి

ఈ ఉదయం నీ రూపం
సుదీర్ఘంగా ఆకాశందాకా సాగి
నా కళ్ళల్లో తళతళ మెరిసింది
జ్ఞాపకం ఖంగుమంది జైగంటలా
ధ్వని అలల్ని మోసుకుంటూ
వెలుతురిలా వ్యాపించింది
నీరద పరదాలు తప్పించుకు వచ్చేవే
ఎంతసేపీ మౌనం
కాంస్య గౌతమునిలా చంద్రకాంతశిలలా
అవశ్యం భంగిమలు
శరీరం నిండా అందిగించుకోవేం
నీలాకాశంలో ప్రవహించే
నీ ఆలాపన ఆపవు
నా కళ్ళు మగత వీడవు
రెప్పపాటులో నీ స్వరతరంగాలు
మింగిన రెప్పలు
నీటి బిందువులు జారవిడుస్తాయి
ఉషోదయ తామరాకుమీద
ఒక బిందువుని వదిలింగా
దోసిలిలోనికి పట్టి
నెమ్మది అడుగు
భూమంత విషాదగీతం
భోరున విన్పిస్తుంది
అంతరంగం స్వప్నాలతో నిండకపోతే
ఇక నిద్రకీ చావుకీ
ఏమిటి తేడా .
ఇంద్రియాలు అనుభూతులు స్మృతులు
వినా ఈ దేహం
కేవలం శవమే కదూ...
ఈ సప్త రంధ్రాల్లోంచి
స్వరాలు జనించకపోతే
వెదురూ వేణువూ
ఒట్టి కట్టే కదూ...
నీ క్రాంతి చుంబనాలకే
మళ్ళీ నా కళ్ళు మేల్కొంటాయి
పులచయిన వసంతరాత్రి వేళల
ఋషి పక్షుల మూర్ఛలకే
సజీవ అంకురార్పణ జరిగేది
మానవ స్పర్శకే
జీవహరితం చైతన్యవంతం అయ్యేది
నా కావ్యచక్షువు
సొగసు కుసుమంలా విచ్చుకొనేది
మానవ రంధ్రాలు జాగృతమయ్యేవి
ఇలాతలం ఆలపించే విషాదగీతాలు
నా అక్షరశక్తి పుటములో స్నానం చేస్తాయి
దం[illegible]లమై [illegible]స్తాయి
అజ్ఞానాంధకారాన్ని శస్త్రం చేస్తాయి.

నువ్వు నా నడినెత్తిన నడుస్తున్నప్పుడు
అంతరంగంలో దుస్స్వప్నాలు
అలారంలా గోల చేస్తాయి
మొహం ముణుచుకొని
నెత్తిన మొట్టి నోరు నొక్కేస్తాను
అపుడు మాత్రం విన్పడేది
ఒక్క నీ గుండె చప్పుడే
ప్రకృతిలా అలుముకుంటుంది
ఆకాశ నగ్నత చూడలేక
చెట్లు పత్రనేత్రాలు మూసుకుంటున్నాయి
కొసా మొదలూ లేని కల
చిక్కబడి ప్రవహిస్తోంది కాలంలా
ప్రతి కిరణాన్ని ఉరికంబం ఎక్కిస్తుంది
పరుగులు తీసే చిన్న పిల్లలతో
నా కనుపాపల్ని పంపిస్తాను షికారు
ఆటధ్యాసలో పడిన నా పాపలు
మళ్ళీ నా కళ్ళ ముంగిళ్ళల్లోకి తిరిగి రావే
హరిత పత్రాల్లా
మైదానంలో పరుగులు తీస్తాయి
మిల మిల మెరిసే నదీ జలాలు
స్వచ్ఛంగా స్నేహంలా వెలిగిపోతున్నాయి
సుదీర్ఘ సాయంత్రాల కీనీడల్లా ఎదిగిపోతున్నాయి
పాదాలు ఇసుకలోనికి చొప్పించి
పిచ్చుక గూళ్ళు కట్టుకుందాం
పూలు రాలిపోతున్నాయి
కలలు చెదిరిపోతున్నాయి
స్మృతులు నన్ను వదిలి
దూరంగా వ్రేలాడుతున్నాయి
పడమర మంజూర్గలో
తాళవృక్షాల బూజుల్లా

ఇంకా ఎందుకీ సంకీర్ణ జీవన కుడ్యాలతో
గుసగుసలు
వదిలోంచి హరివిల్లయి లేచి
ఈ కొసనుండి ఆ కొసకి ఎగిరిపోదాం
రంగుల రెక్కలు సవరించు
ఇంకెప్పుడూ సముద్రాన్ని గుర్తు చెయ్యకు
కెరటాలు కెలికేసిన
గూళ్ళు గుర్తొస్తాయి నాకు
ఎండి విషాదంగా
నిలుచున్న ఇసుక తిన్నెలాంటి
మిత్రులు గుర్తొస్తారు నాకు
అందుకే చెలిమి పడవ
కదలి అంచులవద్ద నిరీక్షణలో ఉంచకు
సముద్రం కళ్ళు అంత మంచివికావు సుమీ

జీవితం పుస్తకంలో
జ్ఞాపకాల పేజీల చించి
హాయిగా గాలిపటాలు చేసుకుందాం పద
స్నేహాకాశంలో ఎగరేసుకుందాం పద
నువ్వు నా గుండెల్లో వికసించు
నేన్నీ కళ్ళల్లో ఉదయిస్తాను.

గిరిజనుల ఋణభారము-ఒక పరిశీలన

గిరిజనులు సంవత్సరాలతరబడి నాగరిక సమాజానికి దూరంగావుంటూ ప్రత్యేక ఆచారాలు అలవాట్లు నాగరికత కలిగివుంటూ ఆర్థిక సాంఘికరంగాలలో ఎంతో వెనుకబడి ఇతరుల దోపిడికి గురియగుచున్నారు. బ్రిటీషువారి పాలనలో వారి సమస్యలను అభివృద్ధిని అంతగా పట్టించుకున్నవారు లేరు. స్వాతంత్ర్యము తదుపరి ప్రభుత్వము గిరిజనులపట్ల శ్రద్ధతోపాటు రాజ్యాంగరీత్యా వారికి ప్రత్యేక రక్షణ అవసరాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవటము తక్షణకర్తవ్యంగా భావించి అనేక పథకాలను రూపొందించినది.

గిరిజనులు ఎదుర్కొనుచున్న ప్రధానసమస్యలు రెండు. ఒకటి పరపతి సమస్య. రెండవది విక్రయసమస్య. కొండల్లో అడవులలో వ్యవసాయానికి పనికిరాని, నీటివసతిలేని భూములనుసాగుచేస్తూ కనీస అవసరాలనుతీర్చుకొనుటకు, వడ్డీవ్యాపారులను, భూస్వాములను ఆశ్రయించుట ప్రతిచోట అగుపడును. గిరిజనులలో విక్రయంకాగల మిగులు ఏమాత్రము ఉన్నా, సంతలోనో, షావుకారుకో అమ్ముచున్నారు దీనికిగల ముఖ్యకారణాలలో (1) రవాణాసౌకర్యములులేకుండుట (2) విక్రయంకాగల మిగులుపరిమాణం చాలాతక్కువగా ఉండుట. (3) మార్కెటు పరిజ్ఞానము ఏమాత్రమూ లేకపోవటం. (4) పరపతికల్గించిన వారికే మిగులు అమ్మవలసిన ఒప్పందం కలిగియుండుట మొదలగునవి.

పై కారణాలదృష్ట్యా పరపతి మరియు విక్రయం, రెండు ఈప్రాంతాలలో షావుకార్లద్వారా జరుగుచున్నవి.

ప్రస్తుత పరిశోధనలో ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లాలోని రెండు గ్రామాలను ఎంపికచేయడం జరిగినది. ఈ రెండుగ్రామాలలోని గిరిజనుల జనాభా 75% నుండి 100% వరకు ఉండటం చాలా ముఖ్యమయిన విషయం. ఈ రెండు గ్రామాలు ఒకటి నిమ్మగూడెం రెండవది ముత్తారం.

పైన పేర్కొన్న గ్రామాలలో ఎక్కువశాతం గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడిఉన్నారు. స్వంతసేద్యముచేయువారు, కౌలుభూములు సేద్యముచేయువారు, మరికొందరు వ్యవసాయక గ్రామీణులుగా ఉన్నారు. సంవత్సరానికి 7 నెలలు వ్యవసాయంపనులుచేస్తూ మిగతాకాలము అటవిక ఫలసాయాన్ని ప్రోగుచేయటం. బీడీఆకులు త్రెంచటము, చెట్లునరికే శ్రామికులుగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

గిరిజనులు ఋణగ్రస్తులు కావటానికిగల ముఖ్యకారణాలలో వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండటమువలన, నీటివసతులులేక ఆధునికపద్ధతులను అనుసరించనందున, ఆర్థికస్థోమత లేకపోవడంతో పెట్టుబడులు తక్కువగా ఉన్నందున దిగుబడి తక్కువకావటం ఫలితంగా కనీస అవసరాలనుకూడ తీర్చుకొనలేకపోవడం గమనించవచ్చు.

వెనుక జతచేసిన పట్టికను పరిశీలించిన 100 కుటుంబాలలోని జనాభా వివరాలు, సగటుభూమి వివరాలు, సగటు ఆదాయం, మరియు సగటు వ్యయము వివరాలు పరిశీలించిన గ్రామాల ఋణభార పరిస్థితిని తెలియచేయును.

పరిశీలనా గ్రామము నిమ్మగూడెంలో పరిశీలించిన 50 కుటుంబాలు 5.02 సగటు కుటుంబ సభ్యులను కలిగియుండి 3.37 ఎకరాల కుటుంబ సగటుభూమిని

పట్టిక - 1

గ్రామము పేరు	పరిశీలించిన కుటుంబాలు	జనాభా		సగటు కుటుంబ సంఖ్య	కుటుంబ సగటు భూమి	కుటుంబ సగటు ఆదాయము	కుటుంబ సగటు వ్యయము	అప్పుల్లో ఉన్న కుటుంబాలు	ఋణ భారం	సగటు ఋణ భారం
		స్త్రీలు	పురుషులు							
నిమ్మగూడెం	50	113	138	5.02	3.37	3251=90	5548=20	45	78,100	1735=56
ముత్తారము	50	98	106	4.08	3.35	2882=40	4628=80	39	66,200	1697=44
మొత్తము	100	211	244	4.55	3.36	3067=15	5088=25	84	1,44,300	1717=80

మూలం : ఫీల్డ్‌స్టడీ

కలిగియుండి 3251-90 సగటు ఆదాయముగా 5548=20 సగటువ్యయముగా ఉన్నందున ఆ కుటుంబాల మొత్తము అప్పు 78100=00 రూ॥ అని సగటు అప్పు 1785=56 తెలియుచున్నది. అలాగే ముత్తారం గ్రామములో పరిశీలించిన 50 కుటుంబాలు 4.08 సగటు కుటుంబ జనాభాను, 3.35 ఎకరాల కుటుంబ సగటుభూమిని, 2882=40 సగటు ఆదాయమును, 4628=30 సగటు వ్యయమును కలిగిఉండి ఈ కుటుంబాలు 66200 రూ మొత్తం ఋణభారమును 1697=44 సగటు ఋణభారము ఉన్నట్టు తెలియుచున్నది. సగటున పరిశీలించ గలిగినచో పురుషుల జనాభా స్త్రీల జనాభాకంటె 116% ఎక్కువగాఉంది. మరియు సగటు కుటుంబసంఖ్య 4.55 కాగా సగటుభూమి 3.36 ఎకరాలు.

పట్టిక-1 ద్వారా తెలియునది నిమ్మగూడెం గ్రామము ముత్తారం కంటె జనాభాలో సగటు అప్పు పరిమాణములో అధికముగా ఉన్నట్టు స్పష్టమగుచున్నది.

ఋణగ్రస్తతకు కారణములైన అంశములను పరిశీలించగా అందులో జనాభా, భూమి వివరాలు, వివిధ మార్గాలనుండి ఆదాయముపొందిన తీరు మరియు వివిధ కార్యకలాపాలపై చేసిన వినియోగమును సూక్ష్మముగా పరిశీలించినచో ఋణభారం పరిస్థితి విశదమగును.

ఋణగ్రస్త - జనాభా

జనాభా పెరుగుదలకు ఋణగ్రస్తతకు ప్రత్యక్షసంబంధం కలదు. పరిశీలించిన 100 కుటుంబాలలో మొత్తము జనాభా 455 అని వారిలో పురుషులు 244 కాగా స్త్రీలు 211 అని సగటు కుటుంబ పరిమాణము 4.55 అని తెలియుచున్నది. జనాభాను, వయస్సువారిగా విభజించి పరిశీలించినచో 15 సం॥ లోబడిన 60 సం॥ పైబడిన అనుత్పాదక శ్రామికుల సంఖ్య ఎక్కువగా ఉండి 15-60 సం॥ మధ్య వయస్సుకల ఉత్పాదక శ్రామికుల సంఖ్య తక్కువగా ఉండి కుటుంబ ఖర్చులు పెరిగి కనీసావసరాలకు సరిపోయె ఆదాయాన్ని పొందలేక అప్పుల పాలవుతున్నారని చెప్పవచ్చు.

ఋణగ్రస్త - భూములు

అత్యధిక జనాభాకు జీవనాధారము వ్యవసాయరంగమే. కావున ఋణగ్రస్తతకు కారణమైన కమతాలను పరిశీలించడం జరిగినది. ఈ గ్రామాలలో కమతాల పరిమాణము స్వల్పముగాఉండి అందులో మెట్టభూమి శాతము ఎక్కువగా కలదు. దానికితోడు నీటిపారుదల సౌకర్యములేక, భూములు వ్యవసాయయోగ్యముగా లేకపోవటము, పంటలు సరిగా పండకపోవటమువల్ల ఈగ్రామాలలో ఋణభార పరిస్థితి పెరిగియున్నది.

ఆదాయము - ఋణగ్రస్తత

పరిశీలించిన 100 కుటుంబాల మొత్తము ఆదాయము 30,6715 రూ అని సగటు ఆదాయము 3067=15 అని తెలియుచున్నది. ఈ మొత్తము ఆదాయములో 40% స్వంత వ్యవసాయముద్వారా సమకూరగా 29% వ్యవసాయ శ్రామికులుగా పొందుచున్నారు. 7% ఆదాయమును చెట్లునరకడము కార్యకలాపాలద్వారా పొందగా 4.5% ఆదాయాన్ని అటవిక ఫలసాయాన్ని ప్రోగుచేసి అమ్మటంద్వారా 1% ఆదాయము భూస్వాములవద్ద పాలేర్లుగా ఉంటూ, కేవలము 6% ఆదాయాన్ని మాత్రమే ప్రభుత్వోద్యోగులద్వారా పొందుచున్నారని తెలియుచున్నది. వ్యవసాయేతర రంగాలనుండి పొందు ఆదాయము అతి తక్కువగా ఉన్నందున ఈ ప్రాంతములోని గిరిజనులు ఋణభారములో మునిగియున్నారు.

వినియోగము - ఋణగ్రస్తత

వినియోగానికి ఋణగ్రస్తతకు గల అవినాభావసంబంధము దృష్ట్యా ఈ రెండు గ్రామాలలో కుటుంబాల వినియోగ తరహాలను పరిశీలించడము జరిగినది. పరిశీలించిన 100 కుటుంబాల వినియోగవ్యయము 50,88=25రూ॥ అని కుటుంబ

పట్టిక - 2

గ్రామము పేరు	పరిశీలించిన కుటుంబాలు	అప్పుల్లో ఉన్న కుటుంబాలు	పరపతి పొందిన మార్గాలు				వివిధ సంస్థలనుండి పొందిన ఋణపరిమాణము				
			భూస్వాముల నుండి పొందిన కుటుంబాలు	వడ్డీవ్యాపారుల నుండి పొందిన కుటుంబాలు	సహకారసంస్థల నుండి పొందిన కుటుంబాలు	స్నేహితులబంధువుల నుండి పొందిన కుటుంబాలు	భూస్వాములు	వడ్డీ వ్యాపారులు	గిరిజన సహకార సంస్థలు	స్నేహితులు బంధువులు	మొత్తం
మ్మగూడెం	50	45	9	32	2	2	15600	47100	13700	1800	7810(
ముత్తారం	50	39	16	21	2	1	29200	31400	5100	500	6620(
మొత్తము	100	84	25	53	3	3	44700	78500	18800	2300	1,44,30

మూలం : ఫీల్డ్‌స్టడీ

సగటువ్యయము 5,068 – 25 అని తెలియుచున్నది. ఈమొత్తము వ్యయములో 68% ఆహారపదార్థాలపైన 11% వస్త్రాలపైన 6% మద్యపానముపై 3.4% ధూమపానముపైన 2.4% ప్రత్యేక పండుగలపైన 10% పెళ్ళిళ్లపైన 3.5% తిరునాళ్ళ (జాతరల) పైన 1.5% (సాంఘిక ఖర్చులు) ఇతర కార్యకలాపాలైన, విద్యా, వైద్యసదుపాయాలపైన వ్యయపరుస్తున్నారని తెలియుచున్నది. ఈ పరిశీలనవల్ల తెలియునది ఈ గ్రామాలలో ఉత్పాదక వ్యయము చాల తక్కువగాఉండి అనుత్పాదక వ్యయము అతి ఎక్కువగా ఉన్నందున ప్రతి అభివృద్ధి కార్యక్రమమునకు ఋణాలపై ఆధారపడవలసి వచ్చుచున్నది.


గిరిజనులు వివిధ కారణాలవల్ల ఋణగ్రస్తతలో మునిగిఉండి పరపతి అవసరాలను తీర్చుకొనుటకు ప్రభుత్వమునేకాక ఇతర ప్రవేటు సంస్థలను ఆశ్రయించినట్టుగా ఈ గ్రామాల పరిశీలనలో తెలియుచున్నది. నిమ్మగూడెం గ్రామంలో 50 కుటుంబాలను పరిశీలించగా అందులో 45 కుటుంబాలు అప్పులలో ఉన్నట్టు, ఆ కుటుంబాలలో 9 కుటుంబాలు పరపతిని, భూస్వాములనుండి, 32 కుటుంబాలు వడ్డీవ్యాపారులనుండి (షావుకార్ల) 2 కుటుంబాలు గిరిజన సహకార సంస్థనుండి మిగిలిన 2 కుటుంబాలు స్నేహితులు మరియు బంధువులనుండి అవసరమైన పరపతిని పొందగా ముత్తారం గ్రామంలో అప్పుల్లోఉన్న 39 కుటుంబాలలో 16 కుటుంబాలు భూస్వాములపై 31 కుటుంబాలు వడ్డీవ్యాపారులు షావుకార్లపై ఆధారపడగా 2 కుటుంబాలు గిరిజన సహకారసంస్థపై మిగిలిన ఒక కుటుంబము స్నేహితులు, బంధువులపై ఆధారపడి ఉన్నారు.

ఈ గ్రామాలలో భూస్వాములు, వడ్డీవ్యాపారుల ప్రాబల్యము ఎక్కువగా ఉండుటకు కారణము రక్షణ లేనందున గిరిజన సహకారసంస్థలను ఆశ్రయించక పోవడం, ఋణంపొందు మార్గాలు తెలియక మరియు కాలాయాపనవల్ల గిరిజనులు అనుత్పాదక, ఉత్పాదక వ్యయాల నిమిత్తము వడ్డీవ్యాపారులవైపే మొగ్గుచూపుచున్నారు. గిరిజనులకు రక్షణకల్పించు చట్ట వివరాలు తెలియకపోవడం కూడ ఒక మూలకారణం. అదేకాకుండా ద్రవ్యసహాయక సంస్థలు తాలూకాకేంద్రములో ఉన్నందున వారికి అందుబాటులో లేవు. వీరు కలిగిఉన్న భూములు యాజమాన్య హక్కులు లేక తాకట్టుపెట్టుటకు వీలుగాలేవు. దానికితోడు దళారులకుచెల్లించాల్సిన ముడుపులుకూడ ఓ కారణం. ఋణాలనుపొందిన వివిధ మార్గాలనేకాకుండ వివిధ సంస్థలనుండి పొందిన ఋణపరిమాణాలను పరిశీలించగా అప్పుల్లో ఉన్న 84 కుటుంబాల మొత్తం అప్పు 1,44300 రూ॥కాగా దీనిలో రూ॥ 78,500 (54%) వడ్డీవ్యాపారులు సమకూర్చినారు. రూ॥ 44.700 (31%) భూస్వాములు సమకూర్చగా, 18,800 (13%) గిరిజన సహకారసంస్థ 2,300రూ (1.6%) స్నేహితులద్వారా సమకూర్చుకొనుచున్నారు. ఈ గ్రామాలలో ప్రభుత్వసంస్థల ఋణాలు లెవని స్పష్టమగుచున్నది. ప్రవేటువ్యక్తుల నుండి పొందిన ఋణాలలో కొన్ని వస్తురూపములో కాగా మరికొన్ని ధనరూపములోకలవు. వస్తురూపములో పొందిన వస్తువులపై 100 నుండి 200% వడ్డీరేటు కలదు. ధనరూపములో పొందిన ఋణాలపై 10% నుండి 36% వరకు కలదు. ఈరేటు మార్పు ఋణదాతకు, ఋణగ్రహీతకు గల సంబంధముపై ఆధారపడిఉండును.

పై పరిశీలనవల్ల తెలియునది ఈ ప్రాంతములో వడ్డీవ్యాపారులు, భూస్వాములు ఎక్కువ పరపతి కల్పించుచున్నారని, గిరిజన సహకారసంస్థల పరపతి నామమాత్రంగా ఉందని భావించవచ్చు. కాని చుట్టుప్రక్క గ్రామాలతో పోల్చి చూసినట్లయితే ఈ ప్రాంతములో వడ్డీరేటు తక్కువే అని చెప్పవచ్చు. దీనికిగల కారణాలలో ముఖ్యంగా సాంఘిక కారణాలతోబాటు వ్యవసాయ కార్మికసంఘాల కృషికూడ ఒక కారణం.

ముగింపు :– గిరిజనుల ఋణభారమును పరిశీలించగా ఈ దిగువ అంశాలు స్పష్టమగుచున్నవి.

కుటుంబ జనాభాలో అనుత్పాదక శ్రామికులసంఖ్య ఎక్కువగా ఉండడము మరియు కుటుంబ నియంత్రణ పరిజ్ఞానం లేకపోవటంవల్ల గిరిజనులు అప్పుల పాలవుతున్నారు. కావున కుటుంబ సంక్షేమ కార్యకలాపాలు చురుకుగా అమలు



జరిగేలా చూడాలి.

కుటుంబ కమతాల పరిమాణము తక్కువేగాకుండా, మెట్టభూములు అధికం మరియు వర్షపాతముపై ఆధారపడి ఉన్నందున తగిన ప్రతిఫలాలు పొందలేక అప్పుల్లోఉన్నారు. వ్యవసాయక అభివృద్ధికిగాను ఈ ప్రాంతాలలో నీటి పారుదల సౌకర్యాలను పెంచడము, రసాయనిక ఎరువుల వాడకంలోని లాభాలను తెలుపడం మరియు అధిక దిగుబడి వంగడాలను ఉయోగించే అట్టి ప్రభుత్వము చర్యలు గైకొనవలసి ఉన్నది.

ఆదాయాలు స్వల్పంగా ఉండుటకు కారణం వారుపొందిన వస్తువులను గిరిజన నిత్యావసరాలను సమకూర్చే, మరియు కొనుగోలుచేసే సంస్థ (డి. ఆర్. డిపో)కు అమ్మక షావుకార్లకు అమ్మడమువల్ల, షావుకార్లు వస్తువును కొనేప్పుడు తక్కువరేటుకు, గిరిజనులకు కావలసిన వస్తువులను అమ్మేప్పుడు ఎక్కువ రేటును విధించుచున్నారు. ఉదాహరణకు ఒక మీటరు తెల్లబట్ట డి. ఆర్, డిపోలో 2 రూ॥లకు లభించేది షావుకార్లవద్ద రూ. 4 లకు లభించును. కావున ఈ డి.ఆర్ డిపోలను ఏర్పరచడమేకాకుండ వీటిని ఉపయోగించుకొనేవిధంగా గిరిజనులను ప్రోత్సహించవలసిన అవసరము ప్రభుత్వ యంత్రాంగమునకు కలదు.

గిరిజనులకు అవసరమైన పరపతితోపాటు వారి అభివృద్ధినిమిత్తము, అటవీ ఆధార పరిశ్రమలనేర్పాటుచేసి ఉద్యోగపరిస్థితులు మెరుగుపరచడం, ప్రభుత్వం ఋణమంజూరీలో ఉన్న అలసత్వాన్ని తగ్గించి, నియమ నిబంధనలు సడలించి కేవలం ఉత్పాదక కార్యకలాపాలకే గాక అనుత్పాదక కార్యకలాపాలకు కూడ ఋణాల ఏర్పాటు, ఇతరరాష్ట్రాలలో ఏర్పాటుచేసినట్టుగా గ్రెమిన్‌గోలాలు ఏర్పాటుచేసి పంటలమార్పిడి సమయంలో వస్తురూపంలో ఋణాలు ఇవ్వడం, అనుత్పాదక వ్యయాలను తగ్గించే ప్రయత్నము, బ్యాంకులు మారుమూల గ్రామాలకు చొచ్చుకొని సహకరించడము, రోడ్డురవాణాసౌకర్యాలు కల్పించడము, మార్కెటు సదుపాయాలను అభివృద్ధిచేయడం మరియు గిరిజనులకొరకు ఏర్పరచబడిన డి.ఆర్. డిపోలో ప్రభుత్వం ఇచ్చిన వస్తువులు ఏ కొద్దిమందికో పరిమితము చేయక గుర్తింపుకార్డులద్వారా ప్రతిఒక్కరికి నిత్యావసరవస్తువులు అందేలా చూడడము అవసరము.

ఈవిధంగా పరపతి సమకూర్చటంలో విక్రయసదుపాయాలు సమకూర్చటంలో ప్రభుత్వం సరియైన శ్రద్ధవహిస్తే గిరిజనుల ఋణగ్రస్తత తగ్గుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

[వ్యాసం రాసినవారు ముగ్గురూ వరంగల్లు కాకతీయ విశ్వవిద్యాలయం యొక్క అర్థశాస్త్ర శాఖకి చెందినవారే.]

కె. లక్ష్మిరాజ్యం-పి. దామోదరరావు-డాక్టర్ పి. రామయ్య

హరివిల్లు చినుకులో

సాంధ్యశ్రీ

1

ఊహలకు ఊపిరులు పోసింది బిందువై
కలమెత్తగా కథల కాణాచి సింధువై

కలవెన్నో తలపులు
కలవు తొలి వలపులు
కథలుగా చెప్పగా
కదలు ఎద పిలుపులు....

వెరజాజు విరజాజి వెదద వన్నెలు చింద
నెరవొంది సొగసంత నెలత రూపమునొంద

కలవెన్నో తలపులు
కలవు తొలి పిలుపులు
కలలుగా సాగగా
కదియగొను మలపులు....

కర్ణాటి సారంగి కనుదోయి మెరుపులో
తెలుగు తర వలపులే తొంగలించిన చోట

కలవెన్నో పిలుపులు
కలవు సిరి వలపులు
కదలగా కదలగా
కదిలించు తలపులు....

2

గతము పూచిన పూలలోపలి కథా రీతుల క్రమగతులివి
వెతలు తోచని అనుగు గుండియ కలుగులోపలి సారజతులివి
భద్రసీమను మనసు పాటలు గొంతుచీల్చుకు వచ్చునట్టివి
వలపు వెలుగుకు భద్రవేదిక చోటునిచ్చిన భవితమట్టిది..

మంచి తలపుల మంచితనమె
మంచు ముత్యములై నవిచట
మించి అహల్యకు శాపమాపి
పంచి పెట్టెను మరకతమ్ముల....

ఎదదలోతుల ఇవతళించిన భావమొక్కటి నీటి బిందువు
చిందిపడినది చినుకు చినుకై భద్రజన్మకు సార్థకమ్ముగ
చినుకు లోపలి మెరుపుదారుల చింది పడినవి వలపులాయెను.
అనుభవాలను ఆశ్రయించిన ఆత్మలోపలి తలపులాయెను.

3

పృళ్ళింది నొకచినుకు
సొగసు పొరువమెత్తి
మెరిసింది మలి చినుకు
పవడాల డాకెత్తి....

దిగజారి నొకచుక్క
ఎదలోతు తడిమింది
మొగసాల నొకచుక్క
మొరవంక మోగింది....

గరికపై నొకచుక్క మరకతమ్మైపోవ
సైకత స్థలిలోన స్ఫటికమై విరబూయ....
ఒడిచిందినది బొట్టు
ఒయ్యారముగ తూలి
జారిపడినది చుట్టు
జాలువారగ సోలి....

చినుకు చినుకు నడుమ
చిత్రగతులను మీటి
మినుకు మినుకుకు నడుమ
మిశ్రజతులను దాటి ...

రాతిపై నొకచుక్క రాలిపడినది చూడ
రాగాల హరివిల్లు రంగు పరచిన జాడ....

4

భద్రభూమిక భద్రభూమిక బయలుమొరసిన భావవీచిక
చిందిపడినది చినుకునందుల పదరుటూహల వలపుదీపిక
తగటుచాలుల తీగమీటిన చిరుతరంగిత నాదలహరిక
రవముగీతిగ రంగరించి గొంతునెత్తిన స్వరసముద్రిక...

రాలగుండెకు రాగమిచ్చిన రసతరంగిణి రాగశారిక
పూలగుండెకు పులకరింతగ మధువు చిలికిన మేఘమాలిక
తీగమలకల హొయలుచుట్టిన తగటు సుందరతటిల్లతిక
మృదుల చంద్రిక జాలువారిన హృదయసీమల కెరలు మలయిక ..



సమృద్ధ పరిమళము
సరియైన ధరతో



ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

"గులాబి మరియు ఆకుపచ్చ రంగులలో లభించును"

జయలక్ష్మి
గుంటూరు వారి
తయారీ

imageads-2107 Tel

ఈ మాసం - మీ నక్షత్రఫలం జూలై 1986

1. మేషము :- (అశ్విని, భరణి, కృత్తిక 1పా)

అశ్వనివారికి గతంకన్న కొంచెం మేలుగా ఉండును. శుభకార్య ప్రయత్నాలకు ఆటంకాలుకలిగి వాయిదాపడును. అనుకొన్న పనులు కొంచెం ఆలస్యంగా జరిగి 15వ తే. నుండి అనుకూలపరిస్థితి ఏర్పడును. తరచు ప్రయాణాలవల్ల శ్రమకలిగినా, తగిన లాభం, పెద్దలతో స్నేహసహవాసాలు ఏర్పడి భవిష్యత్తులో అభివృద్ధికి మార్గం సులభం చేస్తాయి. స్వల్పంగా కలత నలతలు తప్పవు. భరణి వారికి ఇంకా ఈనెల అంతా కలత నలతయూ, అనారోగ్యం, కొంతవరకు బంధు విరోధం, అధికారులచే మాటపడటం, ధనవ్యయం కలగడమేకాక, తలకుమించిన పనులు తలపెట్టి "ముందు నుయ్యి వెనుక గొయ్యి"గా ప్రతిపనిలోను ముందడుగు వేయలేకపోవడం జరుగును. అయినా ఉద్యోగులకీ, విద్యార్థులకీ కొంతలో కొంత మేలుగా ఉంటుంది. కృత్తిక 1పా వారికి విద్యార్థులకు, వర్తక, ఉద్యోగ, కార్మిక, కర్షక వర్గాలవారికి ధనలాభం, కార్యసిద్ధి, శుభకార్య ప్రయత్నాలలో పాల్గొనుటా, విందులూ, వినోదాలూ, పెద్దలతోసహవాసం, సాహసప్రయత్నాలూ నేరవేరుతాయి,

2. వృషభం :- (కృత్తిక 2,3,4 పా; రోహిణి, మృగశిర 1,2 పా.)

కృత్తిక 2,3,4 పా. వారికి క్రమక్రమంగా శారీరక మానసిక వ్యధలు తొలగినట్లు కనబడినా హఠాత్తుగా తిరిగి ఎప్పుడైనా మనఃక్లేశం కలిగించే సంఘటనలు కలుగవచ్చును. మిగిలిన కుటుంబవ్యవహార విషయములు బాగుగా ఉండును. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉండును. రాజకీయవాదులకు, వర్తకులకు మాంద్యమేర్పడును. రోహిణివారికి అతివేడిమి, త్రిప్పటా, శారీరకశ్రమా. మొదలగునవి కలిగినా ఆర్థికలాభంబాగుగా ఉండును. ఉత్సాహంప్రతివిషయంలో చొరవ కలుగును. బంధుమిత్రులవలనగాని, అధికారులవలనగాని సహాయసహకారములు లభించును. అన్నివిషయాల్లో దైవబలము బాగుగా కలసివచ్చును. మరియు వ్యవసాయదారులకు మంచి అనుకూలముగా ఉండును. ధనలాభంకలుగును. మృగశిర 1,2 పా. వారికి గ్రహస్థితి అనుకూలంగా ఉన్నను, మనోవైకల్యం, అసంతృప్తి, పనికిమాలిన ఆలోచనలూ, ప్రతివిషయంలోను అసంతృప్తి, నిద్ర సరిగా పట్టకుండుట, అతివేడిమి మొదలగునవి కలుగును. అయినను ఆర్థిక విషయములలో అక్కరకుతగినట్లు సర్దుబాట్లుజరిగి పనులు నెరవేరుచుండును. ముఖ్యంగా విద్యార్థులకు, ఉద్యోగ, వర్తక, కార్మిక, కర్షకవర్గానికి శ్రమతోకూడిన ఫలితం కలుగును. మొత్తంమీద శుభాశుభ మిశ్రమఫలంతో గడచును.

3. మిథునం :- (మృగశిర 3,4పా. ఆర్ద్ర, పునర్వసు 1,2,3పా.)

మృగశిర 3,4 పా. వారికి ఈనెలకూడ చిక్కులతోనే కొనసాగును. ముఖ్యంగా కార్యవిఘ్నం, మనోవైకల్యం, ఏ రోగము లేకపోయినను ఏదో అనారోగ్యంతోనే బాధపడునట్లుండుట, చేసిన ప్రయత్నాలకు విఘ్నములూ భార్యకు అనారోగ్యం, శరీరశ్రమా కలిగినా ఆర్థికంగా లోపంఉండదు. అయితే ధనంమాత్రం అవసరములేకపోయినా ఖర్చుఔతుంది. బంధుమిత్రాదుల రాకపోకల వత్తిడి, ఆశ్రితులూ, మొగమాటస్థులు మొదలయినవారివలన (ఎంత ధనం వచ్చినను దానికి తగిన) ఖర్చు ఏర్పడుతుంది. ఈ ఖర్చు విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత హెచ్చు. వైద్యవృత్తిలోఉన్నవారికి బాగుగా లభించును. వ్యవసాయదారులకు కూడ లాభకరంగా ఉండును ఆర్ద్రవారికి మంచి ఉత్సాహం కలుగును. అప్పుడప్పుడు భార్యకు, సంతానమునకు నలతవలన ధనవ్యయం జరుగును. చుట్టములవత్తిడి హెచ్చుగానుండును. ధనంమాత్రం పుష్కలంగా కలసివచ్చును. బైటికి డాబుగాఉన్నను లోపలమాత్రం కొంత పిరికితనము, జంకునుపొందుట జరుగును. పునర్వసు 1,2,3 పా. వారికి స్వల్పంగా కుటుంబంలో నలతలు కలిగినా ధనలాభం, స్థిరాస్తి సంపాదన జరుగును. పెద్ద లావాదేవీలలో విజయం, పెద్దవారి ప్రాపకం, గృహాదిలాభమూ, సంఘంలో విశేష గౌరవమూ కలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్లీడర్లకు, వైద్యులకు, వ్యవసాయదార్లకు మంచి లాభదాయకమైన కాలము.

4. కర్కాటకం :- (పునర్వసు 4పా. పుష్యమి, ఆశ్లేష)

పునర్వసు 4పా. వారికి కించిత్తు మానసికశ్రమ కలిగినా ధనలాభమూ, సుఖమూ నూతనమిత్రుల పరిచయమూ కలిగి సర్వకార్యములు సానుకూలమగును. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశం కలుగును. తలవనితలంపుగా పెద్దలతో పరిచయమూ, ఊహించనివిధంగా కొన్ని వ్యవహారములలో విజయం కలుగును. ఉత్సాహం సుఖం వృద్ధియగును. ఒకక్షణంలో జీవితంలో ఒకమలుపు తిరుగుట జరిగి భవిష్యత్తునకు ఒక మంచి బాటవేయును. పుష్యమివారికి ప్రయాణాలవలన తీరికలేనంత పనిభారముల వత్తిడిచేతను, ఈనెల అంతా బడలిక హెచ్చుగా ఉండును. నెల చివరిలో ధనలాభం కలుగును. శుభకార్యప్రయత్నాలు వాయిదాపడును. విద్యార్థులకు ఉన్నతవిద్యావకాశం, దూరప్రాంతములకు ప్రయాణాలు జరిగి లాభించును. తెగని వ్యవహారములు అంతా అనిశ్చితంగానే కొనసాగును. ఆశ్లేషవారికి సుఖసంతోషాలు, ఉద్యోగులకు ప్రమోషను, వర్తక, కర్షకులకు విశేషంగా లాభం, విద్యార్థులకు ఉన్నత విద్యావకాశం, కార్మికులకు ఆర్థికంగా తొట్రుపాటూ, రాజకీయనాయకులకు లాభమూ, కంట్రాక్టర్లూ మొదలగు వారికి కార్యవిలంబము జరుగును. పెద్దగాకాకపోయినా, సామాన్యయోగంతోనైనా సుఖసంతోషాలతో ఈనెల గడచును.

5. సింహం :- (మఘ, పుబ్బ, ఉత్తర 1పా)

మఘానక్షత్రంవారికి ఇతర విషయములలో అనగా ఆర్థిక వ్యాపారాదులతో బాగానే ఉన్నను కుటుంబంలో భార్యకు అనారోగ్యం, సంతానవిషయమై ధనవ్యయం; కొన్ని అనవసరమైన బాధ్యతలను నెత్తిని వేసుకొనుటవలన దండుగమారి వట్టములు కలుగును తల్లికి లేదా మాతృవర్గమువారికి నలత లేక పీడ చేయును. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశం కలుగును. పుబ్బవారికి ఇంకా అనారోగ్యమూ, శ్రమా, అనవసరమైన త్రిప్పటా, మానసికంగా వ్యాకులపాటూ బంధువులతో విరోధమూ, అనవసరంగా ధనవ్యయమూ జరుగును.. విద్యార్థులకు, ఉద్యోగ, వర్తక, కార్మిక, కర్షక వర్గాలవారికి ఆర్థికంగా లాభం కలుగును. ఆత్మీయులతో మాత్రం విరోధభావము కలుగును. ఉత్తర 1పా. వారికి విద్యార్థులకు ఉన్నతశ్రేణిలో విజయం, ఉన్నతవిద్య లేక టెక్నికల్ విద్య, నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, మంచి ధనాదాయం కలుగును. వర్తకులకు, వృత్తిపరులకు వ్యాపార వ్యవహారాదుల మూలకంగాగాని, వ్యవసాయం, పరిశ్రమలూ, వడ్డీ వ్యాపారమూ మొదలగువాని మూలకంగాగాని ధనాదాయం బాగుండును. అన్ని వర్గములవారికి ఇది శుభయోగప్రదమైన కాలము.

6. కన్య :- (ఉత్తర 2,3,4 పా. హస్త, చిత్ర 1,2, పా,)

ఉత్తర 2,3,4 పా. వారికి మాతృవర్గంవారితోను, భార్యావర్గం లేక భర్తృవర్గంవారితోను మాటపట్టింపులూ, మాతృవర్గ పీడా కలుగును. మిగిలిన ఆర్థికాదివిషయములు చాల బాగుండును. విద్యార్థులకు, రాజకీయవాదులకు మంచి అనుకూలమైన కాలము. క్రొత్తవ్యక్తులతో పరిచయమూ, అనుకొనని లేక ఊహించని విషయములవలన ధనం, జయం, లాభంకలుగును. హస్త వారికి

మానసికంగా ఆందోళనా, లాభమునుమించిన ధనవ్యయం, ప్రతివిషయంలోను శంకా, భయం వలన వెనుకంజవేయుట జరుగును. బంధువులతో విరోధమూ, మాటపట్టింపులూ వచ్చును. మరియు చిన్నచిన్న విషయములలో పెద్దగా బాధ పడుట జరుగును. చిత్ర 1,2 పా. వారికి మాతృవర్గపీడా 14వ తే. దాటిననుండి కుటుంబంలో స్వల్పంగా అనారోగ్యం, పనికిమాలినఖర్చు కలుగును. ఇదివర కెన్నడూ లేనంత ధనలాభం వచ్చినను అంతయు ఖర్చైపోవుట మాత్రమేకాక ఋణంకూడ పెరుగును. విద్యార్థులకు కించిత్తు శ్రమతో ఉన్నతవిద్యావకాశం కలుగును. కర్షకులకు వర్తకులకు ఆశించినంత లాభంరాదు. మానసికంగా హెచ్చు శ్రమపడవలసివచ్చును.

7. తుల :– (చిత్ర 3,4 పా. స్వాతి, విశాఖ 1,2,3 పా.)

చిత్ర 3,4 పా. వారికి నెలఅంతా అనుకూలంగానే ఉన్నను వక్రకుజుని దోషంవల్లను, వక్రగురుని దోషంవల్లను చేతులకు చిన్నచిన్న వ్రణములు లేక దెబ్బలు కలుగవచ్చును. సంతానంతో వ్యతిరేకభావము ఎదుర్కొనవలసివచ్చును. ధనాదాయం బాగుగా ఉండును. వైద్యులకు, ఉద్యోగవ్యాపారులకు సర్వవిధముల అభివృద్ధికరమైన కాలము. అన్నివ్యవహారాలలోను విజయం కలుగును. మానసికమైన ఆందోళనా సోదరులతో విభేదమూ కలుగును. స్వాతివారికి గత నెలనుండి ఉన్న అనుకూలపరిస్థితులు కొనసాగుచున్నను కుటుంబంలో చిన్నచిన్న అనారోగ్యములు కలుగుచుండును. ఆర్థికంగా లాభమునకు మించిన వ్యయం కలుగును, సంతానమునకు అన్నివిధముల విద్యాభివృద్ధికలుగును. విద్యార్థులకు, ఉద్యోగ పత్రికలకు స్పెక్యులేషను వ్యాపారముచేయువారికిని బాగుగా యోగించును. ఆరోగ్యం చక్కగాఉండును. పెద్దపెద్ద కార్యములు తలపెట్టుట, ఆర్థికవనరులు సమకూడుట జరుగును. బంధువులతో తగాదాలుకలుగును. విశాఖ 1,2,3 పా. వారికికూడ చిక్కులు పూర్తిగా తొలగిపోయి సంసార కుటుంబసౌఖ్యం వృద్ధియగును. బంధుమిత్రాదుల యొద్ద, సంఘంలోను దురుసుతనమును తగ్గించుకొనుట మేలు. తక్కువస్థాయివారు నీచవృత్తులు చేయువారు మొదలగువారినుండి ధనలాభం కలుగును. వర్తకులకు ఎఱ్ఱధాన్యములు, ఎరువులు, చింతపండు, నూనె, బెల్లం, మొదలగువానివలన హెచ్చులాభం కలుగును. సంతానమునకు అన్నివిధముల అభివృద్ధికలుగును. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశములు బాగుగా ఉండును.

8. వృశ్చికం :– (విశాఖ 4 పా. అనూరాధ, జ్యేష్ఠ)

విశాఖ 4పా. వారికి 15వ తే. వరకు మానసికక్లేశం కలుగును. కుటుంబంలో చిన్నచిన్న అనారోగ్యములు కలుగుచుండును. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశములు కలుగును. వర్తకులకు బాగుగా లాభించును వ్యవసాయ కార్మికులకుకూడ ప్రోత్సాహంకలుగును. పాడిపంటలు, వ్యవసాయం, పరిశ్రమలూ, ఉద్యోగమూ మొదలయిన అయా వృత్తివర్గములవారికి అన్నివిధముల మంచి ఆదాయం ప్రోత్సాహం బాగుగా ఉండును, అనూరాధవారికి వక్రశని, వక్రకుజుడు ప్రతివిషయంలోను ఆటంకము కలిగించును. ఆరోగ్యంకూడ సరిగా ఉండదు. కుటుంబంలో కలతలుకలుగును. ఆర్థికంగా ఆదాయం బాగున్నను, తట్టుకొనుటకు వీలులేని వ్యయంకలుగును. ఏపనిచేయుటకూ ఉత్సాహం ఉండదు. ఎంతవచ్చినను సంతృప్తి ఉండదు. ఎప్పటికప్పుడు ఊహించని చిన్నచిన్న చిక్కులు, ఎటూతెగని సమస్యలు, మనస్సునకు క్లేశమునుకలిగించును, దైవచింతన హెచ్చును. కుజ శనులకు ఉపశాంతులు చేయించుట మంచిది.

జ్యేష్ఠవారికి వ్యవహారపు చిక్కులు క్రమక్రమంగా తొలగి బంధుమిత్రులతో సుముఖత ఏర్పడును. కుటుంబంలో చిన్నచిన్న అనారోగ్యం మూలకంగా ధనవ్యయం కలుగును. కోర్టువ్యవహారాలలో రాజీకుదిరి మేలుకలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, వర్తకులు మొదలగు అన్ని వృత్తులవారికి ఆర్థికంగా లాభించును. అనవసరపు ఆలోచనలు, మనస్సునకు వికలత్వమును కలిగించును ఎన్నివిధముల కలిసివచ్చినను చేయదలంచుకొన్న పనులకు, స్థిరనిర్మాణ ప్రయత్నములకు ఆటంకములేర్పడుచుండును.

9. ధనుస్సు :– (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

మూలవారికి ఆర్థికపు తొట్రుపాటూ, సంఘంలో మాటపట్టింపులూ బంధువులతో మాతృవర్గంవారితో విభేదములు కలుగును. విద్యార్థులకు. ఉద్యోగులకుమాత్రం ఏదోవిధంగా (చిక్కులుకలిగినా) ప్రోత్సాహకరంగా ఉండును. ధనము ఏదోవిధంగా అవసరములకు సరిపోగా ఖర్చుబాటు అగుచుండును. వర్తక వ్యవసాయదారులకు లాభం సామాన్యంగా ఉండును. ఉమ్మడివ్యాపారం చేయువారికి లాభం బాగుగా ఉండును. పూర్వాషాఢవారికి ఈనెల పూర్వార్థం అంతా చిక్కులుగాను, ఉత్తరార్థం కొంత మేలుగాను ఉండును. వక్ర శని కుజులతో పాటు, అష్టమంలో (వక్ర) బుధుడు, రవి శుక్రులుకూడ మరింత వ్యధను, ఆర్థికపు చిక్కులను, మనోవైకల్యాన్ని, ఆరోగ్యభంగమును, విపరీత ధనవ్యయమును కలిగించెదరు. ముఖ్యంగా ఇతరులచే లేనిపోని మాటలు పడవలసివచ్చును. ఉత్తరాషాఢ 1పా. వారికి విశేషశ్రమ ఉండదు. కాని ప్రతివిషయంలోను ధనవ్యయం, అసంతృప్తి, మనఃక్లేశం కలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు కొంత అనుకూలంగా ఉండును.

10. మకరం :– (ఉత్తరాషాఢ 2,3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1.2 పా.)

ఉత్తరాషాఢ 2,3,4 పా. వారికి సంసార కుటుంబసౌఖ్యం, ధనలాభం, సంతానమునకు అభివృద్ధి, బంధుమిత్ర సుఖమూ, ఉద్యోగాభివృద్ధి సంఘంలో మాటపలుకుబడి మొదలగునవి కలుగును. ధనం బాగుగా కలసివచ్చును. శ్రవణం వారికి గృహనిర్మాణాదులలో పనినష్టం, స్పెక్యులేషను, లాటరీ వగైరాలు ఫలించును. ఏనాడో నిరాశచేసికొన్న కార్యములు సఫలములై జేరికంచును. విద్యార్థులకు, ఉద్యోగులకు చాల మేలైన కాలం. శుభకార్యప్రయత్నములు స్థిరపడును. ధనిష్ఠ 1,2 పా. వారికి రావలసినంత ధనలాభం రాదు. ఊహాలు మాత్రం పెరిగెత్తుచుండును. ప్రతివిషయంలోను ఆశలు పెంచుకొనుట, విపరీతమైన ప్రయత్నంచేయుట జరుగును, అయితే ఏదోవిధంగా కొంత ప్రతిఫలం కలసివచ్చుచుండును. విద్యార్థులకు కొంత శ్రమమీద ఉన్నతవిద్యావకాశం కలుగును. ఉద్యోగులకు, వర్తకులకు ధనలాభం కలసివచ్చును.

11. కుంభం :– ధనిష్ఠ 3,4 పా. వారికి నెల పూర్వార్ధం కించిత్తు బంధువిరోధమూ, ఋణబాధ, సోదరులతో విరోధమూ, సంతానంగురించి అధికశ్రమా, బంధుమిత్రులవలన వత్తిడి కలుగును. ఈ అదునుచూచుకొని విరోధులు పగసాధించుటకు ప్రయత్నించెదరు. అయినను బాగుగా కలసివచ్చిన ధనలాభంవలన చిక్కులు తొలగిపోవును. ఇట్లే విద్యార్థులకు, వర్తకులకు, ఉద్యోగులకుకూడ మేలుకలుగును. శతభిషంవారికి ఈనెల అంతా చక్కగా ఉండును. కాని అప్పుడప్పుడు శత్రువుల సాధింపులకు గురికావలసివచ్చును. శరీరంలో మధ్యమధ్య నలతకలుగును. 10వ తే. నుండి ధనవృద్ధి, లాభం, సంసార కుటుంబసౌఖ్యం, సంతానమునకు అన్నివిధముల అభివృద్ధి జరుగును. పూర్వాభాద్ర 1,2,3 పా. వారికి ముఖ్యంగా 3వ పా. వారికి శరీరశ్రమ హెచ్చు. తలకుమించిన పనులను నెత్తిమీద పెట్టుకొని ఏది చేయవలెనో, ఏది మానవలెనో తెలియక ఆటంకముల వలన ఏపనియు చేయలేక శ్రమా, ధనవ్యయమూ మాత్రమే మిగుల్చుకొనును. ధనలోపంమాత్రం ఉండదు. విద్యార్థులకు యోగ్యమైనకాలము. శుభకార్యములు నిశ్చయమగును.


12. మీనం :– (పూర్వాభాద్ర 4 పా. ఉత్తరాభాద్ర, రేవతి)

పూర్వాభాద్ర 4పా. వారికి మంచి అనుకూలమైన కాలం. తలా మొత్తం మూడు నక్షత్రములవారికి కూడ ఉద్యోగ వ్యాపారాభివృద్ధి, సంతానమునకు అన్నివిధముల విద్యాభివృద్ధికలుగును. శుభకార్య ప్రయత్నములు అనుకూలములై ఉండును. అన్నివిధముల ధనాదాయం బాగుగా ఉండును. వర్తక వ్యాపారులకు, ముఖ్యంగా విద్యార్థులకు పుష్కలంగా అన్నిరంగములనుండి ధనం బాగుగా కలసివచ్చును. ఉత్తరాభాద్రవారికి శరీరశ్రమ హెచ్చుగా ఉండును. సంతానవిషయమై చాల శ్రమపడవలసివచ్చును. ఎన్నోవిధముల చేసిన ప్రయత్నములకు ఆరంభంలోకలిగిన ఆటంకముల నెదుర్కొని చివరకు విజయం పొందుట జరుగును. మరియు మానసికంగా భయమూ, దిగులూ ఏదో కలిగినా "ఆని" చెప్పుటకు వీలులేని, లోపంతో బాధపడుట జరుగును. రేవతివారికి నెల అంతా అన్నివిధముల అనుకూలమైన కాలం. అన్నిపనులయందును విజయమూ, సుఖ సంతోషములూ కలుగును. విద్యార్థులకు ఉన్నతవిద్యాప్రవేశమూ, ఉద్యోగులకు ప్రమోషను, అభివృద్ధి, వర్తక వ్యవసాయదారులకు అన్నివిధముల లాభమూ సంఘంలో మంచి పలుకుబడి, గౌరవమూ, కుటుంబంలో అన్నివిధముల సౌఖ్యమూ కలుగును.

సిద్ధాంతి : నిష్ఠల వేంకట సత్య సుబ్రహ్మణ్య
బొబ్బిలి.

గోలమాలపెళ్ళి

లక్ష్మీభాస్కర్ కోలపల్లి



డాక్టరు కొల్లూరు సూర్యనారాయణ

వేములవాడ చాళుక్యుల జైనమత పోషణ

తెలుగునాటి వాయువ్య ప్రాంతాలను కీలకమైన దశలలో పాలించి, ఆ ప్రాంతపు మత సంస్కృతులను పరిరక్షించిన ప్రముఖ సామంత వంశము వేములవాడ చాళుక్య వంశము. సత్యాశ్రయ రణవిక్రమునినుండి మూడవ అరికేసరి వరకు, అంటే క్రీ.శ. 650 నుండి 968 వరకు, సుమారు మూడు శతాబ్దులకు పైగా, వీరు ప్రస్తుత నిజామాబాద్, కరీంనగర్ జిల్లా ప్రాంతములను పాలించటం జరిగింది. రాజ్యాధికారానికి సంబంధించినంత వరకు సర్వ స్వతంత్రతతో వ్యవహరింప లేకపోయినప్పటికీ, రాష్ట్రకూటుల పాలనాకాలంలో వీరి ఖ్యాతి యినుమడించింది. వేంగి కళింగ ప్రాంతాలతో రాష్ట్రకూటుల సంబంధ బాంధవ్యాలను చక్కదిద్దుటలోను, ఉత్తర హిందూ దేశమును మాన్యఖేట రాష్ట్రకూటుల నీడకు గొనితెచ్చుటలోను పూర్తి బాధ్యత వహించిన మహా సామంతాధిపతులు వీరే. కేవల సామంతృత్వమే కాక రాష్ట్రకూటులతోడి వీరి వైవాహిక సంబంధములను పరిశీలించినచో నాటి రాజకీయ రంగమున వీరి ప్రముఖ స్థానము స్పష్టమౌతుంది. జైనమత ప్రాచుర్యంలో దక్షిణ హిందూదేశమున శ్రావణ బెళ్గోలము కంటె హెచ్చు ఖ్యాతికెక్కిన బోధన నగరము వీరి తొలి రాజధాని. కాని సమకాలీన రాజకీయాల కారణంగా, వినయాదిత్య యుద్ధమల్లునికి ముందు వెనుకల్లో ఎప్పుడో వీరి రాజధాని వేములవాడకు మార్చబడింది. కల్యాణీ చాళుక్యుల ఆవిర్భావంతో వీరి రాజకీయపు టధ్యాయం ముగిసేటంతటి వరకు అదియే వీరి రాజధాని. ప్రస్తుత వ్యాసంలో వారి ఏలుబడిలో వృద్ధిచెందిన జైనమత ప్రాచుర్యాన్ని సూక్ష్మంగా పరిశీలించటం జరుగుతుంది. తెలుగునాట జైనాన్ని చేరదీసి, ప్రోత్సహించిన వంశీయుల్లో ప్రథములు, ప్రముఖులు కూడ వేములవాడ చాళుక్యులే.

ఆంధ్రదేశంలో జైనమతం, బౌద్ధంకన్నా కొద్దిగా ముందుగానే అడుగిడినప్పటికీ క్రీ.శ. 7వ శతాబ్ది తరువాత మాత్రమే వ్యాప్తి నందగల్గింది. వేంగీ చాళుక్య కుటుంబంలోని అయ్యణ మహాదేవి మున్నగువారు బెజవాడ వంటిచోట్ల జైనబసదులు నిర్మించి ప్రోత్సహించినప్పటికీ[1], తెలంగాణముతో పోల్చి చూస్తే తీరాంధ్రంలో దీని ప్రాబల్యం తక్కువేనని చెప్పాలి. విజయనగరం జిల్లాలోని రామతీర్థమునందలి ఒక శాసనమాధారంగా[2] విమలాదిత్యుని వంటివారు జైనమతాన్ని స్వీకరించినట్లు నిరాఘాటంగా ఊహింపబడుతోంది[3], గాని ఆ త్రికాలయోగి సిద్ధాంతదేవుని శాసనంలోని విమలాదిత్యు డెవరైనదీ నిర్ధారణగా చెప్పటానికి అవకాశాలు బహు తక్కువ. అదవా, అందు పేర్కొన్న రాజమార్తాండ, ముమ్మడి భీమ బిరుదాంకితుడైన విమలాదిత్యుడు రాజరాజనరేంద్రుని తండ్రియే అని అంగీకరించినప్పటికీ, అలాంటి మారుమూల సందర్భాలు ఉత్తరాంధ్రంలోని జైనమతాగమనాన్ని సూచిస్తాయే తప్ప, దాని ఉద్ధృతిని, ప్రాచుర్యాన్ని మాత్రం కాదు. ఆంధ్ర ప్రాంతంలో యీ మతం చెదురు మదురుగా వ్యాప్తినందినట్లు దాఖలా లున్నప్పటికీ తెలంగాణమే దీనికి కేంద్రస్థానమై నిలిచిందని చెప్పక తప్పదు. ఆ గడ్డపై ఆధిపత్యాన్ని నెరపిన వేములవాడ చాళుక్యులు, రాష్ట్రకూటులు జైనాన్ని ప్రోత్సహించటం మాత్రమే కాక, తామే అవలంబించి బాసటగా నిలవటం యిచటి అధిక ప్రాచుర్యానికి కారణం. ఆల్టేకరు పండితుని పరిగణన[4] వాస్తవ దూరం కాదనుకొంటే, ఆనాటి దక్షిణాపథంలో దరిదాపుగా మూడవ వంతుమంది ప్రజలు మహావీరుని బోధనల ననుసరించి తరించినవారే. కాని 'అహింస'ను మూలాధారంగా బోధించే యీ మతం, తన అనుయాయులైన పాలకులే ఒక్కరినీ యుద్ధరంగాల్లో వేలాది సైనికుల ప్రాణాలను బలిపెట్టే దారుణమైన ఉద్యమాల నుండి విరమింప జేయలేకపోవటం ఆశ్చర్యకరమైన విషయం.

జైన సంప్రదాయా న్ననుసరించి మొదటి తీర్థంకరుడైన ఋషభుని యొక్క యిరువురు పుత్రులలో నొకడైన బాహుబలియే పోదనపురము రాజధానిగా సామ్రాజ్య మేర్పరచిన గోమటునిగా చెప్పబడతాడు.[5] ఆ పోదనపురమే ప్రస్తుత నిజామాబాద్ జిల్లాలోనున్న బోధన్; యిదియే వేములవాడ చాళుక్యుల తొలి రాజధాని. అచ్చటి దేవళ మసీదు స్తంభాలనిండా జైన చిత్రాలుండటం, శాసనాలు, శిల్పాలు మొదలైన అనేక జైనమతావశేషాలు, ఒకనాడచట మహోజ్జ్వలంగా వెలిగిన జైనాన్ని చాటి చెప్తాయి. బోధన నగరంలో సుమారు 525 విల్లుల ఎత్తు కలిగిన గోమటుని విగ్రహమొకటి వుండినట్లును, దానిని దర్శించి ప్రభావితుడైన చాముండ రాయుడు, దానిని పోలునట్లు విగ్రహ మొకదానినెత్తింప దలచి, శ్రావణ బెళ్గోలమున ప్రఖ్యాతమగు గోమటేశ్వరుని విగ్రహమును నిర్మింపించెనని అచ్చటి శాసనమొకటి[6] పేర్కొనుచున్నది. అటువంటి జైన ప్రభావం వున్న బోధన నగరాన్ని - తమ తొలి రాజకీయ కేంద్రంగా మలచు కొన్న చాళుక్యులు, తమ మలి రాజధానియైన వేములవాడను కూడ జైనమత సంపదకు ఆలవాలం గావించటం గుర్తింపదగిన అంశం. పన్నెండుకుపైగా జైన తీర్థంకరుల ప్రతిమలు, ఒక గోమటుని విగ్రహము, అనేక చౌముఖలు యిచ్చట బయల్పడిన జైనశిల్పాలలో పేర్కొనదగ్గవి. రాజేశ్వరాలయపు వెనుక, ధర్మగుండపు గట్టున, స్వామివారి ఉద్యానవనములో ఒక మూల నిర్లక్ష్యముగా విసరి వేయబడి మట్టిలో పొర్లుచున్న వందలాది జైన విగ్రహాలు ఒకనాటి యిచ్చటి జైనమత ఆదరణకే కాక, యీనాటి పురావస్తు శాఖవారి నిరాదరణకు కూడ సాక్షీభూతంగా దర్శనమిస్తాయి. ఇచ్చటి తీర్థంకరుల విగ్రహాలు చాలవరకు మాన్యఖేటమునందలి నేమినాథుని విగ్రహ మాధారంగా రూపేర్పడినట్లు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారభిప్రాయ పడినప్పటికీ[7] యిచ్చట మహావీరునికి కూడ ఉష్ణీషముంచిన తీరు అప్పుడప్పుడు యీతనిని బుద్ధునికన్న భిన్నునిగా గుర్తించటానికి వీలు కల్గింపదు.

అసంఖ్యాకులైన యిచ్చటి శిథిల శిల్పాలనుబట్టి మాత్రమేకాక యిచ్చట లభ్యమయ్యే శాసనాల ఆధారంగా కూడ యిచటి జైనమత విస్తారాన్ని ఊహించగలం. రెండవ బద్దెగుడు 'శుభధామ జినాలయం' పేరిట ఒక జైనాలయాన్ని నిర్మించి దానిని ప్రఖ్యాత జైన పండితుడైన సోమదేవసూరి ఆధీనమున నుంచినట్లు వేములవాడలోని ఒక శాసనం పేర్కొంటుంది.[8] క్రీ.శ. 968లో శ్రీ విజయుడుదత్త పరచిన రేపాకలోని మరో శాసనం మూడవ అరికేసరిని ఒక జైనాలయ నిర్మాతగా పేర్కొంటుంది.[9] ఈ చారిత్ర కాధారాల నేపథ్యంలో వేములవాడ చాళుక్యుల కాలంలో జైనం బహుళ ప్రజాదరణ గాంచి ఉంటుందని భావించగలం. సోమదేవసూరి, పంప మహాకవి మొదలైన జైన సిద్ధాంత నిష్ణాతులైన పండితులు యీ పాలకుల ఏలుబడిలో నుండటం, వీరి బోధనల్ని ప్రజల్లో

విస్తరింపజేసి జైనం పూర్తి విశ్వాసంతో నిల్రదొక్కుకొనేలా యీ చాళుక్య వంశీయులు ప్రయత్నించటం యీ శతాబ్దాల్లో జరిగిన జైనవ్యాప్తికి మూల కారణాలు.

వీరి పోషణలో వ్రాయబడ్డ గ్రంధాలన్నీ దరిదాపుగా జైన సిద్ధాంతాల్ని ప్రవచించేవే. యశస్తిలక, నీతివాక్యామృత సన్నవతీప్రకరణ, మహేంద్రమాతలీ సంజల్ప, యుక్తిచింతామణీసూత్ర - యిత్యాది సోమదేవ పండితుని సాహిత్య సృష్టి యావత్తూ జైన సిద్ధాంతాల్ని కూలంకషంగా బోధించేవే. తర్వాత కాలంలో శుద్ధ వైదికపరంగా నన్నయకవిచే వ్రాయబడ్డ మహాభారతం, పంప మహాకవి చేతిలో జైనప్రభావానికి గురియై 'విక్రమార్జున విజయం' కావటం నిస్సందేహంగా మతప్రభావమే. ఇచ్చట జైనమతానికి లభ్యమైన యింతటి ఆదరణే, దేశపు నాలుగు చెరగులానున్న జైనుల్ని యీ ప్రాంతాలకు ఆకర్షించింది. కమ్మనాటిలోని వంగిపఱ్ఱువాడైన పంపకవి తండ్రియగు భీముడు యీ తీవ్రమతాభినివేశము కారణంగానే తెలంగాణానికి చేరుకోవటం జరిగింది. జినేంద్రధర్మం సర్వ మతోత్కృష్టమని భావించటం వలననే వారు దానిని గ్రహించినట్లు 'విక్రమార్జున విజయం'లో చెప్పబడింది. వేములవాడ శాసనాల్లో[10] పేర్కొనబడ్డ ద్రవిడ సంఘాలు, గౌడ సంఘాలు ఆయా ప్రాంతాలనుంచి తరలిపోయి వేములవాడ చేరిన జైనభిక్షువుల సంఘాలే తప్ప అన్యము కావు ఇదే కాలంలో చోళపాలకుల ఏలుబడిలో ద్రవిడ దేశంలోని వేలాది జైనులు తమ మతధర్మాలు కారణంగా దారుణ హింసలకు గురియై[11], ఆత్మరక్షణార్థం ఆంధ్రావనికి మరలి రావటం, తమ ఆశయాలకు అభిరుచులకు రక్షణ కల్పించే వే ు లవాడ సీమకు చేరుకోవటం జరిగాయి.

ఈ కాలపు కవులు, పండితులు తమ రచనల్లో జైనమత సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా చాటి చెప్పటం జరిగింది. పంపమహాకవి తన 'ఆదిపురాణాన్ని కేవలం 'మతధర్మం' వ్యాప్తి చేయటానికే నిర్దేశించినట్లు పేర్కొన్నాడు.[12] దీనిలో యిరవై మూడవ తీర్థంకరుడైన వృషభనాథుని చరిత్ర సవిస్తరంగా తెలుపబడింది. గ్రంథాదిలో జైన సంప్రదాయాన్ననుసరించి అర్హత, సిద్ధ, ఉపాధ్యాయ, ఆచార్య, సాధు. యక్ష, సరస్వతుల్ని పేర్కొనటం జరిగింది.[13] 'విక్రమార్జున విజయం'లో వ్యాసమూలానికి భిన్నంగా భగవంతుడైన శ్రీకృష్ణుని దైవత్వాన్ని మరుగు పుచ్చటానికి చేయబడ్డ కృషి, నిస్సంశయంగా జైనమతప్రభావమే. ఈ పంపకవి సోదరుడైన జినవల్లభుడు కూడ జైనమతం విషయంలో తీవ్రమైన అభిమానం పెంచుకొన్నవాడే. వృషభాచల శిఖరంమీద త్రిభువన తిలక జినాలయాన్ని కట్టించడం, ఆద్యంత తీర్థంకరుల్ని, చక్రేశ్వరిని అందు ప్రతిష్ఠించటం, దాని కనుబంధంగా 'కవితా గుణార్ణవ' తీర్థాన్ని, 'మదనవిలాస' ఉద్యానవనాన్ని నిర్మించటం, మొదలైనవన్నీ ఆతని కుర్క్యాల శాసనం చెబుతుంది.[14] జినాలయాలు నిర్మించటంలో జినమునుల్ని పూజించటంలో, జైనభిక్షువులకి అన్నవసతి కల్పించటంలో తనకెవ్వరూ సాటిలేరని సగర్వంగా చాటి చెప్పుకొన్న యీ జినవల్లభుడు దేశిగ గణానికి చెందిన జయంగొండ సిద్ధాంతదేవుని శిష్యుడు. ఈ వృషభగిరిని ప్రస్తుత కరీంనగర్ జిల్లాలోని కుర్క్యాల దాపునగల 'బొమ్మల గుట్ట'గా గుర్తించటం జరిగింది.


అనేక జైనగ్రంథాల్ని ఒక్కుమ్మడి వెలయించిన సోమదేవసూరి వంటి పండితులు హిందువుల, బౌద్ధుల చాలా మూఢ విశ్వాసాల్ని తీవ్రంగా దుయ్యబట్టారు.[15] సూర్యారాధన, గ్రహణ సమయాల్లోని స్నానాలు, సంక్రాంతిదానాలు, సంధ్యావందనాలు, అగ్నిపూజ, నదీసాగరాల్లో పవిత్ర స్నానాలు, వృక్షాల్ని, స్థూపాల్ని పూజించటం, గోమూత్ర పరిగ్రహణం, ఆయుధాల్ని, భూమిని, యక్షుల్ని, పర్వతాల్ని అర్చించటం - వీరు నిరసించిన అంధ విశ్వాసాల్లో కొన్ని. కాని విచిత్రమేమంటే యీ అంధ విశ్వాసాలుగా చెప్పబడ్డవి ఒక్క హిందూమతానికో, బౌద్ధానికో మాత్రం పరిమితమైనవి కావు. జైనమతంలో కూడ యిలాంటివి కొన్నైనా లేకపోలేదు. ఉదాహరణకు, జైనమతానుయాయులై, సోమదేవుని పెద్దచేసి ఆశ్రయమిచ్చిన చాళుక్యులే సూర్యారాధకులు. కనుక సోమదేవుని గ్రంథాలలో చెప్పబడినది ఆదర్శవంతమైన జైనసిద్ధాంతమేగాని అనాడు ఆచరణలోనున్న పద్ధతి మాత్రము కాదని తెలుస్తోంది.

జైనమతంలో కూడ వైదికంలోవలెనే సమకాలీన సమాజాన్ని కట్టడి చేసే చాతుర్వర్ణ వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. వేంగీ చాళుక్యుడైన రెండవ అమ్మరాజు యొక్క కలుచుంబర్రు శాసనాన్నిబట్టి జైనమతానుయాయుల్లో కూడ నాలుగు వర్ణాలుండినట్లు తెలుస్తోంది.[16] వైదికమత విధానంలోలాగే మొదటి మూడు వర్ణాల జైనులే మతసంబంధ క్రియాకలాపాలకు అర్హులు. హాండిక్వి పండితుడు గుర్తించినట్లు జైనశూద్రుని పరిస్థితి ఎటు చూచినను హిందూశూద్రుని పరిస్థితి కన్నా భిన్నంగా లేదు.[17]

వేంగీ కళింగ ప్రాంతాలను ఆక్రమించే సందర్భాల్లో మొదటి రాష్ట్రకూట కృష్ణుడు కొంతమంది జైనుల్ని తన తరఫున వేంగీ ప్రాంతాల్లో నియమించి వుండినట్లు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు,[18] శ్రీ బి. యస్. ఎల్. హనుమంత రావుగారు[19] భావించారు. వేంగీ కళింగ ప్రాంతాలను రాష్ట్రకూటుల పతాకనీడకు గొనితెచ్చుటకు కృషి సల్పినదియే వేములవాడ చాళుక్యుడైన మొదటి అరికేసరి. వేంగీ-మాన్యఖేట సంబంధాలను ఓ కొలిక్కి గొనితెచ్చిన ఖ్యాతి పూర్తిగా యీతనిదే. ఈతని అనుమతి లేనిదే ఏ జైనుడును రాష్ట్రకూటుల అవసరము తీర్చుటకై వేంగీ రాజ్యమున కేగలేదు. ఈతడే మతావలంబకుడో స్పష్టంగా తెలియక పోయినప్పటికీ యీతని కొల్లిపర తామ్రశాసనంలో యీతడొక శివాచార్యుని శిష్యుడని చెప్పబడింది.[20] శైవమతావలంబకుడయ్యు, జైనులను కీలక స్థానముల కనుమతింపబోవుట వీరి మతసహనాన్ని ఎత్తిచూపుతుంది. అదే విధముగా వేములవాడలోని రాజేశ్వర, బద్దెగేశ్వర, నగరేశ్వరాది శివాలయాల దాపుననే శుభధామ జినాలయాది జైనమందిరాల్ని నిర్మించి నిల్పిన వీరి మత సహిష్ణుత బహుదా సర్వదా ప్రశంసనీయము.

అధోజ్ఞాపికలు

1. ది ఈస్టరన్ చాలుక్యాస్ ఆఫ్ వేంగి, పు.63.
2. సౌతిండియన్ యిన్స్క్రిప్షన్స్, సం. 10, సంఖ్య. 403.
3. ది ఈస్టరన్ చాలుక్యాస్ ఆఫ్ వేంగి, పు. 216.
4. ది రాష్ట్ర కూటాస్ అండ్ థైర్ టైమ్స్, పు. 313.
5. రెలిజియన్ ఇన్ ఆంధ్ర, పు. 143.
6. ఇపి. ,కర్నాటికా, సం. 2, సంఖ్య. 234.
7. జైన విస్టేజెస్ ఇన్ ఆంధ్ర, పు. 44.
8. ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్; కరీంనగర్ డిస్ట్రిక్టు, నెం.4.
9. పైవలె, నెం. 5
10. పైవలె, నెం.4; మరియు, కన్నడ యిన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, నెం. 33, 36.
11, ది చోళస్, పే. 656.
12. భారతి, జూలై, 1958, పే. 33.
13. తెలుగు కావ్యావతారికలు, పే. 39.
14. పల్లవులు-చాళుక్యులు, పు. 161.
15. యశస్తిలక అండ్ ఇండియన్ కల్చర్, పే. 253.
16. ఎపిగ్రఫియ ఇండిక, సం. 7, పే. 177.
17. యశస్తిలక అండ్ ఇండియన్ కల్చర్, పే. 332.
18. జైనవిస్టేజెస్ ఇన్.ఆంధ, పు. 39.
19. రెలిజియన్ ఇన్ ఆంధ్ర, పే. 169.
20 ది చాళుక్యాస్ ఆఫ్ లే(వే)ములవాడ, పే. 92.


కొత్త రూపంలో కీ!
NEW
Action-Plus
KEY
Godrej
ఏక్షన్ ప్లస్
పనితనం

గౌరవయ్యల వృత్తాంతము

గౌరవయ్యలు శైవ భిక్షకులు. వీళ్లనే పల్లె ప్రజలు "గౌరగయ్య" లని అంటారు. వీళ్లు కురవ కులానికి చెందినవాళ్లు. కురువ—కురుబ సమానార్థాలు. ఈ గౌరవయ్యలు అనంతపురం జిల్లాలో అక్కడక్కడా కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, ఎల్లార్తి, గట్టు మొదలగు ప్రాంతాలలోను, వరంగల్లు సమీపాన 'అయినవోలు' లోను ఉన్నారు. అనంతపురం జిల్లాలో కొన్నిచోట్ల వీళ్ళను 'మల్లేదేవరకుక్క' లని కూడ పిలుస్తారు. శివుడు ఏ రూపంలో ఉన్నా పూజ్యుడేనని ఆ మతస్థుల విశ్వాసం. కన్నడ దేశంలోకూడ గౌరవయ్యలు ఉన్నారు. వాళ్లను అక్కడ 'గౌరగ" లని పిలుస్తారు. వాళ్ళకు గొర్రెలు మేపడం కంబళ్ళు నేయడం కులవృత్తి.

గౌరవయ్యలు కంబళితోనేసిన అంగరగా (అంగీ) చేతిలో ఢమరుకం, పిల్లనగ్రోవి, నెత్తిమీద ఎలుగుబంటి చర్మముతో చేసిన టోపీని ధరిస్తారు. బండారు వేసుకోవడానికి ఉద్దేశించిన చిన్నసంచి నడుముకు కట్టుకొని ఉంటారు. అది జింక తోలుతో చేయబడి ఉంటుంది. వీళ్లు పిల్లనగ్రోవి ఊదుతూ ఢమరుకం వాయిస్తు శివుని స్తుతించే పాటలు పాడుతూ, కుండలాకార నృత్యాలు చేస్తు బిక్షాటన చేస్తుంటారు. గౌరవయ్యల ఆకారం చూపరులకు భయ సంభ్రమాలను కలిగిస్తుంది. వీళ్లను చూడగానే చిన్న పిల్లలు భయపడి ఏడుస్తారు. అలాంటి సమయాలలో వీళ్లు పిల్లలను బుజ్జగిస్తూ శంకర మైలారలింగా, ఈశ్వర, శ్రీశైల మల్లికార్జున అని అంటూ వాళ్ల నొసట బండారు పెడతారు. బండారు పెట్టటం వల్ల పిల్లలుకున్న కీడులు (నాచు జ్వరం మొదలైనవి) పోతాయని పల్లీయుల విశ్వాసం. ఎప్పుడు ఏడ్చే పిల్లలను ఉద్దేశించి తల్లిదండ్రులు అదుగో గౌరవయ్య అని భయపెట్టటంకూడా కద్దు.

జానపద సాహిత్యానికి పట్టుగొమ్మలైన పల్లెలలో ఈ గౌరవయ్యలు బిక్షాటన చేస్తూ, శివునికి సంబంధించిన పాటలను పాడుతూ పొట్టపోసు కొంటారు. వీళ్లు కూడ జానపద గాయకులలో ఒకతెగకు చెందినా కేవలం వీళ్లు శివోత్కర్షను గానం చేస్తారు. స్థిరంగా ఒక ఊళ్లో నివసించినా, స్వంత ఆస్థి పాస్తులున్నా కుల వృత్తి అయిన బిక్షాటనచేస్తూ ఊరూరు తిరుగుతారు. తాము సంపాదించిన సొమ్మును కుటుంబ పోషణకు ఉపయోగించుకొని మిగిలిన సొమ్మును ప్రతి ఏట శివుని పేరిట జరిగే ఉత్సవాలకు వినియోగిస్తారు.

శివరాత్రి మొదలైన పర్వదినాలలో కర్నూలు జిల్లా శ్రీశైలం, ఎల్లార్తి. గట్టు మొదలైన పుణ్య స్థలాలలో వీళ్లంతా గుంపుగా చేరి శివుని పాటలను గానం చేస్తూ పాలు తాగుతూ నృత్యం చేస్తారు. వీళ్లు శివుని పాటలనుపాడుతూ చూపరులకు సంతోషాన్ని కలిగించి వాళ్లను తన్మయులను చేస్తారు,

నాగరికత బాగా పండిన ఈ కాలంలో కూడ కురుపజాతికి చెందినవారు కొందరు 'గౌరగయ్యలు' (గౌరవయ్యలు) గా భిక్షమెత్తటం మనం కళ్లారా చూస్తున్నాం. నేడు పట్టణాలలో కూడ ఈ గౌరవయ్యలు తరచుగా మనకు సాక్షాత్కరిస్తారు. నేడు పట్టణాలలోకూడ ఈ గౌరవయ్యలు తరచుగా మనకు సాక్షాత్కరిస్తారు. వీళ్లు జానపద గేయాలను ముఖ్యంగా శివునికి సంబంధించిన పాటలు పాడుతూ బిక్షమెత్తుతారు. వీళ్లు ఒక విధంగా సంఘానికి మేలుచేసినవారే. మరుగునపడిపోయిన ఈ జానపద గేయాలను వీళ్లు నిలబెట్టినారు.

ఇంతటి జానపద గేయ సంపదను భద్రపరచి సంరక్షిస్తున్న ఈ గౌరవయ్యల కథను వీళ్ల పాటలను కురువవాళ్ల జనాన్ని వీళ్ల ఆరాధ్య దైవమైన శ్రీ మైలారు దేవుని (శ్రీ మల్లికార్జునస్వామిని) గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

'శ్రీ బీరుపోపాఖ్యానం' (పద్యభాగం)లో * శ్రీ వేంకటరామకవిగారు కురపవాళ్ల జనాన్ని గౌరవయ్యల కథను శ్రీ మైలారు దేవాలయ నిర్మాణాన్ని చక్కగా వివరించినారు.

* శ్రీ వేంకటరాయకవిగారి కాలము తెలియదు, బహుశా ఇతడు 19వ శతాబ్ది ఉత్తరార్థంలో జీవించి ఉండవచ్చును, ఇతడు కమ్మకులస్థుడు. మాదినేని వంశస్థుడు, అనంతపురం జిల్లా, గుత్తి తాలూకాలోని ఉరగాద్రి (నేటి ఉరవకొండ) కి సమీపంలోవున్న ముష్టూరు గ్రామనివాసి.

సంతోష మనస్కుడై సరస్వతితో కలసి ఉల్లాసంగా ఉన్నప్పుడు బ్రహ్మకు సృష్టిచేయాలని తలంపు కలిగినది. మూడు వర్ణాల (కులాల) వాళ్లు సృష్టించబడ్డారు. వాళ్లు వాళ్లవాళ్ల కార్యాలతో నిమగ్నులై ఉండిరి. బ్రహ్మ ఈ మూడు వర్ణాల వాళ్ళకు సేవచేయడానికి ఒక జాతి అవసరమవుతుందని తలంచినారు. బ్రహ్మదేవుని నిర్మలమైన పాదములనుండి పుట్టిన నాలుగవ జాతివాళ్లు అగ్న్యాది దేవతలకోర్కెమేర త్రివర్ణాలవాళ్లకి సేవచేయటం కోసం కురవవాళ్ళ వంక బ్రహ్మ చూసినాడు. వాళ్లు బ్రహ్మ మనస్సులోని భావాన్ని గ్రహించి భవదాజ్ఞ అన్నారు. అయితే వాళ్లకు సరైన పేరును సూచించమని కోరిన బ్రహ్మకోరికకు సమాధానంగా 'భూమి' కు' అనే వర్ణాన్ని అగ్ని 'ర' అనే వర్ణాన్ని సముద్రాలు 'వ' అనేవర్ణాన్ని ఇచ్చినట్టు శ్రీ వేంకటరాయకవి తెలిపినారు. ఈ మూడు కలసి 'కురవ" లనే పేరు వాళ్ళకు శాశ్వత మయింది. (శ్రీ బీరుపోపాఖ్యానం, పుట 23)

వాళ్లు భూలోకానికి వచ్చి రాజువద్ద కేతెంచిరి. రాజు వాళ్లను తగిన రీతిగా గౌరవించి మీరెవ్వరు? మీ కులమేది? తెలపండని కోరెను. అప్పుడు వాళ్లు తాము బ్రహ్మదేవుని పవిత్రమైన పాదాలనుండి పుట్టిన వారమని తమను మునుల శూద్రులని పిలుస్తారని, బ్రహ్మ తమను 'కురవ' లని పేర్కొనెనని సమాధాన మిచ్చిరి. అంతేగాక తాము బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య కులస్థులకు సేవకులుగా గడపవలసినదిగా బ్రాహ్మచే ఆదేశింపబడినామని, అ వృత్తినే స్వీకరిస్తామనికూడ రాజుతో చెప్పిరి. వాళ్లకు సేవక వృత్తితోపాటు గొర్రెలను మేపే బాధ్యత కూడ అప్పగించబడిందట.

శివరూప సదృశులైన గౌరవయ్యలకు పాలు ప్రసాదంగా పెడితే భాగ్యం కలుగుతుందని శివుడు కురవలను ఆదేశించాడట. ఆ గౌరవయ్యలను ప్రతి సంవత్సరం పూజింప వలసినదని చెప్పినాడట. వాళ్లు (గౌరవయ్యలు) కుర్కుర నాదంచేస్తూ కంచుపాత్ర చేతపట్టుకొని వస్తారని వాళ్ళకు పాలు అన్నం కలిపి దగ్గర పెట్టిన ఆర్భాటంతో (ఉద్రేకంతో) కాళ్లకు గట్టిన లోహపు గొలుసులను తెంచివేసి కంచు పాత్రలోని పాలు తాగుతారు. ఆ సమయంలో వాళ్లు భవిష్యత్తును గూర్చి చెబుతారు.

(శ్రీ బీరుపోపాఖ్యానము పుట 32)

పిల్లలకు పేరు పెట్టేటప్పుడు, వివాహసందర్భంలోను వాళ్లను తప్పక పిలిపించి సంతుష్టులను చేయవలసినదని శివుడు పలికినాడట. కురవలు శ్రీ మైలారు దేవుని భక్తులకు మృష్టాన్నాలనుపెట్టి, భోజనం చేసిన తరువాత పుష్పఫల తాంబూలాదుల నొసగి వారిని సంతుష్టాంత రంగులను చేయవలెనట. ఈ మైలార దేవుని దర్శించడానికి కురవలు శంకరుని ఆనతి ప్రకారం ప్రతియేట పోవలెనట. తప్పించుకొని అయినా, తల్లిదండ్రులతో చెప్పక పోయినా. భార్య ఒప్పుకొనకున్నా సరే, ప్రతి సంవత్సరం శ్రీ మైలార దేవుని ఉత్సవాన్ని దర్శింపవలెనట. అలా పోవడానికి శక్తిలేనప్పుడు, వీలుగాకున్నప్పుడు మనస్సులో శ్రీ మైలార దేవుని ధ్యానిస్తూ శిష్టజనులకు అన్నం పెట్టవలెనట.

గొరవయ్యలకు పవిత్ర క్షేత్రమైన శ్రీ మైలార దేవుని (శ్రీ మల్లికా స్వామి) దేవాలయం 'అయినవోలు' (ఐనోలు) లో వుంది. ఇది వరంగల్లు రైల్వేస్టేషనుకు 17 కిలోమీటర్ల దూరాన, వరంగల్లు - ఖమ్మం రోడ్డులోని వర్ధన్నపేటకు 12 కిలోమీటర్ల దూరాన. వరంగల్లు నగరం దక్షిణంవైపున వున్న వరంగల్లు - ఖమ్మం రోడ్డుకు 4 కిలోమీటర్ల దూరాన వుంది. ఈ గ్రామంలో పూజించబడే దేవుడు శ్రీ మైలార దేవుడు. ఇది కాకతీయ రాజుల యొక్క సైన్యాధిపతులకు నెలవుగా (ముఖ్య పట్టణంగా) ఉండేదని, ఈ దేవాలయాన్ని కాకతీయ గణపతి దేవుడు నిర్మించినట్లు ఆలయ ప్రాంగణంలో వున్న ఒక శిలాశాసనంద్వారా తెలుస్తున్నది. (వరంగల్లు గజిటీరు పుట 212) ఈ మైలారుదేవుని ఉత్సవాలు 'సంక్రాంతి' మొదలుకొని 'ఉగాది' వరకు ఆది, బుధవారాల్లో జరుపుతారు. ఈ ఉత్సవాలను దర్శించడానికి ఇతర జిల్లాలనుండి కూడ వేలాది భక్తులువస్తారు.

గొరవయ్యల పాటలు

శివోత్కర్షను చాటి చెపుతున్న గేయాలలో రెండు ఈ దిగువ పేర్కొనబడ్డాయి. వీటిని ఒక గొరవయ్య పాడుతుంటే ఈ వ్యాసకర్త వ్రాసుకున్నాడు.

1. శివుని ఆకార వర్ణన

శివుడు నీవయ్య శ్రీశైలమల్లయ్య
కానగ రావయ్యా శివయ్యా కానగరావయ్యా
చిక్కు జడలవాడు శివ నీలకంఠుడు
పైనుండి విభూతి మహాశివుని
మెడలోని రుద్రాక్షలు దేవారుదేవా

సన్నా కంజడి తెచ్చి సరిమడత లేయించి
సన్నా కమ్మడి మీద మహాశివుని
గుండు మల్లెలు పోసెను దేవారుదేవా!
గుండు మల్లెలపైన శివుని కొప్పిరి పెట్టి
మహాశివుని మనసారా తానే కొలిచెను దేవారుదేవా!
పాలు బెల్లం పోసి వెండి కానుకలేసి
శ్రీశైల మల్లయ్యను పూజింపరమ్మా!
వార వారము నాడు సోమవారము నాడు
ఆనందమైనాడు శివుడు ఆనందమైనాడు---శివుడునీవయ్యా!

2. శ్రీ మల్లికార్జునుని ప్రాసాద ప్రాశస్త్య వర్ణన

కొండకని పోదాము రారమ్మా మల్లయ్య కొండలో
స్వామినే చూతాము రారమ్మా।
శివపురానికి వడమటింట సిద్ధులేలే మల్లయ్య కొండకు
చిన్నగనే పోదాము రారమ్మా
ఆ పర్వతాలకు మెల్లగనే పోదాము రారమ్మా
మల్లెపువ్వుల కోనలోన మల్లికార్జునుడున్నాడమ్మ
ఇష్టముతో పూజించే వారికి కష్టములు ఎడబాపె దేవుడు
చిన్నగనే పోదాము రారమ్మా
ఆ పర్వతాలకు మెల్లగనే పోదాము రారమ్మా
లోతైన కోనేరంట లోతమెవ్వరికి తెలియదంట
అందులో స్నానమ్ము చేస్తె నిండు మోక్షము కలుగునమ్మ
కొండపైన దేవళంబు కొండదిగున మందిరంబు
మందిరములో వెలిగేటి మల్లికార్జునుడున్నాడంట
ఘల్లుఘల్లని లేచే గదనమ్మ ఆ సదాశివుడు
ఎన్ని మాయలు గల్లవాడమ్మ
చుట్టు తిరిగే కొండలదిగో నట్టనడుమన దేవళంబు
ఒంటిస్తంభము మాలలోనే ఒక్కడే మల్లయ్య నిలిచిన
కొండకని పోదాము రారమ్మా
ఆ పర్వతాలకు పరుగునా పోదాము రారమ్మా,

డా. కె. ఓబిరెడ్డి

కాదరయ్య పాట-ఒకపరిశీలన

"కాదరయ్య పాట" ఒకజానపదగేయం. దాన్ని పరిశీలించేముందు జానపద సంగీత పరిణామాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసికుందాం.

మరియన్‌బావర్, ఎథెల్, ఆర్. పేసర్, అనే జగద్విఖ్యాత సంగీత విమర్శకులు తమ మ్యూజిక్ త్రూ ఏజస్ అనే గ్రంథంలో అనాదికాలంలో జానపద సంగీతం ఎలా ఉద్భవించిందో వివరిస్తూ వ్రాశారు. దాని సారాంశం ఇది.

ఆదిమ నివాసులైన ఆటవికులు ఆహారంకోసం నిర్విరామంగా శ్రమించారు. పడినకష్టం ఫలించగానే ఆనందతో ఒకపొలికేక పెట్టారు. ఆకేక రెండు మూడు స్వరాలు కలిసిన ధ్వని. ఆ నాదపుతునకనే అందరూ ఆనందాతిరేకంతో ముక్తకంఠంగా మరల మరల రెట్టించి పలికారు. అలా అది

అసంపూర్ణ సంగీత వాక్యమై నిలిచింది. అదే విధమైన సందర్భాల్లో అదే మళ్ళీ మళ్ళీ ఆలాపించబడి, కొనసాగించబడి సామూహిక జనాలాపనలో సునాద పూరితమైన ఒక వాక్యంగా మారింది. అలాంటి నాదపూరిత వాక్యాలనే కొన్నింటిని కూర్చి పాడుకున్నారు. వేటాడేటప్పుడు, మాంసాన్ని ఒలిచేటప్పుడు, భుజించేటప్పుడు పాడగా పాడగా తుదకు దానికొక శ్రుతి ఏర్పడింది. దాన్ని ఆధారం చేసికొని ప్రధాన సంగీతవాక్యాన్ని (పల్లవిని) పదేపదే రెట్టిస్తూ మిగిలిన వాక్యాలతో (చరణాలతో) కలపి పాడుకున్నారు.

ఆవిధంగా వారికి పరిచితమైన పదాలతో వారికి అనుభవమున్న సంఘటనను కూర్చుకొని, అప్రయత్నంగా, ఆనందంగా, ఆలాపించిన పాటలే జానపద సంగీత పరిణామ సిద్ధాంతానికి ప్రాతిపదికలు. అవే జానపద సాహిత్య ప్రాదుర్భావానికి మూలరూపాలు.

"సంతోషం కల్గినప్పుడు ప్రథమ మానవుడు చిందులేస్తూ కూనరాగాలతో ఆలాపించే సామాన్య పదములే నిరక్షరాస్యుల భావగీతాలు" అవే జానపద గేయాలు.

జానపదులు అమాయకులు. వారి హృదయము నిర్మలము. వివిధరకములైన ఊహాకల్పితములు, కోపము, భయము. దుఃఖము, సంతోషము వాటి వలన కల్గిన మనోవికారములు ఇవన్నియు స్వచ్ఛము యథాతథముగా జానపదుని హృదయమునందు సంభవించి అతని పాటలో మనకు స్పష్టముగా కనపడును.

తనకు కల్గిన సంతోషాన్ని తెలియజేస్తూనో, తన కష్టం కనపడకుండా వుండడం కోసమో, లేక తనకు విచారాన్ని కల్గించిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకుంటూనో జానపదుడు తన భావగీతాన్ని తనకిచ్చిన భాషా సాహిత్యాల పరిధిలో ఉల్లాసంగా అల్లుకుంటాడు.

ఆ విధంగా ఒక రోజు సంఘటనను, ఒకనాటి తన అనుభవాన్ని తెలియజేస్తూ ఒక పల్లెవాని నోటి నుండి ఊడిపడ్డ భావగీతమే ఈ కాదరయ్య పాట.

అనంతపురం జిల్లాలోని మాండలిక పద స్వరూపానికి, ఆ జిల్లాలోని జానపదుల గ్రామీణ జీవన విధానానికీ, అక్కడి సాంఘికాచార సంప్రదాయాలకూ ఈ "కాదరయ్యపాట" ఎలా అద్దం పడుతుందో సమీక్షించటమే ప్రస్తుత వ్యాసోద్దేశ్యము.

అంతనపురం జిల్లా గ్రామీణ సంస్కృతి పరిరక్షించే జానపద విజ్ఞానంలో ఈ కాదరయ్య పాట ఒక భాగం, ఒక మచ్చుతునక.

దీన్ని అధ్యయనం చేయడం వల్ల అక్కడి జనుల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, సంస్కృతి అర్థమవుతాయి. జానపద సాహిత్యం సామాజిక స్పృహతో వెలువడేది కాబట్టి ఆ ప్రాంతం జనుల సాంస్కృతిక అధ్యయనం దీని ద్వారా సాధ్య మౌతుంది, ఈ పాటలో స్థూలంగా జానపద విజ్ఞానాన్ని కొంత వరకు దర్శించ వచ్చు.

ఈ పాటను పరిశీలిస్తూ సమీక్షించే సమయంలో అనంతపురం జిల్లాలోని జానపద సాంఘికాచారాలను, జానపద వస్తు సంస్కృతిని, కళలను కొంత వరకు వివరిస్తూ పోవలసి యుంటుంది. కావున పాఠకులు దాని ఆవశ్యకతను గుర్తించగలరని విశ్వసిస్తాను, ముందుగా "కాదరయ్యపాట"ను చూద్దాం.

పొద్దన్నె లేసినాడు కాదరయ్య
వాడు కాళ్ళుమొగం గడిగినాడు కాదరయ్య
కాళ్ళుమొగం గడిగినాడు కాదరయ్యా
వాడు పంగనాం బీకినాడు కాదరయ్యా
పంగనాం బీకినాడు కాదరయ్య
వాడు సద్ద సంకటి దిన్నాడు కాదరయ్యా
సద్ద సంకటి దిన్నాడు కాదరయ్యా
వాడు బుట్టిసంక కేసినాడు కాదరయ్యా
బుట్టి సంక కేసినాడు కాదరయ్యా
వాడు పల్లెదావ బట్టినాడు కాదరయ్యా
పల్లెదావ బట్టినాడు కాదరయ్యా
వాడు పల్లెకుక్క బౌమనె కాదరయ్యా
పల్లెకుక్క బౌమనె కాదరయ్యా
వాడు అద్దదావ దొక్కినాడు కాదరయ్యా
అద్దదావ దొక్కినాడు కాదరయ్యా
వాడు సద్ద సేను ఎదురాయె కాదరయ్యా
సద్ద సేను ఎదురాయె కాదరయ్యా
వాడు ఇరిసిరిసి బుట్లొ బెట్టె కాదరయ్యా
ఇరిసిరిసి బుట్లొ బెట్టె కాదరయ్యా
వాడు సేనురెడ్డి కూతల్ బెట్టే కాదరయ్యా
సేనురెడ్డి కూతల్ బెట్టె కాదరయ్యా
నేను గువ్వల్ దోల్తాదనుకుంటి కాదరయ్యా
గువ్వల్‌గాదు గివ్వల్‌గాదు కాదరయ్యా
వాడు గొడ్డు దంటు బీక్కుండె కాదరయ్యా
గొడ్డుదంటు బీక్కుండె కాదరయ్యా
నాకు సెరకిత్త దనుకుంటి కాదరయ్యా
సెరగ్గాదు గిరగ్గాదు కాదరయ్యా
వాడు నేల కొంగ బీకినాడు కాదరయ్యా
నేలకొంగ బీకినాడు కాదరయ్యా
నేను పేన్లు జూత్తా దనుకుంటి కాదరయ్యా
పేన్లుగాదు గీన్లుగాదు కాదరయ్యా
వాడు మంచెగుంజ క్యాలబీకె కాదరయ్యా
మంచెగుంజ క్యాలబీకె కాదరయ్యా
నేను ఉయ్యాలూపు తాదనుకుంటి కాదరయ్యా
ఉయ్యాలగాదు గియ్యాలగాదు కాదరయ్యా
వాడు ఊపూపి అంటుకుండె కాదరయ్యా
ఊపూపి అంటుకుండె కాదరయ్యా
నేను దావల్ దావల్ ఉరికినాను కాదరయ్యా"

ఈ పాటను సేకరించినది, దీనికి విస్తృత ప్రచారాన్ని ఇచ్చినది. శ్రీ అమళ్ళదిన్నె గోపినాథ్‌గారు.

1945 సం॥లో అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా అప్పరాచ్చెర్వు గ్రామంలో ఒక రోజు బయలు నాటకం ప్రదర్శింప బడుతోంది, ఆ నాటకంలో ఒక హాస్య సన్నివేశంలో శ్రీయుతులు మిషన్ నరసింహులు నూలా పెద్దన్న, రాజన్న అనబడే గాయకులు, ఈ పాట పాడుతూ అభినయించేస్తూ సభికులను రంజింపజేశారు. అప్పుడు పదుమూడు సంవత్సరాల వయస్సుతో వున్న శ్రీ గోపినాథ్‌గారు ఆ పాటను ధారణ చేసి పట్టుకొని ఆనాటి నుండి అక్కడక్కడా ప్రచారం చేశారు.

రాయలసీమలో విస్తృతంగాను, కోస్తా జిల్లాల్లోను, తెలంగాణా ప్రాంతంలోను పలుసభల్లో పాడి దీనికి విశేషమైన వ్యాప్తి ని కల్గించినది, శ్రీ గోపినాథ్

గారే, ఆకాశవాణి కళాకారులు కూడా దీన్ని శ్రోతలకు పరిచయం చేశారు.

ఈ పాటలో కాదరయ్య అనబడే ఆ జానపద చిరంజీవియే ఈ గేయకర్త,

సామాన్యంగా జానపద గేయకర్త అజ్ఞాత వ్యక్తి. దీనికి రచయిత వుండడు. జానపద గేయ లక్షణాల్లో మొదటిది అజ్ఞాత కర్తృత్వము. కానీ ఈ పాటకు కర్త కాదరయ్యే.

ప్రథమ పురుషలో ప్రారంభమైన ఈ పాట కొన్ని చరణాల తరువాత ఉత్తమ పురుషలోనికి మారుతుంది. ఈ పాట ఉత్తరార్థాన్ని పరిశీలిస్తే ఉన్నట్టుండి ఉత్తమ పురుషలోనికి మారడాన్నిబట్టి ఈ గేయకర్త కాదరయ్యే అనేది మనకు స్పష్టము.

అర్వాచీన జానపద గేయాలను పరిశీలించినట్లయితే మనకు కొన్ని గేయాలలో ఆ గేయకర్త పేరు కన్పిస్తుంది. దీర్ఘములైన జానపద కథా గేయములందును, వేదాంత పరములగు జానపద తత్త్వములందును. రచయిత పేరు కొన్నిచోట్ల కలదు. "జానపదగేయము అజ్ఞాత కర్తృత్వము" అనేది లక్షణమునకు లొంగకున్నంత మాత్రమున నిట్టివి జానపద శాఖనుండి బహిష్కృతము కానేరవు, ఏ కారణముచేతనో కొన్ని సిసలైన జానపద గేయములందు కొన్ని తావులలో ఆయాగేయకర్తలు గోచరిస్తారు. బొబ్బిలి పదములకు కర్త పెద్దాడ మల్లేశమనీ, కాటమరాజు కథ జానపద గేయాల రచియిత పినయెల్లయనీ ప్రసిద్ధ పరిశోధకుల వ్యాసములందు మనకు తెలియుచున్నది.

కావున ఈపాటను కాదరయ్యే తానుగా పాడుకున్నాడు. ఒకనాటి తన అనుభవాన్ని, అనుభూతిని తలచుకుంటూ ఉల్లాసంగా నవ్వుకుంటూ పాడుకున్నాడు.

అనంతపురం జిల్లాలో సుప్రసిద్ధమైన పుణ్యక్షేత్రము కదిరి. అక్కడ కొలువై యున్న దైవము శ్రీ నృసింహస్వామి.

ఈ స్వామిని ఇలవేల్పుగా భావించి కొలిచేవారిని ఈ జిల్లాలో "నరసింహస్వామి కాపులు' అని అంటారు. ఈ నరసింహస్వామి కాపులు తమ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ముందుగా కదిరి నరసింహస్వామిని ఆరాధించడమనేది ఆచారం.

కదిరికి వెళ్ళాలంటే ఆ నాడు కాలి నడకే. పైగా కాలయాపన. కష్టము అందుకే ఈ జిల్లాలోని జానపదులు తమ ఊరిలోనే దేవరమూల (ఈశాన్య మూల- అష్టదిక్పాలకులలో ఈశానుడు అధిపతియైనమూల) లో ఒక ఎత్తైన ప్రదేశాన్ని చతురస్రాకారంలో నిర్మించుకొని దానికి మధ్య భాగంలో ఒక గరుడస్తంభాన్ని ప్రతిష్ఠించి పర్వదినాల్లో దీపారాధనచేయించి భక్తి శ్రద్ధలతో భావనామూర్తిని పూజించి కదిరి పుణ్యక్షేత్రాన్ని దర్శించినంత సంతృప్తినీ, స్వామి మూలవిరాట్టును దర్శించినంత ఆనందాన్ని పొందుతారు. పెనుకొండ తాలూకా కేతగాని చెరువులోను ధర్మవరం తాలూకా అప్పరాశ్చెర్వు గ్రామంలోను నేటికి ఈ సదాచారం సజీవంగా కన్పిస్తుంది.

నరసింహస్వామి కాపుల ఇంట్లో బిడ్డపుడితే కదిరెప్ప అనో కదిరెమ్మ అనో నామకరణం చేస్తారు.

అనూచానమైన సంప్రదాయాను గుణంగా పెట్టబడిన కదిరయ్య అనే పేరు జన వ్యవహారంతోనో లేక ఆ జానపదుని గేయానుకూలమైన రాగం కోసమో కాదరయ్యగా మారిపోయింది.

పొద్దన్నె లేసినాడు అంటే తెల్లవారు జాముననే లేచాడని అర్థం. సూర్యుడు ఉదయించేటప్పుడు అస్తమించేటప్పుడు మానవులు మేల్కొనే వుండాలి. నిద్రపోతూ వుండరాదు. అనిచెప్పే మన ఆర్యుల అభిప్రాయానికి ఈ జానపదులు ఆచరణే ఆధారం.

కాళ్ళు మొహం కడుక్కున్న కాదరయ్య పంగనాం బీకినాడట.

సంప్రదాయానుసారంగా శ్రీవైష్ణవత్వసిద్ధికి శ్రీవైష్ణవులు అవలంబించె పంచసంస్కారాల్లో 'తిరునామధారణ' యొకటి, సాతవాహనుల కాలంనుంచీ ఆంధ్రదేశంలో విష్ణుభక్తులైన ప్రజలు తిరునామాలు ధరించడం కనిపిస్తోంది.

శ్రీవైష్ణవులవలెనే మన జానపదుడుకూడా తన నామాలను ఎవరైనా చూచి పరిహసించినా, నిందించినా అవమానించినా ఎదురు మాట్లాడడు. వివాదానికి దిగడు. నొచ్చుకోడు. తన ఆచారన్నీ పద్ధతినీ మానుకోడు. జానపదుని క్రమశిక్షణ అలాంటిది.

ఇప్పటికీ ఈ జిల్లాలో దాసప్పలు, నరసింహస్వామి కాపులు వైష్ణవ సంప్రదాయాన్ని పాటిస్తూ 'తిరునామములను' ధరిస్తారు. అవే మన కాదరయ్య చెప్పుతున్న పంగనామాలు.

అనంతపురం జిల్లా జానపదుల ఆచార వ్యవహారాలను వివరించడంతో పాటు ఇక ముందు ఆ జిల్లాలోని మాండలిక పదాల స్వరూప స్వభావాలను కూడా వివరించ వలసి యుంటుంది కాబట్టి కొంత మాండలిక ప్రస్తావనకు వద్దాం.

జీవద్భాషకు మార్పు సహజం కాబట్టి ఒకే కాలంలో ఒక ప్రాంతంలో వున్న వాడుకకు మరొక ప్రాంతంలోవున్న వాడుకకు మధ్య సమాన శబ్దాల్లో భేదాలుండవచ్చు. ఇలాంటి ప్రాంతీయ భేదాలకు కారణం ప్రాంతీయ బహురూపత. ప్రాంతీయ వైవిధ్యం.

ఆర్థికంగా. సాంస్కృతికంగా సాంఘిక వ్యవస్థలో వున్న మార్పులు వ్యవహర్త మాటల్లో ప్రతి ఫలిస్తాయి. ఇలాంటి తేడాలను వర్గమాండలికా లంటారు.

ప్రాంతీయ వర్గ మాండికాల స్వరూపస్వభావాలు నిర్ణయించడం కోసం భాషా శాస్త్రవేత్తలు తెలుగునాడును ఆరు మండలాలుగా విభజించారు. డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి గారి నాలుగు మండలాల విభజనను ఇంకొంచెం స్పష్టతకోసం న్యూర్తిశ్రీగారు ఆరు మాండలికాలుగా విశదీకరించారు. అవి 1. కళింగాంధ్రము 2. తూర్పు గోదవరి 3. మధ్యమాంధ్రము (పశ్చిమ గోదవరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం.) 4. రాయలసీమ (కడప, కర్నూలు. అనంతపురం 5. దక్షిణాంధ్రము (నెల్లూరు, చిత్తూరు) 6. తెలంగాణా.

కేవలం ఈ విభజనకే కట్టుబడకుండా సరిహద్దు జిల్లాల్లోని కొన్ని మాండలికాలు పొరుగు మాండలికాల్లోనికి కూడ దొర్లుతూ వుంటాయి.

ఈ కాదరయ్య పాటలోని అనంతపురం జిల్లా మాండళిక పదాలను తక్కిన ప్రాంతీయ వర్గ మాండలికాలముతో పోలుస్తూ సమీక్షించడం కోసమే వాటి విభజనను పైన పేర్కొనడం జరిగింది.

కాదరయ్య కాళ్ళూ మోహం కడుక్కున్నాడు. తరువాత మనస్సులోనే దైవధ్యానం. ఎదురుగా కన్పించే కర్మసాక్షికి కైమోడ్పు, అంతే అతని నైష్ఠికత మరి, ఈ జానపదుడు కాళ్ళు మొహం కడగడమేనా ? స్నానం చేయడా ? చేస్తాడు; కానీ ఉదయంకాదు. సాయంత్రం. పగలంతా శ్రమించి, కాయ కష్టంచేసి పొద్దు గూకాక ఇంటికొచ్చి వేడినీళ్ళు పెట్టుకొని చేస్తాడు. కడుపునిండా సంకటితిని ఒడలు మరచి హాయిగా నిద్రిస్తాడు.

పంగనాంటికినాడు — పంగనామములను పైవరకు పొడువుగాలాగినాడు.

పంగనామము — నడుమ ఎడము గలుగ పంగవలె తీర్చిన తిరుమణి (శబ్దరత్నాకరము)

దీనికి వ్యతిరేకము బుంగనామము.

బుంగనామము — నడుమ ఎడము లేకుండ దీర్చిన తిరుమణి (సూర్యరాయాంధ్ర నిఘంటువులు)

సద్ద సంకటి దిన్నాడు. సంకటి ముఖ్యంగా రాయలసీమ ప్రజల ఆహార విశేషం. సామాన్యంగా సంకటి అంటే రాగి సంకటే.

రాగి — రాగులు — రాగిపిండి (రాయలసీమ మాండలీకం)

చోడి — చోళ్ళు — చోడిపిండి (కళింగాంధ్ర, తూ. గో. మధ్య మాంధ్ర మాండలికం)

ఎసరుపెట్టి బియ్యం నూకలువేసి వుడికించి తరువాత రాగిపిండిని వేసి 'ఉప్మా' లాగా కలియబెడతారు. బాగా ఉడికి ముద్దగా తయారైన దాన్ని పెద్ద పెద్ద ముద్దలుగా చేస్తారు, అదే సంకటి. రాగి పిండితో చేస్తే రాగి సంకటి సద్ద పిండితో చేస్తే సద్ద సంకటి.

సద్దలు — సజ్జలు.

సజ్జ — ధాన్య విశేషము (సూర్య. రా. ని.)

ఈ సజ్జలు అనే దానికి రాయలసీమ మాండలిక వ్యవహారం సద్దలు. చిత్తూరు జిల్లాలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఈ సద్దలను కూడూ కంబులు అని అంటారు. కన్నడంలో — కూడ కంబులంటే సజ్జలే. బుట్టి సంక కేసినాడు.

బుట్టి — బుట్ట.

జానపదుని వ్యవహారం బుట్టి. ఇచ్చట బుట్టను చంకలో పెట్టు కొందురు కానీ చంకకు వేసికొనుట ఏమిటను ప్రశ్న ఉదయించును. ఈ బుట్ట మామూలు బుట్ట కాదు.

అనంతపురం జిల్లాలో దాసప్పలు (దాసరులు) ఈ నాటికి తులసీ దళాలను, గన్నేరు పువ్వులను, ఇంకా ఇతరత్రా పూజా పుష్పాలను కోసి ఈ బుట్టలో వేసికొని దానిని చంకకు తగిలించు కొని వాటిని అర్చక స్వాముల ఇండ్లకు సరాఫరా చేస్తారు.

మరచెంబు ఆకారంలో వెదురుతో అల్లబడిన బుట్ట. దాని పైన వృత్తాకారంలో వెదురు తడికెతో ఒక మూత. ఆ మూతకు రెండు రంధ్రాలు. ఆ రంధ్రాల గుండా వెళ్తూ అర్ధ చంద్రాకారంలో బుట్టపైన వంగబడిన ఒక పొడుగాటి వెదురుబద్దే. ఆ వెదురుబద్ద రెండు కొనలూ బుట్ట యొక్క రెండు పార్శ్వాలకు బంధించబడి వుంటాయి. మూత పైకి క్రిందికీ చలించగలదు. ఇలా వుండటం వల్ల బుట్టను నేటి 'వ్యానిటిబ్యాగు' వలె సులభంగా చంకకు తగిలించుకో వచ్చును,

అలాంటి బుట్టనే కాదరయ్య చంకకు తగిలించు కొని పల్లెత్రోవను బట్టి వెళ్తున్నాడు.

కుక్కలు మొరిగాయి, కుక్కల అరుపుకు భయపడిన కాదరయ్య అడ్డదావ దొక్కినాడు.

ఎక్కడో కొంత దూరం వెళ్ళాకా రాచబాటను కలిసే మరో పొట్టిదారిని అడ్డదావ అంటారు. హ్రస్వమార్గాన్ని స్వీకరించడాన్ని తెలిపేందుకు జానపదుడు వాడే నుడికారం అడ్డదావ దొక్కుట. కాదరయ్యకు సద్దసేను ఎదురయ్యింది చేను అంటే రాయలసీను మాండలిక వర్షాధారమైన మాగాణి ఈ చేను అనేపదం కళింగాంధ్ర, మధ్య మాంధ్ర మాండలికాల్లో కాలువలు ఆధారంగా పండే మడికి కూడా పర్యాయపదంగా వాడబడుతుంది. రాయల సీమలో సజ్జలు, జొన్నలు, దామలు, కొఱ్ఱలు మొదాలగు పంటలు దైవ మాతృకములైన భూముల్లోనే పండిస్తారు. ఇక్కడ నదీ మాతృకములైన భూములు తక్కువ. అందుకే వరి అన్నంకంటే జొన్న రొట్టె, సద్దరొట్టె, సంకటి, కొఱ్ఱఅన్నం ఇక్కడి జానపదుల ప్రియతమ ఆహారం.

కాదరయ్య సద్ద చేనులో ప్రవేశించాడు. ఇరిసిరిసి బుట్లోబెట్టాడట. సద్ద చేనులో దూరిన కాదరయ్య ఇరిసిరిసి బుట్లో పెట్టిన దేమిటో ఇక్కడ గేయకర్త చెప్పలేదు. సులభంగా ఊహించ గలిగి దాన్ని చెప్పద మెందు కనుకున్నాడేమో ! కానీ ఈ ప్రాంతంలో అనుభవం లేనివాడు, ఇక్కడి పొలాల తీరుతెన్నులకు, ఇక్కడి ఆహార వ్యవహారాలకు అతీతమైనవాడు అదిఏమిటో తెలిసికోవడం కష్టం,

కాదరయ్య ఇరిసిరిసి బుట్లో బెట్టింది అనగా ఒక్కొక్కదాన్నే విరిచి విరిచి బుట్టలో పెట్టుకున్నది ఏమిటో కాదు సద్దకంకులు.

కంకి అనేమాట అందరికీ తెలిసింది.

ఇక్కడి జానపదులు లేతగావుండే రాగి కంకులను, సద్ద కంకులను, జొన్న కంకులను కోసుకొని వచ్చి అందులోని పాలగింజలను బయటకు తీసి తింటారు. దీన్ని ఈ జానపదుడు కంకిసలపడం అని అంటాడు.

తియ్యగావుండే ఆ పిండి పదార్థాన్ని నెమరు వేస్తూచేనుల్లో నడుస్తూ పోవడం అతని కో సరదా !

ఇంకావీలైతే కంకులు ఇంటికి తీసికెళ్ళి కాల్చి వేడికి మ్రగ్గిన పాల గింజల్ని తీసి తింటాడు. దానికి బెల్లమును కలుపుకొని తింటాడు. ఈ పాలకంకి రాయలసీమ జానపదుడు కాలక్షేపంకోసం భుజించే తాయిలం.

కాదరయ్య చేసేపని చేనురెడ్డి చూచాడు. రాయలసీమలో ఎక్కువగా పెద్ద పెద్ద రైతులు రెడ్లే, కంకులు కోస్తూంటే పొలముకాపు ఊరకుంటాడా? కూతల్ బెట్టాడట, గట్టిగా అరుస్తూ, దండిస్తూ కేకలు వేశాడు: అంతటితో ఆగక ఆగ్రహంతో నడుస్తూ కాదరయ్యను సమీపిస్తున్నాడు.

*ఇక్కడ పాటను కొంచెం నిశితంగా పరిశీలించినట్లయితే ఇంతవరకూ సాగినపాట ప్రథమ పురుషలోవుంది. ఇక్కటనుండి ఉత్తమ పురుషలో కొన సాగుతుంది. అనగా కాదరయ్య ఇంతసేపూ చెప్పింది తనగురించే. అయినా ఇక్కడనుంచే అతడు స్పష్టంగాబైటపడతాడు. ఇకపై తాను ఎదుర్కొన్న అనుభావాన్న చెప్పుతూ పోతాడు.

రెడ్డి అరుస్తూంటే కాదరయ్య గువ్వల్ దోల్తాడనుకున్నాడట ఎంత అమాయకుడో చూడండి గువ్వలంటే పిచ్చుకలు, పంటచేలను ఆశ్రయించే పక్షులను బెదరించి పారదోలుతున్నాడులే అనుకున్నాడట.

మంచెమీద నిలబడి కేకలు వేయడం, వడిసెల ఉపయోగించటం, తాటితో అల్లిన పట్టీలో రాయిపెట్టి గిరగిరా త్రిప్పి విసరడం రాయలసీమలో పొలం కాపరి పక్షులను పారదోలడానికి ఉపయోగించే పద్ధతులు.

పశ్చిమ గోదావరి జిల్లాలో వరిపైరు బాగాపండినప్పుడు. కొన్ని రకాల పక్షులు ఆప్రాంతానికి వలసవెళ్తాయి. అక్కడి జానపదుడు పెద్ద పెద్ద డబ్బాలు తీసికొనివెళ్ళి పొలం గట్టున కూర్చొని సాయంత్రం వరకు ఢమఢమా వాయిస్తూ కూర్చుంటాడు. అవి బెదరి పారిపోతాయి.

కొన్ని రోజులు వరుసగా ఇలా చేస్తే మళ్ళీ అవి ఆ ప్రాంతాలకురావు. ఇది అక్కడి పద్ధతి.

వెంటనే తెలిసింది కాదరయ్యకు అతడు గువ్వలు తోలడం లేదని. వాడు గొడ్డు దంటు బీక్కుండె. పీక్కుండె అంటే లాగినాడు. లాగి చేత పట్టుకొన్నాడు అని అర్థం. దేనిని ? గొడ్డుదంటును,

దంటు — జొన్నలో నగవావికాడ (సూర్య. రా. ని.) ఈ దంటు అనేది కన్నడపదం.

కర్నాటక సరిహద్దు ప్రాంతం కావడం వల్ల ఇలాంటి ఆదాన ప్రదానాలు అనంతపురం జిల్లా మాండలికానికి తప్పవు. జొన్న, సద్ద మొదలగు వాటికి ఈ దంటు అనబడే కాడ చాలా పొడువుగా సుమారు ఐదారు అడుగుల వరకూ పెరుగుతుంది. పైన కంకి కాస్తుంది.

రైతెప్పుడూ ప్రయోజనం వున్నదాన్ని పాడు చేసుకోడు. చేను రెడ్డి పీకింది గొడ్డు దంటును కానీ పంట దంటును కాదు. కంకి కాయకుండా ఊరికే పెరిగి పోతున్న గొడ్డు దంటును రెడ్డి పీక్కున్నాడు.

మన కాదరయ్య అదిచూచి 'నాకు సెరకిత్తదనుకుంటి' - అంటున్నాడు.

రెడ్డి దంటును లాగి చేత బట్టుకుంటే కాదరయ్య చెరకు ఇస్తాడని ఊహించు కోవడమేమిటి ? అసలు ఇక్కడ చెరకు ఎక్కడుంది ? ఇది సద్ద చేనుకదా !

రాయలసీమ జానపదుడు జొన్న దంటు లేదా : సద్ద దంటు యొక్క లేతగా ఆకులతోవున్న అగ్రాన్ని తుంచి పశువులకు వేస్తాడు, దంటు మధ్యలో బలిష్టంగా వున్న భాగన్ని చెరకుగడలా చేత్తో పట్టుకొని దానిపై పెచ్చును పంటితో లాగేసి లోపలవున్న కండను చెరకులాగే నమిలి రసాన్ని పీల్చి పిప్పిచేస్తాడు. ఈ రసం కూడ చెరకంతా మధురంగా వుండక పోవచ్చుగానీ తియ్యగానే వుంటుంది.

అదే కాదరయ్య ఇస్తాడనుకున్న చెరకు. పచ్చిగావుండే దంటును చెరకులాగా సేవించే ఈ జానపదుడు కొంత పసిమివాడిన వారునాత దానిని చొప్పదంటు అని పిలుస్తాడు. ఈ చొప్ప దంటును ముక్కలు ముక్కలుగా కత్తిరించి పశువులకు వేస్తాడు. కంకులు తినడం, దంటును చెరకులా నమలడం అనేవి ఇక్కడి జానపదుడు కేవలం కాలక్షేపం కోసం నోటికి పని కల్పించేవి మాత్రమే.

కోస్తా జిల్లాల్లో మామిడికాయ ఆవకాయ పెట్టడంకోసం మామిడికాయను టెంకతోసహా కత్తిరించడానికి ఉపయోగించే ప్రత్యేకమైన కత్తిపీటలాంటి కత్తి పీటనే ఈ రాయలసీమలోని జానపదుడు చొప్పదంటు కత్తిరించడానికి వుపయోగిస్తాడు. ఆ కత్తిపీట తయారుచేయబడిన విధానం, అది పనిచేసే తీరు అక్కడా ఇక్కడ ఒక్కటే కానీ కోస్తాలోని ప్రజల వాడకం వేరు. రాయలసీమ జనుల ఉపయోగం వేరు. ఇది ఆయా దేశాచారం, ఇది ఆయా జానపద వస్తు సంపదలోని వైవిధ్యం.

కాదరయ్య ఊహించిన చెరకు చేతికందలేదు. పైగా రెడ్డి అతనిని నేలకొంగ బీకినాడు. నేలను తాకునట్లుగా కాదరయ్యను పట్టుకొని వంచినాడు. కాదరయ్య పేన్లు చూస్తాడని అనుకున్నాడట.

రాయలసీమ పల్లెటూళ్ళల్లో ఇప్పటికి పనీ పాటలేని తీరికదినాల్లో మధ్యాహ్నంపూట రావిమానుకట్ట మీదో, వేపచెట్టు క్రిందో రెండు మూడు జంటలు కూర్చొని తీరిగ్గా పేన్లుకూచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వుండడం కనిపిస్తుంది. ఈనాడు క్రాపింగులు వచ్చినవిగానీ పూర్వం మగవాళ్ళందరికి కూడా బారెడేసి వెంట్రుకలుండేవి. భర్తకు పేన్లుచూచి, నూనెరాసి, చిక్కుతీసి. వెంట్రుకలు దువ్వి, ముడివేసే పని అతని భార్యకు తప్పేదికాదు.

ఇక ఆడవాళ్ళు పరస్పరం పేన్లు చూసుకోవడ మనేది సరేసరి. తలలో పేన్లతోపాటు కంటికి కనిపించనంతటి చిన్నచిన్న పేనుగుడ్లు వుంటాయి. ఈ గ్రుడ్లను 'ఈపులు'అని అంటారు. ఈపి(ఏక) ఈపులు(బహు)దీనికి రూపాంతరం ఈరు—ఈర్లు. ఈ ఈర్లను కేశారణ్యంనుండి పట్టి బయటకు లాగడానికి ఇక్కడి జానపదులు ప్రత్యేకమైన పనిముట్లు ఉపయోగిస్తారు. దీనికి మామూలు దువ్వెన సరిపోదు. 'చిక్కంటి' 'ఈర్పెన' అనబడే పొడుగాటి చెక్కదువ్వెనలను ప్రత్యేకంగా తయారుచేసుకున్నారు.

ఈరుపెన — ఈర్లను పెనవేసికొని బయటకు ఈడ్చేడి దువ్వెన. దీనికి రూపాంతరంమే ఈర్పెన. దీనికి జానపదుని ఉచ్చారణ ఈర్వాని. (దువ్వెనను దువ్వాని అన్నట్లుగా) చిక్కంటి—చిక్కుపడిన వెంట్రుకలను సరిచేయు పెద్ద సందులుగల దువ్వెన. ఇది బలిష్టమైన పండ్లు కల్గి చిక్కుతీయడానికి బాగా వుపయోగపడుతుంది. ఈర్పెన లేతకఱ్ఱతో చేయు బడిన పండ్లు కలదియై అతి దగ్గర దగ్గరగా కోయబడి వుండడం వల్ల చిన్నచిన్న ఈర్లు ఇందులో చిక్కుకుంటాయి. తల నుండి బయటకు లాగబడిన ఈ ఈర్పెన యొక్క పండ్లను చేతివేళ్ళతో గట్టిగా నొక్కితే చాలు అందులో చిక్కుకున్న ఈర్లు చిటుకు చిటుకు మని చస్తాయి.

చూశారా రాయలసీమ జానపదుల వస్తు సంపద. పూర్వీకుడైన ఈకాదరయ్యకు పొడుగాటి జుట్టు వుండబట్టే రెడ్డి పేన్లు చూస్తాడన

ఆశపడ్డాడు.

పేన్లు చూడలేదు. రెడ్డి కాదరయ్యను మంచె గుంజక్యాల బీకినాడు. మంచె గుంజకు వ్రేలాడదీసినాడు,

మంచె — జొన్నచేను మొదలగు చోట్ల కూర్చుండుటకై ఎత్తుగా జేసెడు చప్పరము వంటి పందిరి. (శబ్దరత్నాకరము)

గుంజ — పందిరికివేయు కొయ్య, నిలువుకంబము (మాండలిక పదకోశము) దీనికి మధ్యమాంధ్ర మాండలికం గూటము.

పందిరపైన అడ్డుకొయ్యగా బిగించబడ్డిన గుంజకు కాదరయ్యను రెడ్డి వ్రేలాడతీశాడు.

కాదరయ్య ఉయ్యాల ఊపుతాడనుకున్నాడట.
ఉయ్యాలగాదు గియ్యాలగాదు రెడ్డి కాదరయ్యను
ఊపూపి అంటుకున్నాడు.

ఊపూపి అంటుకొనుట — మంచి ఊపుతో బలంగా కొట్టుట,

అంటించు — కొట్టు (రాయలసీమ మాండలీకం) గుంటూరు జిల్లాలో కూడ దెబ్బలువేయుట అను అర్థములో వాడబడుచున్నది

ఆ విధంగా కొడుతూవుంటే అక్కడ నుండే కాదరయ్య దావల్ దావల్ ఉరికినాడు. ఏ త్రోవ చిక్కితే ఆ త్రోవకు పారిపోయినాడు.

ఇది ఆ జానపదుని ఒక నాటి అనుభవం. దాన్ని నెమరు వేసుకొని తనకబ్బిన పదజాలంతో పాటగా కూర్చి మన కందించాడు. అలవోకగా పాడుకున్న పాటలో అనల్పమైన జానపద విజ్ఞానాన్ని ఇమిడ్చిన కాదరయ్య చిరస్మరణీయుడు.

ఉపయుక్త గ్రంథములు.

1. నాట్యకళ — ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీవారి ప్రత్యేక సంచిక 1970
2. తెలుగు జానపద గేయ సాహిత్యము — శ్రీ బిరుదు రామరాజు
3. జానపదా సాహిత్యం శ్రీ ఆర్వీయస్ సుందరం.
4. మాండలిక పదకోశము — ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
5. తెలుగు భాషా చరిత్ర — డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి.
6. తెలుగు భాషా చరిత్ర — స్వార్తి శ్రీ.
7. సూర్యరాయాంధ్ర నిఘంటువు — శబ్దరత్నాకరము.
8. శ్రీ అమళ్ళ దిన్నె గోపీనాథ్‌గారి ఇంటర్వ్యూ.

శ్రీ అమళ్లదిన్నె వేంకటరమణప్రసాద్

ప్రాచీన సాహిత్యంలో ఒక జానపద నృత్యం

ఏ సాహిత్యంలోనైనా సమకాలీన సామాజిక పరిస్థితులు చోటు చేసుకోవడం పరిపాటి; ఇదే పద్ధతిని తెలుగు సాహిత్యంలో కూడా గమనించ వచ్చు. ప్రాచీన తెలుగు సాహిత్యంలో అప్పటి స్థితి గతులతో పాటు, సంస్కృతి, సంప్రదాయాలు, నృత్యకళారూపాలు వాటి రీతులు కన్పిస్తాయి, అంతేకాదు వినోద కార్యక్రమాలు, ఉల్లాసాలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు కూడా చోటు చేసుకున్నాయి. వాటిలో కోలాటం అనే జానపదనృత్యం కూడా సాహిత్య చరిత్ర పుటలకెక్కింది. ప్రాచీన కావ్యాలను పరిశీలిస్తే—

మూల భారతంలో బృహన్నల రూపధారి అర్జునుడు విరాటరాజుతో తన్నుగూర్చి తాను నేర్చిన శాస్త్రపాండిత్యాన్ని గూర్చి—

గాయామి నృత్యామ్యథ వాదయామి
భద్రో஽స్మి నృత్తే కుశలో஽స్మి గీతే
త్వముత్తరాయాః పరిద స్త్వమాం స్వయం
భవామి దేవ్యా నరదేవ నర్తకః ॥ " అని

మాత్రమే చెప్పుకున్నాడు. కాని తిక్కన ఆంధ్రమహాభారతంలో బృహన్నల సంప్రదాయ నృత్యాలతోపాటు దేశినృత్యాలు కూడా నేర్చినట్లు పేర్కొన్నాడు. తిక్కనకాలం 13 శతాబ్ది.

" ఒండు పనులకు నెలవు లేకునికిఁజేసి
యభ్యసించితి శైశవ మాదిగాగ
దండలాసక విధమును గుండలియును
బ్రేంఖణంబు తెలుంగును బేరణియును "

అనే పద్యంలో (ఆంధ్ర. మ. భా. విరాట. 1-239) కన్పించె దండలాసకం, కుండలి, ప్రేంఖణం, ప్రేరణి అనేవి దేశి నృత్యాలు. వీటిని తిక్కన ప్రవేశపెట్టిన తీరు గమనించదగినది. అంటే తిక్కన కాలానికి ఈ దేశి నృత్యాలకు ప్రోత్సాహ ప్రచారాలు విరివిగా సాగుతున్నట్లు మనమూహించ వచ్చు. తిక్కన సమకాలికుడైన జాయప సేనాని నృత్తరత్నావళిలో ఈ దేశి కళలకుకూడా లక్షణాలు పేర్కొనబడ్డాయి. వీటికి లక్ష్యాలా అన్నట్లు కాకతీయ ప్రభువు ప్రతాపరుద్ర దేవుని కట్టడాలలోని శిల్ప సంపదలలో ఈ దేశి నృత్యాలు చోటు చేసుకున్నాయి. వీటిలో దండలాసకం అనేది కోలాటానికి పర్యాయ పదంగా కన్పిస్తుంది. కోలాటం అంటే రెండు చేతులలో రెండు కర్ర ముక్కలతో 20 నుంచి 40 మంది దాకా కలసి గుండ్రంగా తిరుగుతూ, పదాలు పాడుతూ, లయానుగుణంగా అడుగులువేస్తూ ప్రక్కవారి కర్రముక్కలతో ఆడిస్తూఆడే ఆట. ' దండైః లాసః అత్ర లాస × కప్' — అనేది వ్యుత్పత్తి. దండం అంటే కర్ర అని అర్థం. లాసకం అంటే నృత్యం నాట్యం అనే అర్థాలున్నాయి. దండలాసకం అంటే కర్రపుల్లలు పట్టుకొని తాడిస్తూ చేసే నృత్యం అని అర్థం. దీనికి రూపాంతరాలుగా దండలాసం, దండలాస్యం అనే పదాలు కన్పిస్తున్నాయి. దండరాసకం, హల్లీసకం, కోలాటం, కోలన్న, కొట్టమాట, వేష్టితం అనేవి పర్యాయ పదాలుగా కన్పిస్తున్నాయి. ప్రస్తుతం విస్తృత వ్యవహారంలో ఉన్నరూపం కోలాటం.

క్రీ. శ. 1344 ప్రాంతం వాడుగా భావించబడుతున్న నాచనసోమన తన ఉత్తర హరివంశంలో కోలాటాన్ని ప్రస్తావించాడు. హంసడిభకోపాఖ్యానంతో శ్రీ కృష్ణుడు హంసడిభకులపై దండెత్త నిశ్చయించి, పుష్కర సరస్తీరాన చతురంగ సైన్య సమేతంగా విడిదిచేయటానికి నిశ్చయించు కుంటాడు. సేనలతో వెడలుతున్నపుడు దృఢసంరావంతో సకలస్థావరాలు కదిలేటట్లు పాంచజన్యం పూరిస్తాడు. ఆ సందర్భంలోని పద్యంలో—

" పడకు పన్నగరాజు పడగల మీద న
ర్వం సహా కాంత పేరణము నూప
నుఱుత లూగెడును దయా స్త గిరులతో
నాకాశలక్ష్మి కోలాటమాడ........అని (ఉ.హ. 4-216)

కోలాట పదాన్ని ప్రస్తావిస్తాడు.

క్రీ. శ. 1380—1460 మధ్యకాలం వాడుగా భావించ బడుతున్న కవి సార్వభౌముడు తన భీమ ఖండంలో ఈ నృత్యాన్ని ప్రస్తావిస్తాడు. భీమేశ్వరుని ఉత్సవ సంరంభం తెలిపే సందర్భంలో ' మహోత్సవ మండపంబునందుఁ బేరోల గంబుండి, కుండలీ దండలాసక ప్రేరణి ప్రేంఖణ సింధు

కంచుక ...' (బి. ఖ. 1-118) అని దండలాసక ప్రస్తావనం పేర్కొనం కన్పిస్తుంది.

వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామంలో కోలాటం ప్రస్తావన కన్పిస్తుంది.

'హల్లీ సక సటనోద్భట
పల్లవ హరికృష్ణ కంఠ వనమూల్య మిళ
ద్గలత్ సురుభులు త్రిప్పయ
వల్లభరాజ ప్రధాన వాగ్వైభవముల్ (క్రీడా. 25 పద్యం)

కోలాటానికి పర్యాయపదమైన హాల్లీసకం ఇచ్చట ప్రయుక్తమైంది.

16వ శతాబ్ది చివరివాడైన అళియరామ రాయలు సమకాలికుడైన సురభి మాధవరాయల చంద్రికా పరిణయంలో 'గంధర్వులు కోలాటమాడుతున్నట్లు వర్ణించాడు.

సీ॥ కప్పెంద వెడఁద............
... .
దాక పందిలి క్రింద నిద్దంపువేడ్క
దవిలి కోలాటమాడు గంధర్వసతుల
చారు సౌవర్ణ కటక నింజానినాద
కుల ఘుమ ఘుమాయమానమౌ కోనగనియె (చంది.2-20)

ఇచ్చట స్త్రీల క్రీడగా కోలాటాన్ని పేర్కొన్నాడు. క్రీ. శ. 1570—1625 మధ్యకాలం వాడుగా భావించబడుతున్న తరిగొప్పుల మల్లన్న తన చంద్రభాను చరిత్రంలో కథానాయకుడైన చంద్రభానుని స్నేహితుడు కుముదిని వృత్తాంతం చెప్పే సందర్భంలో ఈ కోలాట ప్రస్తావన చేశాడు.

'శా॥ కేలం బంగరు గచ్చుకోలలమరన్ గీర్వాణ బాలామణుల్
శ్రీ లీలావతి పట్టికట్టికల వారింబోలి తజ్జైత్ర వి
ద్యాలాలిత్యము లుగ్గడించి మృదులాలాపంబులం బాడుచుం
గోలాటంబులు శైచిరాయతి తముం గూర్మికటాక్షింపగన్

(చంద్ర భా. చ. 2-139) ఇచ్చట గీర్వాణ బాలామణులు కోలాటమాడినట్లు ప్రసక్తం చేశాడు.

16వ శతాబ్దిలోని పెదపాటి ఎఱ్ఱన తన మల్హణ చరిత్రలో కోలాట ప్రస్తావన చేశాడు. సంస్కృతకవి మల్హణునికి, పుష్పగంధి అనే వేశ్యకు గల ప్రణయ గాథ ఈకావ్యకథ. పుష్పగంధి జాలకుడనే నటుని దగ్గర సాము, నాట్య విద్యలన్నీ నేరుస్తుంది, అందులో కోలాటం ఒకటి.

సీ॥ మొగవరి కట్టడ మొనవు కోలాటంబు
చొక్కంపు మురువులు చిక్కజీలు
.... (మ. చ. ప్రథమాశ్వాసం)

ఈ పద్యంలో కూడా ఇది స్త్రీల క్రీడగానే చెప్పబడింది.

• క్రీ.శ. 16వ శతాబ్ది చివరివాడైన కంకంటి పాపరాజు తన కావ్యంలో కోలాట ప్రస్తావన చేశాడు. కార్తవీర్యార్జునుడు రావణుని చెరపెట్టిన ఘట్టంలో

'సీ॥ దశకంఠ దర్ప వేదండ కంఠీరవ
.. ..
.. ..
............నచ్చరలట్లు గణికాంబు
జాస్యలు దండలాస్యములు సలుప
ఫలముఖో పాయసంబులు...........(ఉ.రా. 3.256)

అని వర్ణించబడింది.

రాజకవి రఘునాథరాయలు (క్రీ. శ. 1600 నుంచి 1631 వరకు తంజావూరిని పాలించాడు.) తన వాల్మీక చరిత్రలో రంభ ఊర్వశి సంవాదాన్ని చక్కగా వర్ణించాడు. రంభ తనకు తెలిసిన నాట్య కళా రూపాలన్నిటినీ పేర్కొంటూ—

ఉ॥ పేరణి దండలాస్యమును ప్రేంఖణి కుండలి నా జతుర్విధో
దారములైన నాట్యముల యందము లెల్ల నెఱింగియందు నిం
పారుచునుండు మూడు పదులాఱునునై తగునంగ హారముల్
రా రసభావ దృష్టులలరన్ నటియించెదె మాట లేటికిన్

(వా. చ. 1-194) అని దండలాస్యాన్నికూడా చెబుతుంది.

క్రీ. శ. 1750 ప్రాంతం వాడైన కనుపర్తి అబ్బయామాత్యుడు తన కవిరాజ మనోరంజనంలో కోలాటం ప్రస్తావన గావించాడు.

" సీ॥ .... కుండలీ ప్రేరణీ దండలాసక ముఖ్య
నృత్యంబులచ్చరల్ నెరపుచుండ........(క.రామ. 1-194)

ఇచ్చటకూడా స్త్రీల క్రీడగానే ఈ దండలాసకాన్ని తెలిపాడు.

క్రీ. శ. 18వ శతాబ్దివాడైన సుదురుపాటి వేంకనార్యుడు తన ఆంధ్ర భాషార్ణవంలో " కోలాటమనగా హల్లీసకం బలరుచుండు.... (1-130) అని కోలాటానికి నిర్వచనం చెప్పాడు.

ఇంకా రాయసం వేంకటపతి రాసిన లక్ష్మీవిలాసం అనే కావ్యంలో వ .... మోహనాంగులపార శృంగారంబులు నెరపుచు కోలాటమాడ " (5-74) అని కోలాటాన్ని ప్రస్తావించాడు.

క్రీ.శ. 18 వందల ప్రాంతంవాడైన అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంసవింశతిలో పిల్లలాడు కొనే ఆటలను చెబుతూ

సీ॥.... .... చిటికెలు కీచు బుజ్జలు కోలాటం పిల్ల గ్రోవులు ... .

(3.147) అని కోలాటాన్ని పేర్కొన్నాడు.

ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈకోలాట నృత్యానికి పాల్కురికి సోమన నాటికే అస్తిత్వం కలదని చెప్పవచ్చు. అయితే దీని ప్రసక్తి నామ మాత్రంగా ముగిసిందేకాని దాని రూపరేఖలు, తీరుతెన్నులు కొంతగానైనా ప్రస్ఫుటం కాలేదు.

అయ్యల రాజు నారాయణామాత్యుని వరకు ఈ నృత్యాన్ని అందరూ స్త్రీలు ఆడినట్లు పేర్కొన్నారు. నారాయణామాత్యుడు మాత్రం పిల్లల ఆటలలో ప్రస్తావించాడు. అంటే దానిపై పురుషులకు అభిరుచి 19 శతాబ్ది మొదటి నుంచి కలిగినట్లు మనం గమనించవచ్చు.

చిత్ర విచిత్ర ప్రక్రియలు గల ఈ కోలాటాన్ని పురుషులు గమనించి, దాన్ని నేర్చి పూర్తి పురుష పరంగా తయారు చేసినట్లు ఊహించవచ్చు. ప్రస్తుతంకూడా కోలాటాన్ని పురుషులే ఆడుతూండడం గమనించవచ్చు.

ఇట్లు సాహిత్యంలో తత్కాల సామాజిక స్థితిగతులతో పాటు జానపద కళారూపాలు చోటుచేసుకోవడం మనం పరిశీలిస్తే విషయాలు కోకొల్లలుగా వెలికి వస్తాయి.

డా॥ బిట్టు వేంకటేశ్వర్లు.

ఆధార గ్రంథపట్టిక

1. ఆంధ్ర భాషార్ణవం
2. ఆంధ్ర మహాభారతం
3. ఆంధ్రప్రదేశ్ దర్శిని
4. ఉత్తర రామాయణం
5. ఉత్తరహరి వంశం

6. క్రీడాభిరామం
7. చంద్రభాను చరిత్ర
8. చంద్రికా పరిణయం
9. నృత్త రత్నావళి
10. పండితారాధ్య చరిత్ర
11. భీమేశ్వరపురాణం
12. మల్హణ చరిత్ర
13. మల్హణీయం
14. మహాభారతం (సంస్కృతం) భండార్కర్‌వారిప్రతి
15. విజ్ఞాన సర్వస్వం
16. వాల్మీకి చరిత్ర
17. సమగ్రాంధ్ర సాహిత్యం, ఆరుద్ర

ప త్రి క లు

1. భారతి
2. తెలుగు

ని ఘం టు వు లు

1. ఆంధ్రశబ్ద రత్నాకరము
2. శబ్దరత్నాకరము
3. శబ్దార్థ చంద్రిక
4. సూర్యరాయాంధ్ర నిఘంటువు
5. వావిళ్ళ నిఘంటువు

లేఖలు

మే 1986 "భారతి"లో మీరు ప్రచురించిన నిడుదవోలువారి అముద్రిత రచన చదివి ఆనందించాను. ఈ సంచికలోని ఇతర సాహిత్య వ్యాసాలుకూడ బాగున్నాయి. అయితే ఈ సంచికలో మీరు ప్రచురించిన కార్టూను ఒకటి– 29వ పుటలోనిది– "భారతి"కే కళంకంగాఉన్నదని చెప్పటానికి చాల బాధగాఉంది. సాహిత్యాన్ని ఆదరించని, సాహిత్యపు విలువలులేని చవకబారు పత్రికలలో ఉండదగిన కార్టూను "భారతి"లో అచ్చువటం భారతి దురదృష్టం అని చెప్పక తప్పదు. "భారతి"సంపాదకులు ఆ కార్టూనును ఎంపికచేసి 'భారతి'లో ప్రచురించినందుకు నా తీవ్రమైన ఆక్షేపణను ఇందుమూలముగా మీకు విన్నవించుకొంటున్నాను.

సూర్యదేవర రవికుమార్
భట్టిప్రోలు.

తెలుగుభాష ప్రత్యేకమంగా ఒకటున్నదా?

1986 ఏప్రిల్ భారతి 'కలగూరగంప'లో పై శీర్షికతో "శ్రీ" గారు విమర్శించుచు, యాతావాతా అసలు నెల్లూరు పేరు సరికాదని అది "నల్లూరు" ప్రాచీన 'కాల్పట్టణమ'ని వ్రాసినారు. అది 'కాల్పట్టణము'కాదు, కల్పట్టణము; సముద్రతీర పట్టణమైన మచిలీపట్టణమునకు 10 కి.మీ. దూరములో బందరు తాలూకాలో ఇప్పటికినీ ఉన్నది. ఈ పట్టణముపేరు ఒక పట్టణదాన శాసనములో సరిహద్దులతోకూడ పేర్కొనబడియున్నది. ఆ శాసనప్రతి ఆచార్య గంటిజోగి సోమయాజిగారివద్ద ఉన్నట్లు 1979 మార్చి భారతి కలగూరగంపలో డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. దానిలో ఆ 'దానపట్టణ' సరిహద్దు లిట్లు పేర్కొనబడినవి.

రండుబల్లి గ్రాంట్ ఆఫ్ విష్ణువర్ధన 4
1-20 గుద్రహార విషయనివాసినః
1-26 రణ్డుబల్లి నామగ్రామః
1-27 పూర్వతః కల్పట్టణం అవధీత్
దక్షిణతః తాడ్కటూరు అవధీత్
పశ్చిమతః నిడుగాడు అవధీత్
ఉత్తరతః జక్కన చెరువు అవధీత్

శ్రీనాథుని ఒకానొక వ్రాతప్రతిలో "కల్పట్టణాధీశ్వరున్" అని యున్నట్లు శ్రీరామమూర్తిగారే వ్రాసినారు. శ్రీనాథుని పద్యమిది:

మ. కనకక్ష్మాధరధీరు వారిధి తటీ–'కల్పట్టణాధీశ్వరున్'
ఘనునిన్ పద్మపురాణసంగ్రహ కథా–కావ్యప్రబంధాధిపున్
వినమత్ కాకతి సార్వభౌము(గవితావిద్యాధరుం గొల్తు,మా
యనుగుందా తత్ప్రదాత శ్రీ కమలనాభామాత్యచూడామణిన్

భీమఖండము 1 ఆ. 10 ప.

దానశాసనములోకూడ 'కల్పట్టణము' అనియుండుటచేత ఆ పట్టణము "కల్పట్టణమే"కాని "కాల్పట్టణము"కాదు. వ్రాతప్రతిలోకూడ "కల్పట్టణమ"నియే ఉన్నది. కొన్ని వ్రాతప్రతులలో "కాల్పట్టణమ"ని యుండుట ఇంటర్‌పొలేషన్ మాత్రమే. అది కృష్ణాజిల్లా బందరుతాలూకాలోని 'కలపటమే' కాని నెల్లూరు (నల్లూరు) కాదు.

కె. విశ్వేశ్వరరావు
హైదరాబాదు

గ్రంథ విమర్శలు

కాంతి వైజయంతి

పద్యకవితాసంపుటి రచన ; శ్రీ వేముగంటి నరసింహాచార్యులు, డెమ్మి 14 + 56 పుటలు. వెల రూ 8 లు. ప్రతులకు :- సాహితీ వికాసమండలి, 1-4-75. పాతగంజు, సిద్ధిపేట-502103.

ఛందోలక్షణాల ప్రమేయంలేకుండా వచనపద్యాల రచనలు విరివిగాసాగే నేటికాలంలోకూడా నియమబద్ధమైన కవిత్వంచెప్పేవారు లేకపోలేదు. రసవంతమైన అట్టి కవితలు ప్రజామోదాన్ని పొందుతూనే ఉన్నాయి. అట్టి కవితల్లో ఈ కవితాసంపుటి ఒకటి. ఇట్టి కవితలుచెప్పేవారికి భాషావాఙ్మయాలలో పాండిత్యం అవసరం. అది లేకపోతే రచన సాగదు. సాగినా అది రక్తికట్టదు.

వేముగంటి నరసింహాచార్యులుగారు విద్వాంసులు. సహజకవులు. వీరి కవితలు రసవంతములై యుండుటలో వింతలేదు. వీరి కవితారచన 1946 నుంచీ అవిచ్ఛిన్నంగాసాగుతూ ఆంధ్రమహాజనుల ఆదర్శాన్ని చూరగొంటూఉన్నది. దీనికి పీఠికను వ్రాసిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు ఈ కవితాసంపుటి ప్రాశస్త్యాన్ని సోదాహరణంగా వివరించారు. డాక్టర్ దాశరథిగారు దీనినెంతో ప్రశంసించారు. ఈ సంపుటిలో "ఆహ్వానం" మొదలుకొని చివరి "బంతిపూవు" వరకూ ఇరవైరెండు కవితలు ఉన్నవి. ఆహ్వానంలోని

"కటిక చీకటి తెరలను కత్తిరించి
కాలమేఘజాలమ్ము ను తూలగొట్టి
లోకమునకెల్ల నూతనాలోకమొసగ
రమ్ము మిత్రుడ! సుస్వాగతమ్ము నీకు"

అనే సూర్యభగవానునిగూర్చిన పద్యం చదవడం ప్రారంభిస్తే పద్యపఠన చివర వరకూ సాగిపోతుంది. దీన్నిగూర్చి వేరే చెప్పనక్కర్లేదు.

ఈపుస్తకం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్య శాఖామాత్యులు శ్రీ కరణం రామచంద్రరావుగారికి అంకితమియ్యబడింది.

'అంగీరస'

శిలా శాసనాలలో శ్రీనివాసుడు

[రచయిత : శ్రీ క్రొవ్విడి రామం, బి.ఏ., బి.ఎల్.,
చోటు : కె. వి. నరసింహారావు, విజయనగరం—3.
వెల : రూ. 7—00]

ఆరు వ్యాసములు గల 40 పుటల పుస్తకమిది. మొదటి వ్యాసంలో తిరుమల తిరుపతియందు గల శాసనసంపద తెలుపబడెను. తిరుమల దేవాలయాలలో 640 శాసనాలు, గోవిందరాజస్వామి ఆలయంలో 340 శాసనాలు, చిల్లర దేవాలయాల్లో 80 శాసనాలు గలవు. ఇవి సుమారుగ చెప్పిన సంఖ్య మాత్రమే. క్రీ.శ. 9వ శతాబ్దం నాటినుండి 17వ శతాబ్దాంతం వరకు అచటి శాసనాలు గోడలపై వ్రాయించబడుతూ వచ్చెను. వాటిలో అధికభాగం తమిళములోను, తెలుగు, కన్నడములలో తక్కువగను గలవు. వాటిని శిలలపై చెక్కించినవారు పల్లవులు, మొదలుకొని చోళులు. యాదవరాయలు, విజయనగరం రాజులు మట్లవంశపు రాజులు మొదలైన రాజులేగాక ఆ యా కాలములలో వారి సామంతులు సేనాపతులు, మంత్రులు మున్నగువారు, మతాచార్యులు సామాన్యభక్తులు కూడ అనేకులు గలరు. వీటినన్నిటిని వెలికితీసి ముద్రించినవారు, అచట 1919 మొదలు 1944 వరకు దేవస్థానములో ఉద్యోగములోనున్న శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. ఆయన ప్రచురించిన శాసన గ్రంథములె యిప్పటివరకు పరిశోధకులకు ఆధారముగ నున్నవి. ఈ విశేషాలు ప్రస్తుత గ్రంథంలో మొదటి వ్యాసంలో తెలుపబడెను.

2) రెండవ వ్యాసంలో తిరుమల సోపానపంక్తిని గూర్చి చెప్పబడెను. ఇప్పుడు మనకు వాడుకలోనున్న మెట్లు 1550లో మట్ల కుమార అనంతరాజు నిర్మించినట్లు అచటి శాసనంవల్ల తెలియుచున్నది. అంతకుముందున్న మార్గము తిరిగి చక్కగా నిర్మించియుండు ననుకొనవలెను. పూర్వము నుండియే తిరుమలకు యాత్రికులు విరివిగా వెళ్ళుచుండెడివారు. కనుక ఒక మార్గముండెడిది. ప్రసంగవశమున గ్రంథకర్త యీ వ్యాసంలో మట్ల కుమారానంతరాజు యొక్కయు ఆయన తాతయైన అనంతరాజుయొక్కయు సత్కార్యములను కొన్నిటిని ప్రశంసించిరి,

3) మూడవ వ్యాసంలో చోళరాజుల కాలంలో తిరుమల పరిస్థితిని గూర్చి వ్రాయబడెను. పల్లవులనాటి తిరుమలనాధుని ఆలయమును చోళులు పునర్నిర్మించిరి. శాసనాధారములతో ఆ విశేషములు కొన్ని తెలుపబడెను. ఆ కార్యక్రమంలో చోళరాజులు, వారి ఉద్యోగులు, గ్రామసభవారు ఎట్లు పనిచేసిరో చెప్పబడెను.

4) నాలుగో వ్యాసంలో విజయనగర రాజులనాటి తిరుమల తిరుపతుల వైభవం చెప్పబడింది. ఆ కాలంలోనే అనగా 15-16 శతాబ్దాలలో అచట గుళ్ళకు అనేక పునర్నిర్మాణాలు జరిగెను. అనేక దానధర్మాలు శాసనస్థం చేయబడెను. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా అయిదు మార్లయినా తిరుమలకు వచ్చి శ్రీనివాసుల దర్శనము చేసుకొన్నట్లు తెలియుచున్నది. స్వామికి సువర్ణ కిరీటము, ఉత్సవ మూర్తులకు రత్నఖచిత కిరీటాలు అనేక ఆభరణాలు సమర్పించినట్లు శాసనాలు తెలుపుచున్నవి. ఈ రచయిత వ్యాసంలో ఏడుసార్లు వచ్చినట్లు తెలుపుచున్నారు. కొన్ని శాసనాలు రాయలు స్వయంగా రాకపోయిననూ ఆయన దానములనే తెలుపుచుండును.

5) అయిదవ వ్యాసంలో తిరుమల-తిరుపతులలో రామానుజులవారు చేసిన విశేష కార్యములు చెప్పబడెను. దీనిని గూర్చి కూడ అనేక ఐతిహ్యములు గలవు. కాని శాసనబద్ధంగా రామానుజులవారి పేరుతో ప్రతిష్ఠించబడిన కొన్ని పూల తోటలు తెలియవచ్చుచున్నవి. రామానుజులవారే యచటి వైష్ణవ ప్రాబల్యానికి మూలమని కథలవల్ల వినుచుందుము. ఈ వ్యాసంలో ఆ విశేషములు తెలుపబడెను.

6) ఆరవ వ్యాసంలో తిరుమలలో తాళ్ళపాక అన్నమాచార్యులు, ఆయన కుమారులు, మనుమలు రచించి శ్రీ వేంకటేశ్వరులకు అంకిత మొనర్చిన వేల సంఖ్యలోనున్న కీర్తనలను గూర్చి చెప్పబడెను. ఆ వ్యాసానికి అనుబంధంగా ఆ వాగ్గేయకారుల జీవితచరిత్ర సంగ్రహంగా చెప్పబడింది.

మొత్తమున ఈ వ్యాసములన్నియు తిరుమల-తిరుపతులను గూర్చిన చరిత్రను శాసనాధారముగా తెలియజేయును. ఐతిహ్యములు, కాక యదార్థమును తెలుసుకొనుటకీ పుస్తకము సంగ్రహముగా బాగున్నది. గ్రంథకర్త తమ వ్యయ ప్రయాసలను లెక్కచేయక పుస్తకము వెలను ఏడు రూపాయలుగా నిర్దేశించిరి.

కాని యిట్టి సంక్షిప్త చరిత్రను తిరుమలను సందర్శించు భక్తులెల్లరను నామ మాత్రం విలువతో అనగా 40 పేజీలు మాత్రమే గనుక రెండు రూపాయలకు మించకుండునట్లు తిరుమల తిరుపతి దేవస్థానమువారు వారి పుస్తక విక్రయశాలలో అమ్మనఏర్పాటు చేయుట బాగుండును.

కాయినేజి ఆఫ్ ది శాతవాహన ఎంపైర్

రచయిత అ. వి. కార్తికేయశర్మ

[ప్రకాశకులు - ఆగం కళాప్రకాశన్, 34, కమ్యూనిటీ సెంటర్, అశోక్ విహార్, ఢిల్లీ–110 052; ప్రథమ ముద్రణ–1980, పుటలు–296, చిత్ర మరియు ఛాయా పటములు–18 + 2; వెల రూ. 140]

శ్రీ కార్తికేయశర్మగారు ప్రస్తుతము ఆర్కియోలాజికల్ సర్వే శాఖలో దక్షిణ భారత దేవాలయముల పరిశీలనాధికారిగ మద్రాసులో పనిచేయుచున్నారు.

సాతవాహన చరిత్ర రచనకు శాసనములు మిక్కిలి తక్కువ. పురావస్తు త్రవ్వకములు అసంపూర్తిగా జరిగినవి. పురాణముల కథనము కూడ స్థూలము గనే వారి చరిత్రను తెలుపుచున్నది. కాగా వారి నాణెములు మాత్ర మసంఖ్యాక ముగ పూర్వము లభించినవి. ఇంకను లభించుచున్నవి. ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రములలోనే గాక మరికొన్ని ప్రాంతములలో గూడ సాతవాహనుల నాణెములు దొరకుచున్నవి. పూర్వము కొన్ని బ్రిటిషు మ్యూజియంలో భద్రపరచబడినవి. వాటిని ఇ. జె. రాప్సన్ 1908లో ప్రకటించెను. భారతదేశములోని మ్యూజియములలోని సాతవాహన నాణెములు గూడ కొన్ని క్యాటలాగులలోను, న్యూమిస్మాటిక్ జర్నలులోను ప్రకటించబడినవి. అయినను ఇంక ప్రకటించబడవలసిన నాణెములు కొన్నివేలు గలవు. చిల్లర, చిల్లరగా ప్రకటించిన నాణెముల సమాచార మొకచోట లేని కొరతను శ్రీ కార్తికేయశర్మగారి గ్రంథము తీర్చుచున్నది.

శాస్త్రీయ పద్ధతిలో సాతవాహన రాజుల నాణెములను పరిశోధించి యిప్పటివరకు సమగ్రమైన గ్రంథముగ దీనిని రూపొందించిరి. ఇందు ఆరు విమర్శనాత్మక ప్రకరణములు, ముఖ్యమగు నాణెముల పట్టిక పరిశీలనార్థము నాణెముల ప్రతిబింబములు, నాణెములు దొరికిన ప్రధాన స్థలములను జూపు పటములు గలవు.

మొదటి ప్రకరణములో సాతవాహనుల చరిత్ర సంక్షిప్తముగ ఉపోద్ఘాత మను శీర్షికతో జెప్పబడెను. ఇందు వారి వంశము, దేశము, పుట్టు పూర్వోత్తరాలు వివరించబడెను. వీరి యభిప్రాయములో 'సప్తివాహన' అను పదమునుండి సాత వాహన పదము వంశనామముగా నేర్పడెనందురు. సప్తివాహనుడనగా సూర్యుడు సూర్యోపాసకులగుట వలన వీరు సాతవాహనులైరని చెప్పిరి. ఆ రాజులు వాడిన శ్రీవత్సాది చిహ్నములనుబట్టి వారు విష్ణు భక్తులని గూడ జెప్పిరి. ఆ రాజుల ఆనుపూర్విని పురాణ కథనానుగుణముగ స్వీకరించిరి. అందులేని రాజులు కొందరు నాణెముల ద్వారా తెలియుచుండుట వలన వారిని గూడ వంశక్రమములో జేర్చిరి. వారి కాలక్రమమును గూర్చి తిరిగి తుది ప్రకరణములో జర్చించిరి.

రెండవ ప్రకరణములో ఇటీవల పలుతావులందు లభించిన నాణెములను వాటి విశేషములను గూర్చి వ్రాసిరి. వీటిలో ముఖ్యముగ త్రవ్వకములు చేయు నపుడు లభించు నాణెములు చరిత్ర రచనకు మిక్కిలి తోడ్పడును. అవి దొరకు పొరలను బట్టి కాలనిర్ణయము చేయుచుందురు. దీనివలన సాతవాహన రాజుల కాలములు కొందరివైనను స్పష్టముగ నిర్ణయమగుచుండును. కాని అట్టి నిర్ణయములలో కూడ విద్వాంసులు భేదాభిప్రాయమును వెలిబుచ్చిరి. అందువలన త్రవ్వకముల ఫలితమునుబట్టి గూడ కొన్ని సంశయములు తీరుటలేదు. సాతవాహన రాజుల నాణెములతో త్రవ్వకములందు లభించిన వాటినిబట్టి వారి కాలనిర్ణయము చేయుటలో గూడ నిట్టి లోపము గలదు. ఉదాహరణకు నెవసా త్రవ్వకములలో ప్రొఫెసరు అజయమిత్రశాస్త్రిగారు చేసిన నిర్ణయము, ప్రొ. సంకాలియా, ప్రొ. యస్. బి. దేవు, శ్రీ కార్తికేయశర్మగారు చేసిన నిర్ణయము లేకవిధముగ గనుపించవు. ఈ కారణము వలన శ్రీ శర్మగారిందు గ్రహించిన కాలము అందరికి సమ్మతము కాదని చెప్పవలసి వచ్చును.

మూడవ ప్రకరణములో సాతవాహన నాణెముల తయారీని గూర్చి చర్చించిరి. నాణెముల పరిశోధకుల కీ భాగము ముఖ్యమైనది. ఏయే కాలములో వారు ఏయే విధముగ నాణెములు ముద్రించిరి? ఏయే లోహములు వాడిరి? వాటి పరిమాణము లెట్టివి? రూపము లెట్టివి? ఏయే టంకసాలలో నేయేవిధముగ నుండెడివి? ఏయే చిహ్నములు వాడిరి? ఇత్యాది విషయములీ పరిశోధనకు ముఖ్యమైనవి. గౌతమీపుత్రసాతకర్ణి నాటినుండి సాతవాహనుల నాణెముల తయారీలో కొన్ని ముఖ్యమగు మార్పులు వచ్చెను. క్షత్రపులతోటి సంబంధము వలన అట్టి మార్పులు ఆవశ్యమయ్యెనని చెప్పుదురు. ప్రాచీన రాజుల నాణెము లధికభాగము స్వదేశ విధానములో ముద్రించబడెను. ఈ యంశములన్ని ఈ గ్రంథములో చాల చక్కగ వివరించబడెను. నాణెములపై పరిశోధనలు జరుపువారికి విద్యార్థులకు ఈ ప్రకరణము పాఠ్యభాగము కాదగియున్నది. ముఖ్యముగ వారుపయోగించిన చిహ్నములు రాజకీయముగ నొక విశిష్టతను ప్రకటించునని యీ గ్రంథకర్త నిరూపించిరి.

నాలుగవ ప్రకరణములో నేయే నాణెములేయే ప్రాంతములలో దొరకెనో చెప్పుచు ఆయా రాజుల రాజ్య విస్తీర్ణతను నిర్ణయించిరి. ఇది చరిత్ర రచనకు సహకరించును. దీనినిబట్టి ప్రాచీన రాజులేయే ప్రాంతము లేలినది అర్వాచీనులేయే ప్రాంతము లేలినది నిర్ణయించి చెప్పిరి. గౌతమీపుత్ర సాతకర్ణికంటె పూర్వపు రాజుల నాణెములేవియు తూర్పు తీర ప్రాంతములలో దొరకకపోవుట వలన ప్రాచీన రాజులెవ్వరు ధరణికోటలో రాజ్యము చేసియుండలేదని వీరి నిర్ణయము. అశోకునినాటి క్రీ.పూ. 250 ప్రాంతమునుండి క్రీ.శ. 50 వరకు సుమారు మూడు శతాబ్దముల దీర్ఘకాలము తీరప్రాంతపు చరిత్ర మనకేమి తెలియదనవలెను. కాని

భారతి కథలు రాసేవారికి మనవి.....

భారతిలో ప్రచురణకి పరిశీలనార్థం చిన్న కథలు పంపవలసిందిగా రచయిత(త్రు) లకి మనవి చేస్తున్నాము.

రచనలు కాగితానికి ఒకవైపే సిరాతో లేదా బాల్‌పెన్‌తో రాయాలి.

కథలు 12 అరఠావు కాగితాలకి మించకుండా ఉంటే మంచిది.

అనువాదాలు, అనుసరణలు పంపరాదు

ప్రచురణకి స్వీకరించని రచనలని త్రిప్పి పంపడానికి తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా గల కవరు జతపరచి పంపాలి.

రచనలని సంపాదకుడు, భారతి, సాహిత్య మాసపత్రిక, ఆంధ్రపత్రిక కార్యాలయం, గాంధీనగరం, విజయవాడ – 520003. అన్న చిరునామాకి పంపాలి.

యీ కాలములోనే అమరావతి స్తూప నిర్మాణములు కొన్ని జరిగియుండినట్లు శ్రీ శర్మగారీమధ్య జరిపిన త్రవ్వకముల నాధారముగ నభిప్రాయపడిరి. పరిశోధకులీ విషయములో యోచించదగును.

అయిదవ ప్రకరణములో సాతవాహనుల వెండి నాణెములను గూర్చి చెప్పబడెను. క్షత్రపుల నోడించి వారి రాజ్యభాగముల ననేకము ఆక్రమించుకొన్న తరువాత గౌతమీపుత్రసాతకర్ణి వారి నాణెముల బోలిన నాణెములను తను గూడ ఆ ప్రాంతములందు వాడకమునకై ముద్రింపించెను. వాటిలో వెండి నాణెములపై తన బొమ్మను గూడ ముద్రించి విడుదల చేసినవి ముఖ్యమైనవి. ఈ సాతకర్ణి తరువాత వచ్చిన వాసిష్ఠీపుత్రపులుమావి, గౌతమీపుత్ర యజ్ఞశ్రీ సాతకర్ణి, స్కందసాతకర్ణి మొదలగువారు తమ బొమ్మలతోబాటు నాణెముల కిరుప్రక్కలం రెండు విధములగు వ్రాతలను వాడిరి. అందొకప్రక్కడి ప్రాకృత భాషలో నుండును. రెండవ ప్రక్కనుండు వ్రాతను గూర్చి పలువురు పలువిధములుగ తలంచుచు వచ్చిరి. కొందరు తెలుగు - కన్నడ మిశ్రభాషయనిరి, కొందరు తమిళమనిరి. ఈ గ్రంథ రచయిత వాటిని తెలుగు వ్రాతలని సహేతుకముగ నిరూపించిరి. ఆ వ్రాతలిట్లుండును.

మొదటి ప్రక్క—— "రఞో వాసెఠి పుతస సిరి పుడుమావిస" - ఇది ప్రాకృతము.

రెండవ ప్రక్క—— "అరహనకు వాహిఠి మాకణకు తిరుపుడుమావికు"

ఈ రెండవది తెలుగుగ సరియగు అర్థముతో వీరు చదవగలిగిరి.

'రఞో' అను ప్రాకృతానికి తెలుగు 'అరహనకు' = రాజుయొక్క అని అర్థము.

'అరహ' అను పదము తెలుగులో 'అరస'గా మారియుండును.

షష్ఠీప్రత్యయము 'కు' చేర్చగా 'అరహనకు' = రాజుయొక్క అని యేర్పడును.

'వాసిఠిపుతస' అను ప్రాకృతమునకు 'వాహిఠిమాకణకు' అని తెలుగు ఇందు 'స' 'హ'గ మార్పునొందెను. 'మా కణ' = 'మగన్' అని ప్రాచీన తెలుగు శాసనములందు కానవచ్చును. కనుక

'పుతస' అనే ప్రాకృతానికి 'మాకనకు' = కొడుకు యొక్క అని తెలుగు అర్థము.

'సిరిపుడుమావిస' అను ప్రాకృతము తెలుగులో 'తిరు పుడుమావికు'

సిరి = తిరు = శ్రీ ; పుడుమావిస = పుడుమావి యొక్క అనగా ఈ నాణెము వాసిష్ఠీపుత్రుడగు శ్రీ పుడుమావి రాజునకు చెందినదని అర్థము.

ఈ గ్రంథకర్త చెప్పిన యీ వివరణ మంగీకరించవచ్చును.

అంతేగాక వారు ఈ తెలుగు భాగము మాత్రాఛందస్సులో నుండు 'రగడ' యను తెలుగు ఛందోభాగమని గూడ జెప్పిరి.

ఆ కాలములో కొన్ని ఇండోగ్రీకు నాణెములపైన గ్రీకు, ఖరోష్ఠి అక్షరము లుండుట సామాన్యము. కనుక సాతవాహన రాజులు ప్రాకృతముతోబాటు, ప్రజల వాడుకభాషగా రూపొందుచున్న తెలుగును గూడ తమ నాణెములపై వ్రాయుట మొదలిడిరని వీరు చెప్పిరి. తెలుగుభాషా ప్రయోగమునందు ప్రాచీనతను నిరూపించు వీరి యీ సమన్వయము ఆమోదయోగ్యముగ నున్నది. తెలుగు భాషా చరిత్రకు గాథాసప్తశతిలోని కొన్ని పదములవలెనే యీ నాణెములపైనున్న వ్రాతలుగూడ తెలుగుయొక్క ప్రాథమిక దశను తెలుపుచున్నవి. అట్లే దేశిఛందోబద్ధమైన రచన గూడ నిందుదాహరింప దగియున్నది. ఇట్టి అపూర్వ విషయమును మన దృష్టికి తెచ్చినందుకు ఈ రచయిత ప్రశంసార్హులు.

ఆరవ ప్రకరణములో వీరి నూతన పరిశోధన 'సాతవాహనచరిత్ర రచన కెట్లు తోడ్పడుచున్నది' వివరించబడెను. అందు ముఖ్యమైనది ఆ రాజుల కాలానుక్రమ నిర్ణయము. ఈ సందర్భమున వీరు మత్స్య పురాణములో జెప్పబడిన మొత్తము 30 మంది రాజులను, నాణెముల వలన తెలియవచ్చిన ఆదనపు రాజులను గ్రహించి వారి వారి పరిపాలనా కాలములను నిర్ణయించిరి. క్రీ.పూ. 230లో సాతవాహన స్వాతంత్ర్య రాజ్యముండెనని వీరు చెప్పిరి. ఆ రాజ్యస్థాపకుడు సిముకసాతహనుడు. కాని వీరి మతములో పురాణములందు జెప్పినట్లే సిముకుడు కాణ్వసుశర్మ నోడించలేదనిరి. ఈ పని చేసినవాడు ఇటీవల లభించిన నాణెముల ద్వారా తెలియవచ్చిన ఛిముక సాతవాహనుడనిరి. కాని యీ ఛిముకుడు పురాణాలలో లేడని స్పష్టముగ వీరు చెప్పలేదు కాని వానిని (మత్స్యపురాణములోని) 14వ రాజగు నొక సాతకర్ణియని తలంచినట్లు తోచుచున్నది. ఈ సాతకర్ణి సుమారు క్రీ.పూ. 40 ప్రాంతములో నుండియుండుననిరి. ఛిముకుని నాణెముల తీరు ఆ కాలమును తెలుపుచున్నది. కాణ్వసుశర్మ నోడించిన కాలము గూడ నిదియే కావచ్చును. కాని పురాణములు కాణ్వులను నిర్జించి సామ్రాజ్యస్థాపన చేసిన సిముకుని నుండి వంశావళిని చెప్పుచుండగా వీరు వేరొక సిముకుని క్రీ.పూ. 230 ప్రాంతములో నున్నట్లూహించుటకు తగిన ఆధారము చెప్పవలెను. అందుకు వారు నానెఘాటు శాసనములోని పేర్లను కొంత ఆధారముగ జూపిరి. వాటి లిపి ప్రాచీనతను జూపుచుండ, నాణెములపైనున్న లిపి యర్వాచీనతను సూచించుచున్నది. ఆంధ్రులొక జాతిగ అశోకుని నాటినుండి గలరనుట నిర్వివాదము. కొందరు సామంత పాలకులుగ గలరని కూడ చెప్పవచ్చును. ఛిముకుని నాణెములకు పూర్వము కూడ నొకరిద్దరి పేర్లు నాణెముల ద్వారా తెలియుచున్నవి. నానెఘాటు శాసనలిపిని గూడ డి. సి. సర్కారువంటి వారు అర్వాచీనము అనగా క్రీస్తుశకారంభమునకు ఒకటి రెండు దశాబ్దములు మాత్రమే పూర్వమై యుండు నందురు. అందుచే సాతవాహనులను సామ్రాజ్య పాలకులుగ క్రీ పూ. 230 నుండి గ్రహించుటలో తగినంత ఆధారము కనిపించదు. మత్స్య పురాణాదులలో పేర్కొనబడిన రాజులలో శాఖాంతరములోని వారు కూడ కలిసి యుండవచ్చును. ఈ వాదములు రెండు మూడు గలవు వాటిలో నొక పక్షమును శ్రీ శర్మగారు స్వీకరించి దాని కనుగుణముగ వారీ గ్రంథములో సాతవాహనుల కాలానుక్రమమును నిర్ణయించిరి. ఈ సమస్య యింకను పరిశోధించవలసి యున్నది.

గ్రంథములో నేడవ ప్రకరణమున ఇప్పటివరకు లభించిన సాతవాహన నాణెముల తరగతులనంటిని పట్టిక రూపములో సంగ్రహించిరి. ఇది పరిశోధకుల కెంతయు ఉపకారకము.

పుస్తక మామూలాగ్రము నూతన సిద్ధాంతములతో గూడిన రచన. సాతవాహన చరిత్ర కీ రచన ఆధార గ్రంథముగ స్వీకరించదగియున్నది.

పి. వి. పరబ్రహ్మశాస్త్రి

పంకజం
(కథల సంపుటి)

[రచన: మురయా, ప్రచురణ: మహాలక్ష్మి పబ్లికేషన్స్, మ్యూజియం రోడ్, విజయవాడ-2; వెల: ఏడు రూపాయలు; పేజీలు 88]

ఈ సంపుటిలో నాలుగు కథలున్నాయి. మొదటి పెద్ద కథ 'పంకజం'.

పంకజం వేశ్యకులంలో పుట్టింది. నాటకాల్లో వేషాలు వెయ్యటం ఆమె వృత్తి. చదువుకుంటున్న రోజుల్లో రామారావుకి ఆమెతో పరిచయం ఏర్పడుతుంది. ఆమెను తనదాన్నిగా చేసుకోవా లనుకుంటాడు. అతనితో లేచిపోవడానికైనా ఆమె సిద్ధమేనంటుంది. కానీ అతనిది సమస్యలు సృష్టించుకునే మనస్తత్వం కాదు. తిన్నగా అన్నీ సవ్యంగా జరగాలనుకుని, ఆమె తల్లితో పంకజాన్ని చేసుకుంటానని చెప్తాడు. ఆమె తల్లి ఒప్పుకోదు. ఇట్లాంటి పెళ్ళిళ్ళు నిలబడేవి కావు అని మందలిస్తుంది. అతను వెళ్ళిపోతాడు, దూరంగా.

మర్చిపోలేక పదేళ్ళ తర్వాత మళ్ళీ ఆమెను చూస్తాడు. ఆమె నాటకాల వృత్తిలోనే ఉంది అతని కోసం అంతకాలం నిరీక్షిస్తూ!

"నాటకాల్లో వచ్చిన స్వర్ణపతకాలు మార్పించి చేయించుకున్నాను (మంగళ సూత్రం). మీకు గుర్తుగా, మీ ప్రేమకు, అభిమానానికి చిహ్నంగా ఇవి మెడలో ధరించాను...." అంటుంది.

పంకజం చాలా ఉదాత్తమైన పాత్ర. ఓ వ్యక్తిని ప్రేమించి, అతను తనకు దూరమైనా, తన పవిత్రతను కాపాడుకుంటూ, వ్యక్తిత్వాన్ని ఉన్నతం చేసుకుంటూ అతనికోసం ఆశగా నిరీక్షిస్తూ వుంటుంది.

మంచి కథ అంటే, గుండెను కదిలించటమో మెదడుకి పని కలిగించటమో చెయ్యాలి. మంచి కథ కోరేవాళ్ళకి ఆ తృప్తినిస్తుందీ కథ.

రెండో కథ 'దొంగనోట్లు'. ఆసక్తికరంగా సాగుతుంది. మూడవది 'ఆత్మార్పణం'—పాములు వాటి పగకు సంబంధించిన ఒళ్ళు జలదరింపు కథ. 'పోయిన సొమ్ము' నాల్గవ కథ. ఉత్కంఠ కలిగించే కథాగమనం కలది.

ఏడు రూపాయలు సరసమైన ధర. ఒకటి కొని సొంత గ్రంథాలయంలో పెట్టుకోదగిన పుస్తకం.

కథా స్రవంతి

(రెండవ సంపుటం)

[సంకలన కర్త: పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి, అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లాశాఖ; ప్రచురణం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లాశాఖ ప్రచురణ; వెల: పన్నెండు రూపాయలు; పేజీలు: 170]

ఎప్పటివో గుళ్ళూ, గోపురాలూ, అందమైన కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతోమందిని ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటి కట్టడాలకి అంతటి శక్తి వుంటోందా? అప్పటివారికి ఎంతో భక్తిశ్రద్ధలు వుండివుంటాయనిపిస్తుంది. ఇప్పటివారికి అంతటి భక్తిశ్రద్ధలు, సమయాన్ని వెచ్చించే ఓపిక వున్నట్టు తోచదు. ఇప్పటి శిల్పాలుగానీ, కట్టడాలుగానీ అంతటి భక్తిశ్రద్ధలు చూపిస్తే తప్ప సినిమా సెట్టింగుల్లా తోచక మానవు.

నేటి కథల విషయంలోనూ అంతేననిపిస్తోంది. ఇదొక రాకెట్ యుగం. ఎవరిని తప్పు పట్టేందుకు వీలున్నది?

ఈ కథాస్రవంతిలో తొమ్మిది కథలున్నాయి—అవి చేయవున్న పాత రచయితలు ఎప్పుడో మలచిన శిల్పాలు.

చింతా దీక్షితులుగారి 'దాసరి పాట' గుండెను తాకే ఓ తెలగదాసరి పొట్ట పోసుకునే కథ.

కవికొండల వెంకటరావుగారి 'ఒక బుక్కింగ్ క్లార్కు పామిస్ట్రీ (లేక) తయితు సమస్య' ఓ సున్నితమైన హాస్యకథ.

అడవి బాపిరాజుగారి 'బొమ్మలరాణి' ఓ తోలుబొమ్మల వాళ్ళ జీవనకథకు అందమైన చిత్రరువు.

మునిమాణిక్యం నరసింహారావుగారి 'కాంతం కథల్లో'ని హాస్యానికి ఎంతో పేరు. అదే కోవలో సాగిన కథ 'సుందరం భార్య'.

ఉప్పల లక్ష్మణరావుగారి 'టెన్నిసు ర్యాకెట్ అమ్మని అమ్మాయి' కొన్ని గంటలపాటు కనిపించి మాయమయ్యే ఓ లండన్ అమ్మాయి కథ.

'నువ్వు కాదూ....?' అందే నారాయణస్వామిగారి నోరులేని జంతువు దీన కథ. ఓ విధంగా బానిస కథ అనుకోవచ్చు.

'పంచరత్నాలు' కొడవటిగంటి కుటుంబరావుగారి ఓ కుటుంబకథ కొడుకులను పైకి తీసుకురావటానికి శ్రమించిన ఓ తండ్రికి మిగిలినదేమిటి, అని ఆలోచింపజేసే కథ.

గోపిచంద్‌గారి 'కూపస్థమాండూక్యం' ఐదుగు జీవితాల్లోని స్త్రీ పురుషుల మధ్య వూహించని స్నేహాన్ని బాంధవ్యాన్ని తెలియ జెప్పిన ఓ జాలి కథ.

జి. వి. కృష్ణరావుగారి 'చేసుకున్న కర్మ' ఓ పాలేరు జీవితానికి అద్దం పట్టిన కథ.

అట్టమీద 'చిరస్మరణీయమైన తెలుగు కథానికలు' అని రాసారు. అట్లా రాయటం ఎంతో సమంజసంగా వుంది.

ఎక్కువగా వచ్చే నేటి చచ్చు నవలలకన్నా, పుచ్చు కథలకన్నా ఇట్లాంటి పుస్తకాలు కొని పదే పదే చదివితే మనోవికాసం కలుగుతుంది.

పసుపు బొట్టు పేరంటానికి

(నాటకం)

[రచన: 'మార్గశీర్ష' బి. వి. రమణమూర్తి; వెల: పన్నెండు రూపాయలు; పేజీలు: 128; పుస్తకం కోసం రాయవలసిన చిరునామా: శ్రీమతి ఎం. సావిత్రి, ఎం.ఎ, కృష్ణమూర్తి వీధి, అమలాపురం—533 201]

ఈ నాటకం మొదటి పేజీల్లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖచే ఉత్తమ రచనగా ఎంపిక చేయబడిందని చెప్పారు. దీన్ని గురించి శ్రీ దాశరథిగారు కూడా సదభిప్రాయం వెలిబుచ్చారు.

ఈ నాటకంలోని యితివృత్తం - నేటి ప్రధాన సమస్య అయిన వరకట్నం. నాటకం ప్రారంభంలో రెండు పాత్రలు దర్శనమిస్తాయి, ఒకటి రచయిత, రెండవది ఒక స్త్రీ. తర్వాత వరకట్నానికి సంబంధించిన రెండు సంఘటనలుంటాయి. మొదటిదానిలో వచ్చే పాత్రలు: కల్యాణి, నాగరాజు భార్యాభర్తలు. పంకజమ్మ, సన్యాసయ్య ఆమె అత్తమామలు. రంగనాధం కల్యాణి తండ్రి. పంకజమ్మ అల్లుడు మురారి.

మురారి డబ్బుకోసం అత్తామామల దగ్గరకు వస్తాడు. డబ్బు ఇస్తేగానీ వాళ్ళ కూతురు ప్రాణం దక్కదంటాడు. వాళ్ళు చివరకు తమ కోడలిని హింసించి డబ్బు రాబట్టి, దాన్ని తమ అల్లుడికి ఇవ్వాలని పథకం వేస్తారు. ఇందులో 'జూలు' అనే క్షుద్రపాత్ర కూడా వుంది. మధ్య మధ్యలో వచ్చి మాటలతో చురకలు వేస్తూ వుండటం ఈ పాత్ర లక్షణం. మంగళసూత్రంతో సహా వొలిచి నాగరాజు కల్యాణిని బయటకు గెంటేస్తాడు ఆమె తండ్రివెంట వెళ్ళమని.

రెండవ సంఘటనలో వచ్చే పాత్రలు: మాధవి, శంకరం భార్యాభర్తలు. చక్రపాణి, సుందరమ్మలు ఆమె మరది ఆడబిడ్డలు. ఆ ఆడబిడ్డ మాధవిపై లేనిపోనివి కల్పించి చెప్పి, ఆమె చనిపోతే ఇన్సూరెన్సు డబ్బు వస్తుందని సోదరుడు శంకరానికి నూరిపోస్తుంది. ఆమెను చంపటానికి పథకం వేసుకుంటారు. అలాంటి సమయంలో వీరి తాతయ్య ప్రవేశించి, వాళ్ళ తల్లిని కూడా వాళ్ళ తండ్రి డబ్బు కోసం చంపాడనీ, మీరు అట్లాంటి రాక్షసులు కాకూడదని చెప్పి వాళ్ళ కళ్ళు తెరిపిస్తాడు.

ఈ నాటకంలో సంభాషణలు ఉపన్యాసధోరణి కాకుండా క్లుప్తంగా సూటిగా, పాత్రోచితంగా వున్నాయి. మొదటి సంఘటనలోని పాత్రధారులే కొద్దిపాటి మేకప్ మార్పుతో రెండవ సంఘటన కూడా వెయ్యవచ్చు. అందుకు కొంత విరామం కూడా కల్పించబడింది. నటన విషయంలో శ్రద్ధ తీసుకోగలిగితే, ఈ నాటకాన్ని ఎవరు ప్రదర్శించినా సందేహం లేకుండా రక్తి కడుతుంది.

బాబు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd. by S. Radhakrishna at the Andhra Patrika Press Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.

పిల్లల మాసపత్రిక

బాలరంజని

రంగు రంగుల ముఖచిత్రం!

★ కథలు! ★ సీరియల్‌లు!

★ బొమ్మల కథ!

★ విజ్ఞానాన్ని పెంచే వ్యాసాలు!

ఇంకా-చిన్న పిల్లలనీ (పెద్దవారిని-కూడా!) అలరించే బొమ్మలు, శీర్షికలు, వింతలు, విశేషాలు!

ప్రతి పేజీ లోనూ రంగు రంగుల బొమ్మలు!

నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి!

వెల రు. 2-00

ఆంధ్రపత్రిక ప్రచురణ


అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
AMRUTANJAN LTD
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
OBM 8777 TG